గురువారం
24•08•2017
హైదరాబాద్
• వెల.5 రూ.
• సంపుటి 7 • సంచిక 78
• పేజీలు : 18 + 24

నమస్తే తెలంగాణ

మన రాష్ట్రం • మన పత్రిక

WWW. NTNEWS.COM
/NTDAILYONLINE



PUBLISHED FROM HYDERABAD I KARIMNAGAR I WARANGAL I KHAMMAM I NALGONDA I MAHABUBNAGAR I NIZAMABAD

డిసెంబర్ కల్లా పక్కా లెక్క

- సెప్టెంబర్ 1 నుంచి 9 వరకు గ్రామ రైతు సంఘాల సమన్వయ సమితుల ఏర్పాటు
- సెప్టెంబర్ 10 నుంచి 15 వరకు మండల స్థాయిలో సమన్వయ సమితుల సదస్సులు
- సెప్టెంబర్ 15 నుంచి డిసెంబర్ నెలాఖరువరకు భూ రికార్డుల ప్రక్షాళన

- గ్రామం యూనిట్‌గా రాష్ట్రం మొత్తం 11వేల యూనిట్లుగా విభజన
- రికార్డులు సరిచేసేందుకు 3,600 బృందాల ఎంపిక
- నెలపాటు ఒక్కో గ్రామంలో ఒక్కో బృందం
- ప్రక్షాళన చేసిన రికార్డులన్నీ డిసెంబర్ నాటికి ఆన్‌లైన్‌లో
- వాటి ఆధారంగానే రైతులకు పెట్టుబడి పథకం అమలు
- నేను మూడు గ్రామాల బాధ్యత తీసుకుంటా
- మంత్రులు, ప్రజాప్రతినిధులు కూడా బాధ్యత తీసుకోవాలి
- ఇది పెద్ద సవాల్... చాలా పీటముళ్లుంటాయి
- అధికారులకు సముద్రమంత ఓపిక ఉండాలి
- పొరపాట్లు జరిగితే పెద్ద కుంభకోణం అవుతుంది జాగ్రత్త
- సమగ్ర భూ సర్వే, రిజిస్ట్రేషన్ల విధానంపై సమీక్షలో సీఎం



భూ రికార్డుల ప్రక్షాళనపై సీఎం కేసీఆర్ ఆదేశం

భూవివాదాలకు చరమగీతం పాడాలి ▪ అత్యంత పారదర్శకంగా రిజిస్ట్రేషన్ విధానం
రైతులకు కొరియర్‌లోనే పాసుపుస్తకాలు ▪ కోర్ బ్యాంకింగ్ తరహాలో రికార్డుల నిర్వహణ
పంట నష్టపోయినా రైతు పెట్టుబడి కోల్పోకూడదు ▪ అందుకే పంటలకు ఎకరాకు 8వేల పెట్టుబడి పథకం

పక్కాగా అమలుకే భూ రికార్డుల ప్రక్షాళన

హైదరాబాద్, నమస్తే తెలంగాణ:

భూవివాదాలు లేని రాష్ట్రంగా తెలంగాణను అభివృద్ధిచేయాలని ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు అన్నారు. భూ వివాదాలకు ముగింపు పలుకడానికి భూ సమగ్ర సర్వే నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. భూమి రికార్డుల నిర్వహణ, రిజిస్ట్రేషన్ విధానం అత్యంత పారదర్శకంగా, సరళంగా ఉండాలని చెప్పారు. భూమి రిజిస్ట్రేషన్ జరిగిన వెంటనే అమ్మిన భూమిని పాసుపుస్తకంలోనుంచి డిలీట్ చేసి, కొనుగోలుచేసిన వారి పాసుపుస్తకంలో చేర్చాలని సూచించారు. భూ రికార్డుల నిర్వహణలో కోర్ బ్యాంకింగ్ విధానాన్ని అమలుచేయాలని చెప్పారు. ఇందుకోసం ప్రతి రెవెన్యూ కార్యాలయానికి ఒక ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ అధికారిని నియమించాలని ఆదేశించారు. అలాగే రిజిస్ట్రేషన్ల విధానంలో సమూల మార్పులు తీసుకురావాలని చెప్పారు. అవసరమైతే రెవెన్యూ అధికారులే రిజిస్ట్రేషన్ చేసే అవకాశాలను సీఎం పరిశీలించారు. రైతులు భూమి క్రయ, విక్రయాల సమయంలో మాత్రమే సంతకాలు చేయడానికి రిజిస్ట్రేషన్ కార్యాలయానికి రావాలని, ఆ తరువాత కొరియర్‌లో పట్టాదార్ పాసుపుస్తకాలు సదరు రైతుల ఇంటికి వెళ్లాలని చెప్పారు. నిషేధిత భూములు రిజిస్టర్ కాకుండా ప్రత్యేక సాఫ్ట్‌వేర్ రూపొందించాలని అన్నారు. సాగుచేసే రైతులకు పెట్టుబడి పథకం పక్కాగా అమలుచేయడానికే రికార్డుల ప్రక్షాళన అని సీఎం స్పష్టంచేశారు. డిసెంబర్ నాటికి పక్కా లెక్కలు సిద్ధం కావాలని చెప్పారు. వీటి ఆధారంగానే ఎకరాకు రూ.8వేల పెట్టుబడి పథకం అమలు అవుతుందని

మిగతా 2వ పేజీలో


నమూనా చిత్రం

త్వరలో రూ.200 నోటు

ఆర్బీఐకి కేంద్ర సర్కారు అనుమతి

న్యూఢిల్లీ, ఆగస్టు 23: దేశప్రజలు ఎదుర్కొంటున్న కరెన్సీ కష్టాలు తీర్చేందుకు కేంద్ర ప్రభుత్వం తొలిసారిగా రూ.200 నోట్ల విడుదలకు అనుమతి మంజూరు చేసింది. పెద్దనోట్ల రద్దు అనంతరం రూ.2000 నోటును ప్రవేశపెట్టడంతో చిల్లర సమస్య అంతకంతకూ పెరుగుతున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆర్బీఐ డైరెక్టర్ల బోర్డు సిఫారసు మేరకు రూ.200 నోటును జారీ చేసేందుకు కేంద్ర ఆర్థిక శాఖ అనుమతి మంజూరు చేసింది. ఈ మేరకు బుధవారం ఒక నోటిఫికేషన్ విడుదలైంది. త్వరలో రూ.200 నోటు చలామణిలోకి వస్తుందని అధికారవర్గాలు తెలిపాయి. ఈ నోటు ముద్రణకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. ప్రకాశవంతమైన నీలిరంగులో హంపీ రథం బొమ్మతో కొత్త రూ.50 నోటును కూడా రిజర్వ్‌బ్యాంక్ విడుదల చేసింది. గత ఏడాది నవంబర్‌లో ప్రధాని నరేంద్రమోదీ రూ.500, రూ.1000 నోట్లను రద్దు చేస్తున్నట్టు సంచలన ప్రకటన చేశారు. ఈ చర్యతో చలామణిలో ఉన్న 86 శాతం కరెన్సీ నిరర్థకమైపోయింది. అనంతరం సర్కారు కొత్తగా రూ.2000, రూ.500 నోట్లను విడుదల చేసింది.

ఓబీసీ ఉప వర్గీకరణకు ప్రత్యేక కమిషన్

12 వారాల్లోగా నివేదిక



- ఉద్యోగాల్లో రిజర్వేషన్లకు క్రీమీలేయర్ పరిమితి 8 లక్షలకు పెంపు
- కేంద్ర మంత్రివర్గం నిర్ణయం
- రెండువేల నోటు రద్దు కాదు
- క్యాబినెట్ భేటీ వివరాలు వెల్లడించిన ఆర్థికమంత్రి అరుణ్‌జైట్లీ

న్యూఢిల్లీ, నమస్తే తెలంగాణ :

ఇతర వెనుకబడిన తరగతుల (ఓబీసీ) వారికి లబ్ధి చేకూర్చే ఓ ప్రధాన నిర్ణయాన్ని కేంద్ర ప్రభుత్వం తీసుకుంది. ఓబీసీ కులాల జాబితాలో ఉప వర్గీకరణ చేపట్టాలని నిర్ణయించింది. శాస్త్రీయ పద్ధతిలో అధ్యయనం చేసి ఓబీసీ కులాలను వర్గీకరించేందుకు ఓ ప్రత్యేక కమిషన్‌ను ఏర్పాటు చేయనుంది. అలాగే కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాలలో రిజర్వేషన్లు పొందేందుకు ఓబీసీ గరిష్ఠ వార్షిక ఆదాయ పరిమితిని రూ.8 లక్షలకు పెంచాలని కూడా నిర్ణయించింది. ప్రధాని నరేంద్రమోదీ అధ్యక్షతన ఢిల్లీలో బుధవారం జరిగిన కేంద్ర మంత్రివర్గ సమావేశంలో పలు నిర్ణయాలు తీసుకున్నారు. ప్రస్తుతం కేంద్ర ఓబీసీ జాబితాలోని కులాలను, వాటికి అందుతున్న రిజర్వేషన్ల ఫలాలను అధ్యయనం చేసి అన్యాయానికి గురవుతున్న కులాలకు సైతం రిజర్వేషన్ల అమలులో తగిన న్యాయం జరిగేలా ఉపవర్గీకరణ చేయడానికి ఒక కమిషన్‌ను ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్టు ఆర్థికమంత్రి అరుణ్‌జైట్లీ చెప్పారు. రూ.2వేల నోటును రద్దు చేసే ఆలోచన ఏదీ లేదని స్పష్టం చేశారు. మంత్రివర్గం నిర్ణయాలను ఆయన మీడియాకు వివరిస్తూ ఓబీసీ కులాల ఉపవర్గీకరణను శాస్త్రీయ పద్ధతిలో అధ్యయనం చేసేందుకు రాజ్యాంగంలోని 340వ అధికరణం ప్రకారం ఒక కమిషన్‌ను ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం వద్దనున్న ఓబీసీ జాబితాలో ఉపవర్గీకరణ లేదని చెప్పారు. ఈ కమిషన్‌కు త్వరలో చైర్మన్‌ను నియమిస్తామని తెలిపారు. కమిషన్ ఏర్పాటైన తర్వాత పన్నెండు వారాల్లోగా నివేదిక సమర్పించాల్సి ఉంటుందని వివరించారు. ప్రధానంగా ఈ కమిషన్‌కు మూడు అంశాలను మంత్రివర్గం సూచించనున్నదని తెలిపారు.

- కేంద్ర ప్రభుత్వం దగ్గర ఉన్న ఓబీసీ జాబితాలోని కులాల వారికి ప్రస్తుతం రిజర్వేషన్లు ఏ తీరులో అమలవుతున్నాయి? అన్ని కులాలకు తగిన స్థాయిలో రిజర్వేషన్లు లభిస్తున్నాయా లేదా? రిజర్వేషన్ ఫలాలు ఏయే కులాలకు ఏ మేరకు అందుతున్నాయి? తదితరాలను ఈ కమిషన్ అధ్యయనం చేస్తుంది.
- ఓబీసీలోని కులాలను వర్గీకరించడానికి శాస్త్రీయ పద్ధతిని రూపొందించాలి. వర్గీకరణకు ఏ రకమైన ప్రాతిపదికను అవలంబించాలి? ఇందుకు అనుసరించే ప్రమాణాలు, అధ్యయనం చేయడానికి రూపొందించాల్సిన యంత్రాంగం, నిబంధనలు,

మిగతా 5వ పేజీలో

ప్రైవేటు టీచర్లకు టెట్ తప్పనిసరి!

హైదరాబాద్, నమస్తే తెలంగాణ:

పాఠశాల యాజమాన్యాలకు విద్యాశాఖ ఆదేశాలు

రాష్ట్రంలోని ప్రైవేటు పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు టెట్‌లో అర్హత సాధించి ఉండాల్సిందేనని ప్రైవేటు స్కూల్ యాజమాన్యాలకు పాఠశాల విద్యా శాఖ ఆదేశాలు జారీచేసింది. ఇప్పటికే బీఎడ్, డీఎడ్ పూర్తిచేసిన ప్రైవేటు టీచర్లలో చాలామంది టెట్‌లో అర్హత సాధించారు. బీఎడ్/డీఎడ్ పూర్తిచేయని వారు కూడా మరికొంత మంది ఉపాధ్యాయులుగా పనిచేస్తున్నారు. వీరిని దృష్టిలో పెట్టుకుని 2019 నాటికి ప్రైవేటు బడుల్లోని ఉపాధ్యాయులంతా బీఎడ్/డీఎడ్ కోర్సులు పూర్తిచేసి ఉండాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. ప్రైవేట్ స్కూల్‌లో పనిచేస్తున్న శిక్షణ లేని టీచర్లకు తక్షణమే శిక్షణ ఇవ్వాలని అన్ని రాష్ట్ర ప్రభుత్వాలకు సూచించింది. ఈ నేపథ్యంలో శిక్షణ లేని టీచర్లకు వచ్చేనెలలో శిక్షణ ఇచ్చేందుకు పాఠశాల విద్యాశాఖ సన్నాహాలు చేస్తున్నది. దీనిపై ప్రైవేటు స్కూల్ యాజమాన్యాల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డి స్పందిస్తూ.. శిక్షణ లేని వారికి శిక్షణ కోర్సులను పూర్తిచేయడం కోసం 2019 వరకు అవకాశం ఇచ్చారని, అప్పటివరకు టెట్‌లో అర్హత లేని వారితోనూ పాఠాలు చెప్పించుకునే వెసులుబాటు స్కూళ్లకు ఉన్నదని చెప్పారు.

కాళేశ్వరంపై కాంగ్రెస్ పగ

రైతులు మద్దతిస్తున్నా రాజకీయ కుట్రలు

ప్రశాంతంగా సాగుతున్న కాళేశ్వరం ప్రజాభిప్రాయ సేకరణ సభలో చిచ్చు
పెద్దపల్లిలో పథకం ప్రకారం కుట్ర ▪ సభ భగ్నానికి 300మందితో శ్రీధర్‌బాబు యత్నం
రైతులపైకి కుర్చీలు విసిరేసిన కాంగ్రెస్ కార్యకర్తలు ▪ అయినా.. ఫలవంతంగా ముగిసిన హియరింగ్
కాళేశ్వరం ప్రాజెక్టుకు జై కొట్టిన పెద్దపల్లి రైతులు ▪ ప్రజాభిప్రాయ సేకరణ ముగిసిందన్న ఇన్‌చార్జి కలెక్టర్

హైదరాబాద్, పెద్దపల్లి ప్రతినిధి, నమస్తే తెలంగాణ:

కుట్రల కాంగ్రెస్ మళ్లీ బుసలుకొట్టింది. తెలంగాణ రైతు ప్రయోజనాలపై విషం చిమ్మేందుకు మరోసారి విఫల యత్నంచేసింది. మల్లన్నసాగర్ విషయంలో రైతుల చేతుల్లో దారుణంగా దెబ్బతిన్న కాంగ్రెస్ నేతలు.. కాళేశ్వరం ప్రాజెక్టును అడ్డుకునేందుకు ఎంతకైనా దిగజారుతున్నారు. ఢిల్లీ నుంచి గల్లీ దాకా నిస్సిగ్గుగా వ్యవహరిస్తున్న కాంగ్రెస్ నేతలు.. బుధవారం పెద్దపల్లిలో ఏకంగా ప్రజాభిప్రాయ సేకరణ సభలో రైతులపై దౌర్జన్యానికి దిగి.. నానా రభస సృష్టించారు. తమ పార్టీ కార్యకర్తలను వెంటేసుకుని వచ్చిన కాంగ్రెస్ నేత, మాజీ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు.. సభను భగ్నం చేసేందుకు పథకం ప్రకారం కుట్ర చేశారు. పోలీసులు జోక్యం చేసుకొని శ్రీధర్‌బాబుతోపాటు పలువురు కాంగ్రెస్ నాయకులను అరెస్ట్‌చేసి పెద్దపల్లి ఠాణాకు తరలించారు.

ప్రశాంతంగా సాగుతున్న సభలో అలజడికి యత్నం

కాళేశ్వరం ప్రాజెక్టుపై పర్యావరణ శాఖ, కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో ఈ నెల 22 నుంచి 26 వరకూ ప్రజాభిప్రాయాన్ని సేకరిస్తున్నారు. ఇందులో భాగంగా బుధవారం పెద్దపల్లి జిల్లాలో పెద్దపల్లి మండలం రాఘవాపూర్‌లోని రెడ్డి ఫంక్షన్ హాల్లో సుందిల్ల బరాజ్, అన్నారం, సుందిల్ల పంప్‌హౌజ్‌పై రామగుండం ప్రాంతీయ కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో ప్రజాభిప్రాయసేకరణ నిర్వహించారు. ఉదయం 11గంటలకు ఇన్‌చార్జి కలెక్టర్ ప్రభాకర్‌రెడ్డి, రామగుండం పర్యావరణ నియంత్రణ అధికారి రవిదాస్ ఆధ్వర్యంలో మొదలైన సభకు జిల్లా నలుమూలలనుంచి పెద్ద సంఖ్యలో రైతులు, ప్రజాప్రతినిధులు, ప్రజలు, అధికారులు హాజరయ్యారు. తమ

మిగతా 8వ పేజీలో

పట్టాలు తప్పిన మరో రైలు

యూపీలోని ఔరయా జిల్లాలో.. ట్రాక్‌పై పడి ఉన్న డంపర్‌ను ఢీకొట్టిన కైఫియత్ ఎక్స్‌ప్రెస్
ఐదు రోజుల్లో రెండోది.. వంద మందికి గాయాలు
రాజీనామాకు సిద్ధపడ్డ రైల్వే మంత్రి సురేశ్ ప్రభు .. తొందరపడొద్దన్న ప్రధాని
రైల్వే బోర్డు చైర్మన్ మిట్టల్ రాజీనామా.. లోహానీ నియామకం

5

అఖిల భారత సర్వీసులకు జోన్ల వ్యవస్థ

ఖరారు చేసిన కేంద్రం

బాలల హక్కులు, రక్షణ కమిషన్ చైర్మన్‌గా గుడిమల్ల



హైదరాబాద్, నమస్తే తెలంగాణ: తెలంగాణ రాష్ట్ర బాలల హక్కులు, రక్షణ కమిషన్ చైర్మన్‌గా వరంగల్ జిల్లాకు చెందిన న్యాయవాది గుడిమల్ల రవికుమార్‌ను ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు నియమించారు. దీనికి సంబంధించిన ఫైల్‌పై బుధవారం సీఎం కేసీఆర్ సంతకం చేశారు. ఒకటి రెండురోజుల్లో ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయనున్నది. వరంగల్‌కు చెందిన గుడిమల్ల రవికుమార్ తెలంగాణ ఉద్యమంలో కీలకంగా పనిచేశారు. ఆయన గతంలో బార్ అసోసియేసన్ అధ్యక్షునిగా కూడా పనిచేశారు.

సీఎం కేసీఆర్‌కు మంత్రి పోచారం అభినందన

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: అగ్రికల్చర్ లీడర్ షిప్ -2017 అవార్డుకు ఎంపికైన ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావుకు బుధవారం వ్యవసాయశాఖ మంత్రి పోచారం శ్రీనివాస్‌రెడ్డి అభినందనలు తెలిపారు. రైతు మేలుకోరి సంక్షేమ పథకాలు అమలుచేస్తున్న సీఎం కేసీఆర్‌కు అవార్డు రావడంపై హర్షం వ్యక్తంచేశారు. వ్యవసాయశాఖ ముఖ్య కార్యదర్శి పార్థసారథి, వ్యవసాయశాఖ కమిషనర్ జగన్మోహన్, హార్టికల్చర్ కమిషనర్ వెంకట్రామిరెడ్డి తదితరులు కూడా సీఎంకు అభినందనలు తెలియజేశారు.



సీఎం కేసీఆర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న మంత్రి పోచారం శ్రీనివాస్‌రెడ్డి తదితరులు

28న రెండురాష్ట్రాల సీఎస్‌ల భేటీ

ఉద్యోగుల విభజన అంశమే కీలక ఎజెండా

కేంద్ర డీవోపీటీ అధికారుల హాజరు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: తెలంగాణ ప్రభుత్వ ప్రధానకార్యదర్శి ఎస్పీ సింగ్, ఏపీ సీఎస్ దినేశ్‌కుమార్‌ల సమావేశం ఈ నెల 28న హైదరాబాద్‌లో జరుగనున్నది. సచివాలయంలోని సీ బ్లాక్ సమావేశ మందిరంలో జరిగే ఈ భేటీకి కేంద్ర డీవోపీటీ జాయింట్ సెక్రటరీలు అర్చనావర్మ, కే కిట్జన్ హాజరుకానున్నారు. తెలంగాణ, ఏపీ రీ ఆర్గనైజేషన్ సెల్స్ ఉన్నతాధికారులు రామకృష్ణారావు, ప్రేంచంద్రారెడ్డి కూడా సమావేశంలో పాల్గొంటారు. ఉద్యోగుల విభజన సలహాసంఘం చైర్మన్ కమలనాథన్ రాజీనామా అనంతరం జరుగుతున్న తొలి సమావేశం కావడంతో దీనికి ప్రాధాన్యం ఏర్పడింది. ఉద్యోగుల విభజన కీలక ఎజెండా అయినప్పటికీ అనేక ఇతర అంశాలను చర్చించనున్నారు. తొమ్మిది, పదో షెడ్యూల్ సంస్థల విభజన, ఏపీ భవనాల అప్పగింత అంశాలు కూడా చర్చకొస్తాయని సమాచారం. అంతర్రాష్ట్ర బదిలీలను కోరుతూ వచ్చిన దరఖాస్తులను రెండురాష్ట్రాల సీఎస్‌లు ఈ సందర్భంగా తనిఖీ చేయనున్నారు. ఏపీకి చెందిన 28 మంది డీఎస్పీలు, స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్‌లో సుమారు 2000 మంది ఏపీ స్థానికత గల పోలీసులు, ఏపీ స్థానికత ఉన్న 24 మంది ఎస్వోలు తెలంగాణలో పనిచేస్తున్నారు. వీరందరినీ ఏపీకి పంపించాలని ప్రధాన కార్యదర్శికి టీజీవో వ్యవస్థాపక అధ్యక్షుడు వీ శ్రీనివాస్‌గౌడ్, టీఎన్జీవో అధ్యక్షుడు కారం రవీందర్‌రెడ్డి, ప్రధానకార్యదర్శి మామిండ్ల రాజేందర్ ఇటీవల విజ్ఞప్తిచేశారు. వీటన్నింటినీ తెలంగాణ సీఎస్ సమావేశంలో ప్రస్తావించనున్నారు.



సమగ్ర భూ సర్వే, రిజిస్ట్రేషన్ల విధానంలో మార్పులు, భూమి రికార్డుల నిర్వహణ, నవీకరణ తదితర అంశాలపై బుధవారం ప్రగతిభవన్‌లో సమీక్షిస్తున్న ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు. చిత్రంలో డిప్యూటీ సీఎం మహమూద్ అలీ, మంత్రులు పోచారం శ్రీనివాస్‌రెడ్డి, జోగు రామన్న, డిప్యూటీ స్పీకర్ పద్మాదేవేందర్‌రెడ్డి, ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ నిరంజన్‌రెడ్డి, ప్రభుత్వ విప్ గొంగిడి సునీత, టీఎస్ఎండీసీ చైర్మన్ శేరి సుభాష్‌రెడ్డి, ఆగ్రోస్ చైర్మన్ లింగంపల్లి కిషన్‌రావు, ఎమ్మెల్యేలు చిట్టెం రామ్మోహన్‌రెడ్డి, ఎం సుధీర్‌రెడ్డి, ప్రభుత్వ ప్రధాన సలహాదారు రాజీవ్‌శర్మ, ప్రభుత్వ సలహాదారు కేవీ రమణాచారి తదితరులు ఉన్నారు.

డిసెంబర్ కల్లా పక్కా లెక్క

మొదటిపేజీ తరువాయి...

తెలిపారు. సమగ్ర భూ సర్వే, రిజిస్ట్రేషన్ల విధానంలో మార్పులు, భూమి రికార్డుల నిర్వహణ, నవీకరణ తదితర అంశాలపై బుధవారం ప్రగతిభవన్‌లో ముఖ్యమంత్రి కేసీఆర్ ఉన్నతస్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. భూ రికార్డుల ప్రక్షాళనకు అవలంబించాల్సిన పద్ధతులపై రంగారెడ్డి జిల్లా కలెక్టర్ రఘునందన్‌రావు నేతృత్వంలో ఏర్పడిన కమిటీ చేసిన అధ్యయనంపై చర్చ జరిగింది. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ సమగ్ర భూ సర్వే నిర్వహించాలనే నిర్ణయానికి నేపథ్యాన్ని వివరించారు.

వ్యవసాయాన్ని నమ్ముకున్న రైతులకు పెట్టుబడి ఇవ్వడానికే..

'వ్యవసాయాన్ని మాత్రమే నమ్ముకున్న రైతులు అప్పుల్లో కూరుకుపోతున్నారు. ఏ మాత్రం గిట్టుబాటు ఉండటం లేదు. బతుకడమే కష్టంగా ఉంది. భార్యకు కనీసం చీర కూడా కొనలేడు. పిల్లలకు స్కూల్ ఫీజు కూడా కట్టలేడు. ఇతర పనులేమీ లేకుండా కేవలం వ్యవసాయాన్ని మాత్రమే నమ్ముకున్న రైతులది ఈ దురవస్థ. పరువుకోసం తెల్లబట్టలేసుకుని తిరుగుతారు కానీ పరిస్థితి ఏమీ బాగుండదు. పంట సీజన్ వస్తే అప్పులకోసం తిరుగని చోటుండదు. బ్యాంకుల చుట్టూ, మిత్తి వ్యాపారుల చుట్టూ తిరిగి అప్పు పుట్టించుకొంటారు. తీరా అనేక కారణాలవల్ల పంట నష్టపోతే పెట్టిన పెట్టుబడి పోయి అప్పు మిగులుతుంది. అప్పుకు వడ్డీ పెరుగుతుంది. బతుకు భారమవుతుంది. ఈ పరిస్థితినుంచి రైతును గట్టెక్కించాలని ఎప్పటినుంచో ఆలోచిస్తున్నా. రైతుల కోసం ఏం చేయాలని చాలామందితో మాట్లాడాను. చివరికి వ్యవసాయానికి పెట్టుబడి ప్రభుత్వమే సమకూరిస్తే రైతులకు అప్పులతిప్పలు తప్పుతాయని నిర్ణయించాం. కాలం కలిసిరాక పంటలు పండక పోయి రైతులు పెట్టుబడి కోల్పోయే ప్రమాదం ఉండదు. ఫలితంగా రైతులు అప్పుల ఊబిలో కూరుకుపోరు. అందుకోసమే ప్రభుత్వం ఎంత వ్యయమైనా భరించి, ప్రతి ఎకరాకు ఏడాదికి రూ.8వేల పెట్టుబడి ఇవ్వాలని నిర్ణయించుకుంది' అని ముఖ్యమంత్రి కేసీఆర్ వివరించారు.

గ్రామం యూనిట్‌గా భూ రికార్డుల ప్రక్షాళన

సెప్టెంబర్ 15 నుంచి డిసెంబర్ నెలాఖరువరకు రెవెన్యూ గ్రామం యూనిట్‌గా భూ రికార్డుల ప్రక్షాళన ఉంటుంది. సెప్టెంబర్ 15న రాష్ట్రవ్యాప్తంగా అన్ని మండలాల్లో ఈ కార్యక్రమం ప్రారంభమవుతుంది. ఒక్కో రెవెన్యూ గ్రామాన్ని ఒక్కో యూనిట్‌గా పరిగణిస్తారు. రాష్ట్రం మొత్తాన్ని సుమారు 11,000 యూనిట్లుగా నిర్ణయించారు. 3,600 బృందాలను ఎంపిక చేస్తారు. రెవెన్యూ అధికారి, వ్యవసాయాధికారి, గ్రామ రైతు సంఘం సమన్వయంతో ఒక్కో గ్రామంలో ఒక్కో బృందం నెలపాటు ఉండి గ్రామ సభలు నిర్వహించి, రైతులందరి సహకారం, అంగీకారంతో భూ రికార్డులను సరిచేస్తుంది. ఇలా ఒక్కో బృందం 3 నెలల్లో మూడు గ్రామాల్లో రికార్డుల ప్రక్షాళన కార్యక్రమం నిర్వహిస్తుంది.

సెప్టెంబర్ 1 నుంచి గ్రామ రైతు సంఘాల ఏర్పాటు

భూ రికార్డులు సక్రమంగా, సమగ్రంగా ఉంటేనే రైతులకు పెట్టుబడి పథకం విజయవంతమవుతుందని సీఎం కేసీఆర్ చెప్పారు. రికార్డుల ప్రక్షాళన, రైతు సంఘాల ఏర్పాటు, రైతు సదస్సుల నిర్వహణ తేదీలను ఈ సందర్భంగా ఖరారుచేశారు. సెప్టెంబర్ 1 నుంచి 9 వరకు గ్రామ రైతు సంఘాల సమన్వయ సమితులు ఏర్పాటవుతాయి. గ్రామంలో వ్యవసాయ భూమి కలిగిన రైతులందరూ గ్రామ రైతు సంఘంలో సభ్యులుగా ఉంటారు. 11 మందితో సమన్వయ సమితులు ఏర్పాటవుతాయి. సెప్టెంబర్ 10 నుంచి 15 వరకు రైతు సమన్వయ సమితుల సదస్సులు మండల స్థాయిలో నిర్వహిస్తారు.

ప్రక్షాళన చేసిన రికార్డులన్నీ డిసెంబర్ నాటికి ఆన్‌లైన్‌లో

ఎలాంటి వివాదాలు లేని భూములు దాదాపు 85% నుంచి 95% వరకు ఉంటాయని అంచనా. వివాదాలు లేని భూములకు సంబంధించిన రికార్డులన్నింటినీ ముందుగా ప్రక్షాళనచేస్తారు. పేరు మార్పిడీలు, క్రయవిక్రయాలు జరిగిన వివరాలన్నీ తీసుకుంటారు. రికార్డులకు తుదిరూపం ఇస్తారు. ఆ రికార్డులను ఆన్‌లైన్‌లో ఉంచుతారు. రెండో దశలో వివాదాస్పద భూములకు సంబంధించిన పరిష్కార మార్గాలు చూస్తారు. కోర్టు వివాదాలుంటే, కోర్టు తీర్పులను అనుసరించి యాజమాన్య హక్కులను నిర్ణయిస్తారు. డిసెంబర్ నెలాఖరునాటికి రికార్డులన్నీ సరిచేసి ఆన్‌లైన్‌లో పొందుపరుస్తారు. దీని ఆధారంగానే రైతులకు పెట్టుబడి పథకం అమలుచేస్తారు.

అసైన్డ్ భూముల్లో వ్యవసాయం చేసుకునే పేదలకు పెట్టుబడి పథకం

సెప్టెంబర్ 15 నుంచి ప్రారంభమయ్యే భూ రికార్డుల ప్రక్షాళన సందర్భంగా రైతుల ఆధీనంలో ఉన్న వ్యవసాయ భూములతోపాటు గ్రామంలో అటవీభూమి, ప్రభుత్వ భూమి, దేవాదాయ భూమి, ప్రజోపయోగ కార్యక్రమాలకోసం వినియోగిస్తున్న భూమి, ప్రభుత్వ భవనాల కింద ఉన్న భూమి, చెరువులు, కుంటల కింద ఉన్న భూమి తదితర అన్ని వివరాలు సేకరించాలని సీఎం కేసీఆర్ ఆదేశించారు. వ్యవసాయ భూములను వ్యవసాయేతర అవసరాల కోసం బదలాయిస్తే.. ఆ వివరాలు, ప్రభుత్వం సేకరించిన భూముల వివరాలు, ప్రభుత్వం అసైన్ చేసిన భూ వివరాలు కూడా నమోదు చేయాలన్నారు. అసైన్డ్ భూముల్లో వ్యవసాయం చేసుకునే పేదలకు కూడా పెట్టుబడి పథకం వర్తింపజేయనున్నట్టు సీఎం కేసీఆర్ ప్రకటించారు. గ్రామకంఠాన్ని కూడా నిర్ధారించాలన్నారు. మొదటి దశలో వివాదాలు లేని భూములు రికార్డులను సరిచేయాలని, రెవెన్యూ గ్రామం పరిధిలోని ప్రతీ భూమి వివరాలను నమోదు చేయాలని చెప్పారు. రెండో దశలో మొత్తం తెలంగాణ భూభాగాన్ని సర్వే చేయించి, కొత్త మ్యాపులు రూపొందిస్తామన్నారు. ఎప్పటికప్పుడు తెలంగాణ భూభాగంలో జరిగే మార్పులు కూడా వెంటనే నమోదయ్యేలా సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకోవాలని చెప్పారు.



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న సీఎం కేసీఆర్

పొరపాట్లు జరిగితే పెద్ద కుంభకోణం అయ్యే ప్రమాదం ఉంది

'1932-36 మధ్య నిజాం రాజ్యంలో భూ సర్వే నిర్వహించారు. తిరిగి మళ్లీ భూ సర్వే చేపట్టలేదు. ఈ ఎనిమిది దశాబ్దాలకాలంలో అనేక మార్పులు సంభవించాయి. కానీ అవన్నీ సరిగ్గా నమోదు కాలేదు. అందుకే భూ రికార్డుల నిర్వహణలో తీవ్ర గందరగోళం ఏర్పడింది. వివాదాలకు కూడా కారణమవుతున్నది. వ్యవసాయ శాఖ వద్ద వివరాలకు, రెవెన్యూ శాఖ వద్ద ఉన్న వివరాలకు పొంతన లేదు. దీంతో ప్రభుత్వం అందించాలనుకునే పెట్టుబడి ఏ ప్రాతిపదికన అందించాలో తెలియని పరిస్థితి నెలకొంది. పొరపాట్లు జరిగితే వేల కోట్ల రూపాయల కుంభకోణం అయ్యే అవకాశం ఉంది. మంచి చేయబోతే చెడు అవుతుంది. అందుకే ఏ భూమి ఎవరి ఆధీనంలో ఉందో, పెట్టుబడి ఎవరికి అందాలో కచ్చితంగా తెలియాలి. అందుకే భూ రికార్డుల ప్రక్షాళన కార్యక్రమం తీసుకుంటున్నాం' అని ముఖ్యమంత్రి వివరించారు.

నేను మూడు గ్రామాల బాధ్యత తీసుకుంటా

'భూ రికార్డులను సరిచేసే కార్యక్రమం సెప్టెంబర్ 15న పెద్దఎత్తున ప్రారంభం కావాలి. అన్ని మండలాల్లో ప్రారంభ కార్యక్రమం నిర్వహించాలి. మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు కూడా తలా మూడు గ్రామాలను తీసుకుని ఈ కార్యక్రమంలో స్వయంగా పాల్గొనాలి. నేను కూడా మూడు గ్రామాలు ఎంపిక చేసుకుంటా. వ్యవసాయశాఖ, రెవెన్యూ శాఖ ఉద్యోగులు, రైతు సంఘాలు చురుకైన పాత్ర నిర్వహించాలి. సర్పంచ్‌లు, ఇతర ప్రజా ప్రతినిధులు కూడా క్రియాశీల పాత్ర పోషించాలి. భూ రికార్డుల ప్రక్షాళనకు సంబంధించి కొంత మంది ఉద్యోగులను తాత్కాలిక పద్ధతిపై తీసుకుంటాం' అని సీఎం చెప్పారు.

భూమి రికార్డుల నిర్వహణకు బ్యాంకుల విధానం

'భూ రికార్డులన్నింటినీ సరిచేసిన తర్వాత ఆ వివరాలన్నీ ఆన్‌లైన్‌లో పెట్టాలి. మళ్లీ భూ రికార్డులకు సంబంధించి ఏ చిన్న మార్పు జరిగినా అంతా ఆన్‌లైన్‌లో తెలిసిపోవాలి. బ్యాంకులు అవలంబిస్తున్న కోర్ బ్యాంకింగ్ విధానంలాంటిది భూ రికార్డుల నిర్వహణలో అనుసరించాలి. ఏటీఎం ద్వారా ఏ బ్యాంకులో, ఏ ప్రదేశంలో డబ్బులు విత్‌డ్రా చేసుకున్నా వెంటనే ఆన్‌లైన్‌లో తెలిసిపోతుంది. వినియోగదారుడికి మెసేజ్ వస్తుంది. అలాగే భూ రికార్డులు కూడా ఉండాలి. పాస్ పుస్తకాల్లో ఎక్కడ మార్పు జరిగినా అంతటా తెలిసిపోవాలి. ప్రతిదీ పారదర్శకంగా జరుగాలి' అని సీఎం అన్నారు.

ప్రతి రెవెన్యూ కార్యాలయానికి ఒక ఐటీ అధికారి

'భూ రికార్డులను సరిచేయడానికి, ఆ తర్వాత వాటిని నిర్వహించడానికి, కోర్ బ్యాంకింగ్‌లాంటి వ్యవస్థను నడుపడానికి ప్రతి రెవెన్యూ కార్యాలయంలో ఒక ఐటీ అధికారిని నియమించాలి. ఇందుకోసం రాష్ట్రవ్యాప్తంగా కొత్తగా రెవెన్యూ శాఖలో వెయ్యి మందిని నియమించాలి. ఎక్కువ సామర్థ్యం కలిగిన కంప్యూటర్లు, ఎక్కువ బ్యాండ్‌విడ్త్ కలిగిన నెట్ కనెక్షన్ కల్పిస్తాం. రెవెన్యూ కార్యాలయాలన్నీ ఒకదానికొకటి అనుసంధానం అవుతాయి' అని ముఖ్యమంత్రి కేసీఆర్ చెప్పారు.

పారదర్శకంగా రిజిస్ట్రేషన్లు

'రిజిస్ట్రేషన్లు కూడా పారదర్శకంగా జరుగాలి. క్రయవిక్రయాలు జరిపే రైతులిద్దరూ రిజిస్ట్రేషన్ కార్యాలయానికి వెళ్లాలి. రిజిస్ట్రార్‌కు ఇద్దరి పాసుపుస్తకాలు ఇవ్వాలి. రిజిస్ట్రార్ రెండు పాసుపుస్తకాలను తీసుకుని, అమ్మేవారి పాసుపుస్తకం నుంచి భూమిని తొలిగించి, కొన్నవారి పాసుపుస్తకంలో ఎంటర్ చేయాలి. రిజిస్ట్రారే ఈ రెండు పాసుపుస్తకాలను కొరియర్‌ద్వారా ఎమ్మార్వోకు పంపాలి. నాలుగు పనిదినాల్లో ఎమ్మార్వో క్రయవిక్రయాలకు సంబంధించిన వివరాలను తన కార్యాలయంలో నమోదు చేసుకోవాలి. పాసుపుస్తకాలపై అటెస్ట్‌చేయాలి. పేరు మార్పిడి చేయాలి. తిరిగి రిజిస్ట్రార్‌కు పంపాలి. రిజిస్ట్రార్ తన రికార్డుల్లో నమోదు చేసుకుని కొరియర్‌ద్వారా రైతులకు పంపాలి. అమ్మే వారు, కొనేవారు కేవలం ఒక్కసారి మాత్రమే రిజిస్ట్రార్ ఆఫీసుకు రావాలి. మళ్లీ మళ్లీ తిరుగడం, పైరవీలు చేయడం ఇక ముందు ఉండకూడదు' అని సీఎం కేసీఆర్ అధికారులకు దిశానిర్దేశనం చేశారు.

పహాణీల్లో అవసరం లేని కాలమ్స్ తీసేయండి

'పాస్ పుస్తకాలు, పహాణీల నిర్వహణ మరింత సరళం చేయాలి. అవసరం లేని కాలమ్స్ తీసేయాలి. పాసుపుస్తకాలు కూడా కొత్తవి ఇవ్వాలి. ప్రత్యేకమైన పెన్నులతో మాత్రమే రాయగలిగేలా పాస్ పుస్తకాలు తయారుకావాలి. నీటిలో పడినా తడవకుండా, పాడవకుండా ఉండేలా నాణ్యతా ప్రమాణాలు పాటించాలి. పాసుపుస్తకాల సైజు కూడా తగ్గించాలి. స్టాంపుల చట్టాలను, రిజిస్ట్రేషన్ చట్టాలను క్షుణ్ణంగా అధ్యయనంచేసి అవసరమైన మార్పులుచేయాలి. భవిష్యత్తులో ప్రతీ మండలానికి ఒక రిజిస్ట్రేషన్ కార్యాలయం ఏర్పాటుచేసుకోవాలి. వీలైతే ఎమ్మార్వోకే రిజిస్ట్రేషన్ కూడా చేసే అధికారం కల్పించే అవకాశాలు పరిశీలించాలి. రెవెన్యూ కోర్టులు కూడా ఇన్ని ఉండాలా? కేవలం కలెక్టర్ వద్ద ఒక్క కోర్టు మాత్రమే నిర్వహించాలా? అనే విషయంలో కూడా నిర్ణయం తీసుకోవాలి. ప్రభుత్వ భూములను అక్రమంగా రిజిస్ట్రేషన్ చేయకుండా నిషేధిత జాబితా తయారు చేయాలి. ఆ భూముల రిజిస్ట్రేషన్‌ను అంగీకరించని విధంగా సాఫ్ట్‌వేర్ అభివృద్ధి చేయాలి' అని సీఎం కేసీఆర్ ఆదేశించారు.

ప్రక్షాళన జరిగితే భూ దందాలకు ఫుల్‌స్టాప్

భూ రికార్డులను ప్రక్షాళన చేయడంవల్ల ఎన్నో సమస్యలు పరిష్కారమవుతాయి. ఏ భూమి పరిస్థితి ఏమిటో తెలియడం వల్ల వివాదాలు, ఘర్షణలకు తావుండదు. ఇది నిజానికి పెద్ద సవాల్. చాలా పీటముళ్లుంటాయి. చిత్తశుద్ధి ఉంటే చేయడం అసాధ్యం కాదు. అధికారులకు సముద్రమంత ఓపిక ఉండాలి. రాష్ట్రంలో మనమంతా పట్టుపడితే గుడుంబా మహమ్మారి పారిపోయింది. పేకాట బంద్ అయింది. ఇప్పుడు రికార్డుల ప్రక్షాళన జరిగితే భూ దందాలు కూడా బందవుతాయి' అని సీఎం అభిప్రాయపడ్డారు.

ముహూర్తం



సూర్యోదయం: 6.04 గంటలకు



సూర్యాస్తమయం: 6.32 గంటలకు

హేవళంబి నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్ష ఋతువు, భాద్రపదమాసం, శుక్లపక్షం, తదియ రాత్రి 8.29 వరకు. తదుపరి చతుర్థి. నక్షత్రం: ఉత్తర మధ్యాహ్నం 2.02 వరకు తదుపరి హస్త. అమృతఘడియలు: ఉదయం 6.51 నుంచి ఉదయం 8.27 వరకు. రాహుకాలం: మధ్యాహ్నం 1.52 నుంచి మధ్యాహ్నం 3.25 వరకు, దుర్ముహూర్తం: మధ్యాహ్నం 3.13 నుంచి సాయంత్రం 4.52 వరకు. వర్జ్యం: రాత్రి 10.38 నుంచి రాత్రి 12.14 వరకు.

గిట్టుబాటు ధర పొందే ప్రణాళిక అమలుచేస్తున్నాం

'రైతులకు కావాల్సింది సాగునీరు, పెట్టుబడి, గిట్టుబాటు ధర. ఇప్పటికే రాష్ట్రంలో సాగునీరు అందివ్వడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయి. వచ్చే ఏడాదినాటికి కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా దాదాపు 40 లక్షల ఎకరాలకు సాగునీరు అందుతుంది. పాలమూరు, సీతారామ ప్రాజెక్టుల నిర్మాణం జరుగుతుంది. అవసరమున్నంత ఉచిత విద్యుత్ అందడంవల్ల రైతులు భూగర్భ జలాలను గరిష్ఠస్థాయిలో ఉపయోగించుకోగలుగుతున్నారు. తర్వాత దశలో గిట్టుబాటు ధరకోసం ప్రయత్నాలు జరుగుతున్నాయి. రైతులను సంఘటితంచేసే పనికి ప్రభుత్వమే పూనుకొంది. రైతులు సంఘటితమై గిట్టుబాటు ధర పొందే ప్రణాళిక కూడా అమలుచేస్తున్నాం' అని సీఎం కేసీఆర్ తెలిపారు. ఈ సమావేశంలో ఉప ముఖ్యమంత్రి మహమూద్‌అలీ, మంత్రులు పోచారం శ్రీనివాసరెడ్డి, జోగు రామన్న, ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు నిరంజన్‌రెడ్డి, డిప్యూటీ స్పీకర్ పద్మాదేవేందర్‌రెడ్డి, విప్ గొంగిడి సునీత, కార్పొరేషన్ల చైర్మన్లు శేరి సుభాష్‌రెడ్డి, భూమ్‌రెడ్డి, కిషన్‌రావు, ఎమ్మెల్యేలు ఎర్రబెల్లి దయాకర్‌రావు, కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు, చిట్టెం రామ్మోహన్‌రెడ్డి, మర్రి జనార్దన్‌రెడ్డి, మంచిరెడ్డి కిషన్‌రెడ్డి, బాజిరెడ్డి గోవర్ధన్, సుధీర్‌రెడ్డి, ప్రభుత్వ ప్రధాన సలహాదారు రాజీవ్ శర్మ, సలహాదారు రమణాచారి, రెవెన్యూశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బీఆర్ మీనా, ప్రణాళికశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బీపీ ఆచార్య, సీఎంవో ముఖ్యకార్యదర్శి ఎస్ నర్సింగ్‌రావు, అదనపు ముఖ్య కార్యదర్శి శాంతికుమారి, ఐటీశాఖ ముఖ్యకార్యదర్శి జయేశ్‌రంజన్, వ్యవసాయశాఖ కార్యదర్శి పార్థసారథి, సీఎంవో కార్యదర్శి స్మితాసబర్వాల్, వ్యవసాయ శాఖ కమిషనర్ జగన్మోహన్, సీసీఎల్‌ఏ జాయింట్ కమిషనర్ ప్రియదర్శిని, రిజిస్ట్రేషన్ల శాఖ ఐజీ అండ్ కమిషనర్ నదీమ్‌అహ్మద్, కుటుంబ సంక్షేమశాఖ కమిషనర్ వాకాటి కరుణ, హార్టికల్చర్ కమిషనర్ వెంకట్రామిరెడ్డి, సీఎంవో అదనపు కార్యదర్శి భూపాల్‌రెడ్డి, కలెక్టర్లు రఘునందన్, వెంకట్రామిరెడ్డి, సింగరేణి సీఎండీ శ్రీధర్, లోకేశ్‌కుమార్, పీసీసీఎఫ్ ఝా, భూ భారతి ప్రాజెక్టు జాయింట్ డైరెక్టర్ దేవదాసు, జాయింట్ కలెక్టర్లు సుందర్ అబ్నార్, ధర్మారెడ్డి, పదవీవిరమణ చేసిన అధికారులు ఎన్ శ్రీనివాసరావు, బీ మధుసూదన్, డీ వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

లోకం పోకడ



పట్టణాభివృద్ధిలో మహిళల పాత్ర పెంచుతాం

- ప్రభుత్వ దవాఖానల్లో ప్రసవాలపై మరింత అవగాహన అవసరం
- రిసోర్స్ పర్సన్ల సమస్యలు సీఎంకు తెలుసు.. త్వరలోనే మీతో భేటీ అవుతారు
- మెప్మా ఉద్యోగుల సమావేశంలో మంత్రి కే తారకరామారావు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: పట్టణాల అభివృద్ధిలో మహిళల పాత్రను మరింత పెంచేందుకు తెలంగాణ ప్రభుత్వం కృషి చేస్తున్నదని పురపాలకశాఖ మంత్రి కే తారకరామారావు చెప్పారు. బుధవారం పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) ఉద్యోగులతో బేగంపేటలోని క్యాంపు కార్యాలయంలో మంత్రి కేటీఆర్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మెప్మా ఆధ్వర్యంలో పనిచేస్తున్న రిసోర్స్‌పర్సన్లు, మహిళా సోదరీమణుల సహకారంతో ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలను పకడ్బందీగా అమలుచేస్తున్నదని పేర్కొన్నారు. వీరి సేవలను ఉపయోగించుకునేందుకు త్వరలోనే మరిన్ని కార్యక్రమాలను చేపడుతామని చెప్పారు. పలు పురపాలికలు చేపట్టిన తడి- పొడి చెత్త కార్యక్రమాన్ని అమలుచేయడంలో, పట్టణ ప్రజలను చైతన్యపర్చడంలో మెప్మా కీలకపాత్ర పోషించాలని సూచించారు. తెలంగాణ ప్రభుత్వం మాతాశిశు సంక్షేమానికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నదని, వ్యాక్సినేషన్, పౌష్టికాహార కార్యక్రమాలు, సర్కారు దవాఖానల్లో ప్రసవాలు వంటి వాటిపై పట్టణ ప్రజల్లోనూ మరింత అవగాహన పెంచాలని కోరారు. మెప్మా ఆధ్వర్యంలో మహిళలు చేస్తున్న సేవల గురించి సీఎంకు పూర్తి అవగాహన ఉన్నదని, త్వరలోనే ఆయన మెప్మా ఉద్యోగులతో సమావేశమవుతారని కేటీఆర్ తెలిపారు. పట్టణాల్లోని పేదల అభివృద్ధి కోసం చేపట్టాల్సిన పలు కార్యక్రమాలపై, వారికి అందించాల్సిన సహాయ సహకారాలపై మంత్రి వివిధ పట్టణాల నుంచి వచ్చిన రిసోర్స్‌పర్సన్లను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం చేపడుతున్న కేసీఆర్ కిట్లు, హరితహారం, బహిరంగ మలవిసర్జన రహిత పట్టణాలను ప్రకటించే కార్యక్రమం వంటివి క్షేత్రస్థాయిలో ఎలా అమలవుతున్నాయనే దానిపై ఆరా తీశారు. తమ వేతనాలు పెంచాలని రిసోర్స్‌పర్సన్లు మంత్రికి విన్నవించగా, దీనిపై ముఖ్యమంత్రి సానుకూల నిర్ణయం తీసుకుంటారని మంత్రి మెప్మా ఉద్యోగులకు హామీ ఇచ్చారు. అనంతరం రిసోర్స్‌పర్సన్లు, కమ్యూనిటీ ఆఫీసర్ల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సమావేశంలో మున్సిపల్ కార్యదర్శి నవీన్ మిట్టల్, డీఎంఏ శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.



బుధవారం బేగంపేట క్యాంపు కార్యాలయంలో మెప్మా ఉద్యోగులతో మాట్లాడుతున్న మంత్రి కే తారక రామారావు

పెరుగనున్న మెప్మా ఉద్యోగుల జీతాలు!

పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా)లోని ఉద్యోగుల జీతాలు పెరుగనున్నాయి. ఇందులో పనిచేస్తున్న 378 మంది ఉద్యోగులకు హెచ్‌ఆర్ పాలసీని అమలు చేయనున్నారు. బుధవారం సాయంత్రం మంత్రి కేటీఆర్.. తెలంగాణ కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు జగన్నాథం ప్రవీణ్‌తో మెప్మా ఉద్యోగుల జీతభత్యాలపై చర్చించారు. త్వరలో రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్‌తో చర్చించి మెప్మా ఉద్యోగుల సమస్యలను పరిష్కరిస్తామని ఉద్యోగ సంఘం నాయకులకు కేటీఆర్ హామీ ఇచ్చారు. మున్సిపల్ ఉద్యోగుల సంఘం అధ్యక్షులు మధు, శ్రీనివాస్, ఉన్నతాధికారులు చర్చల్లో పాల్గొన్నారు.

ముమ్మరంగా వరినాట్లు



84 శాతానికి చేరుకున్న పంటల సాగు విస్తీర్ణం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రెండువారాలుగా కురిసిన వర్షాలతో రాష్ట్రవ్యాప్తంగా వానాకాలం సీజన్‌లో వరినాట్లు ముమ్మరం అయ్యాయి. వారం రోజుల్లోనే దాదాపు 1.26 లక్షల హెక్టార్లలో రైతులు వరినాట్లు వేశారు. రాష్ట్రవ్యాప్తంగా గడిచిన రెండేండ్లతో పోలిస్తే ఈ ఖరీఫ్ సీజన్‌లో వరిసాగు విస్తీర్ణం పెరిగింది. 2015 ఖరీఫ్‌లో వరిసాగు విస్తీర్ణం 3.68 లక్షల హెక్టార్లు కాగా, 2016 ఖరీఫ్‌లో 4.58 లక్షల హెక్టార్లు సాగు చేశారు. ఈ ఏడాది ఖరీఫ్‌లో ఇప్పటివరకు 6.20 లక్షల హెక్టార్లలో వరినాట్లు వేశారు. మరో వారంపాటు వర్షాలు కురిసే అవకాశం ఉండటంతో వరిసాగు మరింత పెరిగే అవకాశాలున్నట్టు వ్యవసాయశాఖ అధికారులు భావిస్తున్నారు. వానాకాలం సాధారణ సాగువిస్తీర్ణం కూడా 84 శాతానికి చేరింది. రాష్ట్రవ్యాప్తంగా సాధారణ సాగువిస్తీర్ణం 43.24 లక్షల హెక్టార్లు. ఇప్పటివరకు 36.21 లక్షల హెక్టార్లలో రైతులు పంటల సాగు చేపట్టారు. సాగువిస్తీర్ణంలో అత్యధికంగా రైతులు ఈ ఏడాది పత్తి పంటను సాగుచేశారు. వానాకాలంలో పత్తి సాధారణ సాగు విస్తీర్ణం 16.76 లక్షల హెక్టార్లు కాగా.. ఈ ఏడాది 18.24 లక్షల హెక్టార్లలో (109 శాతం) సాగు చేపట్టారు. తర్వాత సజ్జపంట 4.46 లక్షల హెక్టార్లు, కందులు 2.40 లక్షల హెక్టార్లు, సోయాబీన్ 1. 62 లక్షల హెక్టార్లు, పెసర్లు 0.87 లక్షల హెక్టార్లు, పసుపు 0.44 లక్షల హెక్టార్లు, మినుములు 0.29 లక్షల హెక్టార్లు, జొన్న 0.41 లక్షల హెక్టార్లు, చెరుకు 0. 22 లక్షల హెక్టార్లు, ఇతర ఆహార పంటలు 0. 42 లక్షల హెక్టార్లు, ఆహారేతర పంటలు 0.12లక్షల హెక్టార్ల విస్తీర్ణంలో రైతులు సాగు చేసినట్టు వ్యవసాయశాఖ వర్గాలు వెల్లడించాయి.

నాలుగు రోజులు మోస్తరు నుంచి భారీవర్షాలు

హైదరాబాద్ వాతావరణ శాఖ వెల్లడి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ఉపరితల ఆవర్తన ప్రభావంతో గురువారం నుంచి నాలుగురోజులపాటు రాష్ట్రవ్యాప్తంగా మోస్తరు నుంచి భారీ వర్షాలు పడే అవకాశాలున్నట్టు బుధవారం హైదరాబాద్ వాతావరణ శాఖ వెల్లడించింది. గురువారం ఓ మోస్తరుగా ప్రారంభమై.. తర్వాత భారీ వర్షాలుగా మారనున్నట్టు తెలిపింది. శుక్రవారం (ఈ నెల 25) నుంచి 27వ తేదీవరకు రాష్ట్రవ్యాప్తంగా భారీ వర్షాలు పడుతాయని వాతావరణ శాఖ అధికారులు చెప్పారు. గడిచిన 24 గంటల్లో రాష్ట్రవ్యాప్తంగా మిర్యాలగూడ, రామన్నపేట, కొణిజెర్లలో 4 సెంటీమీటర్ల చొప్పున, తల్లాడ, సదాశివనగర్, లింగంపేట, బాల్కొండ, నల్లగొండలో రెండు సెంటీమీటర్లు, సూర్యాపేట, కంపాసాగర్, దుమ్ముగూడెం, జూరాల, మెట్‌పల్లి, పర్వతగిరి, గాంధారి, చంద్రుగొండ, మహబూబ్‌నగర్ ప్రాంతాల్లో ఒక సెంటీమీటర్ చొప్పున వర్షపాతం నమోదైనట్టు వాతావరణశాఖ పేర్కొన్నది.

జూనియర్ కాలేజీల్లో డిజిటల్ తరగతులు

కసరత్తు చేస్తున్న ఇంటర్‌బోర్డు

జేఈఈ, ఎంసెట్ వంటి పోటీ పరీక్షలకు ఉపయోగకరం

నెలరోజుల్లో అందుబాటులోకి రానున్న పాఠాలు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: డిజిటలైజేషన్ విషయంలో ఇంటర్మీడియట్ బోర్డు ముందువరుసలో నిలుస్తున్నది. ఇప్పటివరకు విద్యార్థి, కాలేజీలకు సంబంధించి మొత్తం 22 రకాలసేవలను ఆన్‌లైన్ పరిధిలోకి తీసుకొచ్చిన ఇంటర్మీడియట్ బోర్డు డిజిటల్ పాఠాలను కూడా అందుబాటులోకి తీసుకురావడానికి ప్రణాళికలను రూపొందిస్తున్నది. సిలబస్‌కు అనుగుణంగా డిజిటల్ పాఠాల బోధనకు సంబంధించిన సేవలు అందించేందుకు ఓ ప్రైవేట్ సంస్థతో ఒప్పందం చేసుకున్నది. వారి ఆధ్వర్యంలో డిజిటల్ కంటెంట్‌ను రూపొందిస్తున్నారు. వాటిని ఇంటర్మీడియట్ ఆధ్వర్యంలో విషయ నిపుణులు పర్యవేక్షిస్తున్నారు. డిజిటల్ పాఠాలను మరో నెలరోజుల్లో అందుబాటులోకి తీసుకురావడానికి అధికారులు కసరత్తు చేస్తున్నారు. విద్యార్థులు సబ్జెక్టులను సులభంగా అర్థం చేసుకునే విధంగా డిజిటల్ పాఠాలను సృజనాత్మకంగా తీర్చిదిద్ది అందుబాటులోకి తీసుకొస్తున్నామని ఇంటర్‌బోర్డు కార్యదర్శి ఏ అశోక్ తెలిపారు. జేఈఈ మెయిన్స్, జేఈఈ అడ్వాన్స్‌డ్, ఎంసెట్ వంటి ప్రవేశపరీక్షలకు ఉపయోగపడే విధంగా ఈ పాఠాలను అందుబాటులోకి తెస్తున్నారు. విషయ నిపుణులతో సబ్జెక్టులవారీగా కమిటీలను వేసి పాఠాలు రూపొందిస్తున్నారు. బోర్డు రూపొందించిన ప్రత్యేక వెబ్‌సైట్, మొబైల్‌యాప్, సీడీల రూపంలో కూడా పాఠాలను అందుబాటులో ఉంచనున్నారు. ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో చదువుతున్న దాదాపు రెండు లక్షల మంది విద్యార్థులకు ఉచితంగా యూజర్ ఐడీ, పాస్‌వర్డ్ అందజేస్తారు. ప్రైవేట్ జూనియర్ కాలేజీలు ఈ డిజిటల్ పాఠాలు కావాలనుకుంటే ప్రతి విద్యార్థికి రూ.350 చెల్లించాల్సి ఉంటుందని బోర్డు కార్యదర్శి అశోక్ పేర్కొన్నారు.

చికిత్సకోసం 'గాంధీ'కి గవర్నర్

సామాన్యుడిగా వచ్చి..
వైద్యుడి కోసం వేచి ఉండి..

ఇది అందరి దవాఖాన అని ప్రజలకు తెలుపాలనే వచ్చా: గవర్నర్

పారిశుద్ధ్య నిర్వహణ బాగుందని గవర్నర్ నరసింహన్ కితాబు

బన్సీలాల్‌పేట్: తెలంగాణ, ఏపీ రాష్ర్టాలకు గవర్నర్ ఈఎస్‌ఎల్ నరసింహన్ బుధవారం మధ్యాహ్నం 12 గంటలకు సికింద్రాబాద్‌లోని ప్రభుత్వ గాంధీ దవాఖానకు ఎలాంటి హడావుడి లేకుండా వచ్చారు. తన కుడి కాలుకు ఉన్న ఆనె సమస్యకు చికిత్స కోసం వచ్చానని చెప్పారు. దీంతో దవాఖాన సూపరింటెండెంట్ డాక్టర్ శ్రావణ్‌కుమార్, డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ నరసింహారావు నేత, పరిపాలనాధికారి డాక్టర్ జయకృష్ణ, డాక్టర్ సాల్మన్ ఇతర అధికారులు గవర్నర్‌ను నేరుగా ఐదోఅంతస్తులోని వార్డుకి తీసుకెళ్లారు. ఆ సమయంలో సర్జన్లు ఆపరేషన్ థియేటర్‌లో ఉన్నారని చెప్పడంతో వారు వచ్చేవరకు 20 నిమిషాలపాటు గవర్నర్ సామాన్యుడిలా అక్కడే వేచి ఉన్నారు. ఈ సందర్భంగా దవాఖాన వైద్యులు, అధికారులతో మాట్లాడారు. ఆపరేషన్ అనంతరం వచ్చిన ప్లాస్టిక్ సర్జరీ విభాగాధిపతి డాక్టర్ సుభోద్, జనరల్ సర్జరీ విభాగాధిపతి డాక్టర్ ఎన్‌వీఎన్ రెడ్డి గవర్నర్ కుడికాలు చివరలో ఉన్న ఆనెను పరీక్షించారు. దానిని తొలిగించడానికి మైనర్ ఆపరేషన్ చేయాలని, ఆ తర్వాత కనీసం రెండువారాలు నడువకుండా విశ్రాంతి తీసుకోవాల్సి ఉంటుందని వివరించారు. ప్రస్తుతం తాను బిజీ షెడ్యూల్‌తో ఉన్నానని, మరో 15 రోజుల తర్వాత షెడ్యూల్‌లో మార్పులు చేసుకుని వచ్చి ఆపరేషన్ చేయించుకుంటానని వైద్యులకు గవర్నర్ చెప్పారు.



గాంధీ దవాఖానలో వైద్యులతో మాట్లాడుతున్న గవర్నర్ నరసింహన్

నేనూ సామాన్య పౌరుడినే..

తాను కూడా సామాన్య పౌరుడినేని, ఇదివరకు కూడా ఇక్కడే చికిత్స చేయించుకున్నానని, అందుకే మరోసారి వైద్యుల సలహా కోసం వచ్చానని గవర్నర్ నరసింహన్ చెప్పారు. ఈ దవాఖాన కేవలం పేద, మధ్య తరగతి ప్రజలకు మాత్రమే కాదని, మంచి వైద్యంకోసం సంపన్నులు కూడా రావచ్చని ప్రజలందరికీ తెలియాలనే తరచుగా వస్తున్నానని ఆయన వైద్యులతో అన్నారు. పారిశుద్ధ్యం నిర్వహణ ఇప్పుడు చాలా బాగున్నదని కితాబిచ్చారు. ప్రజలతో ప్రేమగా మాట్లాడి వారికి ఎలాంటి ఇబ్బంది కలుగకుండా వైద్య సేవలు అందించాలని సూచించారు. ఏవైనా సమస్యలున్నాయా? అని ప్రశ్నించారు. రోగులకు సరిపడా సిబ్బంది లేరని, ఎంఆర్ఐ యంత్రం ఒక్కటే ఉన్నదని మరొకటి ఉంటే బాగుంటుందని సూపరింటెండెంట్ డాక్టర్ శ్రావణ్‌కుమార్ చెప్పారు. తాను సీఎంతో మాట్లాడి పరిష్కారమయ్యేలా సహకరిస్తానని గవర్నర్ హామీఇచ్చారు.

ఎంపీఈడీ, ఎంబీఏ ఫలితాల విడుదల

ఉస్మానియా వర్సిటీ: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని మాస్టర్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ (ఎంపీఈడీ), ఎంబీఏ ఫలితాలను విడుదల చేసినట్టు అధికారులు తెలిపారు. ఎంపీఈడీ నాలుగో సెమిస్టర్ పరీక్షలను మార్చిలో నిర్వహించారు. ఎంబీఏ నాలుగో సెమిస్టర్ రెగ్యులర్, మొదటి, రెండు, మూడో సెమిస్టర్ బ్యాక్‌లాగ్ పరీక్ష ఫలితాలను మే నెలలో నిర్వహించారు. ఎంపీఈడీ, ఎంబీఏ పరీక్ష ఫలితాలను www.osmania.ac.in వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచారు.

నవంబర్ 13న నేషనల్ ఎచీవ్‌మెంట్ సర్వే పరీక్ష

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: మూడు, ఐదు, ఎనిమిది తరగతులు చదువుతున్న విద్యార్థుల్లో 'లెర్నింగ్ లెవల్స్' ఏ విధంగా ఉన్నాయో తెలుసుకోవడంపై జాతీయ ఉపాధ్యాయ విద్యాపరిశోధన, శిక్షణామండలి (ఎన్‌సీఈఆర్‌టీ) నేషనల్ ఎచీవ్‌మెంట్ సర్వే పరీక్షను నిర్వహిస్తున్నది. ప్రభుత్వ, ప్రైవేట్, ఎయిడెడ్, గురుకులాల్లో ఈ పరీక్షను నవంబర్ 13న నిర్వహించనున్నారు. చదువడం, రాయడం, లెక్కలు చేయడం, ఇంగ్లిష్, తెలుగు భాషపై ఎంత పరిజ్ఞానం వచ్చింది.. వంటి పలు అంశాలపై 'లెర్నింగ్ లెవల్స్‌ను' అంచనా వేస్తారు. తెలంగాణ రాష్ట్రం నుంచి అన్ని పాఠశాలల్లో లక్షన్నర మంది విద్యార్థులు ఎచీవ్‌మెంట్ సర్వే పరీక్షలకు హాజరుకానున్నారు. పరీక్ష కోసం తగుచర్యలు చేపట్టినట్టు పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ జీ కిషన్ తెలిపారు.



హైదరాబాద్‌లో మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న హోంమంత్రి నాయిని నర్సింహారెడ్డి. చిత్రంలో కార్పొరేషన్ చైర్మన్ ప్రేమ్‌సింగ్ రాథోడ్ తదితరులు ఉన్నారు.

మూసీని శుద్ధిచేసి చరిత్ర సృష్టిస్తాం

హోంమంత్రి నాయిని నర్సింహారెడ్డి వెల్లడి

మూసీ రివర్‌ఫ్రంట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ కార్యాలయం ప్రారంభం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: మురికికూపంగా మారిన మూసీనదిని శుద్ధిచేసి చరిత్ర సృష్టిస్తామని హోంమంత్రి నాయిని నర్సింహారెడ్డి చెప్పారు. మూసీని సుజల స్రవంతిగా మార్చడానికి సీఎం కేసీఆర్ తొలివిడుతలో దాదాపు రూ.1,000 కోట్లను కేటాయించారని తెలిపారు. ఇది పూర్తయ్యాక జంట నగరాలకు సరికొత్త కళ వస్తుందన్నారు. బుధవారం హైదరాబాద్‌లోని లక్డీకపూల్‌లో 'మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్' కార్యాలయాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి నాయిని మాట్లాడుతూ గతంలో హైదరాబాద్, సికింద్రాబాద్ జంటనగరాల ప్రజల దాహార్తిని తీర్చిన మూసీనది గత పాలకుల నిర్లక్ష్యం వల్ల మురికికూపంగా తయారైందని విమర్శించారు. హైదరాబాద్‌ను విశ్వనగరంగా అభివృద్ధి చేసేసత్తా తమ ప్రభుత్వానికే ఉన్నదన్నారు. నగరంలో 52 జంక్షన్లు, ఫ్లైఓవర్లు, స్కైవేలు వంటివి పూర్తిచేయడానికి ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తున్నదన్నారు. రాష్ట్రంలోని నగరాలు, పట్టణాల అభివృద్ధికి మంత్రి కేటీఆర్ ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారని తెలిపారు. మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ ప్రేమ్‌సింగ్ రాథోడ్ మాట్లాడుతూ మూసీ ప్రక్షాళన కోసం సుమారు రూ.1,665 కోట్ల నిధులు విడుదల చేసిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందన్నారు.

'స్వచ్ఛ భారత్' ఆవిష్కరణల దరఖాస్తు గడువు పెంపు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: స్వచ్ఛ భారత్-స్వచ్ఛథాన్‌లో భాగంగా పారిశుద్ధ్యం, పరిశుభ్రత పరిష్కారంపై నూతన ఆలోచనలను కేంద్ర ప్రభుత్వానికి అందజేసే గడువును ఈ నెల 31 వరకు పొడిగించినట్లు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ కమిషనర్ నీతూప్రసాద్ తెలిపారు. పారిశుద్ధ్యం, పరిశుభ్రత నూతన ఆవిష్కరణల కోసం రాష్ట్రవ్యాప్తంగా 35 సాంకేతిక విద్యా కళాశాలల్లో అవగాహన సదస్సులు నిర్వహించినట్టు బుధవారం ఒక ప్రకటనలో ఆమె తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో మరుగుదొడ్ల వినియోగం పెంచడానికి వీలుగా వివిధ పద్ధతులను, సాంకేతిక పరిష్కారాలను, ఆలోచనలను కేంద్రప్రభుత్వానికి innovete.mygov.in, swachahaton-1-o వెబ్‌సైట్ ద్వారా పంపాలని కమిషనర్ కోరారు.

ఎస్సీ విద్యార్థులకు 21.63 కోట్లు

ఎస్సీ విద్యార్థులకు స్కాలర్‌షిప్స్ అందజేసేందుకు ప్రభుత్వం రూ.21.63 కోట్లు మంజూరుచేసింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్‌మిశ్రా బుధవారం ఉత్తర్వులు జారీచేశారు. 2017-18 విద్యా సంవత్సరంతో ఎస్సీ విద్యార్థులకు ఈ నిధుల నుంచి స్కాలర్‌షిప్స్ అందజేయాలని పేర్కొన్నారు.



ట్రిపుల్ తలాఖ్ విషయంలో సుప్రీంకోర్టు తీర్పు ఆహ్వానించదగింది. ఈ తీర్పు ముస్లిం మహిళలకు భద్రత ఇస్తుంది. లింగ వివక్ష అంతరించాల్సిన అవసరం ఎంతైనా ఉన్నది.

మహమ్మద్ కైఫ్, మాజీ క్రికెటర్

బీహార్ ముఖ్యమంత్రి నితీశ్‌కుమార్ 'ఎన్‌జీవో' కుంభకోణాన్ని నీరుగార్చటానికి ప్రయత్నిస్తున్నాడు. అనుకూలురైన అధికారులను 'సిట్'లో నియమించి వాస్తవాలను కప్పిపెడుతున్నాడు. అవినీతి మూటల్లో నిజాయితీ నిప్పును దాచి ఉంచలేరు.

లాలూప్రసాద్ యాదవ్, ఆర్జేడీ అధినేత




చరిత్రలో నేడు



1456
మొదటిసారిగా అచ్చు యంత్రంపై బైబిల్ ముద్రణ.

1891
'చలనచిత్ర కెమెరా'ను కనుగొన్న థామస్ ఎడిసన్.





1932
ఖండాంతర విమానాన్ని నడిపిన మొదటి మహిళ అమెలియా ఎరార్ట్.

ఏఐఏడీఎంకే రెండు గ్రూపులు ఏకమై సీఎం పళనిస్వామి, మాజీ సీఎం పన్నీర్ సెల్వం చేతులు కలిపి ప్రభుత్వాన్ని, పార్టీని ఏకతాటిపైకి తేవటంలో సఫలమయ్యారు. కానీ 19 మంది ఎమ్మెల్యేల బలంతో ప్రభుత్వాన్ని పడగొట్టే సంఖ్యాబలం ఉన్న దినకరన్‌ను ఢీకొనడమెలా అన్నదే ఇప్పుడు ప్రధాన సమస్య. శాసనసభలో బలం నిరూపించుకోవాలంటున్న డీఎంకేతో చేతులు కలుపకున్నా శశికళ వర్గాన్ని పార్టీ నుంచి దూరం చేయాలంటున్న పన్నీర్ సెల్వం పంతం నెగ్గే పరిస్థితి కనిపించటం లేదు. ఈ నేపథ్యంలో బీజేపీ, గవర్నర్ విధాన నిర్ణయాలు కీలకంగా మారాయి.

ది హిందూ

అఫ్ఘానిస్థాన్ విషయంలో అమెరికా అధ్యక్షుడు ట్రంప్ కొత్త విధానానికి తెర లేపాడు. అఫ్ఘాన్ సేనలకు సాయంగా, శిక్షణ కోసం మరో నాలుగు వేల మంది అమెరికా సైన్యాన్ని దించుతామంటున్నాడు. అమెరికా సేనలు వైదొలిగితే ఆ స్థానంలో తాలిబన్లు, ఐఎస్ పాదుకొనే పరిస్థితి ఏర్పడుతుందని, అది అఫ్ఘానిస్థాన్ సుస్థిరతకు, శాంతికి ప్రమాదకరమని హెచ్చరిస్తున్నాడు. ఈ నేపథ్యంలోనే 'ఐఎస్'కు అండగా ఉండే దేశాలన్నింటినీ దారిలోకి తెచ్చుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నాడు. దీంతో అయినా అఫ్ఘాన్‌లో శాంతి నెలకొంటే అంతకన్నా మంచి నిర్ణయం మరొకటి లేదు.

ది టైమ్స్ ఆఫ్ ఇండియా

భారత్‌వైపు మొగ్గు

అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఇటీవల ప్రకటించిన దక్షిణాసియా విధానం ప్రచ్ఛన్న యుద్ధానంతరం మారిన పరిస్థితులకు అనుగుణంగా ఉన్నది. పాకిస్థాన్‌ను ఇరుకున పెట్టి భారత్‌వైపు స్పష్టమైన మొగ్గును ప్రకటించింది. కానీ అఫ్ఘానిస్థాన్ విధానమే ఆశ్చర్యం కలిగిస్తున్నది. ట్రంప్ అధ్యక్ష ఎన్నికల ప్రచారంలో అఫ్ఘానిస్థాన్‌లో సైనిక చర్యకు వ్యతిరేకంగా మాట్లాడారు. ప్రజాభిప్రాయం కూడా అఫ్ఘానిస్థాన్‌లో యుద్ధానికి త్వరగా ముగింపు పలుకాలనే రీతిలో ఉన్నది. కానీ అధికారం చేపట్టిన తరువాత ఇప్పుడు మరింత మొండి వైఖరిని ప్రదర్శిస్తున్నారు. అఫ్ఘానిస్థాన్ నుంచి నిర్ణీత కాల వ్యవధిలో దళాలను ఉపసంహరించుకోవాలనేది ఇప్పటివరకు అనుసరిస్తున్న విధానం. అది ఎప్పుడు సాధ్యమవుతుందో తెలువదు కానీ, సాధ్యమైనంత తొందరగా ఆ యుద్ధం నుంచి బయటపడాలనే అభిప్రాయమే బలంగా ఉండేది. కానీ ఇప్పుడు ట్రంప్ నిర్ణీత కాల వ్యవధి అంటూ ఏమీ ఉండదని అంటున్నారు. అక్కడి పరిస్థితులను బట్టి నిర్ణయం తీసుకుంటామని స్పష్టం చేశారు. ట్రంప్ ఈ నిర్ణయానికి రావడానికి కూడా కారణం ఉన్నది. ఇరాక్‌లో మాదిరిగా తమ దళాలను ఉపసంహరించుకుంటే ఆ శూన్యాన్ని ఉగ్రవాద శక్తులు భర్తీ చేస్తాయనే ఆందోళన అమెరికాకు ఉన్నది. కానీ అమెరికా ఆర్థిక వ్యవస్థ సంక్షోభంలో ఉన్నది. సంక్షేమ విధానాలు సన్నగిల్లిపోతున్నాయి. ఈ నేపథ్యంలో యుద్ధ వ్యయాన్ని ఎట్లా భర్తీ చేస్తారనేది పెద్ద సమస్య. యుద్ధం మొదలుపెట్టారు కనుక లబ్ధి జరిగే రీతిలో గౌరవంగా బయటపడాలె. కానీ గతంతో పోలిస్తే తాలిబన్లు అఫ్ఘానిస్థాన్ అంతటికీ విస్తరించారు. అటు ఇరాన్ ఇటు చైనా, రష్యా కాచుకొని ఉన్నాయి. ఈ పరిస్థితులలో యుద్ధభారాన్ని మిత్ర పక్షాలపై మోపాలనేది ట్రంప్ ఆలోచనగా కనిపిస్తున్నది. అమెరికాతో భారత్‌కు వాణిజ్య మిగులు ఉన్నది కనుక, అఫ్ఘానిస్థాన్ అభివృద్ధికి తోడ్పడాలని ట్రంప్ పక్కా వ్యాపారి తరహాలో వ్యాఖ్యానించడం గమనార్హం.

అఫ్ఘానిస్థాన్ మధ్య ఆసియా, దక్షిణాసియా, పశ్చిమాసియాలో ప్రాబల్యం కాపాడుకోవడానికి కీలకం. కానీ అఫ్ఘానిస్థాన్– పాకిస్థాన్ ప్రాంతం తాలిబన్లు, ఐఎస్ తదితర ఉగ్రవాద వర్గాలకు కేంద్రంగా మారిపోయింది. ఈ నేపథ్యంలో పాకిస్థాన్‌ను నియంత్రించడానికి అమెరికా ప్రయత్నిస్తున్నది. మరోవైపు భారత్‌ను మెప్పించడానికి ప్రయత్నిస్తున్నది. కశ్మీర్‌లో ఉగ్రవాద కార్యకలాపాలకు పాల్పడుతున్న హిజ్బుల్ ముజాహిదీన్ సంస్థను ఉగ్రవాద సంస్థగా గుర్తించింది. ద్వైపాక్షిక సంబంధాలను మరింత బలోపేతం చేద్దామనే ఆకాంక్షను ట్రంప్ వ్యక్తం చేశారు. అఫ్ఘానిస్థాన్ వ్యూహంలో భారత్ కలిసి రావాలని కోరుకుంటున్నది. భారత్ ఇప్పటికే అఫ్ఘానిస్థాన్‌లో అనేక అభివృద్ధి ప్రాజెక్టులను చేపట్టింది. 2001 నుంచి ఇప్పటివరకు మూడు వందల కోట్ల డాలర్ల మేర ఆర్థిక సహాయం అందించింది. రహదారులు, నీటిపారుదల ప్రాజెక్టులతో పాటు పార్లమెంటు భవనాన్ని కూడా నిర్మించి పెట్టింది. ఇకముందు కూడా పునర్నిర్మాణంలో భారత్ తోడ్పాటు ఉంటుంది. కానీ ట్రంప్ ఆశిస్తున్నది అంతకుమించిన సైనిక సహాయం. భారత్ ఇప్పటికే అఫ్ఘానిస్థాన్‌కు నాలుగు సైనిక హెలికాప్టర్లను సమకూర్చింది. భారత్ నుంచి మరింత సైనిక మద్దతు కావాలని అమెరికా సైనిక కమాండర్ జాన్ నికల్సన్ గత ఏడాది కోరారు. కానీ అఫ్ఘానిస్థాన్ యుద్ధం మొదలు పెట్టి పదహారేండ్లు అవుతున్నది. నాటో దేశాలు సైనికంగా, ఆర్థికంగా భారీగా నష్టపోయాయి. అమెరికా, యూరప్ దేశాలలోని ప్రజలు అఫ్ఘానిస్థాన్ పోరాటం పట్ల వ్యతిరేకతను ప్రదర్శిస్తున్నట్టు తాజా సర్వేలు సూచిస్తున్నాయి.

> **మన ప్రయోజనాల పరిరక్షణకు సొంత విధానాలను ఏమేర అనుసరించగలదనేది ప్రధానం. అమెరికా పాకిస్థాన్‌ను దూరంగా పెట్టి, భారత్‌కు మద్దతు ఇవ్వడం పట్ల మన విదేశాంగ మంత్రిత్వ శాఖ హర్షం వెలిబుచ్చింది. కానీ ఈ మద్దతు వెనుక గల ఉద్దేశాన్ని కూడా గ్రహించాలె. భారత్‌ను సైనికంగా అఫ్ఘానిస్థాన్ రొంపిలోకి దింపే ప్రమాదం ఉన్నది. ఇప్పటికే నామమాత్రంగా ఉన్న సైనిక సహకారాన్ని పెంచే విధంగా ఒత్తిడి తేవచ్చు. నాటోయేతర మిత్రపక్షంగా దక్షిణాసియాలో అమెరికా ప్రయోజనాల ను కాపాడటం భారత్ బాధ్యతగా మారిపోవచ్చు. అందువల్ల భారత్ జాగ్రత్తగా వ్యవహరించాలె.**

పాకిస్థాన్ ప్రచ్ఛన్న యుద్ధకాలమంతా అమెరికా మిత్రదేశంగా ఉన్నది. భారత్ సోవియెట్ యూనియన్‌తో సాన్నిహిత్యాన్ని పెంచుకున్నది. ఈ మైత్రి అంతర్జాతీయ రంగంలో బల ప్రదర్శనకు, దౌత్య విధానాలకే పరిమితం కాదు. అమెరికా సూచించిన ఆంతరంగిక, ఆర్థిక విధానా లు పాకిస్థాన్‌ను కల్లోల భరితం చేశాయి. భారత్ సోవియెట్ యూనియన్ వైపు మొగ్గు చూపినప్పటికీ, అలీన విధానాన్ని వదిలిపెట్టలేదు. స్వావలంబన, సంక్షేమ విధానాలను కూడా అనుసరించి అన్ని రంగాలలో అభివృద్ధి సాధించింది. నాటో కూటమి, వార్సా కూటమి పరస్పరం ఒలింపిక్ క్రీడలను కూడా బహిష్కరించుకున్న ఉద్రిక్త పరిస్థితులలో కూడా భారత్ తటస్థ వైఖరి పాటించింది. ఇప్పుడు భారత్ అమెరికా వైపు మొగ్గినప్పటికీ, అనేక అంతర్జాతీయ అంశాలలో అవసరమైతే తటస్థ వైఖరి ప్రదర్శించడానికి వెనుకాడకూడదు. మన ప్రయోజనాల పరిరక్షణకు సొంత విధానాలను ఏమేర అనుసరించగలదనేది ప్రధానం. అమెరికా పాకిస్థాన్‌ను దూరంగా పెట్టి, భారత్‌కు మద్దతు ఇవ్వడం పట్ల మన విదేశాంగ మంత్రిత్వ శాఖ హర్షం వెలిబుచ్చింది. కానీ ఈ మద్దతు వెనుక గల ఉద్దేశాన్ని కూడా గ్రహించాలె. భారత్‌ను సైనికంగా అఫ్ఘానిస్థాన్ రొంపిలోకి దింపే ప్రమాదం ఉన్నది. ఇప్పటికే నామమాత్రంగా ఉన్న సైనిక సహకారాన్ని పెంచే విధంగా ఒత్తిడి తేవచ్చు. నాటోయేతర మిత్రపక్షంగా దక్షిణాసియాలో అమెరికా ప్రయోజనాల ను కాపాడటం భారత్ బాధ్యతగా మారిపోవచ్చు. అందువల్ల భారత్ జాగ్రత్తగా వ్యవహరించాలె.

జనగళం

అవగాహన కల్పించాలె

ఎంతోమంది కిడ్నీ, గుండె, ఊపిరితిత్తుల సంబంధిత వ్యాధులతో బాధపడుతున్నారు. అవయవాల మార్పిడికి వీలుగాక అవస్థలు పడుతూ జీవితాన్ని వెల్లదీస్తున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో అవయవదానంపై అవగాహన కల్పిస్తే ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. ఎంతోమంది ప్రమాద ఘటనలలో బ్రెయిన్ డెడ్ అవుతున్నారు. ఇలాంటి వారి అవయవాలు వ్యాధులతో అవస్థలు పడుతున్నవారికి కొత్త జీవితాన్నిస్తాయి. కాబట్టి అవయవదానంపై విస్తృత ప్రచారం చేయాలి. ప్రజల్లో అవగాహన కల్పిస్తే అవయవ దానానికి ముందుకు వస్తారు.

- పి.లావణ్య, బస్వాపూర్, సిద్దిపేట

పరిశుభ్రత పాటించాలె

ఆర్టీసీ బస్టాండుల్లోని మూత్రశాలల్లో శుభ్రత ఉండటం లేదు. దుర్గంధం వెదజల్లుతున్నది. ప్రయాణికులు ముక్కుమూసుకొని బస్సుల కోసం వేచి చూడాల్సిన పరిస్థితి ఉన్నది. కాబట్టి అధికారులు, ఆర్టీసీ యాజమాన్యం పరిశుభ్రతపై దృష్టిసారించాలి. ఎప్పటికప్పుడు మూత్రశాలలను శుభ్రం చేయించాలి.

- కె.ప్రవీణ్, హైదరాబాద్

సంరక్షణ బాధ్యత తీసుకోవాలె

'హరితహారం' పథకంలో భాగంగా ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా కోట్లాది మొక్కలను నాటింది. ఈ మొక్కలను సంరక్షించుకునే బాధ్య తను ప్రజలే తీసుకోవాలి. స్థానిక ప్రజలు, యువకులు గ్రామ పంచాయ తీ సిబ్బంది మొక్కల చుట్టూ కంచెలు ఏర్పాటు చేసి రక్షించుకోవాలి. పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలె.

- బి.కిషన్, కోతిరాంపూర్, కరీంనగర్

ఉత్తరాలు, రచనలు పంపవలసిన చిరునామా: 8-2-603/1/7,8,9, కృష్ణాపురం, రోడ్‌నంబర్.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034. editpage@namasthetelangaana.com Fax-040-23291118

ఆలోకన



టంకశాల అశోక్

'శూన్య'వాదుల శూన్యవాదం!

గ్లాసు సగం నిండి ఉందా లేక సగం ఖాళీగానా అనే తర్కం ఎప్పటినుంచో ఉన్నదే. అది ఎప్పటికీ తేలనిది. ఎవరికీ ఉపయోగపడనిది. ఇప్పుడు తెలంగాణ ప్రజలకు ఉపయోగపడేది గ్లాసులో ఖాళీగా ఉన్నభాగం క్రమంగా నిండుతున్నదా, లేక నిండుగా ఉన్న భాగం ఖాళీ అవుతున్నదా అనే ప్రశ్న మాత్రమే. సాధారణ ప్రజల దృష్టి ఆ విధంగానే ఉండగా, కొందరు స్వప్రయోజనాల కోసం వాస్తవాలను చూడదలుచుకోక, నిండిన సగం గ్లాసు సైతం 'శూన్య'మంటున్నారు.

మూడు సంవత్సరాల కిందట తెలంగాణ ఏర్పడే నాటికి గ్లాసు ఏ విధంగా ఉందో అందరికీ తెలుసు. ఆ విధంగా ఉండటానికి బాధ్యత ఎవరెవరిదో కూడా అందరికీ తెలుసు. తర్వాత మూడేండ్లలో ఏమీ జరిగిందనేదానికి అనేక సాక్ష్యాలు కళ్ల ఎదురుగా ఉన్నాయి. వాటిని చూడదలచుకున్నవారు ఎవరైనా చూడగలరు. సాధారణ ప్రజలు చూస్తున్నారు కూడా. కానీ 'శూన్య'వాదులకు ఏమీ కన్పించటం లేదు. గ్లాసు పూర్తిగా నీటితో నిండిపోయిందని ఎవరూ అనలేరు. మూడేళ్లలోనే నింపివేయగలవారు ఎవరూ లేరు కూడా. మన 'శూన్య'వాదులంతా ఇక్కడ ఉమ్మడి రాష్ట్రంలోనో మరొకచోటనో అధికారాలు నెరిపినవారే. వారు దశాబ్దాలు పాటు పాలించి కూడా గ్లాసును నింపలేదు. పూర్తిగా కాకున్నా కనీసం ప్రజలను సంతృప్తిపరిచే మేరకైనా. అందువల్లనే పరాజయాల పాలవుతున్నారు. తెలంగాణలో జరిగింది కూడా అదే. ఒకవేళ తాము గ్లాసును నింపినట్లు చెప్పదలుచుకుంటే ఆ వివరాలను ప్రజల ముందుంచాలి. ముఖ్యంగా తమ మొదటి మూడేండ్ల పాలనలో గ్లాసును ఎంతవరకు నింపారనే సమాచారం అందులో విడిగా ఉండాలి. అపుడుగాని వారి పాలనతో పోల్చితే ప్రస్తుతం తెలంగాణ గ్లాసులో నిండింది ఎంతో, ఖాళీ ఎంతో తెలియదు. లేక వారు నిత్యం విమర్శిస్తున్నట్లు 'అంతా శూన్య' మేనో అర్థమవుతుంది. తమ వాదన నిజమనిపించినట్లయితే అపుడు తెలంగాణ ప్రజలకు వచ్చేసారి అధికారాన్ని ఈ 'శూన్య'వాదులకు అప్పగించేందుకు ఎటువంటి అభ్యంతరం ఉండకూడదు. నిజం కాదనిపిస్తే అపుడు ఈ 'శూన్య' వాదులనే శూన్యంలోకి తోసేందుకు వారు సందేహించరు.

పైన అన్నట్లు, గ్లాసులోని ఖాళీ భాగం క్రమంగా నిండుతున్నదా లేదా అనేది ఒక్కటే పరిశీలించదగిన ప్రశ్న. ఏ పక్షపాతం లేకుండా స్వతంత్రంగా పరిశీలించేవారు ఎవరైనా ఇందుకు సమాధానం చెప్పగలరు. ఒక్కమాటలో చెప్పాలంటే, గ్లాసులో ఖాళీ ఇంకా ఉండటం ఎంత నిజమో ఆ ఖాళీ క్రమంగా నిండుతుండటం కూడా అంతే నిజం. పనులు జరుగుతున్న తీరును గమనించినపుడు, ఈ ప్రభుత్వానికి గల మిగిలిన రెండేండ్ల గడువు ముగిసేసరికి గ్లాసు మరింత నిండగలదని కూడా చెప్పకతప్పని పరిస్థితి కనిపిస్తున్నది. అప్పటికైనా 'పూర్తిగా' నిండకపోవచ్చుగాక. కొంత శూన్యం ఇంకా మిగిలే ఉండవచ్చుగాక. కానీ, 2014 కన్నా ఈ 2017లో కొంత నిండిందా లేదా? ఇప్పటికన్నా 2019 నాటికి మరింత నిండగలదా లేదా? అన్నవి మాత్రమే లెక్కించదగ్గ విషయాలవుతాయి.

తెలంగాణలో గ్లాసు మూడేండ్లలో 'శూన్యం'గా మిగలకపోవటం మాట అట్లుంచి తగినంత నిండిందని, వేగంగా నిండిందని, నిరంతరం మరింత నిండుతున్నదని చెప్పేందుకు ఎన్ని అంశాలైన కండ్లెదుట కన్పిస్తున్నా యి. అందుకు కొన్ని తాజా ఉదాహరణలను పేర్కొనాలంటే, గతవారం వెలువడిన నేషనల్ కౌన్సిల్ ఫర్ అప్లయిడ్ ఎకనమిక్ రీసెర్చ్ (ఎన్‌సీఏఈఆర్) నివేదిక ఒకటి. ఇది స్వతంత్రంగా పనిచేసే జాతీయ పరిశోధనా సంస్థ. పరిశ్రమల స్థాపనకు అనువైన రాష్ట్రాల్లో తెలంగాణ స్థానం 2016 కన్నా 2017లో ఎంత వేగంగా పెరిగిందో పెరిగిపోయిందో ఆ సర్వే కోసం పరిగణనలోకి తీసుకున్న ఆరు అంశాలను గమనించినపుడు తెలియటం లేదా? ఆ వార్తలను 'శూన్య'వాదులు చూసే ఉంటారు. కానీ ఎందువల్లనో ఎవరూ నోరు విప్పలేదు. రాష్ట్ర అభివృద్ధి గ్లాసు ఆ విధంగా నిండుతుండటం వారికి బహుశా దుఃఖాన్ని కలిగించి ఉంటుంది.

గ్లాసు నిండేందుకు పారిశ్రామిక రంగం ఒక ప్రధానమైన అంశం అనుకుంటే, వ్యవసాయం మరొక ప్రధానమైన రంగం. అందుకు సంబంధించి కూడా ఒక తాజా ఉదాహరణను చెప్పుకుందాం. అది, శ్రీరాం సాగర్ పునరుజ్జీవనానికి ఆరంభం జరుగటం. ఈ ప్రాజెక్టు ఏ స్థాయిలో మొదలై ఏ స్థాయికి పతనమైందన్న చరిత్ర 'శూన్య'వాదులకు బాగా తెలుసు. అటువంటి పతనంలో స్వయంగా తమ పాత్ర ఉన్నందున ఇంకా ఎక్కువగా తెలుసు. అటువంటి ప్రాజెక్టు పునరుజ్జీవానికి ఇదే నెలలో శ్రీకారం జరుగటం గ్లాసును నింపటమవుతుందా లేక ఖాళీ చేయటమా? ఇంతగా రాస్తున్నాము గాని వాస్తవానికి ఇవన్నీ 'శూన్య'వాదులకు తెలియనివి కావు. వారు దివాంధులేమీ కారు. కేవలం రాజకీయ ప్రయోజనాల కోసం ప్రజలను తప్పుదారి పట్టించేందుకు, శూన్యవాద సిద్ధాంతాన్ని ఆశ్రయించారు. కాని వారి పట్ల జాలి కలుగుతున్నది. ఎందుకంటే, తెలంగాణ ప్రజలు 'శూన్య'వాదంతో లేరు. ఉండగల అవకాశమూ కన్పించటం లేదు. గ్లాసు 2014లో ఏ విధంగా ఉందో, ఈ మూడు సంవత్సరాల తర్వాత ఎట్లా ఉన్నదో, అది క్రమంగా నిండుతున్నదో లేక ఖాళీగానే ఉండిపోయిందో ప్రజలకు బాగా తెలుసు. గ్లాసు సగం నిండినట్లా లేక సగం ఖాళీగా ఉన్నట్లా అనే శుష్కమైన వితండ తర్కాలతో వారికి నిమిత్తం లేదు. ఖాళీ గ్లాసు క్రమంగా నిండుతున్నదా లేక క్రమంగా ఖాళీ అవుతున్నదా అనేది ఒక్కటే వారు పట్టించుకునే ప్రశ్న. పట్టించుకోవలసింది కూడా అదొక్కటే.

> **వ్యవసాయం దాని అనుబంధ రంగాలు, పరిశ్రమలు-వాటి అనుబంధ రంగాలు, సంక్షేమం, విద్యా ఉద్యోగ ఉపాధులు, ఆరోగ్యం, మౌలిక వసతులు మొదలైన అన్నింటికి నిండిన గ్లాసు-నిండుతున్న గ్లాసు-ఇంకా నిండవలసిన గ్లాసు అనే విభజనలుండాలి. ఒకవేళ వారి దృష్టిలో తాము గతంలో నింపి ఇపుడు ఖాళీ అవుతున్న గ్లాసు ఏమైనా ఉంటే అది కూడా చేర్చవచ్చు. అపుడు దానిని బట్టి వాదనలు చేస్తే ప్రజలు మెచ్చుతారు గాని, 'అంతా శూన్యం' అనే మిథ్యా వేదాంతాలతో కాదు.**

ఏమవుతున్నదో తెలుసుకునేందుకు ఇవి రెండు ఉదాహరణలు మాత్రమే. అవి కూడా పూర్తిగా ఇటీవలివి. నిజానికి ఇటీవలి ఉదాహరణలే మరిన్ని ఉన్నాయి. ఆదిభట్ల–నాదర్‌గుల్ పారిశ్రామిక ప్రాంతంలో ఏరోస్పేస్ యూనిట్ ప్రారంభం పారిశ్రామికాభివృద్ధికి సంబంధించినది కాగా, 1932–36 నాటి భూముల సర్వే తర్వాత గత 80 సంవత్సరాల్లో అరాచకంగా మారిన రెవెన్యూ వ్యవస్థను చక్కదిద్దేందుకు కొత్త సర్వే పనులు మొదలు కావటం వ్యవసాయ రంగానికి సంబంధించినది. ఇవి అన్నీ కళ్లెదుట నికరంగా కనిపిస్తున్నవే తప్ప గాలి మాటలు కాదు. అందుకే వ్యవసాయరంగంలో అనేక మౌలికమైన మార్పులను ప్రవేశపెడుతున్న నాయకునిగా భారత ఆహార–వ్యవసాయ మండలివారు గత వారాంతంలో ముఖ్యమంత్రి కేసీఆర్‌కు అవార్డు ప్రకటించారు. ప్రభుత్వం ఏర్పడిన కొత్తలోనే విద్యుత్ సమస్య పరిష్కారం, తొమ్మిది గంటలతో ఆరంభించిన వ్యవసాయ విద్యుత్ సరఫరాను ఇప్పుడు ఇరువై నాలుగు గంటలకు పెంచుతుండటం, ఎత్తిపోతల–ప్రాజెక్టులు–మిషన్ కాకతీయ చెరువుల కింద లక్షలాది ఎకరాలకు ఇప్పటికే నీరందుతుండగా దానిని మరింత పెంచే చర్యలు, రైతులకు ఎకరానికి ఏడాదికి ఎనిమిది వేల రూపాయల పెట్టుబడి ఇవ్వనుండటం, ధాన్యం నిల్వకు గిడ్డంగుల సామర్థ్యం ఇప్పటికే అయిదు రెట్లు పెరుగటం, విత్తనాలూ ఎరువుల వంటి గతకాలపు సమస్యల పరిష్కారం, రైతు సమాఖ్యల ఏర్పాటుకు సాగుతున్న చర్యలు, వ్యవసాయ విస్తరణాధికారుల నియామకం ద్వారా ఇప్పటికే జరిపిన భూములు–పంటల సర్వేలు మొదలైనవన్నీ ఆ మండలి పరిగణనలోకి తీసుకుని అవార్డును నిర్ణయించింది.

ఈ వార్తలను 'శూన్య'వాదులు చదువుతున్నారో లేక ఉష్ట్ర పక్షుల వలె తమ తలలను ఇసుకలో దూర్చుకున్నారో తెలియదు. వీరి మాటలు మాత్రం ఏ మార్పూ లేకుండా వినవస్తూనే ఉంటాయి. ప్రభుత్వం రైతు కోసం ఏమీ చేయటం లేదు, వ్యవసాయాన్ని నాశనం చేస్తున్నది, ప్రజలు పోరాడింది ఇటువంటి తెలంగాణ కోసమేనా' అన్నది ఈ 'శూన్య' వాదుల ఆవేదన. పైన అన్నట్లు వీరికి వాస్తవాలు తెలుసు. కాని వాటిని గుర్తించే నిజాయితీ లేదు. అందుకే వారి విమర్శలకు విలువ లేకుండా పోయింది. కాంగ్రెస్, టీడీపీ, బీజేపీ కమ్యూనిస్టులు, ఇతర విమర్శకులు అందరూ ఏమీ చేయాలో తోచని స్థితిలో ఒక నిస్సహాయతకు గురై 'శూన్య'వాదాన్ని ఆశ్రయిస్తున్నారు. దానితో తమ విశ్వసనీయతను ఇంకా కోల్పోయి నవ్వుల పాలవుతున్నారు.

వారు తమ వ్యూహాన్ని ఇప్పటికైనా మార్చుకోవటం మంచిది. అందుకోసం మొదట చేయవలసింది తమ పార్టీ కార్యాలయాల్లో రీసెర్చ్ విభాగాలు ఏర్పాటు చేసుకొని, గత మూడేండ్ల కాలంలో తెలంగాణ అభివృద్ధి గ్లాసు నిండింది ఎంతో, ఇంకా ఖాళీగా ఉన్నది ఎంతో వాస్తవాల జాబితా తయారు చేయించుకోవాలి. అందులో వ్యవసాయం దాని అనుబంధ రంగాలు, పరిశ్రమలు–వాటి అనుబంధ రంగాలు, సంక్షేమం, విద్యా ఉద్యోగ ఉపాధులు, ఆరోగ్యం, మౌలిక వసతులు మొదలైన అన్నింటికి నిండిన గ్లాసు–నిండుతున్న గ్లాసు–ఇంకా నిండవలసిన గ్లాసు అనే విభజనలుండాలి. ఒకవేళ వారి దృష్టిలో తాము గతంలో నింపి ఇపుడు ఖాళీ అవుతున్న గ్లాసు ఏమైనా ఉంటే అది కూడా చేర్చవచ్చు. అపుడు దానిని బట్టి వాదనలు చేస్తే ప్రజలు మెచ్చుతారు గాని, 'అంతా శూన్యం' అనే మిథ్యా వేదాంతాలతో కాదు. అటువంటి శూన్యవాదం తమనే శూన్యంలోకి నెట్టగలదు.

తెలుగుకు తొలి దివిటీ

స్మరణ



డాక్టర్ జె.చెన్నయ్య

ఆంధ్ర సారస్వత పరిషత్తు, ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ మొదలైన మహా సంస్థల ద్వారా తెలుగు భాషా సాహిత్య వికాసానికి నిరంతర, నిస్వార్థ సేవలందించిన ధన్యజీవి డాక్టర్ దేవులపల్లి రామానుజరావు. ఆయన శత జయంతి ఉత్సవాన్ని రేపు సగౌరవంగా జరుపుకుంటున్నాం. ఓరుగల్లు జిల్లాలోని బొల్లికుంట గ్రామంలో 1917 ఆగ స్టు 25న నూరేళ్ల కిందట రామానుజరావు జన్మించారు. తెలుగు నేలకు గొప్ప సాంస్కృతిక వారసత్వం ఉన్నప్పటికీ ఆ సంపదను పెంపుచేసి భావితరా ల కోసం మరింత కాంతివంతంగా రూపొందించి అందించే వ్యవస్థలు అప్పటికి లేవు. అలాంటి పరిస్థితిలో తెలుగును వికసింపజేసి సాహిత్యరంగానికి ప్రోత్సాహం కలిగించవలసిన చారిత్రక ఆవశ్యకత ఉన్న కాలమది. సురవరం ప్రతాపరెడ్డి, ఆదిరాజు వీరభద్రరావు, మాడపాటి హనుమంతరావు, పులిజాల రంగారావు వంటి పెద్దలు తమ శక్తిమేర కృషి చేస్తున్నా ఇంకా చేయవలసిన పనులున్నాయి. సరిగ్గా ఆ సమయంలో నాగపూర్‌లో న్యాయశాస్త్రంలో పట్టభద్రులై తిరిగివచ్చారు దేవులపల్లి రామానుజరావు. రామానుజరావుకు సురవరం, మాడపా టి గురుస్థానీయులు. రామానుజరావు నిజాం కళాశాలలో 1942కు పూర్వమే విద్యార్థిగా సాహిత్యరంగంలో తొలి అడుగులు వేసిన రోజుల్లోనే సురవరానికి, మాడపాటికి తెలుసు. వారి ప్రోత్సాహం రామానుజరావుకు ఎంతో ఉన్నది. ఆ ప్రోత్సాహ మే ఆంధ్ర సారస్వత పరిషత్తు వైపు అడుగులు వేయించింది. 1943 మే 26న ఆం ధ్ర సారస్వత పరిషత్తు ఏర్పడితే ఆ మరుసటి సం వత్సరమే దేవులపల్లి రామానుజరావు పరిషత్తు కార్యవర్గ సభ్యుడయ్యారు. ఆ సంవత్సరమే వరంగల్లు కోటలో పరిషత్తు సభలు నిర్వహించారు. కొందరు దుండగులు సభకోసం నిర్మించిన పందిళ్లను దగ్ధం చేస్తే బెదరక, చెదరక కవి సమ్మేళనం నిర్వహించారు. నాటినుంచి 1993లో దివంగతులయ్యే వరకు రామానుజరావు పరిషత్తును తన ఐదో ప్రాణంగా భావించి దాన్ని మహోన్నత సాంస్కృతిక కేంద్రంగా నిలిపారు. పరిషత్తు తెలంగాణ నట్టనడుమ ఉన్నా, తెలుగు ప్రపంచాన్నంతటినీ తన కార్యక్షేత్రంగా మలుచుకొని విస్తరింపజేశారు. అక్షరాస్యతా కేంద్రాలు నడిపారు. తెలుగు పరీక్షలు నిర్వహించారు. నిజాం రాష్ట్రం విముక్తమైన తొలినాళ్లలో మెట్రిక్ వరకు తెలు గు మాధ్యమంలో విద్యాభ్యాసానికి ప్రభుత్వామోదం సాధించారు రామానుజరావు. పాఠశాలల్లో పనిచేయడానికి ఉపాధ్యాయులు లేరంటే పరిష త్తు పరీక్షలు ఉత్తీర్ణులైన వారికి అర్హత కల్పించాలని కోరారు. అది లభించింది. పరీక్షలు ఉత్తీర్ణులైన వారు పల్లెపల్లెకూ తెలుగు ఉపాధ్యాయులుగా వెళ్లడంతో తెలుగు భాషాసూర్యుని వెలుగు సోకని చోటు లేదన్నట్లు అన్ని చోట్లకూ పాకింది. ఆంధ్ర సారస్వత పరిషత్తును తెలంగాణలో ఉన్న కవి పండితులకే కాదు, కోస్తా ఆంధ్ర సాహితీమూర్తులకు కూడా నిత్య సందర్శనీయ క్షేత్రంగా అభివృద్ధి చేసిన ఘనత రామానుజరావుకు దక్కుతుంది. ప్రాచ్య కళాశాలను, పండిత శిక్షణ కళాశాలను నెలకొల్పారు. ఎంతో విలువైన ప్రచురణలను తెచ్చారు. సాహిత్యంపై ప్రసంగాలు చేయించారు. 1957లో ప్రారంభమైన ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ రామానుజరావుకు మరో ఉన్నతమైన వేదికగా లభించింది. దేశానికే ఆదర్శప్రాయంగా అకాడమీని తీర్చిదిద్దారు. భాషా సాహిత్యాల పరిశోధనలో సృజనాత్మక రచన కృషిలో సాహిత్య అకాడమీ తీగకు పందిరిలా దోహ దం చేసింది.




ప్రాచీన సాహిత్య గ్రంథాల ప్రచురణ మరో ప్రత్యేక అంశం. కవిత్రయ భారతం, పోతన మహాభాగవతాలను, ఎన్నెన్నో కావ్యాలు, ప్రబంధాలను, వాటి ఛందో అలంకార విశేషాలను తరచి చూసేందుకు దారిచూపే నిఘంటువుల ను, పద కోశాలను ప్రచురించి తక్కుత ఖర్చు తో పాఠకులకు అందించే పనిని ఒక పరిశ్రమ లా నిర్వహించారు రామానుజరావు. ఇవేగాక ప్రపంచ తెలుగు మహాసభల కోశాధికారిగా ఉన్నారు. గురజాడ, రవీంద్రనాథ్ ఠాగూర్‌ల శతజయంతి ఉత్సవాల ప్రత్యేక సంచికలకు సంపాదకులుగా ఉన్నారు. ఇట్లా ఒక సామాన్య వ్యక్తికి సాధ్యం కానంత భారాన్ని అనేక బాహువులతో బం డ్లకెత్తారు దేవులపల్లి రామానుజరావు. ఆయనకు వేరే జీవితం లేదు. జమీందారి నేపథ్యం, వేయి ఎకరాల వ్యవసాయం, న్యాయశాస్త్రాది రంగాల్లో ప్రావీణ్యం ఇలాంటి వాటితో కీర్తి, ధన సంపాదనాపరుడు కావచ్చు. కాని తన ఒక్కని మేలుకు సంబంధించిన అన్ని వ్యాపకాలను త్యజించి, తెలుగు కోసం నడుంకట్టారు. యావజ్జీవితం వ్యక్తిగా కాక వ్యవస్థలా కృషి చేశారు. ఆయన తన ప్రాణంలా చూసుకొని పెంపు చేసిన సారస్వత పరిషత్తు ఆ మహనీయుని శత జయంతి సందర్భంగా తగిన రీతిలో స్మరించుకుంటున్నది. మొన్నటివరకు అధ్యక్షులుగా ఉన్న జ్ఞానపీఠ పురస్కార గ్రహీత డాక్టర్ సినారె నేతృత్వంలో దేవులప ల్లి రామానుజరావు శతజయంతిని తెలంగాణ వ్యాప్తం గా నిర్వహించే ప్రణాళిక రూపొందించింది. వరంగల్లు, సిద్దిపేట, ఆదిలాబాద్, కరీంనగర్, నల్లగొండ, మహబూబ్‌నగర్, ఖమ్మం, హైదరాబాద్ తదితర ప్రాంతాల్లో పరిషత్తు రామానుజరావు శతజయంతిని ఘనంగా నిర్వహించింది. పాత తరం కవి పండితులు రామానుజరావు పట్ల ఉన్న అభిమానంతో స్పందించారు. ఈ తరం పరిశోధకులు ఈ శతజయంతి సందర్భంలో అధ్యయనంతో తెలుసుకొని స్పందించారు.

ఈ శతజయంతి సందర్భాన్ని పురస్కరించుకొని తెలంగాణ సారస్వత పరిషత్తు డాక్టర్ రామానుజరావు అలబ్ధ రచనలను ఒక సంపుటిగా ప్రచురించింది. జీవిత చరిత్రను వెలువరించింది. నివాళి వ్యాసాలతో ప్రత్యేక సంచికను ప్రచురించింది. ఆయన స్మృతిని పదికాలాలు కాపాడేందుకు పరిషత్తు ప్రాంగణంలో విగ్రహాన్ని నెలకొల్పింది. తెలంగాణ ప్రభుత్వం భాషా సాంస్కృతిక శాఖ, తెలుగు విశ్వవిద్యాలయం, ఏవీ కళాశాల, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం ఇంకా ఎన్నో సంస్థలు శత జయంతి సందర్భంగా డాక్టర్ దేవులపల్లి రామానుజరావుకు శ్రద్ధా సుమాలను అర్పించాయి. అన్నిటికి మించి 1985లో అప్పటి ప్రభుత్వం సాహిత్య అకాడమీని రద్దు చేసినప్పుడు కలత చెంది నిర్భయంగా వ్యతిరేకించిన వారు రామానుజరావు. ఇప్పడు ఈ శతజయంతి సందర్భంలో తెలంగాణ ప్రభుత్వం సాహిత్య అకాడమీని పునరుద్ధరించడం ఆయనకు తగిన నివాళిగానే భావించాలి. ఆయన శతజయంతి సందర్భంగా ఎంతో చర్చ జరిగింది. ఆ చర్చ సారాంశం, రామానుజరావు జీవన సందేశం, మిగిలిన ఆయన ఆశయం తెలుగు భాషా సాహిత్యాల వికాసమే. ఏ సౌకర్యాలు లేనినాడు, సమాచార సాధనాలు అంతంతమాత్రంగా ఉన్ననాడే ఆయన భాషకు, సాహిత్యానికి ఎనలేని ఔన్నత్యం కల్పించారు. అన్నీ ఉన్న ఈ రోజుల్లో ఆ కృషి ఇంకా సాగాలన్నదే ఆయన ఆశయం. అది నెరవేరుతుందని ఆశిద్దాం.

(రేపు దేవులపల్లి రామానుజరావు జయంతి)

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No.437, Near Velama Kalyana Mandapam, Devara Yamjaal, Shamirpet Mandal, Dist: Medchal - 500 078,
Published At Telangana Publications Pvt Ltd. 8-2-603/1/7,8,9. Krishnapuram, Road No.10, Banjara Hills, Hyderabad, 500 034, Telangana State. Editor: **Katta Shekar Reddy.** Ph: +91 40 2329 1999, Fax: +91 40 2333 4242, 040-23291118, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/37693.

గోప్యత హక్కుపై నేడు సుప్రీంకోర్టు తీర్పు



న్యూఢిల్లీ: గోప్యత హక్కు ప్రాథమిక హక్కు కిందకు వస్తుందా? రాదా? అనే అంశంపై సుప్రీంకోర్టు ధర్మాసనం గురువారం తీర్పు చెప్పనున్నది. చీఫ్ జస్టిస్ జేఎస్ ఖేహర్ నేతృత్వంలోని తొమ్మిదిమంది సభ్యుల రాజ్యాంగ ధర్మాసనం దీనిపై సుదీర్ఘ విచారణ జరిపింది. తీర్పును వాయిదా వేస్తున్నట్టు ఈనెల 2వ తేదీన ప్రకటించింది. ధర్మాసనంలో చీఫ్ జస్టిస్ ఖేహర్‌తోపాటు జస్టిస్‌లు జే చలమేశ్వర్, ఎస్‌ఏ బోబడే, ఆర్కే అగర్వాల్, ఆర్‌ఎఫ్ నారిమన్, ఏఎం సాప్రే, డీవై చంద్రచూడ్, ఎస్కే కౌల్, ఎస్ అబ్దుల్ నజీర్ సభ్యులు. అటార్నీ జనరల్ కేకే వేణుగోపాల్‌తోపాటు అరవింద్‌దాతార్, కపిల్ సిబల్ ఈ కేసు వాదించారు.

ఉత్తరకొరియా మెత్తబడిందన్న ట్రంప్


- అటువంటిదేమీ లేదని స్పష్టం చేసిన కిమ్‌జోంగ్‌ఉన్.. క్షిపణుల తయారీని పెంచాలంటూ ఆదేశాలు



వాషింగ్టన్: ఇటీవలి వరకూ ఉత్తరకొరియాపై నిప్పులు చెరిగిన అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్‌ట్రంప్.. తన హెచ్చరికలకు ఆ దేశం భయపడి, మెత్తపడిందంటూ తాజాగా జబ్బలు చరుచుకున్నారు. అయితే, ఆయన ఆ మాటలన్న కొన్ని గంటల్లోనే ఉత్తరకొరియా తాను మెత్తబడిందేమీ లేదని స్పష్టం చేసింది. క్షిపణుల తయారీని మరింత వేగవంతం చేయాలని, క్షిపణుల్లో అమర్చేందుకు మరిన్ని అణుబాంబులు తయారు చేయాలని శాస్త్రవేత్తలను ఆ దేశాధినేత కిమోజోంగ్‌ఉన్ ఆదేశించారు. బుధవారం ఈ విచిత్ర పరిణామాలు చోటుచేసుకున్నాయి. అరిజోనాలోని ఫీనిక్స్‌లో జరిగిన బహిరంగసభలో ట్రంప్ మాట్లాడుతూ.. ఉత్తరకొరియా ఇటీవల సానుకూల సంకేతాలు వెలువరిస్తున్నదని చెప్పారు. 'ఉత్తరకొరియా నేత కిమ్‌జోంగ్‌ఉన్ మనల్ని గౌరవించడం ప్రారంభించారు.. నేనూ దీన్ని గౌరవిస్తున్నాను' అని తెలిపారు. అయితే, ట్రంప్ మాటల్ని పట్టించుకోకుండా ఉత్తరకొరియా తనదైన ధోరణిలో క్షిపణుల తయారీని మరింత వేగవంతం చేసింది. రక్షణశాస్త్రాల అకాడమీని సందర్శించిన కిమ్ మరిన్ని క్షిపణులను, వాటిలో అర్చేందుకు మరిన్ని అణుబాంబులను తయారు చేయాలని శాస్త్రవేత్తలను ఆదేశించినట్టు ఉత్తరకొరియా వార్తాసంస్థ కేసీఎన్‌ఏ వెల్లడించింది.

పథకం ప్రకారమే దభోల్కర్, పన్సారే హత్య

- బాంబే హైకోర్టు వ్యాఖ్య


దభోల్కర్ పన్సారే

ముంబై: ప్రముఖ హేతువాదులు నరేంద్ర దభోల్కర్, గోవింద్ పన్సారేల హత్యలు ఓ పథకం ప్రకారం జరిగాయని, హంతకులకు సంస్థాగత మద్దతు ఉన్నట్టు తెలుస్తున్నదని బాంబే హైకోర్టు వ్యాఖ్యానించింది. 'అవి సాధారణ హత్యలు కావు. కొన్ని సంస్థలు హంతకులకు ఆర్థికంగా సహాయపడ్డాయి. వారి హత్యలకు పక్కా పథకాన్ని రచించారు' అని న్యాయమూర్తులు ఎస్‌సీ ధర్మాధికారి, విభా కంకణ్‌వాడిలతో కూడిన ధర్మాసనం తెలిపింది. 'హంతకులను గుర్తించినా ఇంతవరకు సీబీఐ అధికారులు వారిని పట్టుకోలేకపోయారు. దోషులను పట్టుకొనేందుకు మరో కోణంలో దర్యాప్తు చేయాలి, ఆధునిక పరిజ్ఞానాన్ని ఉపయోగించాలి' అని సూచించింది.

అఖిల భారత సర్వీసులకు జోన్ల వ్యవస్థ

- ఖరారు చేసిన కేంద్రం



న్యూఢిల్లీ: దేశంలోని ఉన్నతస్థాయి అధికార వర్గాలలో జాతీయ సమగ్రతను ప్రోత్సహించేందుకు కేంద్ర సర్కారు ఐఏఎస్, ఐపీఎస్ తదితర అఖిలభారత సర్వీసు అధికారులకు కొత్త క్యాడర్ విధానాన్ని ఖరారు చేసింది. నూతన విధానంలో ఇప్పటిలా రాష్ర్టాల క్యాడరు కాక జోన్లను ఎంచుకోవాలి. ఇందుకుగానూ దేశాన్ని ఐదు జోన్లుగా విభజించారు. ఐదో జోన్‌లో తెలంగాణతోపాటుగా ఇతర దక్షిణాది రాష్ర్టాలున్నాయి. ఎంపిక చేసుకున్న జోన్‌లోని ఏ రాష్ట్రంలోనైనా నియామకం లభించే అవకాశం ఉంటుంది. పనితీరు, సామర్థ్యాన్ని బట్టి సొంతరాష్ట్రంలో నియామకం లభిస్తుంది. ఒక జోన్‌లో ఒక రాష్ర్టాన్ని క్యాడర్‌గా ఎంచుకుంటే మిగతా రాష్ర్టాలను ఇతర జోన్ల నుంచి ఎంచుకోవాల్సి ఉంటుంది. సొంత రాష్ర్టాలకు పరిమితం కాకుండా ఇతర రాష్ర్టాల్లో పనిచేసి అనుభవం సంపాదించడం లక్ష్యంగా ఈ విధానాన్ని రూపొందించినట్టు సిబ్బందిశాఖకు చెందిన ఓ అధికారి చెప్పారు. ఈ విధానాన్ని ఈ ఏడాది నుంచే అమలు చేయనున్నట్టు ఆయన వివరించారు.


ఛింద్వారా జిల్లాకేంద్రంలోని దవాఖానలో చికిత్స పొందుతున్న చిన్నారులు

మధ్యప్రదేశ్‌లో అమ్మోనియా గ్యాస్ లీక్

- 50 మంది విద్యార్థులకు అస్వస్థత

ఛింద్వారా: మధ్యప్రదేశ్‌లోని ఛింద్వారా జిల్లా కేంద్రంలో గల కోల్డ్ స్టోరేజీ నుంచి అమ్మోనియా గ్యాస్ లీకవ్వడంతో సమీపంలోని ప్రైవేట్ పాఠశాలకు చెందిన 50 మంది విద్యార్థులు బుధవారం అస్వస్థతకు గురయ్యారు. ఛింద్వారా పట్టణంలోని నర్సింగ్‌పూర్ రోడ్‌లో గల ఈ పాఠశాలలో గ్యాస్ లీకైనప్పుడు సుమారు 800 మంది విద్యార్థులు ఉన్నారు. అస్వస్థతకు గురైన 50 మంది విద్యార్థులకు జిల్లా కేంద్ర దవాఖానలో వైద్య పరీక్షలు నిర్వహించి వారి ఇండ్లకు పంపివేసినట్లు అధికారులు తెలిపారు. ఈ ఘటనపై జిల్లా కలెక్టర్ జేకే జైన్ విచారణకు ఆదేశించారు. జిల్లా ఎస్పీ గౌరవ్ తివారీతో కలిసి పాఠశాలలను సందర్శించిన కలెక్టర్ జైన్.. మొత్తం విద్యార్థులందరినీ ఖాళీ చేయించామని తెలిపారు. కోల్డ్ స్టోరేజీ కేంద్రం యజమానిని పోలీసులు ప్రశ్నిస్తున్నారని జైన్ చెప్పారు. ఉదయం 10.15 గంటలకు విద్యార్థులు రోజువారీ అసెంబ్లీలో భాగంగా ప్రార్థన చేస్తున్నప్పుడు పైపులైన్ నుంచి గ్యాస్ లీకైందని చెప్తున్నారు.

ఆఫ్ఘన్‌లో కారుబాంబుదాడి.. ఏడుగురి మృతి

కాబూల్: ఆఫ్ఘనిస్థాన్‌లోని దక్షిణ హెల్మండ్ రాష్ట్రంలో బుధవారం తాలిబాన్ ఉగ్రవాదులు మిలిటరీ కాన్వాయ్‌పై జరిపిన కారుబాంబుదాడిలో ఏడుగురు మృతి చెందారు. మృతుల్లో ఒక బాలిక, ఇద్దరు మహిళలు, నలుగురు సైనికులు ఉన్నారు. రాజధాని లష్కర్ గాహ్‌కు చెందిన 42 మంది గాయపడ్డారు. 'ప్రాథమిక సమాచారం ప్రకారం వివరాలు తెలిపాం. మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశాలు ఉన్నాయి. తుది నివేదిక అందిన వెంటనే పూర్తి వివరాలు తెలియజేస్తాం' అని ప్రావిన్సు గవర్నర్ మీడియా ప్రతినిధి ఒమర్ జ్వాక్ పేర్కొన్నారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆఫ్ఘన్ విషయంలో తన కొత్త పాలసీని ప్రకటించిన మరుసటి రోజేఈ దాడి చోటుచేసుకోవడం విశేషం. ఆఫ్ఘన్‌లో శాంతిభద్రతల పరిరక్షణ విషయంలో సుదీర్ఘంగా జరుగుతున్న యుద్ధాన్ని ముగించేందుకు మరిన్ని అమెరికా బలగాలను పంపిస్తాం అని ట్రంప్ సోమవారం అన్నారు. ఆయన ప్రకటనను ఆఫ్ఘన్ ఉన్నతాధికారులు స్వాగతించారు. దక్షిణ హెల్మండ్‌లో దాడి చేసింది తామేనని తాలిబాన్ మీడియా ప్రతినిధి జబియుల్లా ముజాహిద్ ట్విట్టర్‌లో ప్రకటించాడు.

యెమెన్‌లో సౌదీ సంకీర్ణ సేనల దాడులు

- 60 మంది మృతి, హోటల్ ధ్వంసం

కైరో, ఆగస్టు 23: సౌదీ అరేబియా సారథ్యంలోని సంకీర్ణ సేనలు యెమెన్‌లోని షియా హుథీ తిరుగుబాటుదారులను లక్ష్యంగా చేసుకుని బుధవారం ఉదయం జరిపిన వైమానిక దాడుల్లో సుమారు 60 మంది మృతి చెందారు. అర్హాబ్ పట్టణంపై జరిగిన ఈ దాడుల్లో హుథీ తిరుగుబాటుదారులతోపాటు పౌరులు కూడా మృతి చెందారని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. ఈ దాడిలో ఖ్వా అల్ ఖ్వైదీలోని రెండంతస్తుల హోటల్ భవనం కూడా కూలిపోయింది. ఆ సమయంలో హోటల్‌లో ఉన్నవారు మృత్యువాత పడ్డారని, మృతదేహాలు శిథిలాల కిందే చిక్కుకున్నాయంటున్నారు. ఈ హోటల్‌కు కొన్ని కిలోమీటర్ల దూరంలో హుథీలు నిర్వహిస్తున్న చెక్‌పోస్ట్‌పైనా వైమానిక దాడులు జరిగాయి.

పట్టాలు తప్పిన మరో రైలు

- ట్రాక్‌పై పడి ఉన్న డంపర్‌ను ఢీకొట్టిన కైఫీయత్ ఎక్స్‌ప్రెస్
- యూపీలోని ఔరయా జిల్లాలో ప్రమాదం
- ఐదు రోజుల్లో రెండోది.. వంద మందికి గాయాలు
- రాజీనామాకు సిద్ధపడిన రైల్వే మంత్రి
- తొందరపడొద్దన్న ప్రధాని
- రైల్వే బోర్డు చైర్మన్ మిట్టల్ రాజీనామా.. లోహానీ నియామకం


యూపీలోని ఔరయా సమీపంలో కైఫియత్ ఎక్స్‌ప్రెస్ రైలు ఢీకొనడంతో నుజ్జునుజ్జయిన ఇసుక డంపర్

లక్నో/ఔరయా, ఆగస్టు 23: ఉత్తర్‌ప్రదేశ్‌లో మరో రైలు పట్టాలు తప్పింది. ఆజంగఢ్ నుంచి ఢిల్లీ వెళుతున్న కైఫీయత్ ఎక్స్‌ప్రెస్ పట్టాలకు అడ్డంగా పడి ఉన్న ఓ ఇసుక డంపర్‌ను ఢీకొట్టడంతో వందమంది వరకు రైలు ప్రయాణికులు గాయపడ్డారు. బుధవారం వేకువజామున 2.50 గంటలకు జరిగిన ఈ ప్రమాదంలో పది బోగీలు పట్టాలు తప్పగా, ఒకటి పూర్తిగా బోల్తాపడింది. క్షతగాత్రులను సైఫాయ్, ఇటావా దవాఖానలకు తరలించామని ఔరయా జిల్లా ఎస్పీ సంజయ్ త్యాగి చెప్పారు. వారిలో నలుగురి పరిస్థితి విషమంగా ఉందన్నారు. ఐదురోజుల్లో రెండు రైలు ప్రమాదాలు జరుగడానికి నైతిక బాధ్యత వహిస్తూ రైల్వే మంత్రి సురేశ్ ప్రభు రాజీనామాకు సిద్ధపడ్డారు. తొందరపడొద్దని ప్రధాని మోదీ ఆయనను సముదాయించినట్టు తెలిసింది. కాగా వరుస రైలు ప్రమాదాలకు బాధ్యత వహిస్తూ రైల్వే బోర్డు చైర్మన్ అశోక్ మిట్టల్ చేసిన రాజీనామాను ఆమోదించిన ప్రభుత్వం ఆయన స్థానంలో అశ్వని లోహానీని నియమించింది. మిట్టల్ మంగళవారం రాజీనా మా చేశారని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి.

ఔరయా జిల్లాలోని పాటా, అచ్చల్దా స్టేషన్ల మధ్య కైఫీయత్ ఎక్స్‌ప్రెస్ పట్టాలు తప్పిందని ఉత్తర మధ్య రైల్వే ప్రతినిధి చెప్పారు. రైల్వే నిర్మాణ సామగ్రిని తరలిస్తున్న ఓ ప్రైవేటు డంపర్ కారణంగా ఈ ప్రమాదం జరిగిందని తెలిపారు. రైల్వే ట్రాక్‌కు సమాంతరంగా ఉన్న రోడ్డుపై వెళుతున్న ఆ డంపర్ ప్రమాదవశాత్తు బోల్తా కొట్టి పట్టాలపై పడిందని వివరించారు. డంపర్ డ్రైవర్ తప్పిదంవల్లే ఈ ప్రమాదం జరిగినట్టు ప్రాథమిక దర్యాప్తులో తేలిందని అలహాబాద్ డివిజనల్ రైల్వే మేనేజర్ ఎస్‌కే పంకజ్ ఘటన స్థలాన్ని పరిశీలించాక మీడియాతో అన్నారు. ఈ ప్రమాదం వల్ల కాన్పూర్, ఇటావా మధ్య రైళ్ల రాకపోకలకు అంతరాయం ఏర్పడిందని గురువారం నాటికి రైలు మార్గాన్ని పునరుద్ధరిస్తామని చెప్పారు. కాగా, ఈ నెల 19న ముజఫర్‌నగర్ జిల్లాలో ఉత్కళ్ ఎక్స్‌ప్రెస్ పట్టాలు తప్పిన ప్రమాదంలో 22మంది మృతి చెందిన సంగతి తెలిసిందే.

రైల్వే మంత్రి రాజీనామాకు కాంగ్రెస్ డిమాండ్

ఐదు రోజుల వ్యవధిలో రెండు రైలు ప్రమాదాలు జరిగిన నేపథ్యంలో రైల్వే మంత్రి సురేశ్ ప్రభుకు ఏమాత్రం నైతిక విలువలున్నా వెంటనే రాజీనామా చేయాలని కాంగ్రెస్ డిమాండ్ చేసింది. రైలు ప్రమాదాలకు బాధ్యత వహిస్తూ రైల్వే బోర్డు చైర్మన్ ఏకే మిట్టల్ రాజీనామా చేయడంపై స్పందిస్తూ 'మిట్టల్‌తో రాజీనామా చేయించడం బాధ్యతారాహిత్యానికి పరాకాష్ఠ' అని కాంగ్రెస్ ప్రతినిధి మనీశ్ తివారీ అన్నారు.


రైల్వే బోర్డు కొత్త చైర్మన్ లోహానీ

రైలు ప్రమాదాలకు నైతిక బాధ్యత వహిస్తూ రైల్వే బోర్డు చైర్మన్ పదవికి ఏకే మిట్టల్ రాజీనామా చేయడంతో ఆయన స్థానంలో ఎయిర్ ఇండియా సీఎండీ అశ్వని లోహానీని నియమించారు. ఈ మేరకు క్యాబినెట్ నియామకాల కమిటీ బుధవారం ఉత్తర్వు జారీచేసింది. మరోవైపు అశ్వని లోహానీని స్థానే ఎయిర్ ఇండియా చీఫ్‌గా రాజీవ్ బన్సల్ నియమితులయ్యారు.

రాజీనామాకు సిద్ధపడ్డ సురేశ్ ప్రభు

ఐదు రోజుల వ్యవధిలో రెండు రైలు ప్రమాదాలు జరుగడంతో అందుకు నైతిక బాధ్యత వహిస్తూ రైల్వే మంత్రి సురేశ్ ప్రభు రాజీనామా చేయడానికి సిద్ధపడ్డారు. ప్రధాని నరేంద్రమోదీని కలిసి రాజీనామా అంశాన్ని ప్రస్తావించగా, 'తొందరొద్దు' అని ఆయన సముదాయించినట్టు తెలిసింది. యూపీలో వరుస రైలు ప్రమాదాలతో కలత చెందిన రైల్వే మంత్రి బుధవారం కేంద్ర క్యాబినెట్ సమావేశం సందర్భంగా ప్రధానిని కలుసుకుని మంత్రి బాధ్యతల నుంచి తప్పుకుంటానని, తన రాజీనామాను ఆమోదించాలని ప్రధానిని కోరినట్లు సురేశ్‌ప్రభు ట్వీట్ చేశారు. తొందరొద్దని, కొంత సమయం ఆగాలని ప్రధాని సూచించారన్నారు.

ప్రభు హయాంలోనే 8 భారీ ప్రమాదాలు



న్యూఢిల్లీ: సురేశ్ ప్రభు రైల్వేమంత్రిగా బాధ్యతలు చేపట్టిన 2014 నవంబర్ నుంచి ఇప్పటివరకు 20 వరకు రైలు ప్రమాదాలు జరిగాయి. వీటిలో 8 భారీ ప్రమాదాలు ఆయన సామర్థ్యానికి సవాల్ విసిరాయి.

1) **అనేకల్ రైలు ప్రమాదం :** 2015 ఫిబ్రవరి 13న ఉదయం 7:30 గంటలకు బెంగళూరు-ఎర్నాకులం ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్ బెంగళూరు సమీపంలోని అనేకల్ వద్ద పట్టాలు తప్పింది. డీ-9 బోగీ పూర్తిగా డీ-8బోగీలోకి చొచ్చుకు రావడంతో10 మంది మరణించారు. 150మంది గాయపడ్డారు.

2) **పట్టాలు తప్పిన జనతా ఎక్స్‌ప్రెస్ :** డెహ్రాడూన్- వారణాసి మధ్య నడిచే జనతాఎక్స్‌ప్రెస్ 2015 మార్చి 20 రాయ్‌బరేలీ జిల్లాలో పట్టాలు తప్పింది. ఈ ప్రమాదంలో 58మంది మరణించగా, 150 మందికి పైగా గాయపడ్డారు. బ్రేకులు ఫెయిలైనందున రైలును ఆపలేకపోతున్నానని డ్రైవర్ ముందే రేడియోలో అప్రమత్తంచేసినట్లు నివేదిక వెల్లడించింది.

3) **కౌశంబి ప్రమాదం**: ఉత్తరప్రదేశ్‌లోని కౌశంబి వద్ద రూర్కేలా-జమ్ము మధ్య నడిచే తావిమురి ఎక్స్‌ప్రెస్ 2015 మే 25న పట్టాలు తప్పింది. 8 బోగీలు పట్టాలు తప్పాయి. ఐదుగురు చనిపోయారు.

4) **కామయాని-జనతా జంటరైళ్ల ప్రమాదం :** వరదల కారణంగా ట్రాక్ కొట్టుకుపోవడంతో 2015 ఆగస్టు 4న మధ్యప్రదేశ్‌లోని హర్దా వద్ద కామయాని ఎక్స్‌ప్రెస్, జనతా ఎక్స్‌ప్రెస్ రెండు రైళ్లు పట్టాలు తప్పాయి. జంట ప్రమాదాల్లో 31మంది చనిపోయారు.

5) **దురంతో దారుణం :** సికింద్రాబాద్ - ముంబై మధ్య నడిచే దురంతో ఎక్స్‌ప్రెస్ 2015 సెప్టెంబర్ 12న కర్ణాటకలోని కాల్‌బుర్గి పట్టణంలో పట్టాలు తప్పింది. ఈ ప్రమాదంలో ఇద్దరు మృతిచెందగా, ఏడుగురు గాయపడ్డారు.


6) **కల్కా-సిమ్లా ప్రమాదం :** కల్కా - సిమ్లాకు పర్యాటకులను తీసుకెళ్తున్న నారోగేజ్ ట్రెయిన్ 'శివాలిక్ క్వీన్' 2015 సెప్టెంబర్ 12న పట్టాలు తప్పింది. ప్రమాదం జరిగినప్పుడు 36మంది బ్రిటిష్ టూరిస్టులు రైల్లో ఉన్నారు. ఇద్దరు పర్యాటకులు ప్రాణాలు కోల్పోయారు. 15మంది తీవ్రంగా గాయపడ్డారు.

7) **ఇండోర్-పట్నా ఎక్స్‌ప్రెస్ ప్రమాదం :** 2016 నవంబర్ 20న కాన్పూర్ సమీపంలో ఇండోర్-పట్నా ఎక్స్‌ప్రెస్ పట్టాలు తప్పింది. ఈ ప్రమాదంలో 150 మంది చనిపోగా, మరో 150మంది గాయపడ్డారు. కాన్పూర్ శివారులోని పుక్రయాన్ స్టేషన్ నుంచి రైలు బయటకిచ్చింది. సామర్థ్యానికి మించి ఎక్కిన ప్రయాణికులు, రైల్వేలైన్ తెగిపోవడం వల్లే ఈ ప్రమాదం జరిగిందని నివేదిక స్పష్టంచేసింది.

8) **హీరాఖండ్ ఎక్స్‌ప్రెస్:** జగదల్‌పూర్-భువనేశ్వర్ మధ్య తిరిగే హీరాఖండ్ ఎక్స్‌ప్రెస్ గత జనవరిలో ఏపీలోని విజయనగరం వద్ద పట్టాలు తప్పింది. ట్రాక్ తప్పిన కోచ్‌లు పక్క ట్రాక్‌పై వెళ్తున్న మరో ట్రెయిన్‌ను ఢీకొనడంతో 41మంది చనిపోయారు. 68మంది వరకు గాయపడ్డారు.

గతంలో రాజీనామా చేసిన రైల్వే మంత్రులు వీరే..

1956 అరియాల్‌పూర్‌లో జరిగిన ఘోర రైలుప్రమాదంలో 152 మంది ప్రాణాలు కోల్పోయారు. పలువురు గాయపడ్డారు. దీనికి బాధ్యత వహిస్తూ అప్పటి రైల్వేశాఖ మంత్రి లాల్‌బహదూర్ శాస్త్రి తన పదవికి రాజీనామా చేశారు.





1999 పశ్చిమ బెంగాల్‌లోని గైసల్ వద్ద ఘోర రైలు ప్రమాదంలో 290మంది మరణించారు. దీనికి బాధ్యత వహిస్తూ అప్పటి రైల్వేశాఖ మంత్రి నితీశ్ కుమార్ రాజీనామా సమర్పించారు

2000 రెండు రైలు ప్రమాదాలకు నైతిక బాధ్యత వహిస్తూ అప్పటి రైల్వేశాఖ మంత్రి మమతా బెనర్జీ తన పదవికి రాజీనామా చేశారు. అయితే, అప్పటి ప్రధాని వాజ్‌పేయి ఆమె రాజీనామాను తిరస్కరించారు.




క్యాబినెట్ నిర్ణయాలను మీడియాకు వివరిస్తున్న మంత్రులు అరుణ్‌జైట్లీ, తావర్‌చంద్ గెహ్లాట్

ఓబీసీ ఉపవర్గీకరణకు ప్రత్యేక కమిషన్

మొదటిపేజీ తరువాయి

కొలమానాలు తదితరాలపై కమిషన్ దృష్టి పెట్టాలి.

- రిజర్వేషన్ ఫలాలు ఓబీసీలందరికీ సమానంగా అందేలా ఏయే కులాలను వర్గీకరించాలో అధ్యయనం చేయడానికి శాస్త్రీయ విధానాన్ని రూపొందించాలి.

సుప్రీం తీర్పు మార్గదర్శకం

ఇందిరా సహాని వర్సెస్ భారత ప్రభుత్వం కేసులో 1992లో సుప్రీంకోర్టు వెలువరించిన తీర్పును కేంద్ర క్యాబినెట్ పరిగణనలోకి తీసుకుంది. ఆ తీర్పులో సుప్రీం, ఆయా రాష్ర్టాలు కులాలను బీసీ, ఓబీసీ, ఎంబీసీ తదితర గ్రూపులుగా విభజించుకోడానికి ఎలాంటి రాజ్యాంగపరమైన, చట్టపరమైన ఆంక్షలు లేవని, ఆ ప్రకారం అమలుచేయడానికి కూడా ఎలాంటి ఆటంకాలు లేవన్నది. తెలంగాణతో పాటు ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, పుదుచ్చేరి, కర్ణాటక, మహారాష్ట్ర, జార్ఖండ్, పశ్చిమబెంగాల్, హర్యానా రాష్ర్టాలు రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాల కోసం ఓబీసీ వర్గీకరణ ప్రక్రియను చేపట్టాయని జైట్లీ వివరించారు.

క్రీమీలేయర్ వార్షిక ఆదాయ పరిమితి పెంపు

కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాల్లో ఓబీసీ రిజర్వేషన్లు పొందడానికి ఇంతకాలం అమలులో ఉన్న క్రీమీలేయర్ గరిష్ఠ వార్షిక ఆదాయ పరిమితిని రూ. 6 లక్షల నుంచి రూ. 8 లక్షలకు పెంచుతూ మంత్రివర్గం నిర్ణయం తీసుకున్నదని అరుణ్‌జైట్లీ తెలిపారు. ఇకపై రూ. 8 లక్షల వార్షిక ఆదాయం ఉన్న ఓబీసీ కులాల వారు ప్రభుత్వ ఉద్యోగాల్లో రిజర్వేషన్లను పొందే వీలు ఉంటుందన్నారు. ప్రభుత్వ రంగ సంస్థల్లోని ఉద్యోగాలకు సైతం ఈ అవకాశాన్ని విస్తరింపజేయడంపై ప్రస్తుత సమావేశంలో నిర్ణయం తీసుకోలేదని, దీనిపై లోతైన పరిశీలన జరుగుతున్నదని, త్వరలోనే స్పష్టత వస్తుందని జైట్లీ వివరించారు.

రూ.2000 నోటును రద్దు చేయడం లేదు

పాత పెద్ద నోట్ల రద్దు తర్వాత ప్రవేశపెట్టిన రూ.2000 నోటును రద్దు చేసే ఆలోచన ఏదీ లేదని ఆర్థికమంత్రి అరుణ్‌జైట్లీ స్పష్టం చేశారు. కొత్తగా ప్రవేశపెట్టనున్న రూ.200 నోటు విడుదల తేదీని ఆర్బీఐ ఖరారు చేస్తుందన్నారు. చిల్లర సమస్య పరిష్కారానికి ప్రవేశపెట్టే ఈ కొత్తనోటు వివరాలను ఆర్బీఐ మాత్రమే చెప్పగలదన్నారు. రూ.2000 నోటును ఉపసంహరించే అంశంపై ఎటువంటి చర్చ జరుగలేదని ఒక ప్రశ్నకు సమాధానమిచ్చారు. కేంద్ర ఆహార ఉత్పత్తి పథకం 'సంపద' పేరును ప్రధానమంత్రి కిసాన్ సంపద యోజన (పీఎంకేఎస్‌వై)గా మారుస్తూ కేంద్ర ఆర్థిక వ్యవహారాల క్యాబినెట్ కమిటీ నిర్ణయించింది.

మండల్ - 2కు మార్గం!

- ఓట్ల కోసమే ఓబీసీ వర్గీకరణ?
- 2019 ఎన్నికలే లక్ష్యంగా పావులు కదుపుతున్న కేంద్రం
- యూపీ తరహా విజయం కోసమే ఎత్తుగడలు
- అత్యంత వెనుకబడినవర్గాల ఓట్ల మీద కన్ను

న్యూఢిల్లీ, ఆగస్టు 23: చాన్నాళ్లుగా అటక మీదున్న మండల్-2 ప్రణాళికను కేంద్రం రంగం మీదకు తేవడం వెనుక ఉద్దేశాలేమిటి? జాతీయ రాజకీయాల్లో సంచలనానికి దారితీసే మండలీకరణ రెండోదశకు ఇప్పుడే కేంద్రం శ్రీకారం చుట్టడం వెనుక కారణాలేమిటి? సర్కారుకు ఇది నాలుగో ఏడు. మరో ఏడాదిలోగా ఎన్నికల నగారా మోగనున్నది. ఈ దశలో కేంద్రం అత్యంత వెనుకబడిన వర్గాల సంక్షేమం ఫైలు దుమ్ము దులిపింది. వారి అభివృద్ధికి చేయూతను అందిస్తామని కేంద్రం అంటున్నది. అన్ని వెనుకబడిన వర్గాలకు ప్రయోజనాలు సమకూరేలా చూసేందుకే ఈ కసరత్తు ప్రారంభించినట్టు కేంద్రమంత్రి అరుణ్‌జైట్లీ చెప్తున్నారు. పర్యవసానంగా ఓబీసీ కోటాలో ఉపకోటాలు నిర్ధారించే దిశగా అడుగులు పడుతున్నాయి. అత్యంత వెనుకబడిన వర్గాల కోసం ఈ తరహా ఉపవర్గీకరణను తెలంగాణతోసహా తొమ్మిది రాష్ర్టాలు ఈసరికే అమలు చేస్తున్నాయి. ఇప్పుడు కేంద్ర ఉద్యోగాల్లో, విద్యాసంస్థల్లో ఈ విధానం అమలుకు రంగం సిద్ధమవుతున్నది. మొత్తంమీద 2019 ఎన్నికల నాటికి మండల్-2 ప్రణాళిక సిద్ధం చేయాలని కేంద్ర చూస్తున్నట్టు కనిపిస్తున్నది. సామాజికంగా, విద్యాపరంగా వెనుకబడిన వర్గాల (ఓబీసీ) ఉపవర్గీకరణ అంశాన్ని పరిశీలించేందుకు కమిటీని నియమించాలని నిర్ణయించింది. ఈ ప్రతిపాదనకు కేంద్ర సర్కారు బుధవారం లాంఛనంగా ఆమోదముద్ర వేసింది. ఈ కమిటీ చెయ్యాల్సింది కోటాలో ఉపకోటాలు నిర్ణయించడమే. ఇది పూర్తయితే ఓబీసీల్లో అత్యంత వెనుకబడిన వర్గాలకు ప్రత్యేక కోటా అమలులోకి వస్తుంది. ఓబీసీ రిజర్వేషన్లు అమలు అవుతున్నా అభివృద్ధికి ఆమడదూరంలో ఉండిపోయిన వర్గాలకు దీనివల్ల ప్రయోజనం కలుగుతుంది. 1990లో వీపీసింగ్ సర్కారు మండల్ కమిషన్ సిఫార్సులను అమలులోకి తేవడంతో కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాల్లో, విద్యాసంస్థల్లో ఓబీసీలకు 27 శాతం రిజర్వేషన్లు అమల్లోకి వచ్చాయి. అప్పట్లో ఇదొక సంచలన నిర్ణయం. దీనిపై వాదాలు, వివాదాలు చాలానే నడిచాయి. రాజకీయ భూకంపాలు ప్రభుత్వ పతనాలకు దారితీశాయి. జాతీయ రాజకీయాల్లో ఈ చర్య ఒక మైలురాయిలా నిలిచింది. సుప్రీంకోర్టు కూడా మండల్ అమలు నిర్ణయాన్ని సమర్థించింది. మండల్‌వాదులకు ఓబీసీల్లో బలమైన ఓటుబ్యాంకు ఏర్పడింది. రాజకీయంగా వారు ఎంతో లబ్ధిని పిండుకున్నారు. ఇప్పుడు అదేదారిలో మరింత ముందుకు పోయి అత్యంత ఓబీసీల ఓటుబ్యాంకును చేజిక్కించుకునేందుకు బీజేపీ ఒక పథకం ప్రకారం పావులు కదుపుతున్నట్టు కనిపిస్తున్నది. ఇటీవలే జాతీయ బీసీ కమిషన్‌కు రాజ్యాంగ హోదా కల్పించింది. యూపీ ఎన్నికల్లో యాదవేతర బీసీ ఓట్ల సహాయంతో బీజేపీ ఘనవిజయం సాధించింది. యాదవ ఓట్లనే నమ్ముకున్న సమాజ్‌వాదీ పార్టీ అనూహ్యంగా ఓటమి చవిచూడాల్సి వచ్చింది. అభివృద్ధి ఫలాలు అందని అత్యంత వెనుకబడిన వర్గాలను అక్కున చేర్చుకుని 2019 ఎన్నికల్లో ఇదేతరహాలో లబ్ధి పొందేందుకు బీజేపీకి మండల్-2 ఉపయోగపడుతుందని అంటున్నారు.

'డేరా' అధిపతిపై తీర్పు రేపు

- లైంగిక దాడి ఆరోపణలు ఎదుర్కొంటున్న సిక్కు ఆధ్యాత్మిక నేత
- భారీగా తరలి వస్తున్న అనుచరులు.. అప్రమత్తమైన పంజాబ్, హర్యానా సర్కార్‌లు


గుర్మీత్ రాం రహీం సింగ్


భారీగా తరలివస్తున్న అనుచరులను నిలువరించిన పోలీసులు

చండీగఢ్, ఆగస్టు 23: 2002లో ఇద్దరు మహిళలపై లైంగిక దాడికి పాల్పడిన కేసులో డేరా సచ్చాసౌధా అధినేత గుర్మీత్‌రాం రహీం సింగ్‌పై ఈ నెల 25న హర్యానా, పంచకుల జిల్లాలోని సీబీఐ ప్రత్యేక న్యాయస్థానం తీర్పు చెప్పనున్నది. ఈ నేపథ్యంలో పంజాబ్, హర్యానా రాష్ర్టాలు అప్రమత్తం అయ్యాయి. 24, 25 తేదీల్లో జిల్లాలోని పాఠశాలలు, కళాశాలలను మూసివేసినట్లు పంచ్‌కుల డిప్యూటీ కమిషనర్ గౌరీ పరాశర్ జోషి తెలిపారు. పంచ్‌కుల, భటిండా, హిసార్ పట్టణాల్లో భారీగా పోలీసు బలగాలను మోహరించారు. భద్రతాసంస్థలు ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించాయి. 35 వేల మందికి పైగా గుర్మీత్‌రాం మద్దతుదారులు.. సెక్టార్ – 23లోని నామ్ చర్చాఘర్‌లో చేరి సంఘీభావం తెలుపుతారు. గుర్మీత్‌రామ్‌కు వ్యతిరేకంగా తీర్పు వస్తే ఆయన మద్దతుదారులు అవాంఛనీయ చర్యలకు దిగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ప్రభుత్వం ఆదేశించింది. ఈనెల 31 వరకు చండీగఢ్ పోలీసులకు సెలవులు రద్దుచేశారు.

తాత్కాలిక జైలుగా సెక్టార్ – 16 క్రికెట్ స్టేడియం

పంచ్‌కుల జిల్లా కోర్టు వద్ద నిషేధాజ్ఞలు ఉల్లంఘించే వారిని నిర్బంధించేందుకు వీలుగా ఓ క్రికెట్ స్టేడియంనే తాత్కాలిక జైలుగా మార్చారు. గతంలో జాతీయ, అంతర్జాతీయ క్రికెట్ మ్యాచ్‌లు నిర్వహించిన 'సెక్టార్ – 16 క్రికెట్ స్టేడియం'ను కేంద్ర పాలిత ప్రాంతం చండీగఢ్ హోంశాఖ తాత్కాలిక జైలుగా ప్రకటించింది. క్రికెట్ టీమిండియా మాజీ కెప్టెన్ కపిల్‌దేవ్, ప్రస్తుత క్రికెటర్లు హర్భజన్‌సింగ్, యువరాజ్ సింగ్, తదితరులూ ఇదే స్టేడియంలో శిక్షణ పొందారు. అవసరమైతే పంచ్‌కుల జిల్లా పరిధిలోని స్కూళ్లు, కాలేజీలను తాత్కాలిక జైళ్లుగా మారుస్తామని అధికారులు తెలిపారు. అదనంగా 115 కంపెనీల పారా మిలిటరీ బలగాలను పంపాలని హర్యానా సీఎం మనోహర్‌లాల్ ఖట్టర్ కేంద్రాన్ని కోరారు.

సమీక్ష అవసరమే లేదు

- శశికళ పిటిషన్‌ను తిరస్కరించిన సుప్రీం

న్యూఢిల్లీ/ బెంగళూరు, ఆగస్టు 23: అక్రమాస్తుల కేసులో తనకు విధించిన నాలుగేండ్ల జైలుశిక్షను సమీక్షించాలని అన్నాడీఎంకే నాయకురాలు వీకే శశికళ దాఖలు చేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు బుధవారం తిరస్కరించింది. తాము ఇచ్చిన తీర్పులో ఎటువంటి పొరపాటు లేదని, అందువల్ల దాన్ని సమీక్షించాల్సిన అవసరమే లేదని స్పష్టంచేసింది. 19 ఏండ్ల నాటి రూ.53.6 కోట్ల విలువైన అక్రమాస్తుల కేసులో శశికళకు దిగువ న్యాయస్థానం నాలుగేండ్ల జైలుశిక్ష విధిస్తూ ఇచ్చిన తీర్పును గత ఫిబ్రవరి 14న సుప్రీంకోర్టు ధ్రువీకరించిన సంగతి తెలిసిందే. దీనిని సమీక్షించాలని కోరుతూ శశికళతోపాటు మరో ఇద్దరు సుప్రీంలో పిటిషన్ దాఖలు చేశారు. కాగా, వీకే శశికళ.. బెంగళూరు పరప్పన అగ్రహారం సెంట్రల్ జైలుకు సమీపంలోని హోసూర్ ఎమ్మెల్యే ఇంటిని సందర్శించారని ఏసీబీకి ఇచ్చిన నివేదికలో డీఐజీ డీ రూప తెలిపారు. 'నాకు అందిన నమ్మకమైన సమాచారం ప్రకారం ఆమె (శశికళ) కొన్నిసార్లు హోసూర్ ఎమ్మెల్యే నివాసాన్ని సందర్శించారు' అని డీఐజీ తన నివేదికలో పేర్కొన్నట్లు సమాచారం.

పళని, పన్నీర్ వర్గీయులపై వేటు

చెన్నై: అన్నాడీఎంకేలో వైరివర్గాల యుద్ధం కొనసాగుతూనే ఉంది. బుధవారం రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి ఉదయ్‌కుమార్‌ను పార్టీ అనుబంధ ఫోరం కార్యదర్శి పదవి నుంచి తప్పిస్తున్నట్లు దినకరన్ ప్రకటించారు. ఆయన స్థానంలో తన అనుచరుడు, ఎమ్మెల్యే ఎస్ మరియప్పన్ కెన్నెడీని నియమిస్తున్నట్లు దినకరన్ ప్రకటించారు. పార్టీ మదురై సబర్బన్ శాఖ కార్యదర్శి పదవి నుంచి ఎమ్మెల్యే వీవీ రాజన్ చెల్లప్పను కూడా తొలిగిస్తున్నట్లు ప్రకటించారు. రాజ్యసభ సభ్యుడు వైతిలింగంను పార్టీ దక్షిణ తంజావూర్ జిల్లా కార్యదర్శి పదవి నుంచి తప్పించి, ఆయన స్థానంలో ఎం శేఖర్‌ను నియమించారు.

సీఎం కేసీఆర్ ప్రతిమకు జలాభిషేకం

- రెడ్డి హాస్టల్‌కు శంకుస్థాపన చేసినందుకు ఈబీసీ సంఘం కృతజ్ఞతలు
- పవిత్ర గంగ, కృష్ణా, గోదావరి, పంబా నదుల నీటితో కార్యక్రమం

చంపాపేట: రాష్ట్రంలో అన్నివర్గాల అభివృద్ధికి సీఎం కే చంద్రశేఖర్‌రావు నిరంతరం కృషి చేస్తున్నారని ఎల్బీనగర్ టీఆర్‌ఎస్ సీనియర్ నేత గజ్జల మధుసూదన్‌రెడ్డి చెప్పారు. రంగారెడ్డి జిల్లా బుద్వేల్‌లో రెడ్డి హాస్టల్ నిర్మాణానికి 10 ఎకరాల భూమి, రూ.10 కోట్ల నిధులు మంజూరు చేసినందుకు బుధవారం ఈబీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వల్లపురెడ్డి శేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో కర్మన్‌ఘాట్ బైరామాల్‌గూడలోని టీఆర్‌ఎస్ కార్యాలయంలో సీఎం కేసీఆర్ ఇత్తడి ప్రతిమకు కృష్ణా, గోదావరి, గంగ, పంబా నదుల జలాలతో అభిషేకం నిర్వహించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీలతోపాటు రెడ్డి సంక్షేమానికి ప్రత్యేకంగా కృషి చేయడం అభినందనీయమన్నారు. రాష్ట్రంలో అసాధ్యం అనుకున్న పనులన్నింటినీ సుసాధ్యం చేసి చూపిన అపర భగీరథుడు సీఎం కేసీఆర్ అని ఈబీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వల్లపురెడ్డి శేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. కార్యక్రమంలో ఈబీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు జంగారెడ్డి, స్థానిక టీఆర్‌ఎస్ నాయకులు సతీశ్, టిల్లు, మహేందర్‌రెడ్డి, సాయి, సురేశ్, ఆనంద్, రాఘవ, రామ్‌లక్ష్మణ్, సాయి తదితరులు పాల్గొన్నారు.



హైదరాబాద్ బైరామాల్‌గూడలోని టీఆర్‌ఎస్ కార్యాలయంలో సీఎం కేసీఆర్ ఇత్తడి ప్రతిమకు జలాభిషేకం చేస్తున్న ఈబీసీ సంఘం అధ్యక్షుడు వీ శేఖర్‌రెడ్డి, ఎల్బీనగర్ టీఆర్‌ఎస్ నాయకులు గజ్జల మధుసూదన్‌రెడ్డి తదితరులు

గ్రేటర్ పరిధిలో సివరేజీ నిర్వహణ కోసం జలమండలి ప్రవేశపెట్టిన మినీ ఎయిర్‌టెక్ (జెట్టింగ్) యంత్రాలు ప్రధాన మంత్రి కార్యాలయాన్ని ఆకర్షించాయి. మంత్రి కేటీఆర్ సూచన మేరకు దళిత్ ఇండియన్ చాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ (డిక్కి) సౌజన్యంతో ఒకేసారి 70 యంత్రాలు ప్రవేశపెట్టి విజయవంతంగా నిర్వహిస్తుండడంతో, ఢిల్లీకి వచ్చి యంత్రాల పనితీరును వివరించాలంటూ జలమండలి ఎండీ దానకిషోర్‌కు పీఎంవో అధికారులు సమాచారం ఇచ్చారు. ఈ మేరకు గురువారం మధ్యాహ్నం 2.30 గంటలకు ఆయన పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇవ్వనున్నారు.

- హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ







మొదటి చిత్రంలో.. తుదిమెరుగులు దిద్దుకుంటున్న గణేశ్ విగ్రహం నిండైన రూపంతో ఆకర్షిస్తున్నది కదూ. మట్టితో తయారైన విగ్రహాలు ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలను మించి అందంగా కనిపిస్తాయనడానికి ఈ విగ్రహమే నిదర్శనం. పూర్తిగా మట్టితో, సహజ రంగులతో తయారై 'ఎకో గణేశ్'కు అర్థం చెప్తున్నది. ఈ విగ్రహాలు హైదరాబాద్ బాలానగర్‌లోని రాజుకాలనీ కుమ్మరి బస్తీలో రూపుదిద్దుకుంటున్నాయి. ఈ కాలనీలోని పలు కుటుంబాలు ఏండ్లుగా ఎకో గణేశ్‌లను తయారు చేస్తున్నాయి. అన్ని సైజుల విగ్రహాలు ఇక్కడ తయారవుతున్నాయి. మట్టిని కాలితో తొక్కితే అపవిత్రం అవుతుందనే భావనతో మెషిన్‌తో ముద్ద చేసి విగ్రహాలను రూపొందిస్తున్నారు.

– ఫొటోలు: వీరగోని రజినీకాంత్, విద్యాసాగర్

మహాగణపతికి 75 అడుగుల కండువా

ఖైరతాబాద్: ఖైరతాబాద్‌లో కొలువుదీరిన శ్రీ చండీ కుమార అనంత మహాగణపతికి సమర్పించేందుకు పద్మశాలి సంఘం 75 అడుగుల కండువా, జంధ్యాన్ని తయారు చేయించింది. వీటి ని సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కడారి శ్రీధర్, ఏలే స్వామి, గౌరవాధ్యక్షుడు గుర్రం కొండయ్య బుధవారం ఆవిష్కరించా రు. వినాయక చవితి రోజు స్వామివారికి అలంకరించనున్నట్టు చెప్పారు. గణేశుడికి రెండు వైపులా ప్రతిష్ఠించిన మహాకాళ శివుడు, కుమారస్వామికి పది అడుగుల కండువా, చండీ మాత, మహిషాసుర మర్ధిని అమ్మవారికి పట్టు వస్త్రాలు, పసుపు కుంకుమలు సమర్పిస్తామని పేర్కొన్నారు.




ఖైరతాబాద్ గణపతికి సమర్పించనున్న కండువా, జంధ్యాన్ని ఆవిష్కరిస్తున్న పద్మశాలి సంఘం ప్రతినిధులు

సాఫ్ట్‌వేర్ ట్రాఫిక్ చిక్కులకు చెక్

ఖైతలాపూర్- మాదాపూర్ అయ్యప్ప సొసైటీ మధ్య ఆర్‌వోబీ
రూ.49.5 కోట్లతో నాలుగు లేన్ల వంతెన నిర్మాణానికి ఆమోదం
త్వరలో పనులు ప్రారంభించేందుకు కసరత్తు.. ఉద్యోగులకు తీరనున్న ఇబ్బందులు

కేపీహెచ్‌బీ కాలనీ: కూకట్‌పల్లి పరిసర ప్రాంతాల్లో నివసిస్తున్న సాఫ్ట్‌వేర్ ఉద్యోగుల ట్రాఫిక్ కష్టాలు త్వరలో తీరనున్నాయి. హైదరాబాద్ ఐటీ పరిశ్రమకు కేంద్ర బిందువైన హైటెక్ సిటీకి సమీపంలోని కూకట్‌పల్లి పరిసర ప్రాంతాల్లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు భారీ సంఖ్యలో నివసిస్తుంటారు. వారంతా ఉద్యోగ రీత్యా నిత్యం హైటెక్ సిటీకి రాకపోకలు సాగించాల్సి ఉంటుంది. కూకట్‌పల్లి, ప్రగతినగర్, నిజాంపేట, బాచుపల్లి, జగద్గిరిగుట్ట, హైదర్‌నగర్, వివేకానందనగర్‌తో పాటు కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో నివసించే సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు, ప్రజలు హైటెక్‌సిటీకి వెళ్లాలంటే జేఎన్‌టీయూ చౌరస్తా నుంచి కేపీహెచ్‌బీ కాలనీ మీదుగా ఆర్‌వోబీ బ్రిడ్జి దాటాల్సి ఉంటుంది. వేలాది వాహనాలు ఈ మార్గంలో వెళ్తుండడంతో ట్రాఫిక్ సమస్యలు ఎదురవుతున్నాయి. ప్రగతినగర్ నుంచి కేపీహెచ్‌బీకాలనీలోని రాజీవ్‌గాంధీ సర్కిల్ వరకు ట్రాఫిక్ ఫర్వాలేదనిపించినా.. కేపీహెచ్‌బీ 4, 7వ ఫేజ్‌లలోని రైల్ ఓవర్ బ్రిడ్జి (ఆర్‌వోబీ)ని దాటేందుకు చుక్కలు కనిపిస్తున్నాయి. వివిధ ప్రాంతాల నుంచి వేలాది వాహనాలు ఏకకాలంలో ఆర్‌వోబీ పైకి వస్తుండడంతో దాన్ని దాటేందుకు చాలా సమయం పడుతున్నది. దీంతో ప్రయాణికులు నిత్యం గంటలతరబడి నరకయాతన అనుభవిస్తున్నారు. ఈ సమస్యను పరిష్కరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కేపీహెచ్‌బీకాలనీ రాజీవ్‌గాంధీ చౌరస్తాలో ఫ్లై ఓవర్ నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. మరోవైపు రైల్వే లైన్‌పై మరో వంతెనను నిర్మిస్తే ట్రాఫిక్ సమస్యకు చెక్ పడుతుందని ప్రణాళికలు రూపొందించింది. ఖైతలాపూర్ రోడ్డులో మాదాపూర్ అయ్యప్ప సొసైటీకి చేరుకునేలా ఆర్‌వోబీ నిర్మించాలని నిర్ణయించింది. నిర్మాణానికి నిధులను సైతం విడుదల చేసింది. త్వరలోనే ఖైతలాపూర్ రోడ్డులో ఆర్‌వోబీ నిర్మాణ పనులను ప్రారంభించనున్నారు. నిర్మాణం పూర్తయితే కూకట్‌పల్లి వివేకానందనగర్, జగద్గిరిగుట్ట, కుత్బుల్లాపూర్ ప్రాంతాలకు చెందిన ప్రజలు నేరుగా హైటెక్‌సిటీకి చేరుకోవచ్చు. మరోవైపు కేపీహెచ్‌బీ 4,7వ ఫేజ్‌లలోని ఆర్‌వోబీపై వాహనాల సంఖ్య తగ్గి ట్రాఫిక్ సమస్య పరిష్కారం కానున్నది.



ఖైతలాపూర్ - అయ్యప్ప సొసైటీ ఆర్‌వోబీ నమూనా చిత్రం

575 మీటర్లు.. నాలుగు లేన్లు

ఖైతలాపూర్ నుంచి మాదాపూర్ అయ్యప్ప సొసైటీ వరకు రైల్వే ట్రాక్‌ను దాటేందుకు రూ.49.5 కోట్లతో ఆర్‌వోబీ పనులను ప్రభుత్వం ఆమోదించింది. 575 మీటర్ల పొడవు, 16.2 మీటర్ల వెడల్పుతో ఆర్‌వోబీని నిర్మించనున్నారు. వాహనాల రాకపోకలకు రెండు వరుసల్లో రెండు చొప్పున నాలుగు లేన్లను, పాదచారుల కోసం ఫుట్‌పాత్‌ను ఏర్పాటు చేస్తారు. విడుదలైన నిధుల్లో బ్రిడ్జి నిర్మాణానికి రూ.30 కోట్లు, భూసేకరణకు రూ.6 కోట్లు, రైల్వే విభాగానికి డిపాజిట్ కింద రూ.13.5 కోట్లు కేటాయించారు. బ్రిడ్జి నిర్మాణానికి రైల్వే శాఖ నుంచి అనుమతులు పూర్తయ్యాయి. దీంతో త్వరలోనే పనులు ప్రారంభం కానున్నాయి. రైల్వే ట్రాక్ ఉన్న ప్రాంతంలో 42 మీటర్ల బ్రిడ్జి నిర్మాణ పనులను రైల్వే శాఖ అధికారులు పర్యవేక్షిస్తారు. దీనికిగాను జీహెచ్‌ఎంసీ రూ. 13.5 కోట్ల నిధులను రైల్వేశాఖకు డిపాజిట్ చేసింది. మిగిలిన 533 మీటర్ల దూరం పనులు జీహెచ్‌ఎంసీ ప్రాజెక్టు విభాగం ఆధ్వర్యంలో జరుగుతాయి.

త్వరలో టెండర్లు పిలుస్తాం



ఈ ప్రాజెక్టుకు సంబంధించిన డిజైన్ పనులు పూర్తయ్యాయి. ఇప్పుడు నిధులు మంజూరు అయ్యాయి. త్వరలో టెండర్లు పిలువనున్నాం. రైల్వేట్రాక్ ప్రాంతంలోని పనులకు సంబంధించి నిధులు డిపాజిట్ చేశాం. కాబట్టి త్వరలోనే వారు పనులను ప్రారంభిస్తారు. మొత్తంగా రెండు, మూడు నెలల్లో ఆర్‌వోబీ నిర్మాణ పనులు ప్రారంభం అవుతాయి.

– రవీందర్, ఏఈ, ప్రాజెక్టు విభాగం, వెస్ట్‌జోన్

బొటానికల్ గార్డెన్‌కు కొత్త హంగులు

- సహజత్వం దెబ్బతినకుండా భారీ ఎత్తున అభివృద్ధి పనులు
- త్వరలో మంత్రి కేటీఆర్ చేతుల మీదుగా సైకిల్ ట్రాక్ ప్రారంభం
- అటవీ అభివృద్ధి సంస్థ చైర్మన్ బండా నరేందర్‌రెడ్డి



బొటానికల్ గార్డెన్‌ను పరిశీలిస్తున్న అటవీ అభివృద్ధి సంస్థ చైర్మన్ బండా నరేందర్‌రెడ్డి, అధికారులు

శేరిలింగంపల్లి: కాంక్రిట్ జంగిల్‌గా మారిన హైటెక్ సిటీ ప్రాంతంలో పచ్చదనంతో నిండిన బొటానికల్ గార్డెన్‌లో పెద్ద ఎత్తున అభివృద్ధి పనులు చేపడుతున్నామని, సహజత్వం దెబ్బతినకుండా ప్రత్యేకంగా ఎకో ఫ్రెండ్లీ నిర్మాణాలు చేపడుతున్నామని అటవీ అభివృద్ధి సంస్థ చైర్మన్ బండా నరేందర్‌రెడ్డి పేర్కొన్నారు. బొటానికల్ గార్డెన్‌లో చేపడుతున్న అభివృద్ధి పనులపై బుధవారం గార్డెన్ ఆవరణలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సంస్థ చైర్మన్ బండా నరేందర్‌రెడ్డి, ఎండీ చందన్ మిశ్రా వివరాలు వెల్లడించారు. గతంలో ప్రైవేట్ ఆధీనంలో ఉన్న బొటానికల్ గార్డెన్ కళాహీనంగా మారిందని, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు అనంతరం అటవీ అభివృద్ధి సంస్థ ఆధీనంలోకి వచ్చాక అనేక అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టామన్నారు. దాదాపు రూ. 5 కోట్ల నిధులతో భారీ స్థాయిలో గార్డెన్‌ను దశలవారీగా అభివృద్ధి చేస్తున్నామని, ఇందులో భాగంగా ఇప్పటికే దాదాపు రూ.1.76 కోట్ల పనులకు టెండర్లు పిలిచామన్నారు. 110 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న బొటానికల్ గార్డెన్‌లో 10 ఎకరాల్లో అభివృద్ధి పనులు చేపడుతున్నామని తెలిపారు. విశాలమైన బర్డ్స్ పార్క్‌లో ప్రత్యేకంగా సైకిల్‌ట్రాక్ నిర్మించామని, ప్రతిష్ఠాత్మకంగా మూడు కిలోమీటర్ల మేర అందుబాటులోకి తెస్తున్న ఈ ట్రాక్‌ను వచ్చేనెల 9న ఐటీ, మున్సిపల్‌శాఖల మంత్రి కే తారకరామారావు ప్రారంభించనున్నట్టు తెలిపారు. హైదరాబాద్ సైక్లింగ్ క్లబ్ సహకారంతో సైకిళ్లు అందుబాటులో ఉంచుతామని చెప్పారు. దీంతోపాటు ఎలక్ట్రానిక్ ప్రవేశ ద్వారం నిర్మించామని, నక్షత్రవనం, రాశీవనం, రోజ్ గార్డెన్, బటర్ ఫ్లై గార్డెన్, ఫ్లవర్ గార్డెన్లను ప్రత్యేకంగా తీర్చిదిద్దుతున్నామని వివరించారు. ఆయుర్వేదిక్ అర్బల్ గార్డెన్, కార్తీక వనం, హంపీ థియేటర్లను అందుబాటులోకి తేచ్చేందుకు పనులు చేపడుతున్నట్టు పేర్కొన్నారు. ప్రత్యేకంగా యోగా సెంటర్, కార్పొరేట్ అడ్వెంచర్ గేమ్స్ లాంటి సౌకర్యాలతోపాటు పర్యావరణంపై అవగాహన కల్పించేందుకు చిన్నారుల కోసం త్రీడీ మ్యూజియంను, చిల్డ్రన్స్ పార్క్‌ను అభివృద్ధి చేస్తున్నామన్నారు. సందర్శకుల కోసం ప్రత్యేకంగా బోటింగ్, రెస్టారెంట్, కేఫెటేరీయ, కాటేజ్‌ల నిర్మాణం చేపడుతున్నామన్నారు. రాబోయే నాలుగు నెలల్లో బొటానికల్ గార్డెన్ రూపురేఖలు పూర్తిగా మారనున్నాయన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ ఓఎస్డీ నాగభూషణం, అసిస్టెంట్ డైరెక్టర్ రవీందర్‌రెడ్డి, బొటానికల్ రేంజ్ ఆఫీసర్ రాజేందర్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మూడు క్వింటాళ్ల గంజాయి స్వాధీనం

ఔటర్ రింగ్‌రోడ్‌లో ఐదుగురి అరెస్ట్

శంషాబాద్: ఏపీలోని విశాఖపట్నం నుంచి పెద్ద మొత్తంలో గంజాయి రవాణాకు పాల్పడుతున్న ముఠాను శంషాబాద్ ఆర్‌జీఐఏ పోలీసులు ఔటర్ రింగ్‌రోడ్‌పై మంగళవారం రాత్రి పట్టుకున్నారు. సుమారు మూడు క్వింటాళ్ల గంజాయి పట్టుకొని ఐదుగురిని అరెస్ట్ చేశారు. బుధవారం శంషాబాద్ డీసీపీ పద్మజ, ఏసీపీ నంద్యాల నర్సింహారెడ్డి మీడియాకు వివరాలు వెల్లడించారు. వైజాగ్‌కు చెందిన ప్రధాన సూత్రధారి లక్ష్మణ్‌రావు, సంగారెడ్డికి చెందిన పరశురాం గంజాయి వ్యాపారం చేస్తుంటారు. ఈ మేరకు లక్ష్మణ్‌రావు వైజాగ్‌కు చెందిన చందర్‌రావు, శ్రీనుతో కలిసి బొలేరో వాహనంలో విశాఖపట్నం జిల్లా నర్సీపట్నం నుంచి నారాయణ్‌ఖేడ్‌కు గంజాయితో బయలుదేరారు. గంజాయిని గుర్తు పట్టకుండా ఉండేందుకు పైన మక్కజొన్న కంకులను కప్పారు. బొలేరోకు పైలట్ వాహనంగా టాటా ఇండికా కారును తీసుకొచ్చారు. మంగళవారం రాత్రి రెండు వాహనాలు ఔటర్ రింగ్‌రోడ్‌పైకి చేరాయి. అదే సమయంలో ఔటర్‌పై వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులతోపాటు ఎస్‌వోటీ పోలీసులు వీరిని పట్టుకున్నారు. రెండు వాహనాల్లో రూ.30 లక్షల విలువైన సుమారు మూడు క్వింటాళ్ల గంజాయి లభించింది. ఈ ముఠాలోని వైజాగ్‌కు చెందిన తంబలి చందర్‌రావు, బొంతల నాగు, జొక్కం శ్రీను, సంగారెడ్డికి చెందిన చౌహాన్ మోహన్, చౌహాన్ వెంకట్‌ను అరెస్ట్ చేశారు. ప్రధాన సూత్రధారి లక్ష్మణ్‌రావు, పరశురాం, వైజాగ్‌కు చెందిన బొలేరో వాహనం యజమాని తంబలి సురేశ్ పరారీలో ఉన్నారు. నిందితుల నుంచి సెల్‌ఫోన్లు, నగదు, కారు, బొలేరో వాహనాన్ని స్వాధీనం చేసుకున్నట్టు డీసీపీ తెలిపారు. అరెస్ట్ చేసిన ఐదుగురిని రిమాండ్‌కు తరలించారు. గంజాయి ముఠా గుట్టు రట్టు చేసిన పోలీసులను డీసీపీ అభినందించారు.



ఔటర్ రింగ్ రోడ్‌లో పోలీసులకు చిక్కిన గంజాయి నిందితులు

ఏసీబీకి చిక్కిన ఫుడ్‌ఇన్‌స్పెక్టర్ బాపూజీ

ఆదిలాబాద్ సహా హైదరాబాద్‌లో ఏకకాలంలో నాలుగుచోట్ల దాడులు • రూ.ఐదు కోట్ల ఆస్తులు గుర్తింపు





ఆదిలాబాద్‌లో బాపూజీ ఇంట్లో తనిఖీలు చేస్తున్న ఏసీబీ అధికారులు, హైదరాబాద్ శివారు బండ్లగూడలోని బాపూజీ నివాసం

హైదరాబాద్/ ఖైరతాబాద్/ మేడ్చల్‌రూరల్ / బండ్లగూడ/ ఆదిలాబాద్ అర్బన్, నమస్తే తెలంగాణ: మరో అవినీతి అధికారి ఏసీబీకి చిక్కాడు. ఆదిలాబాద్‌లో ఫుడ్‌ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్న బాపూజీ ఆదాయానికి మించి భారీగా ఆస్తులు కలిగి ఉన్నారన్న సమాచారంతో బుధవారం ఏసీబీ అధికారులు నాలుగు ప్రాంతాల్లోని అతని నివాసాలపై దాడి చేశారు. ఏసీబీ డీజీ పూర్ణచందర్‌రావు కథనం ప్రకారం.. హైదరాబాద్‌లో నివాసముంటున్న బాపూజీ ఆదిలాబాద్‌లో ఫుడ్‌ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్నాడు. అతని వద్ద భారీగా అక్రమాస్తులు ఉన్నట్టు సమాచారం అందడంతో నిఘా పెట్టిన అధికారులు.. ఆస్తులకు సంబంధించిన పక్కా ఆధారాలు, పత్రాలు సేకరించారు. పకడ్బందీ వ్యూహంతో బుధవారం నాలుగు బృందాలు సోమాజిగూడ, మేడ్చల్, ఆదిలాబాద్, బండ్లగూడల్లో సోదాలు చేశాయి. ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని టీచర్స్‌కాలనీలో ఉన్న ఫుడ్‌సేఫ్టీ కార్యాలయం, ద్వారకానగర్‌లోని ఆయన కిరాయి ఇంట్లో దాడులు చేశారు. అక్కడ పలు కీలక పత్రాలు ఫైళ్లను స్వాధీనం చేసుకున్నారు. బాపూజీ భార్య ఎస్టీవోగా విధులు నిర్వహిస్తున్న మేడ్చల్ డీటీవో కార్యాలయంలో కూడా తనిఖీలు చేశారు. సోమాజిగూడలోని శాంతిశిఖర కాంప్లెక్స్ ఫ్లాట్ నంబర్ 15లో, గండిపేట మండలం బండ్లగూడలో సోదాలు చేశారు. ఈ తనిఖీల్లో బయటపడ్డ ఆస్తుల్లో కొన్ని బాపూజీ పేరుతో, మరికొన్ని కుటుంబ సభ్యుల పేరుతో ఉన్నాయి. బండ్లగూడలో రూ. 1.2 కోట్లు విలువచేసే విల్లా, సోమాజిగూడలో రూ. 10.25 లక్షలు విలువచేసే ఫ్లాట్, హయత్‌నగర్‌లో రూ. 2.44 లక్షలు విలువచేసే రెండుప్లాట్లు, రూ. 12.84 లక్షలు విలువచేసే బంగారు ఆభరణాలు, రూ.2.04 లక్షలు నగదు, రూ. 8.8 లక్షల బ్యాంక్ బ్యాలెన్స్, రూ.2.91 లక్షల విలువైన గృహోపకరణాలు, రూ. 8.5 లక్షలు విలువచేసే ఫోర్డ్ కారు, రూ.45 వేల విలువైన బైక్‌ను గుర్తించారు. ఈ ఆస్తుల విలువ పత్రాల ప్రకారం రూ.1.68 కోట్లు ఉన్నా.. మార్కెట్ విలువ మాత్రం దాదాపు రూ.5 కోట్ల వరకు ఉంటుంది. ఈ మేరకు బాపూజీపై కేసు నమోదు చేసి అరెస్ట్ చేసినట్టు ఏసీబీ డీజీ పూర్ణచందర్‌రావు పేర్కొన్నారు. కరీంనగర్‌లోని ఏసీబీ కోర్టులో బాపూజీని హాజరుపరిచినట్టు తెలిపారు. సోమాజిగూడలో వరంగల్ రేంజ్ ఏసీబీ డీఎస్పీ ఆర్ సాయిబాబా, గండిపేట మండలం బండ్లగూడలో ఏసీబీ ఇన్‌స్పెక్టర్ వేణుగోపాల్, ఆదిలాబాద్‌లో డీఎస్పీ పాపాలాల్, మేడ్చల్‌లో ఇన్‌స్పెక్టర్ రఘు బృందాలు తనిఖీలు నిర్వహించాయి.

కెమెరా నీడన ఉస్మానియా దవాఖాన

- 50 కెమెరాలతో నిఘా.. ఎస్‌పీఎఫ్ కోసం ప్రతిపాదన
- రోగులు, వైద్యసిబ్బందికి పటిష్ఠ భద్రతా చర్యలు
- సూపరింటెండెంట్ డాక్టర్ జీవీఎస్ మూర్తి



డాక్టర్ జీవీఎస్ మూర్తి

హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ: ఉస్మానియా దవాఖానలో ఇటీవల వైద్యసిబ్బందిపై జరిగిన దాడి నేపథ్యంలో భద్రతను పటిష్ఠపరుస్తూ వైద్యాధికారులు చర్యలు తీసుకున్నారు. ఎట్టకేలకు సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. టీఎస్‌ఎంఎస్‌ఐడీసీ, ఉస్మానియా దవాఖాన నిధులతో 50 కెమెరాలతో నిఘా వ్యవస్థకు శ్రీకారం చుట్టారు. ఇప్పటికే 25 కెమెరాలను దవాఖానలోని ప్రధాన ద్వారాలు, అత్యవసర విభాగాలు, జనరల్ వార్డులతోపాటు అన్ని బ్లాకుల్లో ఏర్పాటు చేసినట్టు సూపరింటెండెంట్ డాక్టర్ జీవీఎస్ మూర్తి తెలిపారు. త్వరలోనే మరో 25 కెమెరాలను ఏర్పాటు చేయనున్నట్టు చెప్పారు. దవాఖానలో విధులు నిర్వర్తించే వైద్యసిబ్బంది, రోగులకు పూర్తి భద్రత కల్పించే క్రమంలో స్పెషల్ పోలీస్ ఫోర్స్(ఎస్‌పీఎఫ్)బలగాల కోసం పోలీస్‌శాఖకు ప్రతిపాదనలు పంపించామని, త్వరలోనే ఎస్‌పీఎఫ్ బలగాలతో అవసరమైన చోట పికెటింగ్ ఏర్పాటు చేయిస్తామని వివరించారు. దవాఖానలో సిబ్బంది స్వేచ్ఛా వాతావరణంలో విధులు నిర్వహించేలా చర్యలు తీసుకుంటున్నామని, రోగులకు, వారి సహాయకులకు కూడా దీని వల్ల భద్రత ఏర్పడుతుందన్నారు. చారిత్రాత్మకమైన ఉస్మానియాలో మెరుగైన వైద్యసేవలు అందించేందుకు ప్రభుత్వం ప్రత్యేకంగా రూ.100 కోట్లు కేటాయించిందని, దీంతో ఎలాంటి లోటుపాట్లు లేకుండా రోగులకు వైద్యసేవలు అందిస్తున్నామన్నారు. దవాఖానలో వైద్యులు, ఇతర సిబ్బందిపై దాడులు చేస్తే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సీసీ కెమెరాల వల్ల అవకతవకలకు కూడా అడ్డుకట్ట పడుతుందన్నారు.

నిజాంసాగర్‌కు పూర్వవైభవం తెస్తాం

■ పాదయాత్రలో ఎంపీ కల్వకుంట్ల కవిత
■ ఆప్యాయంగా పలుకరిస్తూ.. సమస్యలు తెలుసుకుంటూ..
నిజామాబాద్ జిల్లా సాలూరలో 'మన ఊరు-మన ఎంపీ'

నిజామాబాద్, నమస్తే తెలంగాణ ప్రతినిధి/బోధన్, నమస్తే తెలంగాణ: నిజాంసాగర్ జలాశయానికి పూర్వవైభవం తెచ్చేందుకు కృషి చేస్తామని నిజామాబాద్ ఎంపీ కల్వకుంట్ల కవిత అన్నారు. నాన్ కమాండ్ గ్రామాలకు కాళేశ్వరం నీటిని అందించేందుకు నిజాంసాగర్ డిస్ట్రిబ్యూటరీ కాల్వలను పొడిగించాలని పలుచోట్ల వినతులు వస్తున్నాయని, అధికారులతో ప్రతిపాదనలు తయారుచేయించి ఆ దిశగా కృషి చేస్తామని చెప్పారు. నిజామాబాద్ జిల్లా బోధన్ మండలం సాలూర గ్రామంలో బుధవారం 'మన ఊరు – మన ఎంపీ' కార్యక్రమంలో భాగంగా ఎంపీ పాదయాత్ర నిర్వహించారు. అనంతరం స్థానిక టీటీడీ కల్యాణ మండపంలో నిర్వహించిన బహిరంగ సభలో ఆమె మాట్లాడారు. బోధన్ మండలంలోని హూన్సా, మందర్న, ఖాజాపూర్ గ్రామాల్లోని చెరుకు రైతులకు సంబంధించి రూ.1.22 కోట్ల



సాలూరలో గొల్ల కుర్మలు బహూకరించిన గొర్రెపిల్లతో ఎంపీ కవిత. చిత్రంలో బోధన్ ఎమ్మెల్యే మహ్మద్ షకీల్

రుణమాఫీ జరుగలేదని, దీనికి బ్యాంకు అధికారుల నిర్లక్ష్యం, సాంకేతిక కారణాలు ఉన్నాయని ఎంపీ కవిత అన్నారు. ఈ రుణమాఫీకి తాను తీవ్రంగా ప్రయత్నిస్తున్నానని తెలిపారు. హూన్సా, మందర్న, ఖాజాపూర్‌లో త్వరలో పర్యటించి, ఆ గ్రామాలను అభివృద్ధి చేస్తానని భరోసా ఇచ్చారు. బహిరంగసభలో బోధన్ ఎమ్మెల్యే మహ్మద్ షకీల్, ఎమ్మెల్సీ వీజీ గౌడ్, డీసీసీబీ చైర్మన్ గంగాధర్‌రావు పట్వారీ, టీఆర్‌ఎస్ నాయకులు బుద్దె రాజేశ్వర్, ఎంపీపీ గంగాశంకర్, జెడ్పీటీసీ సభ్యురాలు లావణ్య తదితరులు పాల్గొన్నారు.

ఎంపీ కవితకు సాలూరలో నీరాజనం

సాలూర గ్రామంలోని వీధుల్లో మూడు గంటల పాటు సుమారు నాలుగు కిలోమీటర్లు ఎంపీ కవిత పాదయాత్ర చేశారు. ప్రతి ఒక్కరినీ ఆప్యాయంగా పలుకరించారు. సబ్బండవర్ణాలు ఆమెకు మంగళహారతులు పట్టారు. సమస్యలను విని, పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. మత్స్యకారులు చేపలను, గొల్ల కుర్మలు గొర్రెపిల్లలు, కుమ్మరులు కుండలను ఎంపీకి బహుమతులుగా ఇచ్చారు. ఉదయం 9గంటల నుంచి రాత్రి 7.30 గంటల వరకు దాదాపు పదిగంటల పాటు ఎంపీ కవిత జిల్లా పర్యటన కొనసాగింది.



నిజామాబాద్ జిల్లా బోధన్ మండలం సాలూరలో కుండ తయారీని ఆసక్తిగా తిలకిస్తున్న ఎంపీ కల్వకుంట్ల కవిత

విదేశాల్లో ఉపాధి పేరుతో మోసం

■ రూ.2.5 కోట్లు తీసుకొని బోర్డుతిప్పేసిన కన్సల్టెన్సీ
■ హైదరాబాద్ సనత్‌నగర్‌లో ఘటన



శశిధర్‌రెడ్డి

అమీర్‌పేట్: విదేశాల్లో ఉపాధి కల్పిస్తామని నమ్మించిన సన్‌రైజ్ కన్సల్టెన్సీ దాదాపు 200 మంది నిరుద్యోగులను మోసం చేసింది. కెనడా, జార్జియా, మలేసియాలో ఉపాధి చూపుతామని చెప్పి ఒక్కొక్కరి నుంచి రూ.30 వేల నుంచి రూ.2 లక్షల వరకు రూ.2.30 కోట్లు వసూలు చేసి బోర్డు తిప్పేసింది. హైదరాబాద్ సనత్‌నగర్‌లోని జెక్‌కాలనీలో ఐదునెలల క్రితం కడప జిల్లాకు చెందిన శశిధర్‌రెడ్డి 'సన్‌రైజ్' పేరుతో కన్సల్టెన్సీని ప్రారంభించాడు. ఇప్పటికే ఉపాధి నిమిత్తం విదేశాలకు పంపించామని చెప్పి నిరుద్యోగుల నుంచి నగదు వసూలు చేశాడు. కెనడా వెళ్లేందుకు ఢిల్లీలో వైద్యపరీక్షలకు హాజరుకావాలని సంస్థ నుంచి 30 మందికి సమాచారం వచ్చింది. దీంతో అభ్యర్థులు సనత్‌నగర్ జెక్‌కాలనీలోని కార్యాలయానికి చేరుకోగా తాళం వేసి ఉన్నది. అభ్యర్థులు శశిధర్‌రెడ్డికి ఫోన్‌చేయగా ఎంతకీ ఎత్తకపోవడంతో మంగళవారం రాత్రి సనత్‌నగర్ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదుచేశారు. శశిధర్‌రెడ్డిని అరెస్ట్‌చేస్తామని సనత్‌నగర్ ఇన్‌స్పెక్టర్ వెంకట్‌రెడ్డి చెప్పారు.



టీసీపీసీ సెంటర్‌లో ట్రై సైకిళ్ల తయారీని పరిశీలిస్తున్న వికలాంగుల సహకార సంస్థ చైర్మన్ డాక్టర్ కేతిరెడ్డి వాసుదేవరెడ్డి

సంస్థ అభ్యున్నతికి పాటుపడాలి

వికలాంగుల సహకార సంస్థ చైర్మన్ కేతిరెడ్డి వాసుదేవరెడ్డి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: వికలాంగుల సహకార సంస్థలో పనిచేస్తున్న ఉద్యోగులంతా సక్రమంగా విధులు నిర్వహించి.. సంస్థ అభ్యున్నతికి పాటుపడాలని సంస్థ చైర్మన్ డాక్టర్ కేతిరెడ్డి వాసుదేవరెడ్డి సూచించారు. కమిషనర్ బీ శైలజతో కలిసి సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ట్రైనింగ్ కం ప్రొక్యూర్ సెంటర్ (టీసీపీసీ), బ్రెయిలీ సెంటర్‌ను బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా టీసీపీసీ సెంటర్‌లో తయారు చేస్తున్న ట్రైసైకిళ్లను, బ్రెయిలీ సెంటర్‌లో పుస్తకాల ప్రింటింగును పరిశీలించారు. రాబోయే రోజుల్లో టీసీపీసీ సెంటర్లలో వికలాంగులకు శిక్షణా కార్యక్రమాలను ఏర్పాటు చేస్తామని చైర్మన్ పేర్కొన్నారు.

దత్తత విషయంలో రాష్ర్టానికి కేంద్ర సహకారం

కారా చైర్మన్ మందా రామచంద్రారెడ్డి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: దత్తత విషయంలో రాష్ర్టాన్ని దేశంలోనే ప్రథమస్థానంలో ఉంచడానికి కేంద్రప్రభుత్వం నుంచి కావాల్సిన సహకారం అందించేందుకు సిద్ధంగా ఉన్నామని కేంద్ర మహిళా, శిశు సంక్షేమశాఖ అడ్వైజరీ కమిటీ (కారా) చైర్మన్ మందా రామచంద్రారెడ్డి అన్నారు. బుధవారం డాక్టర్ మర్రి చెన్నారెడ్డి మానవవనరుల అభివృద్ధి కేంద్రంలో నిర్వహించిన శిక్షణా కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. దేశంలో ఏటా మూడువేల దత్తతలు మించడంలేదని రామచంద్రారెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రం నుంచి చట్టపరంగా ఏటా వేయిమంది చిన్నారుల దత్తతలు జరిగేలా చూడాలని కార్యదర్శిని కోరారు. సీసీఐలలో ఉన్న 0 నుంచి 6 ఏండ్లలోపు పిల్లలను వెంటనే ప్రభుత్వ శిశుగృహాలకు తరలించాలని, లేనిపక్షంలో కఠినచర్యలు తీసుకుంటామని మహిళా, శిశు సంక్షేమశాఖ కార్యదర్శి జగదీశ్వర్ హెచ్చరించారు. అక్రమాలకు పాల్పడుతున్న సీసీఐలను మూసివేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా దత్తత, జువైనల్ జస్టిస్ యాక్ట్‌పై కోల్‌కతాకు చెందిన ప్రొఫెసర్ జే మజుందార్ అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జాయింట్ డైరెక్టర్ లక్ష్మీదేవి తదితరులు పాల్గొన్నారు.

అక్రమ క్రషర్లపై ప్రభుత్వం కన్నెర్ర

ప్రభుత్వ ఖజానాకు ఏటా రూ.50 కోట్ల నష్టం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: గ్రేటర్ హైదరాబాద్ చుట్టుపక్కల ప్రాంతాల్లో ఏర్పాటయిన అక్రమ స్టోన్ క్రషర్లపై ప్రభుత్వం కన్నెర్ర చేసింది. వీటివల్ల ప్రభుత్వానికి ఏటా దాదాపు రూ.30 నుంచి 50 కోట్ల వరకు నష్టం వాటిల్లుతున్నదని అంచనా వేసింది. వీటివల్ల సమీప ప్రాంతాల్లోని ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. లారీల రాకపోకల కారణంగా రహదారులు ధ్వంసమవుతున్నాయని, తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని, పరిసరాలు తీవ్రంగా కలుషితమవుతున్నాయని స్థానికులు పేర్కొంటున్నారు. జీహెచ్‌ఎంసీ, హెచ్‌ఎండీఏ, జీవో 111 ప్రాంతాల్లో అక్రమ క్రషర్లను ఏర్పాటు చేశారని అధికారులు గుర్తించారు. పాత ముంబై హైవే నుంచి కొండాపూర్ మార్గంలో 11, రాజేంద్రనగర్‌లో 3 అక్రమ క్రషర్లు ఉన్నాయని తేలింది. గచ్చిబౌలి, ఉప్పల్, హయత్‌నగర్, మేడ్చల్ తదితర ప్రాంతాల్లో ఇవి ఉన్నట్లు గుర్తించారు. అపార్టుమెంట్లను నిర్మించే పలు నిర్మాణ సంస్థలు ఎలాంటి అనుమతుల్లేకుండానే తమ సైట్‌కు చేరువలో క్రషర్లను ఏర్పాటు చేశాయి. వీటికి నీటి వినియోగం అధికంగా ఉండటంతో స్థానికులకు తాగునీటి సమస్య ఏర్పడుతున్నది. ఈ సమస్యలపై భూగర్భ జలవనరులశాఖ దృష్టి సారించింది. అక్రమ క్రషర్ల నిర్వాహకులపై కఠిన చర్యలు తీసుకునేందుకు సిద్ధమవుతున్నది.



ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో తయారుచేసే వినాయక ప్రతిమలను ఉపయోగించొద్దంటూ.. హుందాయి మోటర్ ఇండియా ఇంజినీరింగ్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ ఉద్యోగులకు బుధవారం మట్టి గణపతులను పంపిణీ చేస్తున్న కంపెనీ హెచ్‌ఆర్ అసిస్టెంట్ జనరల్ మేనేజర్ ఏవీఎస్ రమేశ్ తదితరులు

పులిచింతల ఖాళీ

తెలంగాణ రైతుల నోట్లో మట్టికొట్టిన ఏపీ

బోర్డు అనుమతి లేకుండా 4.5 టీఎంసీల నీటి విడుదల ■ ఎండీడీఎల్ దిగువకు పడిపోయిన నీటి మట్టం
నిలిచిన తొమ్మిది ఎత్తిపోతల పథకాలు ■ తెలంగాణ ఫిర్యాదుతో ఏపీని మందలించిన కృష్ణా బోర్డు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ:

'మాది మాకే కావాలి.. మీదీ మాకే కావాలి..' అనే ఆంధ్రప్రదేశ్ వైఖరిలో ఏమాత్రం మార్పు లేదు. ఒక వైపు పట్టిసీమద్వారా గోదావరి జలాల మళ్లింపుతో కృష్ణాడెల్టాను పచ్చగా చేసుకుంటున్న ఆ రాష్ట్రం.. అందుకు అనుగుణంగా తెలంగాణకు న్యాయంగా రావాల్సిన వాటాను మాత్రం ఇవ్వడం లేదు. పైగా.. పులిచింతలకు వచ్చిన కొద్దిపాటి నీటిని తెలంగాణ రైతులు ఎక్కడ వాడుకుంటారోనని ఆ జలాశయాన్ని కూడా ఖాళీచేసి, రైతుల నోట్లో మట్టి కొట్టింది. తాగునీటిఅవసరాల దృష్ట్యా అత్యవసరమైతే తప్ప ఏదైనా ఒక ప్రాజెక్టులో కనిష్ఠ నీటి సేకరణ స్థాయి (ఎండీడీఎల్–మినిమం డ్రాడౌన్ లెవల్) కంటే తక్కువకు వెళ్లవద్దనేది సహజ సూత్రం. దానిని ఉల్లంఘించడమే కాకుండా.. కృష్ణా నదీ యాజమాన్య బోర్డు అనుమతి లేకుండానే ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగానే నీటిని విడుదల చేసిందనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

15వేల ఎకరాలకు దెబ్బ

తెలంగాణను ముంచి నిర్మించిన పులిచింతల ప్రాజెక్టు పూర్తి సామర్థ్యం 45.77 టీఎంసీలు. ప్రాజెక్టు ఎఫ్‌ఆర్‌ఎల్ 175 అడుగులు. కనిష్ఠ నీటి సేకరణ స్థాయి (ఎండీడీఎల్) 140 అడుగులు. పులిచింతల జలాశయం ఫోర్‌షోర్‌లో తెలంగాణకు సంబంధించి తొమ్మిది లిఫ్టు పథకాలు ఉన్నాయి. వీటి కింద సుమారు 15వేల ఎకరాల్లో రైతులు సాగు చేసుకుంటారు. అయితే పులిచింతలలో ఎండీడీఎల్‌లో నీళ్లుంటేనే ఈ లిఫ్టులు పనిచేస్తాయి. ఈ నేపథ్యంలో జలాశయంనుంచి నీటిని విడుదల చేయాలంటే ఏపీ సర్కారు కచ్చితంగా కృష్ణా బోర్డు అనుమతి తీసుకోవాలి. పైగా.. అక్కడి 120 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి కేంద్రం తెలంగాణ ఆధీనంలో ఉంది. జలాశయం నుంచి నీటిని వదులాలంటే తెలంగాణకు సమాచారం అందిస్తే అవసరమైతే విద్యుత్ ఉత్పత్తిద్వారా నీటిని వదిలే ఏర్పాట్లుచేస్తారు. వీటిని పట్టించుకోని ఏపీ ప్రభుత్వం.. జూన్‌లో 2 టీఎంసీలు, ఈ నెల మూడో తేదీనుంచి ఇప్పటివరకు మరో 2.5 టీఎంసీలను రివర్ స్లూయిజ్‌లద్వారా కృష్ణాడెల్టాకు విడుదల చేసింది. అసలే ఎగువనుంచి ఇన్‌ఫ్లోలు లేకపోవడం, నాలుగున్నర టీఎంసీలు విడుదలకావడంతో ఎండీడీఎల్ దిగువకు నీటిమట్టం పడిపోయింది. ఫలితంగా తెలంగాణకు చెందిన పెద్దవీడు, మహంకాళిగూడెం, చింత్రియాల, రెబల్లె, అడ్లూరు, నక్కగూడెం, అమరవరం, చౌటపల్లి, ఎర్రగట్టుతండాతోపాటు శివగంగ ఎత్తిపోతల పథకంకింద ఉన్న రేవూరు, బెగ్గమాదారం, చింతలపాలెంవంటి 9 లిఫ్టు పథకాలకు నీటి లభ్యత కరువైంది. దీంతో ఆయా లిఫ్టులను నమ్ముకొని పంటలు వేసుకున్న రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇదే విషయాన్ని ఇటీవల తెలంగాణ నీటిపారుదల శాఖ ఈఎన్‌సీ మురళీధర్ కృష్ణాబోర్డుకు లేఖ ద్వారా ఫిర్యాదుచేశారు. బోర్డు అనుమతి లేకుండా ఏపీ అధికారులు నీటిని ఎలా విడుదల చేస్తారని ప్రశ్నించారు. ఇప్పటికైనా పులిచింతలలో ఎండీడీఎల్ నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

అంత అవసరమేమొచ్చింది?

అసలు కృష్ణా బేసిన్‌కు ఇన్‌ఫ్లోలు లేవు. పులిచింతలకు ఈ నీటి సంవత్సరంలో మూడు, నాలుగు టీఎంసీల స్వల్ప వరద వచ్చింది. మరోవైపు ఏపీ సర్కారు జూన్‌లోనే పట్టిసీమద్వారా గోదావరిజలాలను లిఫ్టుచేసి, కృష్ణా డెల్టాకు మళ్లించడం మొదలుపెట్టింది. ఫలితంగా డెల్టాలో తాగు, సాగునీటి సమస్య అనేదే ఉత్పన్నంకాదు. కానీ ఏపీ ప్రభుత్వం పులిచింతలలో ఉన్న కొద్దిపాటి నీటిని డెల్టాకు విడుదలచేసింది. దీనివల్ల తెలంగాణ రైతులకు చెందిన 15వేల ఎకరాల్లో పంట ఎండిపోవడంతోపాటు పులిచింతలవద్ద తెలంగాణ కరెంటు ఉత్పత్తి కూడా చేసుకోలేకపోయింది. ఇదే అంశం రెండ్రోజుల కిందట విజయవాడలో జరిగిన కృష్ణాబోర్డు సమావేశంలో చర్చకు రావడంతో బోర్డు చైర్మన్ శ్రీవాత్సవ ప్రాజెక్టులో ఎండీడీఎల్ కంటే దిగువకు ఎలా వెళతారు? అని గట్టిగానే ప్రశ్నించినట్టు సమాచారం. అయితే పట్టిసీమ మోటర్లు నాలుగు రోజులపాటు పనిచేయకపోవడంతో పులిచింతల నుంచి నీటిని విడుదలచేశామంటూ ఏపీ అధికారులు విచిత్ర సమాధానం ఇవ్వడం కొసమెరుపు.

లీడర్‌షిప్ అవార్డుపై కాంగ్రెస్ దురుద్దేశ ఆరోపణలు

■ ఉన్నత ప్రమాణాలను పాటించే సీఎం కేసీఆర్‌కు అవార్డు
■ ఐసీఎఫ్‌ఏ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రంధవ స్పష్టీకరణ
■ కాంగ్రెస్‌నేత శ్రవణ్ బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్

ప్రత్యేక ప్రతినిధి, నమస్తే తెలంగాణ: ఈ ఏడాది అగ్రికల్చర్ లీడర్‌షిప్ అవార్డును తెలంగాణ ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావుకు ప్రకటించిన విషయంలో రాజకీయ దురుద్దేశంతోనే కాంగ్రెస్ నేతలు ఆరోపణలు చేస్తున్నారని భారత ఆహార, వ్యవసాయ మండలి (ఐసీఎఫ్‌ఏ) పేర్కొంది. ఎలాంటి ఆధారాలు లేకుండా విమర్శలుచేసిన కాంగ్రెస్ నేత దాసోజు శ్రవణ్ బేషరతుగా తమ సంస్థకు క్షమాపణ చెప్పాలని మండలి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎన్‌ఎస్ రంధవ డిమాండ్‌చేశారు. ఉన్నత ప్రమాణాలను పాటించి, అన్ని అంశాలను పరిగణనలోకి తీసుకునే తెలంగాణ ముఖ్యమంత్రికి 'అగ్రికల్చర్ లీడర్‌షిప్' అవార్డు ఇచ్చామని ఆయన స్పష్టంచేశారు. ఇందులో ఎవరిదో ప్రమేయం ఉందని, సీడ్ కంపెనీల ప్రయోజనాలు దాగి ఉన్నాయని శ్రవణ్ చేసిన ఆరోపణలకు ఒక్క ఆధారమైనా చూపగలుగుతారా అని ప్రశ్నించారు. భారతదేశంలో వ్యవసాయ అభివృద్ధికి, గ్రామీణ ప్రాంతాల ప్రగతికి విశేష కృషి జరిపే సంస్థలకు, వ్యక్తులకు అగ్రికల్చర్ లీడర్‌షిప్ అవార్డులను 2008 నుంచి ఇస్తున్నట్లు ఆయన వివరించారు. మొదట్లో సీనియర్ కాంగ్రెస్ నాయకులు, హర్యానా గవర్నర్ ఏఆర్ కిద్వాయి గ్లోబల్ అవార్డు కమిటీకి చైర్మన్‌గా ఉండే వారని వివరించారు. మొదటి రెండు సంవత్సరాలు ఆయన ఆధ్వర్యంలో అవార్డుల ఎంపిక జరిగిందని, కిద్వాయి మరణానంతరం ఆ బాధ్యతలను శాస్త్రవేత్త ప్రొఫెసర్ ఎంఎస్ స్వామినాథన్ చేపట్టారని వివరించారు. వ్యవసాయరంగ అభివృద్ధికి, రైతుల ప్రయోజనాలను కాపాడటానికి చిత్తశుద్ధితో కృషిచేసినవారికి రాజకీయాలకు అతీతంగా అవార్డులను బహుకరించామన్నారు. గ్లోబల్ అవార్డు కమిటీ ఉన్నత ప్రమాణాలను పాటిస్తున్నదని, ఎన్నో అంశాలను పరిగణనలోకి తీసుకుని అవార్డుకు ఎంపిక చేస్తున్నదని ఆయన స్పష్టంచేశారు. సీడ్ కంపెనీల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని అవార్డులకు ఎంపికచేస్తున్నట్లు కాంగ్రెస్ నాయకుడు చేసిన ఆరోపణలను రంధవ తోసిపుచ్చారు. ఐసీఎఫ్‌ఏలో ఒక్క విత్తన కంపెనీకి కూడా సభ్యత్వం లేదని స్పష్టం చేశారు. తమ సంస్థకు తెలంగాణతోపాటు దేశంలో ఏ రాష్ట్రంతో లేదా సంస్థతో ఎలాంటి ప్రయోజనాలు లేవని అన్నారు. తమ సంస్థ సభ్యులు, చైర్మన్ గత రెండేండ్లుగా ఏనాడూ హైదరాబాద్‌కు రాలేదని పేర్కొన్నారు. ఉన్నత ప్రమాణాలతో కూడిన తమ సంస్థ ప్రతిష్ఠను దెబ్బతీయడానికి దిగజారుడు పనులకు పాల్పడటం తగదని అన్నారు. శ్రవణ్‌పై చర్య తీసుకోవాలని కాంగ్రెస్ అధ్యక్షురాలు సోనియా గాంధీ, పీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌కు ఐసీఎఫ్‌ఏ లేఖలు పంపింది.

సీపీఎస్ రద్దు చేసేవరకు ఉద్యమం

టీఎన్జీవో అధ్యక్షుడు కారం రవీందర్‌రెడ్డి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం (సీపీఎస్) రద్దు చేసేవరకు దేశంలోని అన్ని రాష్ర్టాల ఉద్యోగులు ఉద్యమించాలని టీఎన్జీవో అధ్యక్షుడు కారం రవీందర్‌రెడ్డి అన్నారు. టీఎన్జీవో భవన్‌లో బుధవారం కార్యవర్గ సమావేశం జరిగింది. సీపీఎస్‌కు వ్యతిరేకంగా కేంద్ర ప్రభుత్వాన్ని నిలదీసే విధంగా ఉద్యమాలను చేపట్టాలని సమావేశంలో తీర్మానించారు. గురువారం తెలంగాణ ఉద్యోగ సంఘాల జేఏసీ సమావేశం నిర్వహిస్తామని రవీందర్‌రెడ్డి ప్రకటించారు. ఈ నెల 29న హైదరాబాద్ జిల్లా కేంద్రంలో సీపీఎస్‌ను వ్యతిరేకిస్తూ సదస్సును నిర్వహించనున్నట్టు తెలిపారు. 30, 31 తేదీలలో ఉద్యోగులు ర్యాలీ నిర్వహించాలని టీఎన్జీవో ప్రధానకార్యదర్శి మామిండ్ల రాజేందర్ సూచించారు.



టీఎన్జీవో కార్యవర్గ సమావేశంలో మాట్లాడుతున్న సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కారం రవీందర్‌రెడ్డి

నెలాఖరున రిటైర్ కానున్న మెదక్ జిల్లా అధ్యక్షుడు ఎల్ శ్రీనివాస్‌రెడ్డి, కేంద్ర సంఘం ఉపాధ్యక్షురాలు ఆర్ శైలజ, పదోన్నతిపై తహసీల్దార్‌గా వెళ్తున్న వరంగల్ కార్యదర్శి రత్నవీరాచారిలను కేంద్ర సంఘం ఘనంగా సన్మానించింది. సమావేశంలో టీఎన్జీవో హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు ముజీబ్, రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు లక్ష్మణ్, నగర అధ్యక్షుడు ఆర్ ప్రతాప్, రాష్ట్ర కోశాధికారి బండారు రేచల్, సహఅధ్యక్షుడు మందడి ఉపేందర్‌రెడ్డి, సహాయఅధ్యక్షుడు కస్తూరి వెంకటేశ్వర్లు వివిధ జిల్లాల అధ్యక్షులు, కార్యదర్శులు, 54 అనుబంధ సంఘాల అధ్యక్ష కార్యదర్శులు పాల్గొన్నారు.

సీపీఎస్ రద్దు కోరుతూ 28న జాక్టో దీక్షలు

రాష్ట్రంలోని సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి, పాత పెన్షన్ విధానాన్ని అమలుచేయాలని కోరుతూ జాయింట్ యాక్షన్ కమిటీ ఆఫ్ టీచర్స్ ఆర్గనైజేషన్ (జాక్టో) ఆధ్వర్యంలో ఈ నెల 28న ర్యాలీలు, దీక్షలను నిర్వహించనున్నట్టు పీఆర్టీయూ తెలంగాణ నాయకులు మారెడ్డి అంజిరెడ్డి, ఎం చెన్నయ్య తెలిపారు.

నవంబర్ 1 నుంచి రేషన్ డీలర్ల సమ్మె

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: కమీషన్ పెంపు, ఉద్యోగాలకు భరోసా కల్పించాలనే డిమాండ్లను నెరవేర్చడంలో కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించకపోవడానికి నిరసనగా నవంబర్ 1 నుంచి బంద్ నిర్వహించాలని రేషన్ డీలర్స్ అసోసియేషన్ తీర్మానించింది. ఆలిండియా రేషన్ డీలర్స్ ఫెడరేషన్(ఏఐఆర్డీఎఫ్) పిలుపు మేరకు బంద్ నిర్వహించే విషయమై మంగళవారం ఖైరతాబాద్‌లో సంఘం రాష్ట్ర, జిల్లాల కార్యవర్గం సమావేశమైంది. ఆలిండియా కమిటీ బంద్ పిలుపు నిర్ణయాన్ని రాష్ట్ర డీలర్ల అసోసియేషన్ సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారు. సమావేశంలో అసోసియేషన్ అధ్యక్షుడు ఎండీ అజీజుద్దీన్, ప్రతినిధులు కృష్ణమూర్తి, సూర్యనారాయణమూర్తి, జ్యోతిందర్ సింగ్, వెంకటరమణ, శంకర్, శ్రీనివాసరావు, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

ఐబీపీఎస్ మైనారిటీ అభ్యర్థులకు ఉచిత శిక్షణ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ఐబీపీఎస్ బ్యాంక్ ప్రొబేషనరీ అధికారుల పరీక్షలకు సిద్ధమయ్యే మైనారిటీ అభ్యర్థులకు రాష్ట్ర మైనారిటీ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్టు స్టడీ సర్కిల్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఎస్ ఏ షుకూర్ తెలిపారు. శిక్షణ సెప్టెంబర్ 8 నుంచి ప్రారంభమవుతుందన్నారు. ఆసక్తి గల ముస్లింలు, క్రైస్తవులు, బౌద్ధులు, పార్సీలు, జైన మత అభ్యర్థులు సెప్టెంబర్ 6 లోగా స్టడీ సర్కిల్‌కు దరఖాస్తు చేసుకోవాలని ఆయన సూచించారు. వివరాలకు మైనారిటీ స్టడీ సర్కిల్ కార్యాలయం ఫోన్ నంబర్లు 040–23236113, 9059547211కు లేదా హైదరాబాద్ గన్‌ఫౌండ్రీలోని ఎస్‌బీఐ బ్యాంక్ ఎదురుగా జామే నిజామియా బిల్డింగ్ కాంప్లెక్స్‌లోని మూడో అంతస్తులో ఉన్న స్టడీ సర్కిల్ కార్యాలయంలో సంప్రదించాలని షుకూర్ సూచించారు.



బుధవారం అధికారులతో ఉపాధి పనులు తదితరాలపై సమీక్షిస్తున్న మంత్రి జూపల్లి

ప్రాధాన్యతాక్రమంలో అభివృద్ధి పనులు

■ ఉపాధి పనుల్లో వెనుకబడిన గ్రామాలపై ప్రత్యేక దృష్టి
■ గ్రామీణాభివృద్ధిశాఖ సమీక్షలో మంత్రి జూపల్లి కృష్ణారావు వెల్లడి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ప్రాధాన్యతాక్రమంలో గ్రామాల్లో అభివృద్ధి పనులు పూర్తిచేయాలని పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధిశాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అధికారులను ఆదేశించారు. అభివృద్ధిలో వెనుకబడిన గ్రామాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. గతంతో పోలిస్తే ఉపాధిహామీ పనుల్లో వేగం పెంచామని, గత ఆర్థికసంవత్సరంలో పూర్తిస్థాయిలో ఉపాధి నిధులను సద్వినియోగం చేసుకోగలిగామని చెప్పారు. ఈ ఆర్థికసంవత్సరం కూడా ఉపాధిపనులు ఆశించిన రీతిలోనే సాగుతున్నాయన్నారు. కొన్ని గ్రామాలు పూర్తిగా వెనుకబడ్డాయని, వాటిని గుర్తించి యుద్ధప్రాతిపదికన పనులు పూర్తిచేయాల్సిన అవసరం ఉందని మంత్రి అధికారులకు దిశానిర్దేశం చేశారు. బుధవారం హైదరాబాద్‌లోని గ్రామీణాభివృద్ధిశాఖ కమిషనర్ కార్యాలయంలో ఉపాధిహామీ పనులతోపాటు మరుగుదొడ్లు, ఇంకుడు గుంతలు, డంపింగ్ యార్డులు, వైకుంఠధామాల నిర్మాణాలపై సంబంధితశాఖ అధికారులతో మంత్రి జూపల్లి సమీక్షించారు. ప్రతి మండలంలో వెనుకబడిన రెండు గ్రామాల జాబితాలను సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. ఉపాధిహామీ కూలీల వేతనాలను ఎప్పటికప్పుడు చెల్లించేందుకు చర్యలు తీసుకోవాలని, కేంద్రం నుంచి రావాల్సిన బకాయిలపై సంప్రదింపులు జరుపాలని ముఖ్యకార్యదర్శి వికాస్‌రాజ్, కమిషనర్ నీతూ ప్రసాద్‌ను మంత్రి జూపల్లి ఆదేశించారు. ప్రజలు కోరుకున్న మొక్కలను గ్రామంలోనే అందుబాటులో ఉంచితే హరితహారం లక్ష్యాన్ని తేలికగా చేరుకోగలమని, ఆ దిశగా ప్రతిగ్రామంలో నర్సరీ ఏర్పాట్లకు చర్యలు తీసుకోవాలని సూచించారు. పాఠశాలల్లో టాయిలెట్ల నిర్మాణానికి సంబంధించి సర్పంచ్‌లను, ఎంపీడీవోలను సన్నద్ధం చేయాలని ఆదేశించారు. సమావేశంలో గ్రామీణాభివృద్ధిశాఖ అధికారులు వెస్లీ, రామారావు, ఆశ తదితరులు పాల్గొన్నారు.



బుధవారం టీఏఎస్‌ఏ కేంద్ర కార్యాలయంలో మేజర్ జనరల్ శ్రీనివాసరావుతో సమావేశమైన ఎంపీ లక్ష్మీకాంతారావు

సైనిక సంక్షేమానికి మరింత సహకారం

■ మేజర్ జనరల్‌తో ఎంపీ కెప్టెన్ లక్ష్మీకాంతారావు భేటీ

హైదరాబాద్/కంటోన్మెంట్, నమస్తే తెలంగాణ: సైనికుల సంక్షేమానికి మరింత సహకారం అందిస్తామని రాజ్యసభ సభ్యుడు కెప్టెన్ లక్ష్మీకాంతారావు హామీ ఇచ్చారు. ఇండియన్ ఆర్మీ, రాష్ట్ర ప్రభుతాల మధ్య మరింత పరస్పర సహకారం అవసరమని వివరించారు. లక్ష్మీకాంతారావు బుధవారం తెలంగాణ, ఆంధ్రా సబ్ ఏరియా (టీఏఎస్‌ఏ) కేంద్ర కార్యాలయానికి వెళ్లి మేజర్ జనరల్ శ్రీనివాసరావుతో సమావేశమయ్యారు. సైనికుల సంక్షేమం తదితర అంశాలపై చర్చించారు. గతంలో లక్ష్మీకాంతారావు, శ్రీనివాసరావు మిలిటరీలోని ఆర్టిలరీ (ఫిరంగి) విభాగంలో కలిసి పనిచేశారు. ప్రస్తుతం ఆర్టిలరీ విభాగంలో పరిస్థితులు, వారి అనుభవాల గురించి చర్చించుకున్నారు. సమావేశంలో బ్రిగేడియర్ వీ వెంకట్‌రెడ్డి, రాష్ట్ర సైనిక సంక్షేమ డైరెక్టర్, రిటైర్డ్ కల్నల్ పీ రమేశ్‌కుమార్ పాల్గొన్నారు.

భద్రతకు ప్రైవేటు సెక్యూరిటీ దోహదం

డీజీపీ అనురాగ్‌శర్మ వెల్లడి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: శాంతిభద్రతల విషయంలో ప్రైవేటు సెక్యూరిటీ ఏజెన్సీలు కూడా దోహదపడుతున్నాయని రాష్ట్ర డీజీపీ అనురాగ్ శర్మ చెప్పారు. ప్రైవేటు సెక్యూరిటీ ఏజెన్సీలు భద్రత అంశంలో పోలీసులకు సహకరించాలని సూచించారు. ఇంటెలిజెన్స్ సెక్యూరిటీ వింగ్ ఆధ్వర్యంలో ప్రైవేటు సెక్యూరిటీ ఏజెన్సీల భద్రతా సిబ్బందికి ఆరురోజులుగా ఇస్తున్న శిక్షణ బుధవారంతో ముగిసింది. ఈ సందర్భంగా డీజీపీ కార్యాలయంలో ప్రైవేటు సెక్యూరిటీ ఏజెన్సీలతో సమావేశం ఏర్పాటుచేశారు. లైసెన్స్ తీసుకున్న సెక్యూరిటీ ఏజెన్సీల సిబ్బందికి భద్రత అంశాలపై శిక్షణ ఇస్తున్నామని డీజీపీ చెప్పారు. సెక్యూరిటీ గార్డులుగా ఉద్యోగావకాశం కల్పిస్తున్న ఏజెన్సీలు తప్పనిసరిగా నియామక సమయంలోనే సిబ్బంది వివరాలు సేకరించాలన్నారు. రాష్ట్ర హోంశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ రాజీవ్ త్రివేది మాట్లాడుతూ ప్రైవేటు సెక్యూరిటీ ఏజెన్సీలకు శిక్షణ ఇచ్చేందుకు మొయినాబాద్‌లో ఇంటిగ్రేటెడ్ ఇంటెలిజెన్స్ ట్రైనింగ్ అకాడమీ ఉందన్నారు. లైసెన్స్ కలిగిన ప్రైవేటు సెక్యూరిటీ ఏజెన్సీల తొలిబ్యాచ్‌లోని 40 మందికి శిక్షణ ఇచ్చామని ఇంటెలిజెన్స్ సెక్యూరిటీ వింగ్ ఓఎస్డీ ఎంకే సింగ్ తెలిపారు. శిక్షణలో పాల్గొన్న ప్రైవేటు సెక్యూరిటీ సంస్థలకు డీజీపీ అనురాగ్‌శర్మ సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. కార్యక్రమంలో అదనపు డీజీపీ అంజనీకుమార్, ఇంటెలిజెన్స్ ఐజీ వీ నవీన్‌చంద్ తదితరులు పాల్గొన్నారు.

సూపర్‌స్పెషాలిటీ కోర్సుల సీట్ల భర్తీపై నేడు తీర్పు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: తెలంగాణ, ఏపీ రాష్ర్టాల్లోని కాళోజీ నారాయణరావు, ఎన్టీఆర్ వైద్య విశ్వవిద్యాలయాల పరిధిలో సూపర్‌స్పెషాలిటీ కోర్సుల ప్రవేశాలపై ఉమ్మడి హైకోర్టు గురువారం తీర్పును వెలువరించనుంది. ఆర్టికల్ 371–డీ అమల్లో ఉండగా రెండు రాష్ర్టాల్లోని సూపర్ స్పెషాలిటీ కోర్సుల సీట్లను జాతీయ కౌన్సెలింగ్ ద్వారా భర్తీ చేయాలని కేంద్ర ఆరోగ్యశాఖ జారీచేసిన ఉత్తర్వులపై బుధవారం విచారణ చేపట్టిన అనంతరం గురువారం తీర్పును వెలువరిస్తామని జస్టిస్ రామసుబ్రమణియన్, జస్టిస్ టీ రజనీలతో కూడిన ధర్మాసనం ప్రకటించింది. కేంద్రం ఉత్తర్వులను సవాల్‌చేస్తూ దాఖలైన వ్యాజ్యంపై ఇప్పటికే విచారణ చేపట్టిన కోర్టు, తెలుగు రాష్ర్టాల్లో ప్రవేశాలు చేపట్టరాదని గత వారం మధ్యంతర ఉత్తర్వులు జారీచేసిన సంగతి తెలిసిందే.

మీ ఆతిథ్యానికి కృతజ్ఞతలు

■ సీఎం కేసీఆర్, గవర్నర్‌లకు ఉపరాష్ట్రపతి లేఖలు



న్యూఢిల్లీ, నమస్తే తెలంగాణ: రాష్ట్ర ప్రభుత్వం సోమవారం తనకు నిర్వహించిన పౌర సన్మానానికి ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు కృతజ్ఞతలు తెలిపారు. ఈ మేరకు సీఎం కేసీఆర్, గవర్నర్ నరసింహన్‌కు లేఖలు రాశారు. ఉప రాష్ట్రపతిగా పదవీ బాధ్యతలు స్వీకరించిన తర్వాత తనకు పౌరసన్మానం చేసిన తొలి రాష్ట్రం తెలంగాణే అని, యావత్తు తెలంగాణ ప్రజల తరపున మాత్రమే కాకుండా తెలుగు జాతి తరపున సీఎం కేసీఆర్ తనకు శుభాకాంక్షలు తెలియజేశారని లేఖలో పేర్కొన్నారు. తెలంగాణ ప్రభుత్వ ఆతిథ్యానికి ఉపరాష్ట్రపతి ధన్యవాదాలు తెలిపారు.

సీఎం కేసీఆర్‌కు రాసిన లేఖ పూర్తిపాఠం..

"శ్రీ చంద్రశేఖరరావుగారికి,
తెలంగాణ రాష్ట్రంలో నా పర్యటన సందర్భంగా మీరు పలికిన స్వాగతానికి, చేసిన మర్యాదలకు, అందించిన శుభాకాంక్షలకు నా ధన్యవాదాలు. చక్కని తెలుగులో మీరు చేసిన ప్రసంగం నన్నెంతగానో ఆకట్టుకున్నది. మీరు చేసిన పౌర సన్మానానికి, అభినందనలకు, చక్కని తెలుగు భోజనానికి, ఇతర ఏర్పాట్లకు మరొక్కమారు నా హృదయపూర్వక ధన్యవాదాలు" అని వెంకయ్యనాయుడు అచ్చమైన తెలుగులో తన చేతిరాతతో రాసిన లేఖలో పేర్కొన్నారు.

గవర్నర్‌కు ఆంగ్లంలో లేఖ: తెలంగాణ ప్రభుత్వం ఏర్పాటు చేసిన పౌరసన్మానానికి హాజరై పలు ఆలోచనలను పంచుకున్నందుకు గవర్నర్ నరసింహన్‌కు కృతజ్ఞతలు తెలిపారు. అనేక మధుర జ్ఞాపకాలు, ఆలోచనలను పంచుకున్నందుకు సంతోషంగా ఉందని గవర్నర్‌కు ఆంగ్లంలో రాసిన లేఖలో పేర్కొన్నారు. పర్యటనను మరపురాని ఘట్టంగా మలిచినందుకు ధన్యవాదాలు తెలిపారు.

ప్రాజెక్టులు కట్టొద్దనేదే కాంగ్రెస్ వైఖరి

■ ఎకరాకు 10 లక్షల పరిహారం ఎప్పుడైనా ఇచ్చారా?

■ ఎమ్మెల్యే శ్రీనివాస్‌గౌడ్ ధ్వజం



హైదరాబాద్, నమస్తే తెలంగాణ: కాంగ్రెస్ నేతల ముఖాలకు ఎప్పుడైనా భూనిర్వాసితులకు ఎకరానికి రూ.10 లక్షల పరిహారం ఇచ్చిన చరిత్ర ఉందా? అని టీఆర్ఎస్ ఎమ్మెల్యే వీ శ్రీనివాస్‌గౌడ్ విమర్శించారు. అసలు ప్రాజెక్టులు కట్టొద్దనేదే కాంగ్రెస్ వైఖరి అని ఆరోపించారు. కాంగ్రెస్ హయాంలో జలయజ్ఞం కాస్త ధనయజ్ఞంగా మారిందని ధ్వజమెత్తారు. టీఆర్ఎస్ఎల్పీలో బుధవారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ మొబిలైజేషన్ అడ్వాన్స్‌ల పేరిట కాంట్రాక్టర్లను మేపింది కాంగ్రెస్ నేతలు కాదా? రాజకీయ నాయకులే కాంట్రాక్టర్లుగా అవతారమెత్తింది కాంగ్రెస్ హయాంలో కాదా? అని ప్రశ్నించారు. కాంగ్రెస్ నేతలు 15 ఏండ్లు కుర్చీని వదిలి ఉండలేరా అని ఆయన నిప్పులు చెరిగారు. రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధిని, సీఎం కేసీఆర్‌కు పెరుగుతున్న ఆదరణను చూసి కాంగ్రెస్ నేతలు, ప్రాజెక్టులను అడ్డుకోవాలని చూస్తున్నారని ఆరోపించారు. తమకు తాము సీఎం అభ్యర్థులుగా ఊహించుకుంటున్న కాంగ్రెస్ నేతలు అదే పనిగా ప్రభుత్వంపై దుష్ప్రచారం చేస్తున్నారన్నారు. ఉత్తమ్, జీవన్‌రెడ్డిలకు దమ్ముంటే ఎమ్మెల్యే పదవులకు రాజీనామా చేసి గత ఎన్నికల మెజారిటీని సాధించుకోగలరా? అని సవాల్ విసిరారు.

అభివృద్ధికి అడ్డు.. మూడు ముఠాలు

■ వాటికి సహకరిస్తూ ప్రభుత్వాన్ని బద్నాం చేస్తున్న కోదండరాం

■ అబద్ధాల చిట్టాతో ప్రొఫెసర్ ఢిల్లీలో సంచరిస్తున్నారు

■ ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్ ఫైర్



హైదరాబాద్, నమస్తే తెలంగాణ: అభివృద్ధిని అడ్డుకునే ముఠా, కోర్టుల్లో కేసులు వేసే ముఠా, ఏ ఘటన జరిగినా దానిని ప్రభుత్వ వైఫల్యంగా ఆరోపించే ముఠా.. ఇలా రాష్ట్రంలో మూడుముఠాలు పనిచేస్తున్నాయని టీఆర్ఎస్ ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్ విమర్శించారు. వీటికి ప్రత్యక్షంగా, పరోక్షంగా కోదండరాం సహకరిస్తూ ప్రభుత్వాన్ని అభాసుపాలు చేసేందుకు యత్నిస్తున్నారని మండిపడ్డారు. ఆయన రాష్ట్ర ప్రభుత్వాన్ని బద్నాం చేయాలని ఢిల్లీలో అబద్ధాల చిట్టాతో సంచరిస్తున్నారని ఆయన ఆరోపించారు. బుధవారం హైదరాబాద్‌లో టీఆర్ఎస్ఎల్పీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ ఢిల్లీలో ప్రొఫెసర్ అబద్ధాలతో ఎవరినీ మెప్పించలేరని, అప్పులు తీర్చగలిగే వారికే ఎవరైనా అప్పులు ఇస్తారని, దేశంలో మిగతా రాష్ట్రాలు అప్పులు చేయడంలేదా? అని ఆయన ప్రశ్నించారు. ఎఫ్ఆర్‌బీఎం చట్టానికి లోబడే అప్పులు తెస్తున్నామన్న విషయం ఆయనకు తెలియదా? ఎలాంటి తెలంగాణ కావాలో కోదండరాం స్పష్టం చేయాలన్నారు. అభివృద్ధి కావాలంటే అప్పులు చేయక తప్పదని, అంబానీ సోదరులకు సైతం భారీ అప్పుఉందని, అమెరికా కూడా 19 ట్రిలియన్ డాలర్ల అప్పులో ఉన్న విషయం మరువకూడదని సూచించారు. బీజేపీ పాలిత రాష్ట్రాలు, చివరకు ఆయన అభిమానించే కాంగ్రెస్ పాలిత రాష్ట్రం కర్ణాటకకు కూడా భారీగా అప్పులున్నాయన్నారు. తెలంగాణలో అబద్ధాలు చెప్పి విఫలమైన ఆయన, ఢిల్లీలో అవే సిద్ధమయ్యారని అన్నారు. మేధావులతో అబద్ధాలు చెప్పిస్తూ ఆయన ఓ పార్టీ ఎజెండాను మోస్తున్నారని కర్నె ప్రభాకర్ ఆరోపించారు. అప్పులు లేనిది అభివృద్ధి సాధ్యమా? విషప్రచారం మానుకుంటే మంచిదని ఆయనకు హితవు పలికారు. ప్రాజెక్టుల అవినీతిపై మాట్లాడుతున్న మల్లు భట్టి విక్రమార్కతో సహా కాంగ్రెస్ నేతలంతా ఒక్కఆధారం అయినా బయటపెట్టారా? అని కర్నె ప్రశ్నించారు. ప్రాజెక్టుల టెండర్లు ఈ-ప్రొక్యూర్‌మెంట్ ద్వారా పారదర్శకంగా జరుగుతున్నాయని అన్నారు. ఆయా రాష్ట్రాల బడ్జెట్, అప్పులకు సంబంధించిన వివరాలను ప్రభాకర్ మీడియాకు వెల్లడించారు.

వివిధ రాష్ట్రాల బడ్జెట్ 2016-17- అప్పులు

రాష్ట్రం పేరు	మొత్తం బడ్జెట్(కోట్లలో)	2016-17 అప్పులు(కోట్లలో)
గుజరాత్	రూ. 1,51,852	రూ.1,65,742
మహారాష్ట్ర	రూ. 2,56,992	రూ.3,56,212
మధ్యప్రదేశ్	రూ. 1,58,713	రూ. 1,11,000
ఆంధ్రప్రదేశ్	రూ. 1,35,689	రూ. 1,90,513
తమిళనాడు	రూ. 1,48,175.09	రూ. 2,52,000
కర్ణాటక	రూ. 1,63,419	రూ. 1,75,623 (2015-16 అప్పులు)

శంషాబాద్ ఎయిర్‌పోర్టులో 'ఓజోన్ సేఫ్' ఏసీలు

శంషాబాద్: శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయంలోని ప్రధాన కార్యాలయాల్లో 'ఓజోన్ సురక్షిత (ఓజోన్ సేఫ్) ఎయిర్ కండీషనర్ల'ను అమర్చుతున్నారు. ఇప్పటి వరకు 80 శాతం పనులు పూర్తయినట్టు ఎయిర్‌పోర్ట్ కమ్యూనికేషన్ అధికారులు బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ప్రస్తుతం ఉన్న సంప్రదాయ ఏసీ యూనిట్ల స్థానంలో 300 ఓజోన్ సేఫ్ యూనిట్లను అమర్చుతున్నట్టు చెప్పారు. సాధారణ ఏసీల నుంచి వెలువడే ఉద్గారాలు ఓజోన్ పొరకు హాని కలిగిస్తాయని, ఓజోన్ సేఫ్ ఏసీలతో ఆ ప్రమాదం చాలావరకు తగ్గుతుందని, మరోవైపు దాదాపు 50 శాతం విద్యుత్ ఆదా అవుతుందన్నారు. ఎయిర్‌పోర్ట్ నుంచి ప్రతిరోజు దాదాపు 40 వేల మంది ప్రయాణిస్తున్నారని, వారి సౌకర్యార్థం ఏసీలు పెట్టించామన్నారు. పర్యావరణ హితానికి సంబంధించి ఎయిర్‌పోర్ట్‌లో జాతీయ, అంతర్జాతీయ ప్రమాణాలు పాటిస్తున్నామని ఎయిర్‌పోర్టు సీఈవో ఎస్‌జీకే కిశోర్ పేర్కొన్నారు. ఇందులో భాగంగానే ఓజోన్ సేఫ్ ఏసీలు అమర్చామని, ఇప్పటికే 5 మెగావాట్ల సౌర విద్యుత్ ప్లాంటు ఏర్పాటు చేశామన్నారు. ఎయిర్‌పోర్ట్‌లో వందశాతం ఎల్ఈడీ విద్యుత్ దీపాలు ఉపయోగిస్తూ విద్యుత్‌ను ఆదా చేస్తున్నామని వివరించారు.



బుధవారం పెద్దపల్లి జిల్లా రాఘవాపూర్‌లో నిర్వహించిన ప్రజాభిప్రాయ సేకరణ సభలో రైతుల పైకి కుర్చీలు విసురుతున్న కాంగ్రెస్ నాయకులు ..



ప్రజాభిప్రాయ సేకరణ సభలో కాళేశ్వరం ప్రాజెక్టుకు చేతులెత్తి మద్దతు తెలియజేస్తున్న ప్రజలు, రైతులు

కాళేశ్వరంపై కాంగ్రెస్ పగ

మొదటిపేజీ తరువాయి...

అభిప్రాయాలను వివరిస్తున్న క్రమంలో మధ్యాహ్నం 12.30 గంటలకు కాంగ్రెస్ నేత శ్రీధర్‌బాబు తన అనుచరులతో అక్కడికి వచ్చి ప్రభుత్వానికి, ముఖ్యమంత్రికి వ్యతిరేకంగా నినాదాలుచేశారు. వెంటనే అక్కడ ఉన్న టీఆర్ఎస్ నాయకులు ప్రభుత్వానికి అనుకూలంగా నినాదాలుచేశారు. రెచ్చిపోయిన కాంగ్రెస్ నాయకులు రైతులపై, టీఆర్ఎస్ కార్యకర్తలపై కుర్చీలు విసురుతూ హంగామా సృష్టించారు. పరిస్థితి చేయిదాటి పోతున్నదని భావించిన పోలీసులు కాంగ్రెస్ నాయకులను అదుపులోకి తీసుకొని ఠాణాకు తరలించారు. వీరి హంగామా ఎలా ఉన్నా.. పెద్దపల్లి రైతులు, ప్రజలు మాత్రం కాళేశ్వరం ప్రాజెక్టుకు జై కొట్టారు. మెజార్టీ రైతులు, ప్రజలు ప్రాజెక్టుకు అనుకులంగా మద్దతు తెలిపారని, ప్రజాభిప్రాయ సేకరణ పూర్తి కావడంతో నివేదికను ప్రభుత్వానికి అందజేస్తామని ఇన్‌చార్జి కలెక్టర్ ప్రకటించారు.

ఏం మాట్లాడాలో తెల్వక...

తెలంగాణ సాగునీటి ప్రాజెక్టులపై సీఎం కేసీఆర్ గతంలో శాసనసభ వేదికగా పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చారు. కానీ.. ప్రధాన ప్రతిపక్షంగా ఉన్న కాంగ్రెస్.. పలాయనం చిత్తగించింది. అక్కడే కాదు.. రాష్ట్రంలో ఏ మారుమూలన కూడా ప్రాజెక్టులపై మాట్లాడేందుకు కాంగ్రెస్ నాయకులు సాహసించని పరిస్థితి ఉంది. తెలంగాణ ప్రయోజనాలకు అనుగుణంగా, శరవేగంగా ప్రాజెక్టుల నిర్మాణం జరుగుతుండటంతో ఏం మాట్లాడాలో తెల్వకపోవడమే దీనికి కారణమనే అభిప్రాయాలున్నాయి. అందుకే చర్చకు బదులు కాంగ్రెస్ రచ్చను ఎంచుకుందని తెలంగాణవాదులు మండిపడుతున్నారు. ఈ క్రమంలోనే పెద్దపల్లిలో మాజీ మంత్రి శ్రీధర్‌బాబు తన అనుచరులతో ప్రజాభిప్రాయ సేకరణను భగ్నం చేసేందుకు ప్రయత్నించారని ఆరోపిస్తున్నారు. శ్రీధర్‌బాబుగానీ, ఆయన వెంట పెట్టుకొచ్చిన 300 మంది అనుచరులుగానీ స్వేచ్ఛగా ప్రాజెక్టుపై మాట్లాడే అవకాశం ఉంది. ఎవరైనా వేదికపైకి వచ్చి అభిప్రాయాన్ని వ్యక్తం చేయవచ్చని పెద్దపల్లి ఇన్‌చార్జ్ కలెక్టర్ ప్రభాకర్‌రెడ్డి పదేపదే మైకులో కోరినా.. రచ్చ చేయడానికే కాంగ్రెస్ నేతలు మొగ్గుచూపారు. దీంతో పోలీసులు జోక్యం చేసుకోవాల్సి వచ్చింది. మొత్తంగా ఓ పదిహేను నిమిషాల పాటు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు రచ్చ చేయగలిగారే తప్ప ఏం సాధించలేకపోయారన్న అభిప్రాయాలు వినిపించాయి. ఘటన తర్వాత తిరిగి 1.10 గంటలకు మళ్లీ సభ మొదలైంది. మధ్యాహ్నం మూడు గంటల వరకు ప్రశాంతంగా సాగింది. వాస్తవంగా అక్కడ మాట్లాడేందుకు 60 మంది పేర్లు ఇచ్చారు. మధ్యాహ్నం 3 గంటల వరకు 25 మంది అభిప్రాయాలు చెప్పారు. ప్రాజెక్టు నిర్మాణంతో పర్యావరణ సమతుల్యతకు ఎలాంటి నష్టం లేదని తెలిపారు. ఈ ప్రాజెక్టుతో ఒక్క సాగు మాత్రమే కాదు అనేక రకాల ప్రయోజనాలు ఉన్నాయని చెప్పారు. భూగర్భ నీటిమట్టాలు పెరుగడంతోపాటు, నీటి పారుదల సౌకర్యం మెరుగుపడుతుందని, తాగునీటి, పారిశ్రామిక నీటి అవసరాలు తీరుతాయని, పంటసాగు విస్తీర్ణం పెరుగుతుందని చెప్పారు. నిర్మాణ సమయంలో స్థానికులకు ఉపాధి కలుగుతుందని, ఏడాది పొడవునా చేపల ఉత్పత్తితో పాటు అనేక ప్రయోజనాలతో తెలంగాణలోని సబ్బండ వర్ణాలు సంబురపడుతాయని రైతులు, ప్రజలు, పర్యావరణ నిపుణులు, రిటైర్డ్ ఇంజనీర్లు తమ తమ అభిప్రాయాలను వ్యక్తపరిచారు. ప్రజాభిప్రాయ సేకరణకు పెద్దపల్లి ఎంపీ బాల్క సుమన్, ఐడీసీ చైర్మన్ ఈద శంకర్‌రెడ్డి, ఎమ్మెల్సీ భానుప్రసాద్‌రావు, పెద్దపల్లి ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి, మంథని ఎమ్మెల్యే పుట్ట మధు, పలువురు ప్రజాప్రతినిధులు హాజరై కాళేశ్వరం ప్రాజెక్టులకు మద్దతు తెలిపారు. కాళేశ్వరం ప్రాజెక్ట్‌తో పర్యావరణానికి ఎలాంటి ముప్పులేదని సభలో పాల్గొన్న నీటిపారుదల శాఖ రిటైర్డ్ సీఈ కృష్ణమూర్తి స్పష్టంచేశారు. బరాజ్ నిర్మాణానికి మహారాష్ట్ర ప్రభుత్వంతో చేసుకున్న ఒప్పందం చారిత్రాత్మకమైనదని అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టుతో పర్యావరణ సమతుల్యత పెరుగుతుందని తెలిపారు. ఆ తర్వాత మిగిలిన వారు తాము ప్రాజెక్టు నిర్మాణానికి మద్దతిస్తున్నామని ముక్తకంఠంతో చెప్పడంతో జిల్లా కలెక్టర్ సభను ముగించారు.

జీర్ణించుకోలేక పోతున్న కాంగ్రెస్!

కాళేశ్వరం ప్రాజెక్టుపై నిబంధనల ప్రకారం నిర్వహిస్తున్న ప్రజాభిప్రాయ సేకరణలు ప్రశాంతంగా, సానుకూలంగా కొనసాగుతుంటే కాంగ్రెస్ నేతలు జీర్ణించుకోలేక పోతున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రజామద్దతును ముందుగానే గుర్తించిన కాంగ్రెస్ నాయకులు.. ప్రజాభిప్రాయ సేకరణను అడ్డుకునేందుకుగాను ఆ పార్టీ నాయకుడు మర్రి శశిధర్‌రెడ్డిని కేంద్ర పర్యావరణ మంత్రిత్వ శాఖ దగ్గరికి పంపారు. అక్కడ కాంగ్రెస్‌కు ప్రతికూల పరిణామాలు ఎదురవడం, మరోవైపు పలు జిల్లాల్లో సభల్లో రైతులు, ప్రజల మద్దతు లభిస్తుండటంతో కాంగ్రెస్‌కు దిక్కు తోచడం లేదన్న అభిప్రాయాలు ఉన్నాయి. ప్రజాక్షేత్రంలో వరుసగా పరాభవాలు ఎదురవుతున్నా.. ఆ పార్టీ నేతల్లో మాత్రం కించిత్తు తెలంగాణ సోయి రాకపోవడం అందరినీ విస్మయానికి గురి చేస్తున్నదని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు.

అడ్డుకోవడమే పరమావధిగా..

కాళేశ్వరం ఎత్తిపోతల పథకం ఎప్పుడు పూర్తవుతుందా? అని తెలంగాణ సమాజం ఎదురుచూస్తుంటే... దానిని ఎలా అడ్డుకోవాలి? అని కాంగ్రెస్ నేతలు కిందా మీదా పడుతున్నారని పలువురు రైతులు మండిపడుతున్నారు. సీఎం కేసీఆర్ పట్టుదలతో వచ్చే ఏడాది వానాకాలం పంట సీజన్ నాటికి కాళేశ్వరం నీటిని బీడు భూములకు పారించాలని కంకణం కట్టుకున్నారు. అందుకు అనుగుణంగా పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఈ ప్రాజెక్టు పూర్తయితే తమకు రాజకీయంగా అడ్రస్ గల్లంతవుతుందని ఏనాడో కాంగ్రెస్ గుర్తించిందన్న అభిప్రాయాలున్నాయి. అందుకే అనేక మార్గాల్లో ప్రాజెక్టును అడ్డుకునేందుకు ఆ పార్టీ నేతలు శతవిధాలా ప్రయత్నిస్తున్నా.. అవన్నీ వికటిస్తున్నాయి. గతంలో మల్లన్నసాగర్ రిజర్వాయర్ విషయంలో రాద్ధాంతంచేశారు. కానీ రైతులు కాంగ్రెస్ నాయకుల దుర్మార్గాన్ని గుర్తించడంతో వారికి పరాభవం తప్పలేదు. ఆ తర్వాత చనిపోయినవారి పేరిట కోర్టుల్లో కేసులువేశారు. హైకోర్టు మొదలు సుప్రీంకోర్టు వరకు వెళ్లినా, జాతీయ హరిత ట్రిబ్యునల్ తలుపు తట్టినా.. ఫలితం లేకపోయింది. తాజాగా నిబంధనల ప్రకారం కేంద్ర పర్యావరణ, అటవీ శాఖ పర్యావరణ ప్రభావ అంచనా (ఈఐఏ) కోసం ప్రజాభిప్రాయ సేకరణకు రంగం సిద్ధమవడంతో దానినీ అడ్డుకునే నీచానికి కాంగ్రెస్ నాయకులు ఒడిగట్టారని టీఆర్ఎస్ నేతలు మండిపడుతున్నారు.



కాళేశ్వరం ప్రాజెక్టుకు సంపూర్ణ మద్దుతు వచ్చినట్లు ప్రకటిస్తున్న ఇన్‌చార్జి కలెక్టర్ ప్రభాకర్‌రెడ్డి



సభలో అభిప్రాయాన్ని వెల్లడిస్తున్న రిటైర్డ్ సీఈ కృష్ణమూర్తి

స్వేచ్ఛగా.. ప్రశాంతంగా..

కాళేశ్వరం ప్రాజెక్టుపై ప్రజాభిప్రాయ సేకరణ కోసం కాలుష్య నియంత్రణ మండలి, జిల్లా యంత్రాంగాలు ఈ నెల 22 నుంచి 26 వరకు 15 జిల్లాల్లో సభలు నిర్వహిస్తున్నది. గత రెండ్రోజులుగా ఎనిమిది జిల్లాల్లో సభలు నిర్వహించారు. తొలిరోజు నిజామాబాద్, కరీంనగర్, యాదాద్రి-భువనగిరి, మేడ్చల్ జిల్లాల్లో ఈ సభలు జరిగాయి. అన్నిచోట్లా రైతులు, మేధావులతోపాటు సామాన్య ప్రజలు సైతం ఈ ప్రాజెక్టును చేపట్టాల్సిందేనంటూ ముక్తకంఠంతో నినదించారు. సంగారెడ్డి, కామారెడ్డి, నల్లగొండ, పెద్దపల్లి జిల్లాల్లో బుధవారం సభలు నిర్వహించారు. కామారెడ్డిలో ఏకంగా 75 మంది స్వేచ్ఛగా తమ అభిప్రాయాల్ని తెలిపారు. మరో 106 మంది లిఖితపూర్వకంగా వినతులు ఇచ్చారు. ఇందులో అందరూ ప్రాజెక్టుకు మద్దతుగానే తమ వాణిని వినిపించారు. నష్టపరిహారం విషయంలో ఒకరిద్దరు డిమాండ్లు వినిపించారు. తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి పశ్య పద్మ వాస్తవంగా నల్లగొండ జిల్లాకు చెందినవారు. అయినా ఆమె సంఘం ప్రధాన కార్యదర్శి హోదాలో కామారెడ్డిలో సభకు వెళ్లారు. అధికారులు ఆమెకు సుమారు 15 నిమిషాలపాటు మాట్లాడేందుకు అవకాశం కల్పించారు. ఆమెతోపాటు కాంగ్రెస్ పార్టీకి చెందిన కామారెడ్డి నియోజకవర్గ ముఖ్య నాయకులు ముగ్గురు కూడా మాట్లాడారు. ఇక్కడే కాదు.. పెద్దపల్లి సభలోనూ సీపీఐ నేత, మాజీ ఎమ్మెల్యే గుండా మల్లేశ్ మాట్లాడారు. నల్లగొండ జిల్లా చిట్యాల సభలో 50 మంది మాట్లాడగా.. అందులో అన్ని పార్టీల నాయకులు, ప్రజా సంఘాల నాయకులు, సామాన్య రైతులు, మేధావులు ఉన్నారు. సంగారెడ్డిలో 30 మంది మాట్లాడితే అందులోనూ సీపీఐ, సీపీఎం నాయకులు, రైతు సంఘాల నాయకులు ఉన్నారు. ఇప్పటివరకు ఎనిమిది జిల్లాల్లో జరిగిన సభలో అధికారులు వీలైనంత మేరకు అందరికీ మాట్లాడే అవకాశం ఇచ్చారు. ప్రతిచోటా సభలు ప్రశాంతంగా ముగిశాయి.

కాంగ్రెస్ పార్టీ డ్రామాలు ఆపాలి



అరవై ఏండ్లుగా దగాపడ్డ తెలంగాణ రైతుల కన్నీళ్లు తుడువడానికి ముఖ్యమంత్రి కేసీఆర్ కోటి ఎకరాల మాగాణే లక్ష్యంగా ప్రాజెక్టుల రీడిజైనింగ్ చేస్తే.. కాంగ్రెస్ నాయకులు భవిష్యత్‌లో స్థానం ఉండదని భయపడి.. ప్రజాభిప్రాయ సేకరణలో డ్రామాలాడుతున్నారు. ఇలాంటి పనులుచేయడం వల్ల కాంగ్రెస్ పార్టీని ప్రజలు అసహ్యించుకునే పరిస్థితి ఏర్పడింది. ప్రాజెక్టుల నిర్మాణంతో సమస్యలుంటే విలువైన సలహాలు, సమస్యలు చెప్పాలి తప్ప ఇలా చిల్లర పనులుచేసి, ప్రాజెక్టులను అడ్డుకోవడానికి ప్రయత్నించడం వారి అవివేకం.

- బాల్క సుమన్, పెద్దపల్లి ఎంపీ

ప్రాజెక్టులు వద్దనుకుంటున్న కాంగ్రెస్



ఆరు దశాబ్దాల సమైక్యపాలనలో అనేక కష్టాలు అనుభవించాం. స్వరాష్ట్రంలో ప్రాజెక్టుల నిర్మాణం పూర్తయితే తమ కష్టాలు పోతాయని రైతులు భావిస్తుంటే కాంగ్రెస్ నాయకులు మాత్రం ప్రాజెక్టులు కట్టవద్దని కోరుకుంటున్నారు. సబ్బండవర్ణాలు సంతోషంగా ఉండడం కాంగ్రెస్‌కు ఇష్టంలేదు. ప్రాజెక్టులు ఎందుకు వద్దో కాంగ్రెస్ నాయకులు ప్రజలకు చెప్పాలి. అభిప్రాయం చెప్పకుండా పత్రికల్లో కవరేజ్ కోసం ఫోటోల కోసమే ఇలా వ్యవరిస్తున్నారు.

- పుట్ట మధు, మంథని ఎమ్మెల్యే

నంద్యాల పోలింగ్ @ 82%

రికార్డు స్థాయిలో నమోదైన ఓటింగ్.. ప్రశాంతంగా ముగిసిన ఉపఎన్నిక

నంద్యాల పట్టణంలో స్వల్ప ఉద్రిక్తతలు.. కోడ్ ఉల్లంఘనపై జగన్, సాక్షి టీవీలపై కేసులు

గెలుపుపై ఇరుపార్టీల్లో ధీమా.. 28న ఓట్ల లెక్కింపు



బుధవారం నంద్యాలలో జరిగిన ఉప ఎన్నికలో పోలింగ్ కేంద్రంవద్ద బారులు తీరిన ఓటర్లు

హైదరాబాద్, నంద్యాల, జోగుళాంబ గద్వాల, నమస్తే తెలంగాణ ప్రతినిధి: నంద్యాల ఉపపోరులో కీలకమైన ఎన్నికల ఘట్టం ముగిసింది. అక్కడక్కడా చెదురుమదురు సంఘటనలు మినహా పోలింగ్ ప్రక్రియ ప్రశాంతంగా జరిగింది. గతంలో ఎప్పుడూ లేనంతగా 82శాతం పోలింగ్ నమోదయ్యే అవకాశం ఉన్నట్టు ఎన్నికల ప్రధాన అధికారి భన్వర్‌లాల్ తెలిపారు. ఉదయం 7 గంటల నుంచే ఓటర్లు పోలింగ్ కేంద్రాల దగ్గర బారులుతీరారు. సాయంత్రం వరకు ప్రశాంతంగా కొనసాగిన పోలింగ్ ప్రక్రియ మరో గంటలో ముగుస్తుందనగా.. నంద్యాల పట్టణంలో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. నందమూరినగర్ బూత్ నంబర్ 18లో ఈవీఎంలు మొరాయించడంతో పోలింగ్ ఆలస్యమైంది. ఈ ఎన్నికల్లో మహిళలు ఎక్కువ సంఖ్యలో ఓటుహక్కును వినియోగించుకోవడం విశేషం. ఎన్నికలు ముగిసే సమయంలో పలుచోట్ల టీడీపీ, వైసీపీ నేతల మధ్య ఘర్షణలు చోటుచేసుకున్నాయి. పట్టణంలోని ఏడో వార్డు ఎన్టీఆర్ షాదీఖానా పోలింగ్‌బూత్‌లో దొంగ ఓట్లు వేస్తున్నారంటూ వైసీపీ నేతలు ఓటింగ్‌ను అడ్డుకోవడంతో టీడీపీ అభ్యర్థి బ్రహ్మానందారెడ్డి, ఆపార్టీ నేతలు ఏవీ సుబ్బారెడ్డి, భూమా నాగిరెడ్డి కుమార్తె మౌనిక, వైసీపీ అభ్యర్థి శిల్పా మోహన్‌రెడ్డి, ఆయన సోదరుడు చక్రపాణిరెడ్డి అక్కడికి చేరుకున్నారు. దీంతో అక్కడ ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్నాయి. మైనార్టీ నేతలు అబ్దుల్ కలాం, రహీంపై దాడి జరిగిందని వైసీపీ నేతలు ఆందోళనకు దిగారు. వైసీపీ అభ్యర్థి వాహనం వద్దకు టీడీపీ అభ్యర్థి బ్రహ్మానందారెడ్డి, ఆయన అనుచరులు వెళ్లడంతో ఇరువర్గాల మధ్య ఘర్షణ వాతావరణం నెలకొంది. రాయలసీమ ఐజీ ఇక్బాల్ అక్కడకు చేరుకుని పరిస్థితి చక్కదిద్దారు. నంద్యాల టౌన్ ఒకటో వార్డులో 10 మంది, నందమూరినగర్‌లో 45 మంది, వైఎస్సార్‌నగర్‌లో 30 మంది దొంగ ఓట్లు వేస్తున్నారనే అనుమానంతో పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. 255 పోలింగ్ కేంద్రాల్లో 141 కేంద్రాలను సమస్యాత్మకమైనవని గుర్తించినా.. ఆయా కేంద్రాల్లో పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. పోలింగ్ రోజున కూడా పలు కేంద్రాలవద్ద పార్టీలు ఓటుకు రూ.రెండు నుంచి నాలుగు వేలు పంపిణీ చేసినట్టు తెలుస్తున్నది.

గెలుపుపై ధీమా..

పోలింగ్ శాతం భారీగా పెరుగడంతో రెండు ప్రధాన పార్టీల అభ్యర్థులు గెలుపుపై ధీమాతో ఉన్నాయి. ఇరు పార్టీలు తమకే కలిసివస్తుందనే ఆశతో ఉన్నారు. మైనార్టీ, ఎస్సీ, బలిజల ఓట్లు ఎక్కువగా పోలైనట్లు భావిస్తున్నారు. గతంలో గోస్పాడ్ మండలంలో వైసీపీకి ఎక్కువగా ఆధిక్యం రావడంతో ఈసారి కూడా తమకే మెజార్టీ వస్తుందని ఆశిస్తున్నారు. నంద్యాల రూరల్ లోనూ తమకే అనుకూలంగా ఉందనే ఆశతో ఉన్నారు. నంద్యాల పట్టణంపై టీడీపీ భారీగా ఆశలు పెట్టుకున్నది. గతంలో మాదిరిగానే పట్టణంలో తమకు ఆధిక్యం లభిస్తుందని ఆ పార్టీ నేతలు భావిస్తున్నారు.

82 శాతం పోలింగ్ నమోదయ్యే అవకాశం: భన్వర్‌లాల్

2014 సాధారణ ఎన్నికలకంటే ఈ ఎన్నికలో భారీగా ఓటింగ్ నమోదైందని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి భన్వర్‌లాల్ పేర్కొన్నారు. 2009 సాధారణ ఎన్నికల్లో 76 శాతం, 2014లో 72.08 శాతం పోలింగ్ నమోదవగా.. ప్రస్తుత ఉపఎన్నికలో మధ్యాహ్నం 3 గంటల వరకు 71.91 శాతం, సాయంత్రం 5 గంటల వరకు 77.66శాతం పోలింగ్ నమోదయ్యిందని ఆయన తెలిపారు. సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్ కేంద్రాల వద్ద లైన్లో ఉన్నవారికి ఓటు వేసే అవకాశం కల్పించామని చెప్పారు. వీరితో కలుపుకొంటే మరో ఐదు శాతం ఓటింగ్ పెరిగే అవకాశం ఉందని, 82శాతం ఓటింగ్ నమోదయ్యే అవకాశం ఉన్నట్టు పేర్కొన్నారు. 80శాతం ఓటింగ్ నమోదైనట్లు పీటీఐ వార్తా సంస్థ పేర్కొన్నది. నంద్యాల పట్టణంలో 67.60, నంద్యాల రూరల్‌లో 81.10, గోస్పాడ్‌లో 81.14, నంద్యాల అర్బన్‌లో 67.60 శాతం ఓటింగ్ నమోదైంది. పోలింగ్ సందర్భంగా విధి నిర్వహణలో ఒక కానిస్టేబుల్ మృతి చెందారని, ఆయన కుటుంబానికి రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించినట్టు భన్వర్‌లాల్ తెలిపారు. ఓట్ల లెక్కింపు ఈనెల 28న ఉదయం 8 గంటలకు ప్రారంభమవుతుందని చెప్పారు

నంద్యాలలో వైఎస్ జగన్‌పై కేసు

నంద్యాల ఉపఎన్నికల ప్రచారంలో ఏపీ సీఎం చంద్రబాబుపై అనుచిత వ్యాఖ్యలు చేసిన ప్రతిపక్ష నేత వైఎస్ జగన్‌పై నంద్యాల మూడో పట్టణ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదయ్యింది. ఎన్నికల ప్రచారంలో చంద్రబాబును కాల్చేయాలని, ఉరి తీయాలని జగన్ వ్యాఖ్యానించిన విషయం తెలిసిందే. దీనిపై టీడీపీ నాయకులు కేంద్ర ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేశారు. ఈసీఈ ఆదేశాల మేరకు నంద్యాల పోలీసులు ఐపీసీ సెక్షన్లు 188, 504, 506, ప్రజాప్రాతినిధ్య చట్టం 125 ప్రకారం జగన్‌పై కేసు నమోదు చేశారు. ఉపఎన్నికలకు సంబంధించిన ప్రసారాలలో సాక్షి టీవీ ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘించిందంటూ ఆ చానల్‌పై హైదరాబాద్ సీసీఎస్‌లో కేసు నమోదయ్యింది. రాష్ట్ర ఎన్నికల కమిషన్ ప్రధానఅధికారి భన్వర్‌లాల్ ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు డీసీపీ అవినాశ్‌మహంతి తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా ఉపఎన్నికలకు సంబంధించి ఎగ్జిట్‌పోల్స్‌ను సాక్షి టీవీ ప్రసారం చేసిందని ఎన్నికల కమిషనర్ ఫిర్యాదు మేరకు 126(1)(బి), 126(ఏ) సెక్షన్ల కింద కేసునమోదు చేసినట్టు డీసీపీ తెలిపారు.

నమస్తే తెలంగాణ

హైదరాబాద్
గురువారం 24 ఆగస్టు 2017

WWW. NTNEWS.COM



క్యాన్సర్‌ను జయించింది!

లావణ్య నాగరాజన్ 21 సంవత్సరాలున్నప్పుడు అనుకోకుండా మెడ నొప్పి.. శోషరస గ్రంథుల సమస్య రావడం ప్రారంభమైంది. వైద్యులను ఆశ్రయిస్తే థైరాయిడ్ క్యాన్సర్ అన్నారు.

కొన్నాళ్ల పాటు దవాఖానలోనే ఉంటూ రేడియో యాక్టిక్ ఐయోడిన్, ఐసోలేషన్ చికిత్స తీసుకోవాల్సి వచ్చింది. ఆత్మస్థైర్యంతో ఆ పరిస్థితిని అధిగమించింది లావణ్య. కష్ట సమయంలోనే నిజమైన బంధువు లెవరో, స్నేహితులెవరో తెలుస్తుందంటారు. ఆ విషయంలో లావణ్య ఎంతో అదృష్టవంతురాలు. బెస్ట్ ఫ్రెండ్ జస్టీన్‌తో పాటు కుటుంబసభ్యులు ఆమెకు అండగా నిలిచారు. ఇప్పుడు క్యాన్సర్ భయం లేదామెకు. ఎప్పటిలాగే జాబ్‌కు వెళ్తున్నది. ఇంటికి రాగానే తన పెంపుడు కుక్కలతో ఆడుకుంటున్నది. అల సటతో ఇంటికి వచ్చే తనకు అవి మరింత ఎనర్జీని ఇచ్చేందుకు సిద్ధంగా ఉంటాయి. జీవితం ముగిసిందనుకున్న దశలో గుండెనిబ్బరంతో థైరాయిడ్ క్యాన్సర్‌తో పోరాడి గెలిచింది లావణ్య. తనలా క్యాన్సర్‌తో బాధపడేవారికి ఆదర్శంగా నిలిచింది.

సినిమాకు ప్రేరణనిచ్చింది!

టాయిలెట్.. ఏక్ ప్రేమ్ కథ సినిమా ఈరోజు వంద కోట్ల క్లబ్బు లో చేరి అందరి ఆదరాభిమానాలు సంపాదించుకుంటున్నది. ఈ సినిమాకు ప్రేరణనిచ్చింది మధ్యప్రదేశ్‌కి చెందిన అనితా బాయ్ నర్రే.

ఈ కథకి మూలం అనిత జీవితమే. పక్క ఫొటోలో ఈ సినిమా హీరోయిన్ భూమి పెండేన్కర్‌తో పాటు ఉన్న మహిళే అనిత. కుటుంబంతో కలిసి సినిమాకి వెళ్లిన అనితని థియేటర్ ఓనర్ సాదరంగా ఆహ్వానించి మరీ సినిమా చూపించాడట. తెర మీద తన కథని చూసుకోవడం ఎంతో సంతోషంగా ఉందంటున్నది అనిత. ఆ సినిమా హీరోయిన్ కూడా అనితని కలువడం ఎంతో ఆనందంగా ఉందంటున్నది. మధ్యప్రదేశ్‌లోని బీటుల్ జిల్లా జితుధనలో అనిత నివాసం. పెళ్లయ్యాక అత్తామామల ఇంట్లో మరుగుదొడ్డి లేదని వారిపై వ్యతిరేకంగా పోరాడింది. అలా 2011లో అనిత రాత్రికి రాత్రి సెలబ్రిటీ అయిపోయింది. ఆమె పోరాట ఫలితం ఆమెను దేశం గుర్తించేలా చేసింది. ఆ జిల్లా అధికారులు మరుగుదొడ్డి కట్టించారు. అంతేకాదు.. అప్పటి రాష్ట్రపతి ప్రతిభా పాటిల్ చేతుల మీదుగా సులభ్ ఇంటర్నేషనల్ ఫౌండేషన్ ఐదు లక్షల నగదు ఇప్పించింది.



జిందగీ పేజీ పై మీ అభిప్రాయాలు, సలహాలు తెలియజేయండి.

zindagi@ntdaily.news
www.ntzindagi.com
/nt.zindagi



మనీ మ్యాటర్స్
for women

ఏదైనా కొత్తగా
చేయాలంటే ఆలోచనా శక్తి కావాలి..
ఆలోచన వచ్చినా అది అందరూ మెచ్చేలా
ప్రత్యేకతను కలిగినదై ఉండాలి..
ఆ ఆలోచనను ఆచరణలో పెట్టగలుగాలి..
మరి ఆ ఆలోచనలు ఎక్కణ్నుంచొస్తాయ్?
కొన్నిసార్లు నిత్య జీవితంలో ఎదురయ్యే
సంఘటనల నుంచే అవి ఉద్భవిస్తాయ్..
ఆదాయానికి అవసరమైన మార్గాన్ని చూపిస్తాయ్..
ముఖ్యంగా ఇంటి పట్టున ఉండే ఎందరో గృహిణులకు
మంచి వ్యాపకంగానూ మారుతాయ్..
ఆర్థికంగా ఆసరా అవుతాయ్..
అలాంటి ఐడియాతో మీ
ముందుకు తీసుకొచ్చింది
ఈ వారం మనీమ్యాటర్స్.

పల్లిపట్టీతో ఆదాయం పట్టు

ఇంట్లో పిల్లలు అల్లరి చేసినా, ఏడ్చినా.. షాప్‌కు తీసుకెళ్లి పల్లిపట్టీలను కొనిచ్చేది శ్రావణి. ఒకటి కాదు, రెండు కాదు.. కొన్నేళ్ల పాటు ఇలాగే చేసింది. అప్పుడు ఆమె మెదడులో మెరుపు లాంటి ఆలోచన. 'ఎట్లాగో ఇంటి దగ్గర ఖాళీగా ఉంటున్నా కదా! ఆయన, పిల్లలు వెళ్లిపోయాక పనేం ఉంటుంది? ఆ సమయంలో ఈ పల్లిపట్టీ (చిక్కీ)లను నేనే ఎందుకు తయారుచేయకూడదు?' అనుకున్నది. అనుకున్నదే తడువు భర్తతో చర్చించి.. వ్యాపారాన్ని ప్రారంభించింది. విజయం సాధించి తోటి మహిళలకు ఆదర్శంగా నిలిచింది.

చింతలేని వ్యాపారం

పల్లిపట్టీల తయారి చిన్న వ్యాపారమే కాదు, చింతలేని వ్యాపారం కూడా. దీంట్లో ఆర్డర్లను బట్టి ఉత్పాదకతను పెంచుకోవాల్సి ఉంటుంది. టేస్టీగా ఉండి.. మార్కెట్‌లో మంచి పేరు సంపాదించగలిగితే ఆర్డర్లు అవే వస్తాయంటారు శ్రావణి. తాను కూడా మొదట్లో చిన్న సంఖ్యలో తయారు చేసేది. ఇప్పుడామె తయారు చేసే పల్లిపట్టీలకు మంచి డిమాండే ఉంది.



అందరికీ ఇష్టమే

బెల్లం, పల్లీలు, నువ్వులతో కలిపి పలు వెరైటీల్లో పల్లీ పట్టీలను తయారు చేయవచ్చు. ఎక్కువ మొత్తంలో అయితే డబ్బాల్లో ప్యాక్‌చేసి, కొద్దిగా అయితే చిన్నప్యాకెట్లలో ప్యాక్‌చేసి అమ్మవచ్చు. ఇవంటే చిన్నవాళ్ల నుంచి పెద్దల వరకు అందరికీ ఇష్టమే. కాబట్టి గిరాకీ తక్కువేం ఉండదు. కిరాణషాపుల్లో, పాన్‌షాపుల్లో బాగా అమ్ముడవుతాయి. ఈ మధ్య మాల్స్‌లోనూ ఈ పల్లీ పట్టీల ప్యాకెట్లు దర్శనమిస్తున్నాయి. కాబట్టి హోల్‌సేల్‌గా సప్లయి చేసుకోవచ్చు.

మంచి ఉపాధి మార్గం

మొదట్లో ఈ వ్యాపారాన్ని చిన్నగా ప్రారంభించినా తర్వాత ఆర్డర్లు పెరిగేకొద్ది.. విస్తరించాల్సి ఉంటుంది. అప్పుడు ప్రత్యేకంగా ఒక గదిని అద్దెకు తీసుకుని వీటిని తయారు చేయాల్సి ఉంటుంది. ఆర్డర్లు బాగా పెరిగితే ఈ పని ఒక్కరితో అయ్యేది కాదు. కాబట్టి సహాయకుల అవసరం ఉంటుంది. అలా మరి కొందరికి కూడా ఉపాధి మార్గం చూపవచ్చు. అయితే కుటుంబసభ్యుల సహకారం ఉంటే మాత్రం.. సహాయకుల్ని ప్రత్యేకంగా నియమించుకోవాల్సిన అవసరం ఉండదు. దానివల్ల వేతనాల ఖర్చును మిగుల్చుకునే అవకాశం ఉంటుంది. అదనపు ఆదాయం సమకూరుతుంది. సప్లయి చేసేందుకు ఒక వాహనాన్ని ఏర్పాటు చేసుకుంటే మరీ మంచిది.

సులువైన వ్యాపారం

పల్లిపట్టీలు తయారు చేయడమంటే ఇంట్లో వంటచేసినట్టుగానే ఉంటుంది. మొదట్లో ఇంటి పనులు చేసుకుంటూనే వీటిని తయారు చేసేదాణ్ని. గృహిణులకు ఎంతో సులువైన వ్యాపారం. ఆర్డర్లు పెరిగిన తర్వాత హెల్పర్‌ను నియమించుకున్నాను. వీటి తయారీ కోసమే ప్రత్యేకంగా ఒక గదిని ఏర్పాటు చేశాను. ఈ వ్యాపారంలో వచ్చిన ఆదాయంతో కుటుంబానికి ఆర్థికంగా ఆసరా ఇవ్వగలుగుతున్నా.

- శ్రావణి

టేస్టు చాలా ముఖ్యం

ఈ పల్లిపట్టీలను చతురస్రాకారంలోనూ, గుండ్రని ఉండలుగానూ తయారు చేసుకోవచ్చు. డిజైన్ ఎలా ఉన్నా టేస్టు మాత్రం అదిరిపోయేలా ఉండాలంటున్నారు సుజాత. ఆ టేస్టుతోనే ప్రోడక్ట్‌కు డిమాండ్ పెరుగుతుందంటున్నది. దానికోసం ముడిసరుకు సేకరించడంలో జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉంటుంది. మంచి బెల్లంతో పాటు అవసరమైన సామగ్రిని నాణ్యత చూసి ఎంచుకోవాల్సి ఉంటుంది. అప్పుడే నాణ్యమైన,రుచికరమైన చిక్కీలను తయారు చేయవచ్చు.

ఆరోగ్యం.. ఆదాయం

ఇవి కేవలం చిన్నపిల్లలు మారాం చేస్తే కొనిచ్చే స్వీట్స్ అనుకోవద్దు. వీటిని తినడం వల్ల పిల్లలకు అవసరమైన ప్రొటీన్లు, విటమిన్లు లభిస్తాయని డాక్టర్లు కూడా సూచిస్తున్నారు. అందుకే వీటిని శుభ్రమైన పరిసరాల్లో, నాణ్యతతో తయారు చేయడం చాలా ముఖ్యం. తయారీదార్ల ఆదాయానికే కాదు, కస్టమర్ల ఆరోగ్యానికీ ఇవి దోహదం చేస్తాయి. శరీరంలో చక్కెర స్థాయి తక్కువుగా ఉన్న వాళ్లు కూడా వీటిని ఎప్పుడూ తమవెంట పెట్టుకుంటున్నారు. పిల్లలకే కాదు, పెద్దలకూ వీటి అవసరం ఉందన్నమాట. కాబట్టి ఆరోగ్యకరమైన చిక్కీకి గిరాకీ ఏమాత్రం తగ్గదని చెప్పొచ్చు.

మీరూ ప్రారంభించొచ్చు..

స్థిర వ్యయాలు..

- హోమ్‌మేడ్ ఫుడ్స్ అయినప్పటికీ, ఎక్కువ సంఖ్యలో తయారు చేయాలంటే కార్ఖానా ఏర్పాటుకు ఒక పెద్ద గది అవసరం.
- రూమ్‌కు అడ్వాన్స్ : రూ. 25,000 (ఏరియాను బట్టి మారొచ్చు)
- ఇతర యంత్రాలు, సామాగ్రి : రూ. 25,000
- ప్రాథమిక + ప్రారంభ వ్యయాలు : రూ. 50,000
- మొత్తం : రూ. 1,00,000

నెలవారీ ఖర్చు

- యాభై పల్లీ పట్టీలను కలిపి ఒక ప్యాకెట్‌గా లెక్కగడితే..
- ఒక్కరోజులో 150 ప్యాకెట్ల పల్లీ పట్టీలను తయారు చేయగలరనుకుందాం.
- ఒక ప్యాకెట్ తయారీకి అయ్యే సరాసరి ఖర్చు రూ. 15
- నెలకు 25 రోజులు పనిచేస్తే 3750 ప్యాకెట్ల పల్లీ పట్టీలను తయారుచేయవచ్చు.
- అంటే నెలకు 3750x 15= రూ. 56, 250
- కరెంట్, ఫోన్, ఇతర బిల్లులు: రూ. 5,000
- రూమ్ రెంటు: రూ. 5000 (ఏరియాను బట్టి మారొచ్చు)
- ఇన్‌స్టాల్‌మెంట్‌లో ఒక వాహనం కొనుక్కుంటే నెలవాయిదా: రూ.5,000
- హెల్పర్‌ని నియమించుకుంటే వేతనం, పెట్రోలు ఖర్చు : రూ. 10,000
- మొత్తం : రూ. 81,250
- పెట్టుబడి : రూ. 1,81,250

ఏడాది అమ్మితే వచ్చేది..

- రోజుకు 150 ప్యాకెట్ల పల్లీ పట్టీలను అమ్మగలుగుతాం.
- ఏడాదికి 300 రోజులు పనిదినాలుగా లెక్కేస్తే..
- 150x 300 = 45000 ప్యాకెట్ల పల్లీ పట్టీలను అమ్మవచ్చు.
- సగటున ఒక్కో ప్యాకెట్‌ను రూ. 30కి అమ్ముదామనుకుందాం.
- 45000 x 30= రూ. 13, 50,000 ఆదాయం వస్తుంది.

ఏడాదికి అయ్యే ఖర్చు..

- నెలవారీ ఉత్పాదక వ్యయాన్ని ఏడాదికి లెక్కగడితే..
- 81, 250 x 12 = రూ. 9,75,000
- ప్రారంభ వ్యయాలు రూ. 1,00,000
- మొత్తం ఏడాదికి అయ్యే ఖర్చు : రూ. 10,75,000

లాభం అంచనా..

- ఏడాది మొత్తం వచ్చిన ఆదాయం రూ. 13,50,000
- సంవత్సరంలో అయిన ఖర్చు : రూ.10,75,000
- తీసేస్తే వచ్చే లాభం : రూ. 2,75,000
- అంటే నెలకు వచ్చే లాభం : సుమారుగా రూ. 23,000

గమనిక :
ఈ లెక్కలు కేవలం అంచనా ప్రకారం వేసినవే. ఆర్డర్లు పెరిగితే ఆదాయం మరింత పెరిగే అవకాశం ఉంటుంది.

బిట్స్ కార్నర్

కరివేపాకుతో అందం..



- కరివేపాకు పేస్ట్‌లో శనగపిండి, పెరుగు వేసి బాగా కలుపుకోవాలి. దీన్ని ముఖానికి, మెడకు రాయాలి. ఇరవై నిమిషాల తర్వాత చల్లని నీటితో కడిగేయాలి. ఇలా వారానికి రెండుసార్లు చేస్తే చర్మం అందంగా, ఆరోగ్యంగా మారుతుంది.
- మొటిమల వల్ల వచ్చిన మచ్చలను నివారించడానికి ఈ ప్యాక్ బాగా పని చేస్తుంది. కరివేపాకు పేస్ట్‌లో నిమ్మరసం కలిపి ముఖానికి రాయాలి. పది నిమిషాల తర్వాత కడిగేయాలి.
- కరివేపాకులను మెత్తగా పేస్ట్ చేసి దాంట్లో చిటికెడు పసుపు చేర్చాలి. ఆ ముద్దని మొటిమలు ఉన్న చోట రాస్తే అవి తగ్గుతాయి.
- కరివేపాకు మెత్తగా చేసి దాంట్లో ముల్తానీ మట్టి, రోజ్‌వాటర్ కలుపాలి. ముఖానికి రాసి ఆరిన తర్వాత గోరువెచ్చని నీటితో కడిగేయాలి. ఇది ముఖం మీద మచ్చలను, వలయాలను తగ్గిస్తుంది.
- కరివేపాకు పేస్ట్‌లో మూడు చెంచాల ఆలివ్ నూనె కలుపాలి. దీన్ని ముఖానికి, మెడకు రాసి పావుగంట తర్వాత కడిగేస్తే మంచి ఫలితం ఉంటుంది.



కన్యాకుమారి టు కశ్మీర్!

ఆమె అథ్లెట్ కాదు.. అలాగని సోషల్ డెవలప్‌మెంట్ సెక్టార్‌లోనూ లేదు. అయినా ఆడవాళ్ల సమస్య గురించి పరుగులు పెడుతున్నది. కన్యాకుమారి నుంచి కశ్మీర్‌కి పయనమైంది.

సృష్టి భక్షి 'ప్రాజెక్ట్ క్రాస్‌బౌ' పేరిట ఈ పరుగు పెడుతున్నది. దాదాపు 3,800కి.మీల మేర ఈ పరుగు ఉంటుందట. రోజుకు కనీసం 25 నుంచి 30 కిలోమీటర్ల మేర కాసేపు నడవడం, కాసేపు పరుగెత్తడం చేస్తుందట భక్షి. ఈమె పరుగుకు కారణం.. ఆడవాళ్ల మీద జరుగుతున్న అఘాయిత్యాలేనంటున్నది. సృష్టి 'ఇండియా టుడే' మ్యాగజైన్‌లో ఫీచర్ రిపోర్టర్‌గా పనిచేసేది. అప్పుడు 'రియల్ ఉమెన్' పేరిట ఒక ఫీచరింగ్ చేద్దామనుకుంది. కానీ అప్పుడు ఎవరూ ఆమెకు సహకరించలేదు. ఆడవాళ్లలో ఉన్న శక్తిని వెలికి తీసే ఆ ఆర్టికల్స్ ఎంతోమందికి ఆదర్శంగా నిలుస్తాయని అనుకుంది. అది జరుగకపోవడంతో ఆ ఉద్యోగానికి రాజీనామా చేసింది. ఒకరోజు ఢిల్లీలో అమ్మాయి మీద రేప్ జరిగిన సంఘటన గురించి ఇంట్లో, ఫ్రెండ్స్ దగ్గర చర్చ జరిగింది. అందరూ 'మాకెందుకులే' అన్నట్లు మాట్లాడారు. ఆ సమయంలో సమాజానికి 'నేనేం చేయాలనా?' అని ఆలోచించింది. తనలా ఆలోచించే వారిని ఒక తాటి మీదకు తీసుకొచ్చింది భక్షి. ఆడవాళ్లకు ఆర్థికంగా ఎలా ఎదుగాలి, ఆత్మసంరక్షణ ఎలా చేసుకోవాలన్న దాని మీద శిక్షణ ఇస్తున్నది. దాంతో పాటు ఈ పరుగుతో మరికొంతమంది తనతో భాగస్వాములవుతారని ఆశిస్తున్నది. తనతో పాటు మరో బిలియన్ అడుగులు కలుస్తాయని అనుకుంటున్నది.

ఆయిలీ స్కిన్ .. ఏం చేయాలి?

అడుగండి చెబుతా



మా పాప వయసు 16 సంవత్సరాలు. ఆమె చర్మం ఆయిలీ స్కిన్ రకం అనిపిస్తున్నది. అవుట్‌డోర్ గేమ్స్ ఆడడం ఆమెకు చాలా ఇష్టం. చాలా సమయం ప్లే గ్రౌండ్‌లోనే గడుపుతుంది. ఆమె చర్మం విషయంలో ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉంటుందో కాస్త వివరంగా తెలుపగలరు?
- వేద, హైదరాబాద్

ఇలా చర్మ సంరక్షణ గురించిన ఆలోచన మీకు ఉన్నందుకు ముందుగా నా అభినందనలు. ముఖ్యంగా టీనేజ్‌లో ఉన్న పిల్లల చర్మ సంరక్షణ గురించి మరింత శ్రద్ధ అవసరం. మీ పాప ఎక్కువగా అవుట్ డోర్‌లోనే గడుపుతుందంటున్నారు కాబట్టి ఆమె తప్పకుండా చర్మానికి సంబంధించిన జాగ్రత్తలు పాటించాల్సి ఉంటుంది. తప్పనిసరిగా సన్‌స్క్రీన్ వాడాలి. ప్రతి రెండు గంటలకు ఒకసారి వాతావరణ స్థితిని బట్టి, ఎంత సమయం పాటు తాను ఆరు బయట గడుపుతున్నది అనే దాన్ని బట్టి 15–40 ఎస్‌పీఎఫ్ కలిగిన సన్‌స్క్రీన్ ఉపయోగించాల్సి ఉంటుంది. ఇలా సన్‌స్క్రీన్ ఉపయోగించడం వల్ల చర్మం మీద సన్నని గీతల వంటి ముడుతలు, ఎండకు చర్మం నల్లబారడం వంటి వాటిని నివారించవచ్చు. ఆమెది ఆయిలీ స్కిన్ రకం అంటున్నారు కాబట్టి సాల్సిలిక్ యాసిడ్ కలిగిన ఫేస్ వాష్, వాటర్ బేస్డ్ మాయిశ్చరైజర్ వాడడం మంచిది. సరైన ఎస్‌పీఎఫ్ కలిగిన సన్‌స్క్రీన్, సాల్సిలిక్ యాసిడ్ కలిగిన ఫేస్ వాష్ రాత్రి పూట వాడే నైట్ క్రీమ్ లేదా సీరమ్ లేదంటే సాధారణ వాటర్ బేస్డ్ మాయిశ్చరైజర్ ఉపయోగించడం వంటి జాగ్రత్తలతో పాటు, తాజా పండ్లు, కూరగాయలు ఎక్కువగా తీసుకోవాలి. సమతుల పౌష్టికాహారం తీసుకోవడం వల్ల ఆరోగ్యంగా ఉంటారు. ఆరోగ్యంగా ఉండే వారి చర్మం కూడా ఆరోగ్యంగా మెరుస్తూ ఉంటుందనే విషయం గుర్తుంచుకోండి.



డాక్టర్ హరీష్
డెర్మటాలజిస్ట్
నియోడెర్మా
హైదరాబాద్

వాట్సప్!

ట్వీట్

ప్రణీత సుభాష్
@pranitasubhash



ప్రణీతను ట్విట్టర్‌లో ఫాలో అవుతున్నవారి సంఖ్య

437,934



మార్పు కోసం మనవంతుగా.. టీచ్ ఫర్ చేంజ్!

సమ్‌థింగ్ స్పెషల్



ఏవరీ ఆకాశరామన్నా.. స్టిల్ ఏమన్నా!

కామన్‌మ్యాన్ వాయిస్

ప్రపంచం చాలా పెద్దది. అందులో సమాజం గురించి ఆలోచించేవాళ్ల సంఖ్య చాలా తక్కువ. ఎవరికి వాళ్లు తాము అనుకున్న పని చేయాలి, పూర్తి చేయాలి అంటే ఒక్కోసారి జీవితకాలం కూడా సరిపోదు. ఎంతచేసినా ఇంకా ఉంటనే ఉంటది. మనం నమ్మిన దాన్ని శ్రద్ధగా చేసుకుంటూ పోతే అది చివరికి ఏదో ఒకరోజు ఫలితాన్ని ఇస్తది. ఒకవేళ ఫలితం రాకున్నా కూడా మన ప్రయత్నంలో ఉన్న నిజాయితీ మనకు సంతృప్తి ఇస్తది. సమాజానికి స్ఫూర్తిని ఇస్తది. నాదే కరెక్ట్, పక్కోడిది తప్పు అనే చర్చల్లోనే మొత్తం సమయం గడిచిపోతే ఇంకా అసలు పని చేసేది ఎప్పుడు? అని నాకు అప్పుడప్పుడు డౌటనుమానం వస్తుంది.

Chegondi Chandrashekar

ట్రిపుల్ తలాఖ్ తీర్పును మతపరమైన రాజకీయం చెయ్యకుండా అందరూ స్వాగతించాలి. ఇది ఒక మహిళ ఆత్మగౌరవం, పవిత్ర వివాహ బంధానికి సంబంధించిన విషయం.

S S Vara Prasad

వైరల్ వీడియో



2017 తర్వాత ఏం జరుగుతుందో మీకు తెలుసా? 2067కు ముందు ఏం జరుగబోతుందా ఊహించ గలరా? నవాజుద్దీన్ సిద్దిఖీ నటించిన కార్బన్ షార్ట్ ఫిలిం చూడండి తెలుస్తుంది.

Carbon | Jackky Bhagnani I Nawazuddin Siddiqui I Royal Stag Barrel Select Large Short Films

Total views : 5,065,808+

Published on Aug 21, 2017

షేరింగ్

బరువైన బంధాలు

చెట్టుపై పక్షి గూడు కట్టుకుంది
పిల్లలను పెంచింది, రెక్కలొచ్చాయి
వాటిలానే అతడూ ఎగిరిపోయాడు
గింజల వేట తప్పలేదు!

అసలే అమెరికాలో ఉన్నాడు
కాసుల వేట, ప్రపంచంతో
పోటీ నేర్పిన అమ్మ, తననూ
పట్టించుకోవాలనే
సూత్రాన్ని చెప్పనే లేదు
అమాయకురాలు!

బీటలు వారి, నోళ్లు విచ్చుకున్న
భూమిపై ఏడాదికో, రెండేళ్లకో
వాన చినుకులు పడ్డట్టుగా
ఫోన్‌లో పొడిపొడిగా
పలకరింపులు!

ఎన్నో జ్ఞాపకాలను నిర్దాక్షిణ్యంగా
చెరిపేసిన ఆధునికత
పేగు బంధాలను కూడా
మోయలేని
బంధాల జాబితాలో చేర్చింది!

కళ్లలో ఒత్తులేసుకునే అమ్మలూ
స్వార్థపడండిక!
గుండెలు పగులకముందే
పక్కానికొచ్చిన ఆకుల్లా
రాలడానికి సిద్ధమైపోండి.

ఏడాదిన్నర దాకా ఏమాత్రం పలు
కరించని కొడుకు అమెరికా నుంచి
వచ్చి చూస్తే శవమై కనిపించిన
ఒంటరి తల్లి గురించి.

Nasreen Khan



మిర్యాల రవీందర్‌రెడ్డి, బోయపాటి శ్రీను, రకుల్‌ప్రీత్‌సింగ్, బెల్లంకొండ శ్రీనివాస్

నా జీవితాన్ని మార్చింది!

'జయజానకి నాయక' చిత్రం నా జీవితాన్ని మార్చింది. ఈ సినిమా గురించి ఎంత చెప్పినా తక్కువే. నాకు చాలా ఆనందాన్నిచ్చిన సినిమా ఇది' అని అన్నారు బెల్లంకొండ శ్రీనివాస్. ఆయన కథానాయకుడిగా నటించిన చిత్రం 'జయజానకి నాయక'. బోయపాటి శ్రీను దర్శకత్వం వహించారు. ద్వారక క్రియేషన్స్ పతాకంపై మిర్యాల రవీందర్‌రెడ్డి నిర్మించారు. రకుల్‌ప్రీత్‌సింగ్‌కథానాయిక. ఇటీవల ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకొచ్చింది. బుధవారం హైదరాబాద్‌లో చిత్రబృందం పాత్రికేయుల సమావేశాన్ని ఏర్పాటుచేసింది. ఈ సందర్భంగా హీరో శ్రీనివాస్ మాట్లాడుతూ 'ప్రతి గుండెను తాకుతున్న సినిమా ఇది. 'జయజానకి నాయక' రూపంలో దర్శకుడు బోయపాటి శ్రీను నాకో మంచి సినిమా ఇచ్చారు. పోటీ మధ్య విడుదలైన ఈ చిత్రం పెద్ద విజయాన్ని సాధించడం ఆనందంగా ఉంది' అన్నారు. బోయపాటిశ్రీను మాట్లాడుతూ 'తరాలు మారినా మానవ భావోద్వేగాలు మాత్రం మారవని మరోసారి ఈ చిత్రం నిరూపించింది. ప్రతి ఒక్క కుటుంబానికి చేరువైంది. నేను బాగా నమ్మి చేసిన సినిమా ఇది. మిర్యాల రవీందర్‌రెడ్డి లాంటి నిర్మాతలు చిత్రసీమకు అవసరం. భవిష్యత్తులో ఆయనతో మళ్లీ సినిమాలు చేస్తాను. మూడో వారంలో అడుగుపెడుతున్న ఈ చిత్రం మంచి వసూళ్లతో దూసుకుపోతుండడం ఆనందంగా ఉంది' అని తెలిపారు. 'మంచి సినిమా తీశానని గర్వంగా చెబుతున్నాను. ప్రేమకథ, కుటుంబ బంధాలు, సెంటిమెంట్‌తో పాటు బోయపాటి శైలి మాస్ యాక్షన్ హంగులున్న చిత్రమిది. మళ్లీ ఇలాంటి సినిమా చేస్తానో? లేదో? తెలియదు. సాఫ్ట్‌వేర్ ఉద్యోగుల నుంచి రైతుల వరకు, బెంజ్‌క్లాస్ నుంచి మిడిల్‌క్లాస్ వరకు అన్ని వర్గాలను ఈ సినిమా మెప్పిస్తున్నది. మంచి సినిమా చేస్తే ప్రేక్షకులు ఆదరిస్తారని మరోసారి ఈ చిత్రంతో రుజువైంది' అని మిర్యాల రవీందర్‌రెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో రకుల్‌ప్రీత్‌సింగ్, నందు, శివన్నారాయణ, హరి, సాహి సురేష్, శ్రవణ్ తదితరులు పాల్గొన్నారు.

విఫల ప్రేమికుడి కథ



సందీప్‌రెడ్డి వంగా

'అర్జున్‌రెడ్డి' చిత్రం భావోద్వేగ ప్రధానంగా ఉంటుంది. సినిమాటిక్ ఫీల్ కాకుండా సహజమైన అనుభూతిని పంచుతుంది' అని తెలిపారు సందీప్‌రెడ్డి వంగా. ఆయన దర్శకత్వం వహిస్తున్న చిత్రం 'అర్జున్‌రెడ్డి'. విజయ్‌దేవరకొండ, షాలిని జంటగా నటించారు. ప్రణయ్‌రెడ్డి వంగా నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 25న ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ సందర్భంగా బుధవారం హైదరాబాద్‌లో సందీప్‌రెడ్డి పాత్రికేయులతో ముచ్చటిస్తూ 'ప్రేమలో విఫలమైన ఓ యువకుడి జీవితంలో ఎదురైన సంఘటనల సమాహారమే ఈ చిత్రం. నా జీవితంలో జరిగిన అనుభవాలతో పాటు నిజజీవితంలో నేను చూసిన సంఘటనల స్ఫూర్తితో ఈ సినిమా చేశాను. హైదరాబాదీ మాండలికంలో ఈ సినిమాలోని సంభాషణలు సాగుతాయి. భావోద్వేగాలను కాలంతో కొలవలేము. ఒకప్పుడు సినిమాలన్నీ మూడు గంటల కంటే ఎక్కువ నిడివితో ఉండేవి. కానీ ఇప్పుడు మాత్రం రెండు గంటల్లోనే కథను చెబుతున్నారు. అది ఎలా సాధ్యమవుతుందో నాకు అర్థం కావడం లేదు. కథ మీద నమ్మకంతోనే మూడు గంటల ఒక్క నిమిషం నిడివితో సినిమాను రూపొందించాను. 'పెళ్లిచూపులు' సినిమాకు ముందు విజయ్‌దేవరకొండకు ఈ కథ వినిపించాను. సహజత్వం కోసం నిజమైన లొకేషన్స్‌లోనే సినిమాను తెరకెక్కించడంతో ఆలస్యమైంది. పోస్టర్స్‌లో లిప్‌లాక్ సన్నివేశంతో పాటు సినిమాలో ఉపయోగించిన సంభాషణల్లో అశ్లీలత కనిపిస్తున్నదని అంటున్నారు. అందులో ఎలాంటి తప్పు లేదని నేను అనుకుంటున్నాను. అది చూసే వారి కోణంలోనే ఉంటుంది. నా స్వస్థలం వరంగల్ జిల్లా. ఫిజియోథెరఫీతో పాటు ఆస్ట్రేలియాలో ఫిలిమేకింగ్‌లో పోస్ట్‌గ్రాడ్యుయేట్ చేశాను. నాగార్జున నటించిన 'కేడి' చిత్రానికి దర్శకత్వ విభాగంలో పనిచేశాను. దర్శకుడు క్రాంతిమాధవ్ నాకు మంచి స్నేహితుడు. ఆయన తెరకెక్కించిన 'మళ్లీ మళ్లీ ఇది రాని రోజు' చిత్రానికి కథా రచనలో సహకారం అందించాను. ఈ సినిమా జయాపజయాలను అనుసరించే తదుపరి సినిమా ఎవరితో అనేది నిర్ణయిస్తాను. పెద్ద హీరోలతో సంప్రదింపులు జరుగుతున్నాయి' అని చెప్పారు.

థ్రిల్లర్ కథాంశంతో...

'థ్రిల్లర్ కథాంశంతో ఆద్యంతం ఆసక్తికరంగా సాగే చిత్రమిది. పాజిటివ్, నెగెటివ్... రెండు ఛాయలతో నా పాత్ర భిన్నంగా సాగుతుంది. నా కెరీర్‌లోనే ఛాలెంజింగ్ క్యారెక్టర్ ఇది' అని అన్నారు సచిన్‌జోషి. ఆయన కథానాయకుడిగా నటిస్తున్న చిత్రం 'వీడెవడు'. తాతినేని సత్య దర్శకత్వం వహిస్తున్నారు. రైనా జోషి నిర్మాత. ఇషాగుప్తా కథానాయిక. మంగళవారం హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో దర్శకుడు తాతినేని సత్య మాట్లాడుతూ 'ఇప్పటివరకు రీమేక్ కథాంశాలతో సినిమాలు చేశాను. తొలిసారి నేను చేస్తున్న స్ట్రెయిట్ చిత్రమిది. ఆసక్తికరమైన మలుపులతో థ్రిల్‌ను కలిగిస్తుంది. సచిన్ నటన, థమన్ సంగీతం, బినేంద్ర మీనన్ ఛాయాగ్రహణం సినిమాకు ప్రధాన బలంగా నిలుస్తాయి' అన్నారు. క్రీడా నేపథ్యానికి ప్రేమ, యాక్షన్ అంశాలను మేళవించి ఈ సినిమా రూపొందించామని, సెప్టెంబర్ 8న చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నామని సచిన్ పేర్కొన్నారు. వైవిధ్యమైన కథ, కథనాలతో తెరకెక్కుతున్న చిత్రమిదని, తెలుగు, తమిళ భాషల్లో ఒకేసారి విడుదల చేస్తున్నామని సి.కల్యాణ్ చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



తాతినేని సత్య, సచిన్, సి.కల్యాణ్

రజనీకాంత్‌తో సినిమా నా డ్రీమ్!

వినూత్నమైన చిత్రాలతో ప్రేక్షకుల్లో ప్రత్యేక గుర్తింపును సొంతం చేసుకున్నారు ధనుష్. నటుడిగానే కాకుండా అభిరుచి గల నిర్మాతగా, దర్శకుడిగా విమర్శకుల ప్రశంసలందుకుంటున్నారాయన. ధనుష్ నటించిన తాజా చిత్రం 'విఐపి-2'. రఘువరన్ బీటెక్' సినిమాకు సీక్వెల్‌గా తెరకెక్కిన చిత్రమిది. సౌందర్య రజనీకాంత్ దర్శకత్వం వహించారు. వండర్‌బార్ ఫిలింస్ పతాకంపై ధనుష్ నటిస్తూ నిర్మించిన ఈ చిత్రం రేపు ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా ధనుష్ బుధవారం హైదరాబాద్‌లో పాత్రికేయులతో ముచ్చటించారు. ఆ విశేషాలివి.

'రఘువరన్ బీటెక్' చిత్రానికి సీక్వెల్ చేయాలనే ఆలోచనకు కారణం?

- 'రఘువరన్ బీటెక్'.. ప్రపంచం నాకెంతో నచ్చింది. దానికి సీక్వెల్ చేస్తే బాగుంటుందనిపించింది. అందుకే చేశాను. తెలుగులోనూ భారీ విజయాన్ని సాధించింది. దాన్ని దృష్టిలో పెట్టుకుని సీక్వెల్‌ని తెలుగు, తమిళ భాషల్లో ఏకకాలంలో చేయాలనుకున్నాను. ఇప్పటి వరకు తెలుగులో స్ట్రెయిట్ సినిమా చేయని నాకు ఇదే కరెక్ట్ ఫిల్మ్ అనిపించింది. అందుకే ఈ సినిమా కోసం ప్రత్యేకంగా తెలుగు నేర్చుకుని నా పాత్రకు నేనే డబ్బింగ్ చెప్పుకున్నాను.

తెలుగులో రిలీజ్ ఆలస్యం కావడానికి కారణం?

- తెలుగు, తమిళ భాషల్లో ఒకేసారి విడుదల చేయాలనుకున్నాం కానీ అదే సమయంలో తెలుగులో మూడు చిత్రాలు విడుదల కావడం వల్ల కుదరలేదు. మంచి రిలీజ్ డేట్ కోసం ఎదురు చూసి ఇప్పుడు విడుదల చేస్తున్నాం. ఈ చిత్రానికి కథ, మాటలు నేనే అందించాను. నటన, దర్శకత్వం ఈ రెండింటికి న్యాయం చేయలేనని ఆ బాధ్యతల్ని సౌందర్యకు అప్పగించాను.

వసుంధర పాత్ర కోసం ప్రత్యేకంగా కాజోల్‌నే ఎందుకు తీసుకున్నారు?

- వసుంధర పాత్ర చాలా స్టైలిష్‌గా పవర్‌ఫుల్‌గా సాగుతుంది. ఆ పాత్రకు కాజోల్ అయితేనే బాగుంటుందని నేను, సౌందర్య అనుకున్నాం. ఆలోచన వచ్చిన వెంటనే ఆమెను సంప్రదించి స్క్రిప్ట్ వినిపించాం. చాలా అద్భుతంగా నటించారామె. కాజోల్ పాత్రే సీక్వెల్‌కు స్పెషల్. తమిళంలో తన పాత్రకు తానే డబ్బింగ్ చెప్పారు. తెలుగులో మాత్రం వేరే వాళ్లతో డబ్బింగ్ చెప్పించాం. హిందీ అనువాదానికి ఆమె డబ్బింగ్ చెప్పారు. తమిళంలో విడుదలైన ఈ చిత్రానికి క్రిటిక్స్ నుంచి మిశ్రమ స్పందన లభించింది. అయితే కలెక్షన్స్‌పై మాత్రం ఆ ప్రభావం పడలేదు. నేను ఊహించిన దాని కంటే భారీ స్థాయిలో ఈ చిత్రానికి ఓపెనింగ్స్ లభించాయి. ఆ విషయంలో క్రిటిక్స్ లెక్క తప్పింది.



ధనుష్

ఇక నుంచి మీ ప్రతి సినిమా రెండు భాషల్లో వుండేలా చూసుకుంటారా?

- ఇక నుంచి నేను చేయనున్న సినిమాల్ని తెలుగు, తమిళ భాషల్లో చేయాలని నిర్ణయించుకున్నాను. ప్రస్తుతం చేస్తున్న వడా చెన్నై, మారి-2 చిత్రాన్ని ద్విభాషా చిత్రాలుగా తెలుగు, తమిళ భాషల్లో చేస్తున్నాను. ఈ సినిమాలు పూర్తయిన తరువాత నా దర్శకత్వంలో ఓ సినిమా వుంటుంది.

కాజోల్ మిమ్మల్ని డామినేట్ చేస్తారనే అనుమానం కలిగిందా?

- నటుడిగా నేనేంటో అందరికి తెలుసు. నాపై, నా నటనపై నాకు నమ్మకం ఎక్కువ. అలాంటి నన్ను కాజోల్ డామినేట్ చేస్తుందనే అనుమానమే నాకు కలగలేదు.

రజనీకాంత్ రాజకీయ ప్రవేశం గురించి చాలా రోజులుగా వార్తా కథనాలు వినిపిస్తున్నాయి. రజనీ నిజంగానే రాజకీయాల్లోకి రాబోతున్నారా?

- ఏది చేస్తే మంచిదో ఆయనకు బాగా తెలుసు. ఆయన ఏది కరెక్ట్ అని నమ్ముతారో అది చేయడానికి వెనుకాడరు. ఆయన ఏం చేయబోతున్నారా? అని అందరిలాగే నేనూ ఎదురుచూస్తున్నాను.

తెలుగు హీరోలతో కలిసి మల్టీస్టారర్ చిత్రాల్లో నటించే అవకాశం వుందా?

- నచ్చిన కథ, ప్రాముఖ్యత వున్న పాత్ర ... ఇలా అన్నీ కుదిరితే తెలుగు హీరోలతో కలిసి మల్టీస్టారర్ చిత్రాల్లో నటించడానికి నేనూ ఎప్పుడూ సిద్ధమే.

మీరు నటిస్తున్న హాలీవుడ్ ఫిల్మ్ 'ది ఎక్స్‌ట్రార్డినరీ జర్నీ ఆఫ్ ది ఫకీర్' ఎంత వరకు వచ్చింది?

- చిత్రీకణ పూర్తయింది. ప్రస్తుతం పోస్ట్‌ప్రొడక్షన్ కార్యక్రమాలు జరుగుతున్నాయి.

'పవర్‌పాండీ'తో తొలి ప్రయత్నంలోనే దర్శకుడిగా సక్సెస్ సాధించారు. రజనీకాంత్‌ని డైరెక్ట్ చేయాలనే ఆలోచన వుందా?

- రజనీకాంత్‌తో కెరీర్‌లో ఓ సినిమా అయినా చేయాలని చాలా మంది దర్శకుల డ్రీమ్. ఆ డ్రీమ్ నాకూ వుంది.

రజనీతో మీరు నిర్మిస్తున్న 'కాలా' ఏ దశలో వుంది?

- దాదాపు చిత్రీకరణ 70 శాతం పూర్తయింది. రజనీసార్ అభిమానులకు ఓ ట్రీట్ లాంటి సినిమా అని చెప్పొచ్చు. అంత అద్భుతంగా రూపొందిస్తున్నాం. 'కబాలి' చిత్రానికి సీక్వెల్ అని ప్రచారం జరుగుతున్నది. అందులో ఎలాంటి వాస్తవం లేదు. ఆ చిత్ర కథకు దీనికి ఎలాంటి సంబంధం లేదు. సరికొత్త నేపథ్యంలో తెరకెక్కుతున్న చిత్రమిది.



'వెళ్లిపోమాకే' చిత్రంలో ఓ దృశ్యం

ఫీల్ గుడ్ ఎంటర్‌టైనర్

కొత్తదనాన్ని ప్రోత్సహించడంలో ముందుండే నిర్మాతల్లో దిల్‌రాజు ఒకరు. తాజాగా ఆయన నూతన దర్శకుడు యాకుబ్ అలీ రూపొందించిన 'వెళ్లిపోమాకే' చిత్రాన్ని స్వయంగా విడుదలచేస్తున్నారు. విశ్వక్‌సేన్ ప్రధాన పాత్రలో నటించారు. సెప్టెంబర్ 2న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకురానుంది. దిల్‌రాజు మాట్లాడుతూ 'ఫీల్‌గుడ్ లవ్ ఎంటర్‌టైనర్ ఇది. దర్శకుడు యాకుబ్‌అలీ ఆద్యంతం ఆహ్లాదకరంగా సినిమాను తెరకెక్కించారు. అనుపమ్‌ఖేర్ ఫిలిం ఇనిస్టిట్యూట్‌లో శిక్షణ పొందిన విశ్వక్‌సేన్ మంచి నటనను కనబరిచాడు. ఎనిమిది పాత్రలతో భావోద్వేగాల సమాహారంగా సాగే ఈ చిత్రం ప్రేక్షకులకు సరికొత్త అనుభూతిని పంచుతుంది' అని తెలిపారు. ముక్కోణపు ప్రేమకథా చిత్రమిదని, రెండు సంవత్సరాల క్రితం ఈ సినిమాను ప్రారంభించానని, కథ, సినిమాను తెరకెక్కించిన విధానం నచ్చి నిర్మాత దిల్‌రాజు చిత్రాన్ని విడుదల చేయడానికి ముందుకు రావడం ఆనందంగా ఉందని యాకుబ్ అలీ చెప్పారు.

అవగాహనతో అపోహలు దూరం



వాస్తవానికి క్యాన్సర్ గురించిన వాస్తవాల కన్నా క్యాన్సర్ గురించిన అపోహలే ఎక్కువగా ప్రచారంలో ఉన్నాయి. నిజానికి జన్యుపరంగా వచ్చే వ్యాధులు వేరు. వంశానుగతంగా వచ్చే వ్యాధులు వేరు. క్యాన్సర్ జన్యుపరమైన కారణాలతో వచ్చే వ్యాధి కానే కాదు. ఈ కారణంగా కొందరు తమకు క్యాన్సర్ వచ్చినట్టు చెప్పుకోవడానికి కూడా భయపడుతుంటారు. సంతానంలో ఒకరికి క్యాన్సర్ ఉంటే మిగతా వారికి కూడా క్యాన్సర్ వస్తుందేమోనని కూడా భయపడుతుంటారు. కానీ ఇవన్నీ కూడా అపోహలే తప్ప వాస్తవాలు కావు. కీమోథెరపీ తీసుకుంటే జుట్టు ఊడిపోతుంది. తమకు క్యాన్సర్ ఉన్నట్టు తెలిసిపోతుందని కొందరు ట్రీట్‌మెంట్ మధ్యలోనే ఆపేసి వెళ్లిపోతారు. దీనివల్ల క్యాన్సర్ పూర్తిగా నయమైపోవాల్సిన సమయంలో మధ్యలోనే వదిలేయడం ద్వారా ప్రాణాల మీదకు తెచ్చుకుంటారు.

జన్యువులు కారణమే..

క్యాన్సర్ రావడానికి జన్యుపరమైన కారణాలు ఉన్నాయే తప్ప, వంశానుగత మూలాలు ఏమీ లేవు, జన్యుకారణాలు, పారిశ్రామిక కాలుష్యాలు, వాతావరణ కాలుష్యాలు క్యాన్సర్‌కు దోహదం చేసే అవకాశం ఉంది. కానీ వంశానుగత కారణాలతో క్యాన్సర్ వచ్చే అవకాశమేమీ లేదు.

కాకపోతే రొమ్ము క్యాన్సర్, పెద్దపేగు క్యాన్సర్, థైరాయిడ్ క్యాన్సర్ తమ తల్లిదండ్రులకు ఉన్నప్పుడు అదీ బాగా చిన్నవయసులోనే వచ్చి ఉంటే, ఆ తర్వాత తరం వారికి వచ్చే అవకాశం సాధారణ ప్రజానీకం కన్నా కొంచెం ఎక్కువ. అలాగే కుటుంబసభ్యుల్లో ఎవరికైనా బీఆర్‌సీఏ -1, బీఆర్‌సీఏ -2 జన్యువుల మ్యూటేషన్ ఉంటే ఆ వ్యక్తికి అండాశయ క్యాన్సర్ వచ్చే అవకాశాలు ఎక్కువే ఉంటాయి. మగవాళ్లకయితే మేల్ బ్రెస్ట్ క్యాన్సర్ గానీ, క్లోమగ్రంథి క్యాన్సర్ గానీ రావచ్చు. అలాగే తల్లిదండ్రుల్లో ఎఫ్ఏపీ జీన్ ఉండే వారి పిల్లల్లో 50 శాతం మందికి క్యాన్సర్ వచ్చే అవకాశం ఉంది. కాకపోతే ఇవన్నీ జన్యుపరమైన సమస్యలే. ఇలా జన్యుపరమైన కారణాలు ఉండే తప్ప క్యాన్సర్ వంశానుగతమైన కారణాలతో వచ్చే వ్యాధి కాదు.

కత్తి కాదు

కత్తి పెడితే క్యాన్సర్ పెరుగుతుందన్న అపోహ ఇప్పటికీ చాలామందిలో ఉంది. ఇదో పెద్ద అపోహ. వాస్తవానికి క్యాన్సర్‌కు సర్జరీని మించిన ఉత్తమ చికిత్స మరొకటి లేదు. సర్జరీతో పాటు, కీమో థెరపీ, రేడియో థెరపీ, టార్గెటెడ్ థెరపీ, హార్మోనల్ థెరపీ, మోనోక్లోనల్ యాంటీ బాడీ థెరపీ కూడా ఉంటాయి. అలాగే లింఫ్ నాళాల ద్వారా పాకకుండా సర్జరీలో లింఫ్‌గ్లాండ్స్‌ను కూడా తీసేస్తారు. ఇవన్నీ సర్జరీ ద్వారానే సాధ్యమవుతాయి. కాకపోతే క్యాన్సర్‌కు సహజంగా ఒక శరీర భాగం నుంచి మరో శరీర భాగానికి పాకే లక్షణం ఉంటుంది. పక్కనున్న భాగాలకు గానీ, లింఫ్‌నాళాల ద్వారా గానీ, రక్తనాళాల ద్వారా గానీ, శరీరంలోని ఇతర భాగాలకు పాకవచ్చు.

కరెంట్ కాదు

రేడియేషన్ అంటే కరెంట్ పెట్టడమని, కరెంట్ షాక్స్ పెట్టడమేనని, అందుకే రేడియేషన్ తర్వాత నల్లగా మారిపోతారని అనుకుంటూ ఉంటారు. వాస్తవానికి రేడియేషన్ అనేది శరీరంలోని ఆయా శరీర అవయవాలకు ప్రత్యేకించి ఇచ్చే ఒక మెగా ఓల్టేజ్ ఎక్స్‌రే థెరపీ. ఇది శరీరంలోని క్యాన్సర్ కణజాలాన్ని మాత్రమే నశింపజేస్తుంది. ఇటీవలి కాలంలో మరింత కచ్చితంగా ఆ క్యాన్సర్ కణాలనే చంపే రేడియేషన్ విధానాలు అందుబాటులోకి వచ్చాయి. కేవలం కోబాల్ట్ రేడియేషన్ మాత్రమే అందుబాటులో ఉన్న పాత రోజుల్లో ఆ రేడియేషన్ కిరణాలు, క్యాన్సర్ కణాలకు మాత్రమే పరిమితం కాకుండా దాని పక్కనున్న కణాల మీద కూడా ప్రభావం చూపించేవి. దీని వల్ల కొన్ని దుష్ప్రభావాలు ఉండేవి. ముఖ్యంగా ఇప్పుడు వి - మ్యాట్ రేడియోథెరపీ వల్ల ఆ సమస్యలేవీ ఉండడం లేదు.

వ్యాధి కంటే భయంకరమా?


క్యాన్సర్ చికిత్సలో ఇచ్చే కీమోథెరపీ క్యాన్సర్ కంటే భయంకరం కాదు. ఈ చికిత్స చాలా బాధాకరమని కూడా చెబుతుంటారు. అదేపనిగా వికారం, వాంతులు ఉంటాయని అనుకుంటారు. చికిత్స తర్వాత ఆరోగ్యం బాగా క్షీణించిపోతుంది అంటారు. ఒకప్పటి కీమోథెరపీలు కొంత బాధాకరంగానే ఉండేవి. కానీ, ఇప్పుడు వస్తున్న ఆధునిక కీమోథెరపీ అనేది కేవలం క్యాన్సర్ కణాలకే పరిమితమయ్యేది కాదు. అది శరీరంలో వేగంగా పెరిగే ప్రతికణాన్ని ఆపేస్తుంది. జుట్టు వేగంగా పెరుగుతుంది. కాబట్టి రాలిపోతుంది. కీమోథెరపీ ఆపిన వెంటనే, మళ్లీ పూర్తిస్థాయిలో జుట్టు వచ్చేస్తుంది. కీమోథెరపీ సమయంలో తెల్ల రక్తకణాలు, ఎర్ర రక్తకణాలు, ప్లేట్‌లెట్లు తగ్గే అవకాశం ఉంది. కాకపోతే ఇది తాత్కాలికమే, చికిత్స పూర్తి కాగానే తిరిగి యథాస్థితికి వచ్చేస్తాయి. పైగా ఇటీవల వచ్చిన కొన్ని కొత్త మందుల ద్వారా ఈ వికారం, వాంతుల సమస్య బాగా తగ్గిపోయింది. దీనికి తోడు తెల్ల రక్తకణాలు తగ్గకుండా ముందుగానే కాలని స్టిమ్యూలేటింగ్ ఫ్యాక్టర్స్, ఎర్రరక్తకణాలు తగ్గకుండా, ఎరిథ్రోపాయిటింగ్ ఇంజెక్షన్స్ ఇస్తున్నారు. ప్లేట్‌లెట్లు తగ్గకుండా ముందే దాతల నుంచి సేకరించిన ప్లేట్‌లెట్లను ఎక్కిస్తున్నారు.

చికిత్స తర్వాత

గుండె జబ్బు కారణంగానో కీళ్ల జబ్బుల కారణంగానో చికిత్స తీసుకుంటే, ఆ తర్వాత జీవిత కాలమంతా పాటించాల్సిన కొన్ని జాగ్రత్తలు ఉంటాయి. పరుగెత్తకూడదు, బరువులు ఎత్తకూడదు, బాగా ఒత్తిడి కలిగించే పనులేవీ చేయకూడదు వంటి కొన్ని ఆంక్షలు ఉంటాయి. క్యాన్సర్ చికిత్స తర్వాత అలాంటి ఆంక్షలేమీ ఉండవు.

శృంగారానికి ఆటంకం కాదు

క్యాన్సర్ చికిత్సా కాలంలో గానీ, ఆ తర్వాత గానీ, శృంగారంలో పాల్గొనకూడదనే నియమం లేదు. ఇది అంటు వ్యాధి కాకపోవడమే ఇందుకు కారణం. ఏ అమ్మాయికైనా చిన్న వయసులోనే క్యాన్సర్ వచ్చి నయమైపోతే, ఆ తర్వాత పెళ్లి చేసుకోవడానికి గానీ, గర్భం ధరించడానికి గానీ ఏ ఆటంకమూ ఉండదు. వాళ్లు తమ శృంగార జీవితాన్ని అందరిలాగే కొనసాగించవచ్చు. పిల్లలకు జన్మనూ ఇవ్వవచ్చు. వాళ్ల ద్వారా వాళ్ల పిల్లలకు క్యాన్సర్ వచ్చే అవకాశమే లేదు. క్యాన్సర్ చికిత్స తీసుకున్న వారిని ప్రత్యేకంగా చూడకూడదు. అవసరమైతే వారిలో మరింత ఉత్సాహం నింపే మాటలు చెప్పగలుగాలి. మనతో పాటే వారినీ వెంట తీసుకొని నడవాలి. వారి జీవన ప్రయాణంలో ఒక నిజమైన నేస్తంగా వెన్నుదన్నుగా నిలువాలి.



డాక్టర్ సీహెచ్ మోహన వంశీ
చీఫ్ సర్జికల్ ఆంకాలజిస్ట్
ఒమెగా హాస్పిటల్స్, హైదరాబాద్
9848011421

లోహ ఖనిజాలు - వివరాలు

- ఇనుము, మాంగనీస్, అల్యూమినియం, రాగి, బంగారం, వెండి, ప్లాటినం, టంగ్‌స్టన్, క్రోమైట్ మొదలైన వాటిని లోహ ఖనిజాలు అంటారు.

ఇనుము

- ఇనుము నిల్వలు ఎక్కువగా ఉన్న రాష్ట్రాలు – ఒడిశా, ఛత్తీస్‌గఢ్, జార్ఖండ్
- ఇనుము ఉత్పత్తి ఎక్కువగా ఉన్న రాష్ట్రాలు – మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, ఒడిశా
- ఇనుములోని ఫెర్రస్ శాతాన్ని బట్టి ఈ ఖనిజాన్ని 4 రకాలుగా వర్గీకరించారు. అవి: 1. మాగ్నటైట్, 2. హెమటైట్, 3. లిమోనైట్, 4. సిడెరైట్.

మాగ్నటైట్

- ఇది నలుపు రంగులో ఉంటుంది. దీనిలో అధిక శాతం ఇనుప ధాతువు లభ్యమవుతుంది. 72 శాతం ఇనుము ఉంటుంది. ఇది ప్రధానంగా తమిళనాడులోని సేలంలో లభిస్తుంది.

హెమటైట్

- ఇది ప్రపంచంలో విస్తృతంగా లభిస్తుంది. దీనిలో సుమారు 69 శాతం వరకు ఖనిజ పదార్థం ఉంటుంది. మాగ్నటైట్‌లాగే గట్టి పదార్థం. కానీ బరువు తక్కువగా ఉంటుంది.

లిమోనైట్

- దీనిలో 60 శాతం ఇనుప ఖనిజం లభిస్తుంది. సుమారు 11 శాతం నీటితేమను కలిగి ఉంటుంది. సాధారణంగా పసుపురంగు లేదా బూడిదరంగులో కనిపిస్తుంది.

సిడెరైట్

- ఇది పుసుపు పచ్చగా లేదా సిమెంటు రంగులో కనిపిస్తుంది. 40–50 శాతం వరకు ఇనుప ధాతువు లభ్యమవుతుంది. దీనిలో 0.7 శాతం తేమ ఉంటుంది.



మాంగనీస్

- మాంగనీస్ లభించే శిల – ధార్వార్ శిల
- దేశంలో అత్యంత పురాతనమైన మాంగనీస్ గని – శ్రీకాకుళం (1892)
- మధ్యప్రదేశ్‌లోని బాలాఘాట్–చింద్వారా, మహారాష్ట్రలోని నాగ్‌పూర్–బాండారా, ఒడిశాలోని మహేంద్రగిరి, గురుమహిసాని, మయూర్ భంజ్ ప్రాంతాల్లో మాంగనీస్ లభిస్తుంది.
- దేశంలో అత్యధికంగా మాంగనీస్ నిల్వలు ఉన్న రాష్ట్రం – ఒడిశా.

అల్యూమినియం

- అల్యూమినియం బాక్సైట్ రూపంలో లభిస్తుంది. దీన్ని మధ్యతరగతి ప్రజల లోహంగా పిలుస్తారు.
- ఒడిశాలోని కలహండి–కోరాపూట్, సంబల్‌పూర్–బొలంగిర్, ఏపీలోని విశాఖపట్నం, మధ్యప్రదేశ్‌లోని అమర్‌కంటక్, మకాల, కట్నీ, గుజరాత్‌లోని జామ్‌నగర్ ప్రాంతాల్లో అల్యూమినియం ఖనిజం లభ్యమవుతుంది.
- దేశంలో అత్యధికంగా అల్యూమినియం నిల్వలు ఉన్న రాష్ట్రం – ఒడిశా.

రాగి

- రాగి మానవుడు ఉపయోగించిన తొలి లోహం.
- ఇది అత్యుత్తమ విద్యుత్ వాహకం కావడంతో ఎలక్ట్రికల్, ఇంజినీరింగ్ పరిశ్రమల్లో దీని ఉపయోగం ఎక్కువగా ఉంటుంది.
- రాగి నిల్వలు అత్యధికంగా ఉన్న రాష్ట్రం – రాజస్థాన్.
- ఏపీలోని గుంటూరు (అగ్ని గుండాల), నెల్లూరు (గరిమెనపెంట), అనంతపురం (మడిగుబ్బల), కడప (జంగంరాజు పేట), మధ్యప్రదేశ్‌లోని మలజ్‌ఖండ్, జార్ఖండ్‌లోని హజారీబాగ్, రాజస్థాన్‌లోని ఖేత్రి, జున్‌జున్‌హు, తెలంగాణలోని ఖమ్మం (అప్పల్రాజు కొండ) ప్రాంతాల్లో రాగి ఖనిజం లభిస్తుంది.
- దీన్ని నాణేల తయారీలో కూడా ఎక్కువగా ఉపయోగిస్తారు.

బంగారం

- ఇది క్వార్ట్జ శిలల్లో లభిస్తుంది. ఆభరణాలుగా ఉపయోగిస్తారు.
- ప్రపంచ బంగారం ఉత్పత్తిలో మన దేశం వాటా 0.75 శాతం ఉంది.
- దేశంలో అత్యధికంగా బంగారాన్ని ఉత్పత్తి చేసే ప్రాంతం – కోలార్, హట్టి (కర్ణాటక)
- ప్రస్తుతం బంగారం లభించడం లేదు.

వెండి

- వెండిని బంగారం తర్వాత నాణ్యమైన వస్తువుగా చెప్పుకుంటారు.
- దీన్ని ఆభరణాల తయారీకి, పళ్లు కట్టడానికి, ఛాయాచిత్ర వస్తువుల తయారీకి, ఎలక్ట్రోప్లేటింగ్ మొదలైన వాటికి ఉపయోగిస్తారు.
- వెండికి ప్రసిద్ధిగాంచిన ప్రాంతం – రాజస్థాన్‌లోని జావార్. ఇది మంచి విద్యుత్ వాహకం.

ప్లాటినం

- దేశంలో 2010లో కనిపెట్టిన విలువైన ఖనిజం ప్లాటినం.
- ఒడిశా, తమిళనాడులో ప్లాటినం నిల్వలు ఉన్నాయి.

టంగ్‌స్టన్

- టంగ్‌స్టన్ ఖనిజానికి ప్రసిద్ధిగాంచిన ప్రాంతం – రాజస్థాన్‌లోని డేఘన.
- దీన్ని వెల్డింగ్ ఎలక్ట్రోడ్లుగా, మెటల్ వర్కింగ్‌లో ఉపయోగిస్తారు.

క్రోమైట్

- క్రోమైట్ ఖనిజానికి ప్రసిద్ధిగాంచిన ప్రాంతం – ఒడిశాలోని సుకింద.
- దీన్ని స్టెయిన్‌లెస్ స్టీల్ తయారీలో ఉపయోగిస్తారు.

విభజించు.. ఆక్రమించు

భారతదేశ చరిత్ర



గ్రూప్స్ ప్రత్యేకం

బెంగాల్‌లో ద్వంద ప్రభుత్వం

- బ్రిటిష్ కంపెనీ అధికారుల కబంధ హస్తాల్లో ఇరుక్కుపోయిన బెంగాల్ పరిస్థితిని రాబర్ట్ క్లైవ్ స్వయంగా ఇలా వర్ణించాడు.. 'అటువంటి అరాచకత్వం, గందరగోళం, అవినీతి, లంచగొండితనం, దోపిడి ఒక్క బెంగాల్‌లో తప్ప ప్రపంచంలో మరెక్కడా కానరాదని నేను ఘంటాపథంగా చెప్పగలను. అలాగే అంత అధమంగా, దురాశాపూరితంగా సంపద పోగేసుకోవడం కూడా నేనెక్కడా చూడబోను'. అక్షరాల 30 లక్షల పౌండ్ల ఆదాయం తెచ్చిపెట్టే బెంగాల్, బీహార్, ఒరిస్సా రాష్ట్రాలు.. మీర్ జాఫర్‌ని మళ్లీ గద్దె ఎక్కించినప్పటి నుంచి కంపెనీ అధికార్ల సంపూర్ణ ఏలుబడి కింద ఉన్నాయి. పౌర, సైనిక అధికారాలు రెండూ వాళ్లవే. కాస్తోకూస్తో అధికారం, పలుకుబడి కలిగిన ప్రతి మనిషి దగ్గరా, నవాబు మొదలుకొని చోటా జమీందారు దాకా అందరి దగ్గరా కంపెనీ అధికార్లు విరాళాలు గుంజారు.
- ఇక లండన్‌లోని కంపెనీ అధికార్లు తమ వంతు కర్తవ్యంగా బెంగాల్ సంపదని పీల్చిపిప్పి చేయడానికి పూనుకొన్నారు. భారతీయ వస్తువులను కొనుగోలు చేయడానికి వాళ్లు డబ్బు పంపటం మానుకున్నారు. బెంగాల్ మీద వచ్చే ఆదాయంతో ఇక్కడ సరుకు కొని, ఇంగ్లండ్‌లో అమ్ముకున్నారు. వాటికి కంపెనీ పెట్టుబడి అని పేరు పెట్టారు. కంపెనీ సంపాదించే లాభాల్లో ఇవి ఒక భాగం. ఈ భాగోతం చాలక, బ్రిటిష్ ప్రభుత్వం తన వాటా పంపించమని, కంపెనీని నిలదీసింది. ఏటా నాలుగు లక్షల పౌండ్లు తనవాటా కింద చెల్లించమని ప్రభుత్వం 1767లో ఉత్తర్వులు జారీచేసింది.
- 1766 నుంచి 1768 వరకు అంటే మూడు సంవత్సరాల స్వల్పకాలంలో తూర్పు ఇండియా కంపెనీ బెంగాల్ నుంచి సుమారు 57 లక్షల పౌండ్లను వసూలు చేసింది. ద్వంద్వ ప్రభుత్వ వ్యవస్థ అవినీతి ఒక వైపు, ఉన్న సంపద యావత్తు ఊడ్చుకుపోయే దమననీతి మరొక వైపు రాష్ట్రాన్ని పిప్పిచేశాయి. 1770లో బెంగాల్‌లో భయంకర క్షామం సంభవించింది. దాని కరాళనృత్యంతో జరిగిన ఘోరకలి లెక్కగడితే మానవ చరిత్రలో అంతటి భయానక కాటకం మరొకటి లేదని రుజువైంది. లక్షలాది మంది పురుగుల్లా రాలిపోయారు. బెంగాల్ జనాభాలో దాదాపు మూడోవంతు కరువు రాక్షసికి బలైపోయారు. వానలు కరువై క్షామం సంభవించినప్పటికీ దాని భయంకర పరిణామాలకు కారణం కంపెనీ విధానాలే.
- 1772లో కంపెనీ ప్రభుత్వం 'వారెన్ హేస్టింగ్స్'ను బెంగాల్ గవర్నర్‌గా నియమించి పరిస్థితిని పునర్వ్యవస్థీకరించమని ఆదేశించింది. అతని నియామకం హిందూ దేశంలో కంపెనీ పాలనలో గవర్నర్ జనరల్ పరిపాలనా అధ్యాయానికి నాందిగా పరిణమించింది. వారెన్ హేస్టింగ్స్ బ్రిటిష్ సామ్రాజ్య స్థాపనకు పునాది వేశాడు.

వారెన్ హేస్టింగ్స్ ఆక్రమణలు (క్రీ.శ. 1772 - 1785)

- బెంగాల్ గవర్నర్‌గా నియమించిన వెంటనే హేస్టింగ్స్ దేశంలో బ్రిటిష్ వారి పలుకుబడిని పెంపొందించడానికి కృషిచేశాడు.
- 1772లో అతడు బెనారస్ సంధి కుదుర్చుకుని కారా, అలహాబాద్ ప్రాంతాలను అయోధ్య నవాబుకు ఇచ్చి 50 లక్షల రూపాయలను పుచ్చుకున్నాడు. అతనికి అవసరమైనప్పుడల్లా సైనిక సహాయం చేయడానికి కూడా కంపెనీ ప్రభుత్వం అంగీకరించింది.
- ఇతని కాలంలో మొదటి ఆంగ్ల మరాఠా యుద్ధం, రెండో మైసూర్ యుద్ధం జరిగాయి.

రెండో మైసూరు యుద్ధం (1780-1784)

- హైదరాలీతో యుద్ధం 1780లో మొదలైంది. అంతకుముందు మాదిరిగానే హైదరాలీ ఇంగ్లిష్ వారిని దెబ్బమీద దెబ్బ తీశాడు. ఇంగ్లిష్ సైన్యంలో అనేక మంది లొంగిపోక తప్పలేదు. హైదరాలీ దాదాపు యావత్తు కర్ణాటకను కైవసం చేసుకున్నాడు. కానీ మరోసారి బ్రిటిష్‌వారి రాజనీతిజ్ఞత, ఆయుధ బలం వారిని కాపాడింది. గుంటూరు జిల్లాని అప్పగించడం ద్వారా నిజాంను లంచంతో లొంగదీసుకుని బ్రిటిష్ వ్యతిరేక కూటమి నుంచి విడదీశారు. వారెన్ హేస్టింగ్స్ 1781–82 మధ్య మహారాష్ట్రులతో సంధి చేసుకుని, మహారాష్ట్ర సరిహద్దుల్లో కాపుంచిన సైన్యాన్ని ఉపసంహరించి మైసూరుకు వ్యతిరేకంగా మోహరించాడు. 1781 జూలైలో ఐర్‌క్యూట్ నాయకత్వంలో సాగిన బ్రిటిష్ సేనలు పోర్టునోవా వద్ద హైదరాలీని ఓడించి మద్రాసును కాపాడుకున్నాయి. 1782లో హైదరాలీ మరణానంతరం అతని కుమారుడు టిప్పు సుల్తాన్ యుద్ధాన్ని కొనసాగించాడు. ఉభయులూ ఒకరినొకరు ఓడగొట్టలేక పోరు విరమించి 1784 మార్చిలో శాంతి ఒప్పందం చేసుకున్నారు. ఈ విధంగా బ్రిటిష్‌వారు మహారాష్ట్రులనుగానీ, మైసూరునుగానీ ఓడించలేమని గ్రహించారు. అయినా భారతదేశంలో పట్టు నిలుపుకుని తమ రాజకీయ చతురతను రుజువు పర్చుకున్నారు. బ్రిటిష్ సామ్రాజ్యం దక్షిణ భారతంలో పూర్తిగా తుడిచిపెట్టుకు పోకుండా కాపాడుకోవడమేగాక, ఆ యుద్ధాల్లో దేశంలోని మూడు అగ్రరాజ్యాల్లో ఒకటిగా బ్రిటిష్ రాజ్యం మొగ్గ తొడిగింది.

కారన్‌వాలీస్ - మూడో మైసూరు యుద్ధం (1790-92)

- 1786లో పదవీ బాధ్యతలు చేపట్టిన గవర్నర్ జనరల్ కారన్‌వాలీస్.. టిప్పు సుల్తాన్‌ను బలహీనపర్చడానికి కంపెనీకి మహారాష్ట్రుల సహకారం తప్పనిసరని భావించాడు. ఈలోగా టిప్పు సుల్తాన్ మంగళూరు సంధి నిరుపయోగమైనదని గ్రహించి 1787లో పారిస్‌కు, కాన్‌స్టాంటినోపుల్‌కు తన దూతలను పంపగా, ఆ సమయానికి వాళ్లెవరూ అతనికి సహాయం చేసేందుకు ముందుకు రాలేదు. కారన్‌వాలీస్ 1788లో గుంటూరు సర్కారుని పొంది, నిజాంకు 1768 ఒప్పందం ప్రకారం సహాయపడటానికి అంగీకరించాడు. 1789 డిసెంబర్‌లో కంపెనీవారికి ఎప్పటినుంచో మిత్రుత్వంగల తిరువాన్కూర్ సంస్థానాన్ని టిప్పుసుల్తాన్ ముట్టడించడం మూడో మైసూరు యుద్ధానికి తక్షణ కారణమైంది.
- కారన్‌వాలీస్ ఈ ఆక్రమణను యుద్ధంగా గుర్తించి తన కుటిల నీతితో మరాఠా, నిజాం పాలకులతో ఒక త్రైపాక్షిక ఒడంబడికను చేసుకున్నాడు. వీరు ముగ్గురూ కలిసి టిప్పు సుల్తాన్‌తో యుద్ధం చేశారు. యుద్ధం రెండేండ్లపాటు సాగింది. జనరల్ మెడోస్‌ను నిర్వీర్యం చేయడం ద్వారా టిప్పు సుల్తాన్ ఖ్యాతిని, కాలాన్ని సద్వినియోగం చేసుకున్నాడు. 1791 మార్చి 21న కారన్‌వాలీస్ స్వయంగా నాయకత్వం వహించి బెంగళూరును ఆక్రమించాడు. 1791 డిసెంబర్ 3న టిప్పు కోయంబత్తూరును ఆక్రమించాడు. 1792 ఫిబ్రవరి 5 నాటికి కారన్‌వాలీస్ బొంబాయి సేనలతో శ్రీరంగ పట్టణం ముట్టడించాడు. అనివార్యమైన పరిస్థితుల్లో టిప్పుసుల్తాన్ 1792 మార్చిలో శ్రీరంగపట్టణం ఒప్పందం చేసుకున్నాడు.
- ఆ ఒప్పందం ప్రకారం కృష్ణా, పెన్నా నదుల మధ్య భాగంలో ఎక్కువ భాగం నిజాంకు, కొంత మహారాష్ట్రులకు ఇవ్వాల్సి వచ్చింది. మలబార్, కూర్గ్, దిండిగల్, బారామహల్‌లను ఇంగ్లిష వారికి ఇవ్వాల్సి వచ్చింది. దీంతో టిప్పు సుల్తాన్ తన రాజ్యంలో సగానికిపైగా కోల్పోయాడు. అంతేగాక కంపెనీకి 30 లక్షల పౌండ్లను నష్టపరిహారంగా ఇస్తూ, తన ఇరువురు కుమారులను కారన్‌వాలీస్ శిబిరంలో ఉంచాల్సి వచ్చింది.

మొదటి ఆంగ్ల - మరాఠా యుద్ధం (1775 - 1782)

- 1775లో ఇంగ్లిష్ వాళ్లకి మహారాష్ట్రులతో తగాదా వచ్చింది. మహారాష్ట్రుల మధ్య అధికార వారసత్వం కోసం సంఘర్షణ రగిలిన కాలం ఇది. పసివాడిగా ఉన్న రెండో మాధవరావు పీష్వా తరపున నానా ఫడ్నవీస్, అతనికి వ్యతిరేకంగా రఘునాథరావు బరిలోకి దిగిన సమయం. బాంబేలోని కంపెనీ అధికార్లు రఘునాథరావు తరుపున రంగంలోకి దిగారు. మద్రాసు, బెంగాల్ ప్రాంతాల్లో మాదిరిగా సంఘటనలు ఇక్కడా పునరావృతం అవుతాయని కంపెనీ వాళ్లు ఆశించారు. మద్రాసులో, బెంగాల్‌లో మాదిరిగా మహారాష్ట్రలో కూడా డబ్బు సంచులు గుంజుకోవచ్చని ఆశపడ్డారు. 1775 నుంచి 1782 దాకా మహారాష్ట్రులతో సాగిన సుదీర్ఘ యుద్ధంలో తలమునకలై పోయారు.
- ప్రారంభంలో మహారాష్ట్రులు బ్రిటిష్ బలగాలను తలెగావ్ దగ్గర ఓడించి వడెగావ్ ఒడంబడిక మీద సంతకాలు పెట్టించారు. దీని ప్రకారం ఇంగ్లిష్ వాళ్లు తాము జయించిన భూభాగాన్ని తిరిగి అప్పగించారు. రఘునాథరావు పక్షం వదిలివేశారు. కానీ మళ్లీ వెంటనే యుద్ధం మొదలైంది. భారతదేశంలో బ్రిటిష్ ఆధిపత్యానికి ఎసరొచ్చిన విషమకాలం అది. మరాఠా సర్దార్లు యావన్మంది పీష్వా తరుపున, పీష్వాను బలపరిచే నానా ఫడ్నవీస్ తరుపున ఐక్యంగా నిలబడ్డారు. ఇంగ్లిష్ వాళ్ల వాసనగిట్టని హైదర్ అలీ, నైజాంలు కంపెనీకి వ్యతిరేకంగా యుద్ధం ప్రకటించారు. మహారాష్ట్రులు, హైదరాలీ, నైజాంల శక్తివంతమైన సంయుక్త ప్రతిఘటనని కంపెనీ ఏకాకిగా ఎదుర్కోవలసి వచ్చింది. పైగా అమెరికాలో 1776లో ప్రజలు బ్రిటిష్ వాళ్లకి వ్యతిరేకంగా తిరుగబడ్డారు.
- అమెరికా వలస యుద్ధాల్లో బ్రిటిష్‌వారి ఓటమి దగ్గరపడింది. మరోవైపు చుట్టుముట్టిన ఇబ్బందుల్లో ఊపిరాడక ఉక్కిరిబిక్కిరవుతున్న తమ పాత శత్రువును తొక్కిపారేయడానికి ఫ్రెంచివారు సమాయత్తమయ్యారు. ఇలాంటి పరిస్థితుల్లో నాటి బ్రిటిష్ గవర్నర్ జనరల్ వారెన్ హేస్టింగ్స్.. కూలిపోతున్న తమ సామ్రాజ్యాన్ని తన సమర్థతతో, పట్టుదలతో నిలబెట్టాడు. బ్రిటిష్ కంపెనీ సేనలు 1780లో అహ్మదాబాద్‌ను స్వాధీనం చేసుకున్నాయి. అయితే అమేయ సాదన సంపత్తితో, తీవ్ర అభినివేశంతో పోరుకు తలపడ్డ మహారాష్ట్రులు బ్రిటిష్ సైన్యానికి చెమటలు పట్టించారు. మహదాజీ సింధియా తన ప్రతాపప్రభ ప్రదర్శించాడు. ఆయనతో పోటీకి ఇంగ్లిష్‌వారు జంకారు. ఇరుపక్షాల్లో విజయం ఎవరిని వరించలేదు. యుద్ధం నిలిచిపోయింది. మరాఠాలు, ఆంగ్లేయులు 1782లో 'సాల్బే శాంతి సంధి'పై సంతకాలు చేశారు. యథాపూర్వ స్థితికి ఉభయపక్షాలు సమ్మతించాయి. భారత సంస్థానాల సంయుక్త ప్రతిఘటన నుంచి ఇంగ్లిష్‌వారు బైటపడ్డారు.
- దీన్నే చరిత్రలో మొదటి ఆంగ్ల–మహారాష్ట్ర యుద్ధం అంటారు. ఈ యుద్ధంలో ఏ పక్షానికి విజయం దక్కలేదు. అయితే బ్రిటిష్‌వారికి మేలు జరిగింది. ఆ యుద్ధం తర్వాత 20 ఏండ్లపాటు మహారాష్ట్రులతో శాంతియుతంగా జీవించే సదుపాయం కలిగింది. అప్పట్లో మహారాష్ట్రులంటే దేశంలో ఒక దుర్భేధ్య శక్తి. మహారాష్ట్రులతో శాంతి వర్ధిల్లిన కాలంలో ఇంగ్లిష్‌వారు బెంగాల్ ప్రెసిడెన్సీలో తమ ప్రభుత్వాన్ని ధృడపర్చుకున్నారు. ఈ లోగా మారణ అంతఃకలహాల్లో మునిగిపోయి మహారాష్ట్రుల శక్తియుక్తులు ఉడిగిపోయాయి. సాల్బే సంధి ప్రకారం హైదరాలీతో జరిగిన యుద్ధంలో పూర్వం కోల్పోయిన తమ భూభాగాన్ని పునరాక్రమించుకునే సందర్భం వచ్చినప్పుడు మహారాష్ట్రులు ఇంగ్లిష్‌వారికి మద్దతు ఇస్తామని వాగ్దానం చేశారు. కాబట్టి ఇంగ్లిష్‌వారు మైసూరు మీద యుద్ధానికి సిద్ధమయ్యారు. ఈ విధంగా స్వదేశీ సంస్థానాలు రెండింటిని చీల్చడంలో ఇంగ్లిష్‌వారు మరోసారి సఫలమయ్యారు.

సాసాల మల్లికార్జున్
అసిస్టెంట్ ప్రొఫెసర్
పెద్దపల్లి డిగ్రీ కాలేజీ
9492575006



తెలంగాణ హస్తకళలు



నకాష్ (నిర్మల్ పెయింటింగ్స్, బొమ్మలు)

- ఆదిలాబాద్ జిల్లాలోని నిర్మల్ పట్టణంలో కళాత్మకమైన బొమ్మలు, వస్తువులు చిత్రాలు తయారవుతాయి. వీటినే 'నకాష్'లని పిలుస్తారు. ఇక్కడ తయారయ్యే కళాత్మక వస్తువులు మూడు రూపాలుగా ఉంటాయి.
  1. చేతి వస్తువులు
  2. నిర్మల్ పెయింటింగ్స్
  3. నిర్మల్ ఇంటి సామాగ్రి
- **నిర్మల్ కొయ్య బొమ్మల తయారీలో ఉపయోగించే కలప:** పునికి, టేకు
- నిర్మల్ హస్తకళలు కాకతీయుల కాలంలో ఆవిర్భవించాయి. నిర్మల్ కళకు ఆద్యుడు– నిమ్మనాయుడు (17వ శతాబ్దం)
- నిర్మల్ హస్తకళలలో లక్కను ఉపయోగించి చేసే ఫర్నిచర్, ఇతర అలంకార వస్తువులు ఎంతో ప్రాచుర్యం పొందాయి.
- నిర్మల్ పెయింటిగ్స్‌ను సహజ రంగులను ఉపయోగించి తయారు చేస్తారు.
- నిర్మల్ కళలో ఇండియన్, మొగలుల శైలి కనిపిస్తుంది.
- నిర్మల్ బొమ్మలను అలంకరించడానికి ప్రత్యేకమైన ఆయిల్ పెయింటింగ్స్ వాడుతారు.

పెంబర్తి

- వరంగల్ జిల్లాలో పెంబర్తి గ్రామం ఉంది. కాకతీయుల కాలంలో పెంబర్తి ఇత్తడి కళా నైపుణ్యం ఉచ్ఛదశకు చేరుకున్నది.
- ఇక్కడ ఇత్తడిని ఉపయోగించి అత్యద్భుతమైన కళా ఖండాలను తయారు చేస్తారు.
- పెంబర్తి కళావస్తువులు రథాల అలంకరణ, ఆలయాల అలంకరణ, షాండిలియర్లు, జ్ఞాపికలు మొదలైనవి.

ఇక్కత్ (పోచంపల్లి వస్త్రకళ)

- నల్లగొండ జిల్లాలో పోచంపల్లి గ్రామం ఉంది.
- స్వామి రామనంద తీర్థ గ్రామీణ సంస్థ కంప్యూటర్ ఆధారిత నేత డిజైన్లను అందిస్తుంది.
- ఇక్కడ వస్త్రాలపై వేసే డిజైన్ కళను ఇక్కత్ కళ అంటారు. దీనికి భౌగోళిక గుర్తింపు లభించింది.

చేర్యాల స్క్రోల్ పెయింటింగ్స్

- వరంగల్ జిల్లాలో చేర్యాల గ్రామం ఉంది.
- పురాణ కథలను డిజైనులుగా తీసుకొని వివిధ రంగులతో అత్యంత అద్భుతమైన పెయింటింగ్స్ చేస్తారు.
- చేర్యాల పెయింటింగ్స్ కళాకారులను 'నకాషీ'లు అంటారు. ఇక్కడి పెయింటింగ్‌ను థీమ్ పెయింటింగ్ అని కూడా పిలుస్తారు.
- నకాషీ అనేది ఉర్దూ పదం. తెలంగాణ జానపద సంస్కృతి నకాషీ చిత్రాల్లో కనిపిస్తుంది. దీపావళి, కార్తీకమాసంలో కేదారీశ్వరీ వ్రతం చేయడం కోసం ఇండ్లలో తెల్లటి సున్నపు గోడలపై జాజుతో పొప్పెడ అనే చిత్రాలను గీసేవారు.

హైదరాబాద్ బిద్రి వస్తువులు

- హైదరాబాద్ నగరంలో గన్‌మెటల్ (కాపర్, జింకుల మిశ్రమం)తో తయారు చేసిన కళాఖండాల మీద నల్లటి రంగువేసి దానిపై వెండి లేదా బంగారు రంగులతో డిజైన్లు వేస్తారు.
- హైదరాబాద్ సంస్థానంలో భాగంగా ఉన్న బీదర్ జిల్లాలో ఈ కళ అభివృద్ధి చెందింది. కాబట్టి ఈ కళకు బిద్రి అనే పేరు వచ్చింది. బిద్రి కళ ఇరాన్ నుంచి హైదరాబాద్ సంస్థానానికి వచ్చింది.

సిల్వర్ ఫిలిగ్రీ (వెండి తీగ కళాఖండాలు)

- ఈ కళకు కరీంనగర్ జిల్లా పెట్టింది పేరు. వెండి తీగ, బంగారపు తీగలతో అల్లకం పద్ధతిలో తయారు చేసే వస్తువులను సిల్వర్ ఫిలిగ్రీ అని పిలుస్తారు.
- 200 ఏండ్ల క్రితం జిల్లాలో ఈ కళ ఆవిర్భవించింది. దీనిని ప్రవేశపెట్టింది కడార్ల రామయ్య. సిల్వర్ ఫిలిగ్రీ వస్తువులలో పొందానాలు, అత్తర్ దానాలు, హుక్కాలు, ప్లేట్లు మొదలైన వస్తువులు ఉంటాయి.

ఆసియా రుమాల్

- నల్లగొండ జిల్లాలోని పోచంపల్లిలో వీటిని తయారు చేస్తారు. ఇక్కత్ అనే నేతను దీనిలో ఉపయోగిస్తారు.
- సంక్లిష్టమైన రేఖా చిత్రాలు, మార్జిన్లను వీటిపై ఉపయోగిస్తారు. దారాన్ని తైలంలో ముంచి ఆరవేస్తారు.
- వీటిని గొర్రె పేడతో నింపిన నీటిలో ఒక రాత్రి ఉంచి, మరునాడు ఆరబెడుతారు. నాలుగు రోజులపాటు ఈ విధంగా చేస్తారు. ఆ తర్వాత టై–డై ప్రక్రియలో రంగులను అద్ది చిత్రాలను గీస్తారు.

బంజార హస్త కళ

- తెలంగాణలోని బంజార తెగలు వారి వస్త్రాలపై సూదిని ఉపయోగించి చిన్నచిన్న అద్దాలు రంగు రాళ్లు గవ్వలతో ఈ కళను ప్రదర్శిస్తారు.

డోక్రా మెటల్ క్రాఫ్ట్స్

- బెల్‌మెటల్ ఉపయోగించి ఆదిలాబాద్ గిరిజన ప్రాంతంలోని గిరిజనులు అతిసున్నితమైన, సహజమైన కళాఖండాలను తయారు చేస్తారు.
- జానపద డిజైన్లు, నెమళ్లు, ఏనుగులు, గుర్రాలు, దీపాలు తదితర వస్తువులను తయారు చేస్తారు. వీటిలో ఎక్కడా ఒక్క అతుకు కూడా ఉండదు.

కంచు కళాఖండాలు

- హైదరాబాద్‌లోని శిల్పారామంలో ఈ కళాఖండాలు కొలువుదీరి ఉన్నాయి.
- దేవతల విగ్రహాలు, నటరాజ విగ్రహం అలంకరణ వస్తువులు, సాధారణంగా తయారుచేస్తారు.

లంబాడా ఎంబ్రాయిడరీ

- నిజామాబాద్ జిల్లాలోని లంబాడా మహిళలు రంగురంగుల దుస్తులు, బంగారం, వెండి, బీడ్స్‌తో తయారు చేసిన ఆభరణాలతో అలంకరించుకుంటారు.
- లంబాడా మహిళలు ఎంబ్రాయిడరీ వర్క్, వారి బట్టలు, సంచులు, టుక్రీలు తయారు చేయడంలో ప్రసిద్ధి పొందారు.

గద్వాల కొత్తకోట చీరలు

- మహబూబ్‌నగర్ జిల్లా గాద్వాల కొత్తకోట ప్రాంతాల్లో అనేక కుటుంబాలు ఈ విధమైన చేనేత చీరలను నేస్తారు.
- పట్టు, జరీ, లేసులు, కలంకారీలు ఉపయోగించి ఈ చీరలను అత్యంత నైపుణ్యంతో తయారు చేస్తారు.

నాయక్‌పోడుల మాస్కులు

- నాయక్‌పోడులు లక్ష్మీదేవరను, కృష్ణున్ని, పాండవులను, పోతరాజు మొదలైన దేవుళ్లను మాస్కుల రూపంలో పూజిస్తారు.
- ఈ మాస్కులను స్థానిక వడ్రంగి వారితో తయారు చేయించి గ్రామ ఆలయాల్లో ఉంచి సంరక్షిస్తూ ప్రతి ఏడాది ఉత్సవాల్లో పూజిస్తారు.

డర్రీలు (వరంగల్ తివాచీలు)

- కాకతీయుల కాలం నుంచి ఈ కళ వరంగల్‌లో కొనసాగుతున్నది. వీటినే డర్నీలుగా పిలుస్తారు.
- ఇటలీ యాత్రికుడైన మార్కోపోలో కాకతీయ సామ్రాజ్యాన్ని సందర్శించి వీటిని తన రచనలలో ప్రస్తావించారు.

రంజన్ కుండలు

- వీటి తయారీకి ఆదిలాబాద్ జిల్లా ప్రసిద్ధి మహబూబ్‌నగర్‌లోని షాద్‌నగర్‌లో కూడా వీటిని తయారు చేస్తారు.
- సాంకేతికంగా, శాస్త్రీయంగా తయారు చేసే మట్టి కుండలనే రంజన్ కుండలు అని పిలుస్తారు. వీటి ప్రత్యేకత కాలానికి తగ్గట్లుగా నీటిని సరైన ఉష్ణోగ్రతలో ఉంచుతాయి.

ప్రతిభకు పరీక్ష

1. **మన సౌర వ్యవస్థలో అత్యంత పురాతనమైన గ్రహం ఏది?**
   1) గురు 2) శని
   3) శుక్రుడు 4) బుధుడు
2. **2018 వాతావరణ మార్పు సదస్సును ఏ దేశంలో నిర్వహిస్తామని ఐక్యరాజ్యసమితి ప్రకటించింది?**
   1) బ్రిటన్ 2) పోలెండ్
   3) జర్మనీ 4) స్పెయిన్
3. **దేశంలో అత్యంత పొడవైన ధోలా - సాదియా వారధిని ప్రధానమంత్రి నరేంద్రమోదీ జాతికి అంకితం చేశారు. అయితే ఇప్పటివరకు పొడవైన వంతనగా ఉన్నది?**
   1) బాగల్‌పూర్‌లో గంగానదిపై ఉన్న విక్రమశిలా సేతు
   2) కేరళలోని వెంబానద్ సరస్సుపై ఉన్న వంతెన
   3) ముంబైలోని మహిమ్ బే పై బంద్రా – వోర్లి సీ లింక్
   4) బీహార్‌లో గంగానదిపై ఉన్న మహాత్మా గాంధీ సేతు
4. **ప్రతిష్ఠాత్మక 'కార్నెగీ మెడల్' అంతర్జాతీయ పురస్కారాన్ని పొందిన ప్రముఖ భారతీయుడు ఎవరు?**
   1) రతన్‌టాటా 2) ఉర్జిత్ పటేల్
   3) రఘురామ్ రాజన్ 4) అజీం ప్రేమ్‌జీ
5. **ప్రపంచంలో అత్యధికంగా కార్బన్ డై ఆక్సైడ్ ఉద్గారాలను విడుదల చేస్తున్న దేశం?**
   1) చైనా 2) బ్రెజిల్
   3) బ్రిటన్ 4) అమెరికా

సమాధానాలు శుక్రవారం నిపుణలో..

17న ఇచ్చిన సమాధానాలు: 1-1, 2-2, 3-1, 4-2, 5-1, 6-2.
22న ఇచ్చిన సమాధానాలు: 1-1, 2-2, 3-1, 4-1, 5-4.

ప్రియమణి వివాహం!


ముస్తఫారాజ్, ప్రియమణి

'ఎవరే అతగాడు' సినిమాతో తెలుగు ప్రేక్షకులకు పరిచయమైన కన్నడ సోయగం ప్రియమణి. గత కొంత కాలంగా వ్యాపార వేత్త ముస్తాఫారాజ్‌తో ప్రేమలో వున్న ఆమె అతన్ని బుధవారం రిజిస్టర్ మ్యారేజ్ చేసుకుంది. రెండు మతాలకు చెందిన వీరి వివాహం బెంగళూర్‌లోని శివాజీనగర్‌లో నిరాడంబరంగా జరిగింది. గురువారం రిసెప్షన్ జరగనుంది. 22న ఎలాంటి హంగూ ఆర్భాటం లేకుండా అత్యంత సన్నిహితులు, బంధువుల మధ్య సంగీత్ వేడుక జరుపుకున్న ప్రియమణి రిసెప్షన్‌ను మాత్రం భారీ స్థాయిలోనే ప్లాన్ చేసినట్లు చెబుతున్నారు. ఇందు కోసం భారీగా ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిసింది. దక్షిణాదికి చెందిన దాదాపు అన్ని భాషల్లో నటించి మంచి గుర్తింపును సొంతం చేసుకున్న ప్రియమణి వివాహ విందుకు తెలుగు చిత్రపరిశ్రకు చెందిన ప్రముఖ నటీనటులతో పాటు తమిళ, మలయాళ, కన్నడ భాషలకు సంబంధించిన ప్రముఖులు హాజరుకానున్నారట. రిసెప్షన్ తరువాత రోజు నుంచి ఎప్పటిలాగే నూతన చిత్రం షూటింగ్‌లో పాల్గొంటానని, హనీమూన్‌కు వెళ్లడం లేదని ప్రియమణి ఇటీవలే వెల్లడించింది.


వరుణ్‌తేజ్, సాయిపల్లవి

ఒకే థియేటర్‌లో కోటి...

తెలంగాణ భాషకు, సంస్కృతులకు పెద్దపీట వేస్తూ దర్శకుడు శేఖర్‌కమ్ముల తెరకెక్కించిన చిత్రం 'ఫిదా'. వరుణ్‌తేజ్, సాయిపల్లవి జంటగా నటించారు. తక్కువ బడ్జెట్‌లో చిన్న సినిమాగా దిల్‌రాజు నిర్మించిన ఈ చిత్రం విమర్శకుల ప్రశంసలతో పాటు అంచనాలకు మించి వసూళ్లను సాధిస్తున్నది. తాజాగా ఈ సినిమా హైదరాబాద్‌లోని ఒక్క సుదర్శన్ థియేటర్‌లోనే కోటి రూపాయలకుపైగా వసూళ్లను సాధించినట్లు తెలిసింది. సింగిల్ థియేటర్‌లో కోటి రూపాయల మైలురాయిని దాటిన చిత్రంగా 'ఫిదా' సరికొత్త రికార్డును సొంతం చేసుకున్నట్లు ట్రేడ్ వర్గాలు చెబుతున్నాయి. ఇప్పటివరకు సుదర్శన్ థియేటర్‌లో 33 రోజుల్లో 1.04 కోట్ల వసూళ్లను ఈ చిత్రం సాధించినట్లు సమాచారం.

కార్మికులతోనే ఆర్టీసీకి మనుగడ

టీఎస్ఆర్టీసీ చైర్మన్ సోమారపు సత్యనారాయణ

1,616 మంది కార్మిక, సూపర్‌వైజర్లకు అవార్డులు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: సామర్థ్యానికి మించి బస్సులను నడిపిన ఘనత టీఎస్ ఆర్టీసీదేనని సంస్థ చైర్మన్ సోమారపు సత్యనారాయణ చెప్పారు. కార్మికులతోనే ఈ ఘనత, సంస్థ మనుగడ సాధ్యమైందని, మెరుగైన పనితీరు కనబరిచిన కార్మికులకు తప్పనిసరిగా గుర్తింపు ఉంటుందని చెప్పారు. బుధవారం హైదరాబాద్ ఆర్టీసీ కళాభవన్‌లో జరిగిన హైమైలేజీ అవార్డుల ప్రదానోత్సవంలో ఎండీ జీవీ రమణారావుతో కలిసి మెకానిక్, సూపర్‌వైజర్లకు ప్రోత్సాహక అవార్డులు, బహుమతులను అందజేశారు. 2011 డిసెంబర్ నుంచి 2017 ఫిబ్రవరి వరకు 10 లక్షల కిలోమీటర్లుదాటిన 808 అశోక్ లేలాండ్ బస్సులను పరిగణనలోకి తీసుకొని మైలేజీని అధిగమించిన ఒక్కో బస్సుకు సంబంధించి రెండు బహుమతుల చొప్పున 1,616 మంది కార్మిక, సూపర్‌వైజర్లకు అవార్డులు ప్రదానం చేశారు. హై మైలేజీ అవార్డుల్లో కరీంనగర్, ఖమ్మం, నల్లగొండ రీజియన్లు తొలిమూడు స్థానాల్లో నిలిచాయని చెప్పారు. గత ఏడాది కేవలం ఐదు డిపోలే లాభాల్లో ఉండగా, ప్రస్తుతం వాటిసంఖ్య 34కు చేరిందనన్నారు. సంస్థలో ఈ ఏడాది రూ.120 కోట్ల నష్టాలు తగ్గించుకునే ప్రయత్నం చేస్తున్నామన్నారు. కొత్తగా మరో 1400 గ్రామాలకు బస్సు సౌకర్యం కల్పిస్తామన్నారు. ఆర్టీసీ ఎండీ జీవీ రమణారావు మాట్లాడుతూ ఆయా రీజియన్ల స్థాయిలో తీసుకున్న చర్యల వల్ల హై మైలేజ్ సాధించడం గర్వకారణమన్నారు. కార్యక్రమంలో ఈడీలు ఎం రవీందర్, వేణు, నాగరాజు, సత్యనారాయణ, పురుషోత్తంనాయక్, అశోక్‌లేలాండ్ ఉపాధ్యక్షుడు జాలాజ్ గుప్తా, ప్రాంతీయ మేనేజర్ ఎన్ దివాకర్‌రెడ్డి, తెలంగాణ, ఏపీ ఎస్టీయూ హెడ్‌సర్వీస్ సునీల్‌టాండన్ పాల్గొన్నారు.



బుధవారం హైదరాబాద్‌లోని ఆర్టీసీ కళాభవన్‌లో హై మైలేజీ అవార్డు గ్రహీతలతో టీఎస్ఆర్టీసీ చైర్మన్ సోమారపు సత్యనారాయణ, ఎండీ జీవీ రమణారావు

అనంతగిరికి పర్యాటక సిరి

- పాక్షిక అభయారణ్యంగా గుర్తించేందుకు చర్యలు
- చెక్‌పోస్టుల ఏర్పాటు, భారీ వాహనాలపై ఆంక్షలు
- అనంతగిరి అభివృద్ధి కమిటీ ఏర్పాటుపై కసరత్తు



వికారాబాద్ జిల్లాలోని అనంతగిరి కొండలు

ప్రత్యేక ప్రతినిధి, నమస్తే తెలంగాణ: ప్రకృతి అందాలకు నెలవైన వికారాబాద్ జిల్లాలోని అనంతగిరి కొండలను పర్యావరణ పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దడానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళికలను రూపొందిస్తున్నది. అపార ప్రకృతి సంపదకు, ఔషధ మొక్కలకు ప్రసిద్ధి చెందిన అనంతగిరి అడవులను కన్జర్వేషన్ రిజర్వ్ (పాక్షిక అభయారణ్యం)గా ప్రకటించడానికి ఏర్పాట్లు జరుగుతున్నాయి. వన్యప్రాణుల రక్షణ కోసం అనంతగిరి కొండల మధ్య రహదారుల వెంట భారీ వాహనాల రాకపోకలను నియంత్రించాలని, రాత్రివేళ వాహనాల ప్రవేశంపై ఆంక్షలు విధించాలని అధికారులు భావిస్తున్నారు. ఇందుకోసం రెండు ప్రత్యేక చెక్‌పోస్టులను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. అనంతగిరి కొండలను కేరళ తరహాలో పర్యావరణ, ప్రకృతివైద్యం అందించే పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలని సీఎం కేసీఆర్ గతంలోనే అధికారులను ఆదేశించారు. దీంతో ఉన్నతస్థాయి అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి అనంతగిరి అడవులను ఏ విధంగా అభివృద్ధి చేయవచ్చన్న విషయంపై ప్రాథమిక నివేదిక తయారుచేశారు. 1,654 హెక్టార్లలో ఉన్న అటవీప్రాంతాన్ని కన్జర్వేషన్ రిజర్వ్‌గా ప్రకటించాలని నివేదికలో పేర్కొన్నారు. దీనిలో నుంచి అనంత పద్మనాభస్వామి దేవాలయంతోపాటు మరికొంత ప్రాంతాన్ని మినహాయిస్తారు.

తెలంగాణ ఊటీ..

రాజధాని హైదరాబాద్‌కు సమీపంలో ఉన్న అనంతగిరి అడవులు పర్యాటకులను విశేషంగా ఆకర్షిస్తాయి. దీనిని తెలంగాణ ఊటీగా పిలుస్తారు. వారాంతాల్లో సరదాగా గడుపడానికి అనంతగిరికి వచ్చేవారికి సరైన సౌకర్యాలు అందుబాటులో లేవు. పర్యాటక శాఖ కొన్ని ఏర్పాట్లు చేసినా అవి అంతంతమాత్రమే. ఇక సందర్శకులు ప్లాస్టిక్ వ్యర్థాలను ఎక్కడపడితే అక్కడ పారేయడం వల్ల అవి తిని జింకలు వంటి వన్యప్రాణులు మృత్యువాత పడుతున్నాయి. మరో వైపు ఈ అడవిగుండా వేగంగా వెళ్తున్న భారీ వాహనాలకు కొన్నిరకాల వన్యప్రాణులు బలవుతున్నట్లు సీఎం కార్యాలయం అధికారులు తమ క్షేత్రస్థాయి పర్యటనలో గుర్తించారు. ఈ పరిస్థితిని నివారించడానికి అనంతగిరి అడవుల్లోకి రెండు వైపులా వాహనాలు ప్రవేశించే మార్గంలో చెక్‌పోస్టులు ఏర్పా టు చేయాలని ప్రతిపాదించారు. వన్యప్రాణులు ఎక్కువగా సంచరించే ప్రాంతాల్లో రాత్రివేళ వాహనాల రాకపోకలపై ఆంక్షలుంటాయి. వాహనాలు ఢీకొనడం వల్ల ఆరు జింకలు చనిపోయినట్లు డిప్యూటీ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ శ్రీలక్ష్మి 'నమస్తే తెలంగాణ'కు తెలిపారు. ఏడాదికి దాదాపు 15 వన్యప్రాణులు మృత్యువాత పడుతున్నట్లు సీఎం కార్యాలయం అధికారులు తమ నివేదికలో పేర్కొన్నారు. వన్యప్రాణులకు, అటవీసంపదకు రక్షణ కల్పించడానికి 1,654 హెక్టార్ల పరిధిలోని అడవిని పాక్షిక అభయారణ్యంగా ప్రకటించాలని నిర్ణయించారు. ఈ ప్రతిపాదన ప్రస్తుతం ముఖ్యమంత్రి కార్యాలయ ఉన్నతాధికారుల పరిశీలనలో ఉన్నది. అనంతగిరి అడవుల్లో చిరుతపులులతోపాటు వివిధ రకాల జిం కలు, వందల రకాల పక్షులు, పలురకాల నిశాచర జంతువులు మనుగడ సాగిస్తున్నాయి. వివిధరకాల సీతాకోకచిలుకలతో సందర్శకులకు ఆహ్లాదాన్ని పం చేలా ఒక పార్కును కూడా ఏర్పాటు చేయనున్నారు. భారీ వాహనాలను అడవుల నుంచి కాకుండా మరో మార్గం నుంచి మళ్లించాలని ప్రతిపాదించారు. అన్ని వాహనాలను కేరిల్లి నుంచి ఎన్టీఆర్ సర్కిల్‌కు మళ్లించాలని సూచించారు. రోడ్‌నంబర్ 14, 15 మార్గంలో వాహనాల రాకపోకలను నియంత్రించనున్నారు. ఈ ప్రాంతంలో ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించడానికి చర్యలు తీసుకోవాల్సిన అవసరమున్నదని అధికారులు సిఫారసు చేశారు. దీనికోసం ఎకో-డెవలప్‌మెంట్ కమిటీని ఏర్పాటుచేసి స్వచ్ఛంద కార్యకర్తలను రంగంలోకి దింపాలని సూచించారు. ప్రస్తుతం ఉపయోగంలోలేని టీబీ శానిటోరియాన్ని మూసేసి ఆ భవనాలను పర్యాటకశాఖకు అప్పగించాలని ప్రతిపాదించారు. ఔషధ మొక్కలకు ప్రసిద్ధి చెందిన అనంతగిరి అడవుల చెంత విశాలమైన ఔషధ మొక్కల గార్డెన్‌ను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. దీని చెంతనే బట్టర్‌ఫ్లై పార్క్‌ను నెలకొల్పుతారు.

అనంతగిరి అభివృద్ధి కమిటీ

పర్యాటకులను ఆకర్షించడానికి వివిధ కార్యక్రమాల కోసం అనంతగిరి డెవలప్‌మెంట్ కమిటీని ఏర్పాటుచేయాలని ఉన్నతాధికారులు ప్రతిపాదించారు. ఇందులో ప్రధానశాఖలకు ప్రత్యేక బాధ్యతలను అప్పగించాలని సూచించారు. నీటి ఆటలు లేదా సరస్సుల అభివృద్ధిని నీటిపారుదలశాఖకు, గ్రామీణ పర్యాటకాభివృద్ధిని, స్టీల్ బాటిళ్లు, బట్ట బ్యాగ్‌లను సరఫరా చేసే బాధ్యతను డీఆర్‌డీఏకు, రహదారుల అభివృద్ధిని ఆర్‌అండ్‌బీకి, ఎకో-టూరిజంను అటవీశాఖకు అప్పగించాలని నిర్ణయించారు. వెల్‌నెస్ టూరిజంను ఆరోగ్యశాఖకు, దేవాదాయశాఖకు ఆలయాల అభివృద్ధిని అప్పగించి సమగ్రంగా అభివృద్ధి చేయాలని నిర్ణయించారు. ఇందుకోసం రూ.6.28 కోట్లు అవసరమవుతాయని అంచనా వేశారు.

గిరిజన విద్యాప్రగతికి సర్కారు కృషి

మూడున్నరేండ్లలో రూ.3,495 కోట్ల ఖర్చు

నిరుద్యోగులకు ఉపాధి శిక్షణ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రంలోని గిరిజనుల విద్యాప్రగతికి సర్కారు ప్రత్యేకంగా కృషిచేస్తున్నది. వారి కుటుంబాలు సామాజిక, ఆర్థికప్రగతి సాధించేందుకు చదువు ఎంతో అవసరమని భావించిన సర్కారు గిరిజనుల విద్యకు ప్రణాళికాబద్ధంగా చర్యలు చేపట్టింది. మూడున్నరేండ్లలో గిరిజన గురుకుల విద్యాలయాలు, సంక్షేమ హాస్టళ్లు, గిరిజన స్టడీ సర్కిళ్ల నిర్వహణ, విద్యార్థుల ప్రీమెట్రిక్ స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్, ఉన్నతవిద్య కోసం విదేశాలకు వెళ్లిన గిరిజనులకు ఆర్థిక సహాయానికిగాను ప్రభుత్వం రూ. 3495.63 కోట్లు ఖర్చు చేసింది. విద్యార్థులు ఉన్నత విద్యావకాశాలు పొందేందుకు ఆంగ్ల బోధనా విధానంతో రాష్ట్రవ్యాప్తంగా 145 గిరిజన గురుకుల విద్యాలయాలు, గిరిజన రెసిడెన్షియల్ జూనియర్ కళాశాలలు నిర్వహిస్తున్నారు. కళాశాలస్థాయి విద్యార్థులు హాస్టల్‌సౌకర్యం లేక మధ్యలోనే చదువు మానేస్తున్న పరిస్థితులను గుర్తించి ఈ విద్యాసంవత్సరం కళాశాలస్థాయి హాస్టళ్లను ఏర్పాటు చేశారు. రాష్ట్రవ్యాప్తంగా 14 గిరిజన బాలికల, 8 గిరిజన బాలుర రెసిడెన్షియల్ డిగ్రీ కళాశాలలు ఈ నెల 28న ప్రారంభించనున్నారు. ఇందులో బీఏ, బీకాం, బీఎస్సీ, బీబీఏ వంటి కోర్సుల నిర్వహణకు సంబంధిత విభాగాలు చర్యలు చేపట్టాయి. గిరిజన నిరుద్యోగులకు ప్రత్యేక శిక్షణలు ఇచ్చేందుకు స్టడీసర్కిళ్లను అభివృద్ధి చేస్తున్నారు.

సివిల్ సర్వీసెస్‌కు శిక్షణ..

గిరిజన విద్యార్థుల్లో ఉన్న ప్రతిభను ప్రోత్సహించి ఫలితాలను సాధించేందుకు గిరిజన సంక్షేమశాఖ ప్రత్యేక చర్యలు చేపట్టింది. అఖిల భారత సర్వీసులకు ఎంపికయ్యేందుకుగాను గిరిజన అభ్యర్థులకు ప్రత్యేక శిక్షణ ఇప్పించాలని నిర్ణయించింది. ఇందుకోసం అంబేద్కర్ యూనివర్సిటీతో ఒప్పందం కుదుర్చుకొని సివిల్స్ పరీక్షల కోసం ప్రతిభావంతులైన వంద మంది గిరిజన అభ్యర్థులను ఎంపిక చేసే బాధ్యతను అప్పగించింది. ఇందుకోసం యూనివర్సిటీ ప్రవేశ పరీక్షను నిర్వహించి అత్యంత ప్రతిభను కనబరచిన వందమంది విద్యార్థులను ఎంపిక చేసింది. వీరికి ప్రముఖ బోధకుల ద్వారా ప్రత్యేక శిక్షణను ఇప్పించనున్నారు. ఈ ఏడాది ప్రారంభించనున్న గిరిజన డిగ్రీ రెసిడెన్షియల్ కళాశాలల్లో విద్యార్థులకు అఖిల భారత సర్వీసుల ఎంపికకు సంబంధించిన అవగాహన, శిక్షణ ఇవ్వనున్నారు. డిగ్రీ మొదటి సంవత్సరం నుంచే ఇందుకు సంబంధించిన ఫౌండేషన్ కార్యక్రమాలను ప్రారంభించనున్నారు.

సీఎం కేసీఆర్ ఆదేశాల మేరకే..:గిరిజన సంక్షేమశాఖ మంత్రి అజ్మీరా చందూలాల్

గిరిజన కుటుంబాలు విద్య ద్వారానే సామాజిక, ఆర్థిక ప్రగతి సాధిస్తాయని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తున్నది. ఇందులో భాగంగానే గిరిజనుల విద్యాప్రగతికి ప్రత్యేక చర్యలు చేపట్టాం. సీఎం కేసీఆర్ ఆదేశాల మేరకు సివిల్ సర్వీస్ పోటీ పరీక్షలకు హాజరయ్యే గిరిజన యువత ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలను చేపడుతున్నాం. అంబేద్కర్ యూనివర్సిటీ, గిరిజన సంక్షేమశాఖ సమన్వయంతో ప్రతిభావంతులైన గిరిజన విద్యార్థులను ఎంపిక చేశాం.

వజ్ర బస్సుల్లోనూ టికెట్ సౌకర్యం



హైదరాబాద్ సిటీబ్యూరో/సుల్తాన్‌బజార్/ నమస్తే తెలంగాణ: ఇప్పటివరకు వజ్ర ఏసీ మినీబస్సులో ప్రయాణించాలంటే ఆన్‌లైన్, యాప్ లేదా ప్రత్యేక కౌంటర్ల ద్వారా మాత్రమే టికెట్లు తీసుకోవాల్సి ఉండేది. బుధవారం నుంచి బస్సుఎక్కిన తర్వాత డ్రైవర్ వద్ద నున్న ట్యాబ్ నుంచి కూడా టికెట్ తీసుకొనే సౌకర్యాన్ని ఆర్టీసీ అమలుచేస్తున్నది. ఇప్పటివరకు వరంగల్ రూట్లో ఉప్పల్, నిజామాబాద్ రూట్‌లో సుచిత్ర పాయింట్ వద్ద టికెట్ తీసుకోవాల్సి ఉండేది. ఉప్పల్ క్రాస్‌రోడ్డు, సుచిత్ర పాయింట్ దాటితే ప్రయాణికులు వజ్ర బస్సు ఎక్కడానికి వీలుండేది కాదు. ప్రస్తుతం ఆ కష్టాలు తొలిగినట్టే. ఇప్పటివరకు హైదరాబాద్ నుంచి నిజామాబాద్, వరంగల్ మార్గాల్లోనే వజ్ర ఏసీ మినీ సర్వీసులు నడుస్తుండగా, నెలాఖరు నాటికి కరీంనగర్, రామగుండం మార్గాల్లో సైతం ప్రవేశపెట్టాలని ఆర్టీసీ భావిస్తున్నది.

మండలి సభ్యులను నిర్లక్ష్యం చేయొద్దు

ప్రొటోకాల్ పాటించాల్సిందే.. అధికారులకు కౌన్సిల్ ప్రివిలేజ్ కమిటీ సూచన

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ప్రొటోకాల్ విషయంలో శాసనమండలి సభ్యులను నిర్లక్ష్యం చేయరాదని, ఎమ్మెల్యేలతో సమానంగా వారికి గౌరవం ఇవ్వాలని శాసనమండలి ప్రివిలేజ్ కమిటీ సూచించింది. కమిటీకి చైర్మన్‌గా ఉన్న శాసనమండలి డిప్యూటీ చైర్మన్ నేతి విద్యాసాగర్ అధ్యక్షతన బుధవారం ప్రివిలేజ్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఇందులో ప్రధానంగా శాసనమండలి సభ్యుల ప్రొటోకాల్ విషయంలో వచ్చిన ఫిర్యాదులపై చర్చించారు. ఇదే సమయంలో సాధారణ పరిపాలన విభాగం (జీఏడీ) అధికారులతోనూ కమిటీ సమావేశమైంది. ప్రభుత్వ కార్యక్రమాల్లో కౌన్సిల్ సభ్యులకు చట్టపరంగా ఇవ్వాల్సిన ప్రాధాన్యం, గౌరవం ఇస్తున్నారా? లేదా? అని అధికారులను కమిటీ అడిగి తెలుసుకుంది. ప్రొటోకాల్‌ను తప్పకుండా పాటించాలని సూచించింది. ఈ సమావేశంలో కమిటీ సభ్యులు కర్నె ప్రభాకర్, కాటేపల్లి జనార్దన్‌రెడ్డి, సంతోష్‌కుమార్, జీఏడీ ముఖ్యకార్యదర్శి అధర్ సిన్హా, ప్రొటోకాల్ డైరెక్టర్ అరవింద్‌కుమార్, తెలంగాణ లెజిస్లేటివ్ సచివాలయం కార్యదర్శి డాక్టర్ రాజా సదారాం, జాయింట్ సెక్రటరీ డాక్టర్ నరసింహాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

శత్రుచర్ల జరిమానా చెల్లించాల్సిందే

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ఏపీకి చెందిన మాజీ మంత్రి శత్రుచర్ల విజయరామరాజును షెడ్యూల్ తెగ(ఎస్టీ) వ్యక్తి కాదని న్యాయస్థానాలు తీర్పు వెలువరించిన నేపథ్యంలో ఆయన జరిమానా చెల్లించాల్సిందేనని ఉమ్మడి హైకోర్టు స్పష్టంచేసింది. 1994 నుంచి 2004 వరకు ఎమ్మెల్యేగా ఉన్నకాలంలో ఒక్కో సిట్టింగ్‌కు రూ.500 జరిమానా చొప్పున రూ.2.25 లక్షలు చెల్లించాలని సింగిల్ బెంచ్ ధర్మాసనం జారీచేసిన ఆదేశాలను నిలిపివేయాలని శత్రుచర్ల చేసిన అప్పీల్‌ను ద్విసభ్య ధర్మాసనం తోసిపుచ్చింది. నాలుగువారాల్లో ఈ మొత్తాన్ని హైకోర్టు రిజిస్ట్రార్ (జ్యుడీషియల్) వద్ద డిపాజిట్ చేయాలని స్పష్టంచేసింది. తప్పుడు ధ్రువపత్రంతో ఎమ్మెల్యేగా గెలిచిన శత్రుచర్ల నుంచి జీతభత్యాలు రాబట్టాలంటూ నిమ్మక జయరాజ్ వ్యాజ్యం దాఖలు చేసిన సంగతి తెలిసిందే.

చంద్రబాబు ప్రమాణంపై పిల్‌ను తోసిపుచ్చిన హైకోర్టు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ఏపీ పునర్వ్యవస్థీకరణ చట్టంలోని నిబంధనల మేరకు ఏపీ సీఎంగా చంద్రబాబు, ఇతర ఎమ్మెల్యేల ప్రమాణ స్వీకారం చెల్లదంటూ దాఖలైన పిల్‌ను ఉమ్మడి హైకోర్టు తోసిపుచ్చింది. చంద్రబాబును సీఎంగా, గవర్నర్ ప్రమాణస్వీకారం చేయించడం రాజ్యాంగ విరుద్ధంగా ప్రకటించాలని మూడేండ్ల తర్వాత పిటిషన్ దాఖలు చేయడాన్ని తప్పుపట్టింది. పునర్వ్యవస్థీకరణ చట్టం ప్రకారం అపాయింటెడ్ తేదీకి ముందు ఉమ్మడిరాష్ట్రంలో ఎన్నికైన ఎమ్మెల్యేలు గవర్నర్ ద్వారా ప్రమాణం చేయనందున వారిని ఎమ్మెల్యేలుగా పరిగణించలేమని, చంద్రబాబుతో ప్రమాణస్వీకారం సైతం రాజ్యాంగవిరుద్ధమని ఏపీసీసీ ప్రధాన కార్యదర్శి పీ సూరిబాబు హైకోర్టులో పిల్ వేసిన సంగతి తెలిసిందే.

శిక్షణా పోలీసులకు 'టిటా' డిజిటల్ తరగతులు

తెలంగాణలో సైబర్ సెక్యూరిటీ నిపుణుల కొరత

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రంలో మరికొందరు సైబర్ సెక్యూరిటీ నిపుణులు అవసరమని తెలంగాణ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (టిటా) అసోసియేషన్ వ్యవస్థాపకుడు, గ్లోబల్ ప్రెసిడెంట్ సందీప్‌కుమార్ మక్తాల అన్నారు. రాన్సమ్‌వేర్ దాడి జరుగకుండా పోలీసుశాఖలోని సైబర్ సెక్యూరిటీ నిపుణులు ముఖ్యపాత్ర పోషించారని ప్రశంసించారు. పోలీసులకు డిజిటల్ మీడియా, సైబర్ సెక్యూరిటీపై అవగాహన ఉండాలని అభిప్రాయడ్డారు. టిటా ఆధ్వర్యంలో శిక్షణా పోలీసులకు 'డిజిటల్ మీడియా, సైబర్ సెక్యూరిటీ'పై ఒక రోజు శిక్షణా కార్యక్రమాన్ని బుధవారం కొండాపూర్‌లో నిర్వహించారు. తెలంగాణ యువ నిర్మాణ్ వలంటీర్లు సాంకేతికత సంబంధిత అనుమానాలను నివృత్తి చేయడంతోపాటు, ఇటీవలే డ్రగ్స్‌కు వ్యతిరేకంగా ప్రారంభించిన ఈ- లెర్నింగ్ కార్యక్రమం గురించి అవగాహన కల్పించారు. డిజిటల్ అక్షరాస్యతను పెంపొందించేందుకు టిటా చేస్తున్న కృషిని ఈ సందర్భంగా 8వ బెటాలియన్ కమాండర్ హెచ్ సత్యనారాయణరావు కొనియాడారు.

నర్సాపూర్ సీఐపై చర్యలు తీసుకోండి

హోంమంత్రికి మజ్లిస్ ఎమ్మెల్యే విజ్ఞప్తి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ఖురేషీ కులానికి చెందిన 9 మందిని మంచిర్యాల పోలీసులు అక్రమంగా బైండోవర్ చేశారని, ఇందుకు కారణమైన సీఐపై చర్యలు తీసుకోవాలని మజ్లిస్ ఎమ్మెల్యే సయ్యద్ అహ్మద్ పాషా ఖాద్రీ హోంమంత్రి నాయిని నర్సింహారెడ్డిని కోరారు. ఈ మేరకు వినతిపత్రం అందజేశారు.

మట్టి గణపతులను పూజించండి

సచివాలయంలో గణేశ్ విగ్రహాల పంపిణీలో పీసీబీ సభ్యకార్యదర్శి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: పర్యావరణాన్ని పరిరక్షించేందుకు ప్రతిఒక్కరు తమ వంతు కృషి చేయాలని పీసీబీ సభ్య కార్యదర్శి సత్యనారాయణరెడ్డి అన్నారు. సచివాలయంలో అధికారులు, ఉద్యోగులకు పొల్యూషన్ కంట్రోల్ బోర్డు (పీసీబీ) ఆధ్వర్యంలో బుధవారం మట్టి గణేశ్ విగ్రహాలను పంపిణీ చేశారు. పర్యావరణ పరిరక్షణకు మట్టి గణపతులను పూజించాలని సత్యనారాయణరెడ్డి కోరారు. కాలుష్యం వెదజల్లే పరిశ్రమలపై నిరంతరం నిఘా కొనసాగుతుందన్నారు. కార్యక్రమంలో అటవీశాఖ జాయింట్ సెక్రటరీ కృష్ణవేణి, పీసీబీ సీనియర్ పర్యావరణ ఇంజినీర్లు రవీందర్, రవీందర్‌రెడ్డి, తెలంగాణ సచివాలయం సంఘం అధ్యక్షుడు ఎం నరేందర్‌రావు, అటవీశాఖమంత్రి పీఎస్ డాక్టర్ విష్ణువర్ధన్‌రావు పాల్గొన్నారు.

వ్యవసాయ సమస్యలపై ‘అగ్రిటెక్’ స్టార్టప్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: వ్యవసాయరంగ సమస్యలను పరిష్కరించే దంపై హైదరాబాద్ ట్రిపుల్ ఐటీ దృష్టి సారించింది. ఇందులోభాగంగా నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అగ్రికల్చర్ ఎక్స్‌టెన్షన్ మేనేజ్‌మెంట్ (మేనేజ్)తో కలిసి సరికొత్త అగ్రిటెక్ స్టార్టప్‌కి శ్రీకారం చుట్టింది. ఈ మేరకు రెండు సంస్థలు బుధవారం హైదరాబాద్‌లో అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నాయి. వ్యవసాయరంగంలో రైతులు ఎదుర్కొనే పలుకీలక సమస్యల పరిష్కారానికి ఈ స్టార్టప్ ద్వారా కృషి చేస్తారు. ఇందుకోసం సాంకేతిక పరిజ్ఞానాన్ని విరివిగా వినియోగిస్తారు. ఎంవోయూ కుదుర్చుకున్న సందర్భంగా ఐఐఐటీ హైదరాబాద్ డైరెక్టర్ పీజే నారాయణన్ మాట్లాడుతూ ల్యాబ్ నుంచి ల్యాండ్ వరకు అధ్యయనాన్ని విస్తరించడానికి ఇదో గొప్ప అవకాశమని పేర్కొన్నారు. ‘మేనేజ్’ సంస్థ డైరెక్టర్ జనరల్ వీ ఉషారాణి మాట్లాడుతూ ఐఐఐటీ హైదరాబాద్ విజ్ఞానం, ఆరోగ్య, పారిశ్రామిక, సేవలరంగానికి ఎంతో ఉపయోగపడిందని.. అదేవిధంగా వ్యవసాయరంగంలోనూ కీలకపాత్ర పోషించడానికి ఇదో అవకాశమని పేర్కొన్నారు.

జలాల పంపిణీపై స్పష్టమైన విధానం ఉండాలి

కేంద్ర జలవనరుల మంత్రిత్వశాఖకు ఎంపీ నర్సయ్యగౌడ్ లేఖ

న్యూఢిల్లీ, నమస్తే తెలంగాణ: కర్ణాటకలోని రిజర్వాయర్లన్నీ పూర్తిస్థాయిలో నిండిఉన్నా దిగువ రాష్ట్రమైన తెలంగాణకు తాగునీటి కోసం చుక్కనీటిని విడుదల చేయడం లేదని భువనగిరి ఎంపీ డాక్టర్ బూర నర్సయ్యగౌడ్ ఆరోపించారు. జలాలపై వివిధ పరిస్థితులను చక్కదిద్దేందుకు సమగ్రమైన విధాన నిర్ణయం తీసుకోవాలని కోరారు. ఈ మేరకు ఆయన కేంద్ర జలవనరుల మంత్రిత్వశాఖకు లేఖ రాశారు. కృష్ణా జలాలను దిగువ రాష్ట్రానికి విడుదల చేయకుండా కర్ణాటక ఆటంకాలు సృష్టిస్తూ ఉన్నా కేంద్ర ప్రభుత్వం ప్రేక్షకపాత్ర వహించడం సరికాదని పేర్కొన్నారు. వన్ నేషన్-వన్ టాక్స్, టీమ్ ఇండియా స్పిరిట్ లాంటి నినాదాలు ఇస్తున్న కేంద్రం రాష్ట్రాల మధ్య నదీజలాల పంపకానికి చట్టబద్ధత కల్పించేలా నిర్ణయం తీసుకోవాలని కోరారు. నిత్యం నదుల అనుసంధానం గురించి మాట్లాడే కేంద్ర జలవనరుల మంత్రిత్వశాఖ ఇప్పుడు కర్ణాటకలోని రిజర్వాయర్లు పూర్తిస్థాయిలో నిండి ఉంటే తెలంగాణ, ఏపీ రాష్ట్రాల్లో మాత్రం కనీస నీటిమట్టం కూడా లేని పరిస్థితులకు సమాధానం చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. యూపీఏ ప్రభుత్వ హయాంలో జాతీయ విపత్తు నిర్వహణ అథారిటీ వైస్‌చైర్మన్‌గా ఉన్న మర్రి శశిధర్‌రెడ్డి రాష్ట్ర ప్రయోజనాలను తుంగలో తొక్కి కాళేశ్వరం ప్రాజెక్టును అడ్డుకోవడానికి విశ్వప్రయత్నాలు చేస్తున్నారని ఆయన విమర్శించారు. జాతీయ విపత్తు నివారణలో తన మేధస్సును ఏ మేరకు వినియోగించారో తెలియదుగాని ఇప్పుడు తెలంగాణ సాగునీటి ప్రాజెక్టులు సకాలంలో పూర్తికాకుండా [illegible] రని అన్నారు. తెలంగాణ ప్రజలు కాంగ్రెస్ నేతలను క్షమించరని, రానున్న ఎన్నికల్లో తగిన గుణపాఠం నేర్పుతారని అన్నారు.



కేంద్ర మంత్రి డాక్టర్ హర్షవర్ధన్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎంపీ డాక్టర్ బూర నర్సయ్యగౌడ్

కేంద్రమంత్రి హర్షవర్ధన్‌తో భేటీ

భువనగిరి నియోజకవర్గ పరిధిలోని బీబీనగర్‌లో ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ట్రాన్స్‌లేషనల్ మెడిసిన్ కేంద్రాన్ని నెలకొల్పడానికి చాలా ఏండ్ల క్రితమే కేంద్ర ప్రభుత్వం అనుమతిచ్చిందని, ఇందుకు రాష్ట్ర ప్రభుత్వం 39 ఎకరాలు కూడా కేటాయించిందని, కానీ ఇప్పటికీ పనులు ప్రారంభం కాలేదని, కేంద్ర సైన్స్-టెక్నాలజీ మంత్రిత్వశాఖ చొరవ తీసుకోవాలని ఆ శాఖ కేంద్రమంత్రి డాక్టర్ హర్షవర్ధన్‌కు విజ్ఞప్తిచేశారు. హైదరాబాద్‌లోని సెల్యులార్-మాలిక్యులర్ బయాలజీ కేంద్రం ఆధ్వర్యంలో నడిచే ట్రాన్స్‌లేషనల్ మెడిసిన్ ఇన్‌స్టిట్యూట్ ద్వారా ‘బెంచ్ టు బెడ్’ వరకు వివిధ రకాల వైద్య సేవలు, పరిశోధనలు జరుగుతాయని మంత్రికి వివరించారు. వీలైనంత త్వరగా ఈ సెంటర్ పనుల ప్రారంభానికి చొరవ తీసుకోవాలని కేంద్రమంత్రిని కోరారు.

నెలాఖరులోగా భూములు పంపిణీచేయాలి

అధికారులను ఆదేశించిన ఎస్సీ అభివృద్ధిశాఖ స్పెషల్ సీఎస్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: భూమి కొనుగోలు పథకంలో ఈ ఆర్థిక సంవత్సరానికి గుర్తించిన 5,810.31 ఎకరాల భూమిని ఈ నెలాఖరులోగా లబ్ధిదారులకు పంపిణీ చేయాలని ఎస్సీ అభివృద్ధిశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్‌మిశ్రా జిల్లా జాయింట్ కలెక్టర్లను ఆదేశించారు. బుధవారం సచివాలయం నుంచి ఎస్సీ అభివృద్ధిశాఖ అధికారులతోపాటు జిల్లా జాయింట్ కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. భూమిని ఇవ్వడంతోపాటు ఏడాది పాటకు కావాల్సిన ఖర్చును సెప్టెంబర్ 30 వరకు అందజేయాలని ఆదేశించారు. దళిత మహిళల అభివృద్ధికి మహిళా ప్రాంగణంలో కుట్టులో శిక్షణ ఇప్పించాలన్నారు. వివిధ జిల్లాల్లో నిరుపయోగంగా ఉన్న దుకాణ సముదాయాలను పరిశీలించాలని సూచించారు. జిల్లా ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు 15 రోజులకోసారి స్వయం ఉపాధి పథకం లబ్ధిదారుల యూనిట్లను తనిఖీలు చేయాలని ఆదేశించారు.

కార్మికుల సంక్షేమానికే తొలి ప్రాధాన్యం

మున్సిపల్ వర్కర్స్ జేఏసీతో పురపాలకశాఖ కార్యదర్శి చర్చలు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: వివిధ మున్సిపాలిటీల్లో పనిచేసే కార్మికుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం తొలి ప్రాధాన్యం ఇస్తుందని పురపాలకశాఖ కార్యదర్శి నవీన్‌మిట్టల్ చెప్పారు. మున్సిపల్ కార్మికుల సమస్యలపై జేఏసీ ప్రతినిధులతో బుధవారం సచివాలయంలో ఆయన చర్చలు జరిపారు. 28న మరోసారి చర్చలు జరుపాలని నిర్ణయించారు. చర్చల్లో ఐఎన్‌టీయూసీ, ఏఐటీయూసీ, సీఐటీయూ, ఐఎఫ్‌టీయూ, బీఎంఎస్, హెచ్‌ఎంఎస్ ప్రతినిధులు, పురపాలకశాఖ డైరెక్టర్ డాక్టర్ టీకే శ్రీదేవి అధికారులు పాల్గొన్నారు.

సెన్సెక్స్	నిఫ్టీ
31,568	9,852
↗ 276	↗ 87

బంగారం ధరలు

ముంబై

24 క్యారెట్లు	29,150
22 క్యారెట్లు	29,000
వెండి (కిలో)	39,035

ముడి చమురు (బ్రెంట్)

↗ 52.50

అతిపెద్ద అంబులెన్స్‌లకు సెస్ మినహాయింపునివ్వాలి

కేంద్రాన్ని కోరిన సియామ్



న్యూఢిల్లీ, ఆగస్టు 23: దేశవ్యాప్తంగా ఉన్న అతిపెద్ద అంబులెన్స్‌లకు సెస్ నుంచి మినహాయింపు నివ్వాలని భారత ఆటోమొబైల్ తయారీదారుల సంఘం(సియామ్) కేంద్ర ప్రభుత్వాన్ని కోరింది. ప్రస్తుతం 13 మంది కూర్చోవడానికి వీలుండే అంబులెన్స్‌పై 28 శాతం జీఎస్టీతోపాటు మరో 15 శాతం సెస్ విధిస్తున్నారు. జీఎస్టీ కంటే ముందు అన్ని అంబులెన్స్‌లపై ఎక్సైజ్ సుంకం రాయితీ ఇచ్చారు. ప్రస్తుతం తొమ్మిది మంది కూర్చోవడానికి వీలుండే అంబులెన్స్‌లకు మాత్రమే పరిహార సెస్ నుంచి ఆర్థిక మంత్రిత్వ శాఖ మినహాయింపునిచ్చింది. కానీ అంతకంటే ఎక్కువ మంది కూర్చునే అంబులెన్స్‌పై 28 శాతం జీఎస్టీతోపాటు 15 శాతం సెస్ విధిస్తున్నారని సియామ్ డైరెక్టర్ జనరల్ సుగాటో సేన్ తెలిపారు. మెడికల్ అవసరాలకోసమే అతిపెద్ద అంబులెన్స్‌లను రూపొందించారని, రోగులకు మెరుగైన సేవలు అందించే ఈ అంబులెన్స్‌లకు కేంద్రం తన వంతు సహాయ సహకారాలు అందించాలని ఆయన సూచించారు. టాటా మోటార్స్, ఫోర్స్ మోటార్స్‌లు ఈ తరహా అంబులెన్స్‌లను రూపొందించింది.

విదేశీ మారకం

కరెన్సీ	కొనుగోలు	అమ్మకం
అమెరికా డాలర్	58.29	67.59
ఆస్ట్రేలియా డాలర్	45.99	53.24
బహ్రెయిన్ దినార్	157.95	180.91
యూరో	68.55	79.52
జపాన్ యెన్/100	53.26	61.77
కువైట్ దినార్	175.46	218.49
ఒమన్ రియాల్	154.55	176.86
సౌదీ రియాల్	15.50	18.37
సింగపూర్ డాలర్	42.78	50.68
స్టెర్లింగ్ పౌండ్	74.74	86.67
యూఏఈ దిర్హామ్	15.86	18.54

కోడిగుడ్ల ధరలు

	నెక్	హెచ్ఎల్ఎఫ్ఏ
హైదరాబాద్	355-00	355-00
రంగారెడ్డి	355-00	355-00
మెదక్	355-00	355-00
కరీంనగర్	357-00	---
వరంగల్	357-00	---
రిటైల్ ప్రైస్	4-15	4-15

చికెన్ ధరలు

ఫారం ధర	82.00
రిటైల్ లైవ్	97.00
డ్రెస్డ్	136.00
స్కిన్‌లెస్	160.00

9న హైదరాబాద్‌లో జీఎస్టీ కౌన్సిల్ భేటీ

హాజరుకానున్న కేంద్ర ఆర్థికమంత్రి జైట్లీ



హైదరాబాద్, నమస్తే తెలంగాణ: వచ్చేనెల 9న హైదరాబాద్‌లో 21వ జీఎస్టీ కౌన్సిల్ సమావేశం జరుగనున్నది. జీఎస్టీ అమల్లోకి వచ్చిన తర్వాత జరుగుతున్న మూడో సమావేశం ఇది. జీఎస్టీ పన్నుల శ్లాబ్ రేటుపై కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న వైఖరిపై న్యాయపోరాటం చేయాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తున్న క్రమంలో జరిగే ఈ సమావేశం ప్రాధాన్యత సంతరించుకున్నది. ఈ కౌన్సిల్ వేదికగా జీఎస్టీ లోపాలను సవరించాలని, అనవసర భారాలు తగ్గించాలని రాష్ట్ర ప్రభుత్వం తన వాదనను గట్టిగా వినిపించనున్నది. రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో జరిగే అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించిన వర్క్స్ కాంట్రాక్ట్‌పై జీఎస్టీని 18 శాతానికి పెంచడాన్ని రాష్ట్ర ప్రభుత్వం మొదటినుంచి గట్టిగా వ్యతిరేకిస్తున్నది. దీనిపై పలుసార్లు కౌన్సిల్ సమావేశంలో తన వాదనను వినిపించింది. హైదరాబాద్‌లో జరిగే కౌన్సిల్ సమావేశంలో జీఎస్టీపై పూర్తి వివరాలతో రాష్ట్ర ప్రభుత్వం పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చే అవకాశమున్నది. ప్రజలకు ఉపయోగపడే కార్యక్రమాల కోసం చేపడుతున్న ప్రాజెక్టులు, నిర్మాణ పనులపై విధించిన జీఎస్టీని 12 శాతం తగ్గించే వరకు రాజీలేని పోరాటం చేయనున్నట్టు ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు మరోసారి స్పష్టంచేసిన సంగతి తెలిసిందే. వచ్చే నెల 9న జరుగనున్న సమావేశానికి కేంద్ర ఆర్థికమంత్రి అరుణ్‌జైట్లీ అధ్యక్షత వహిస్తారని అధికారులు తెలిపారు.

జీఐసీలో 40% వాటా విక్రయం!

న్యూఢిల్లీ, ఆగస్టు 23: దేశంలో అతిపెద్ద రియల్టీ సంస్థ డీఎల్‌ఎఫ్‌కు చెందిన రెంటల్ సంస్థ జీఐసీలో ప్రమోటర్లు 40 శాతం వాటాను విక్రయించడానికి సిద్ధమవుతున్నారు. ఈ వాటా విక్రయంతో సంస్థకు రూ.13 వేల కోట్ల నిధులు సమకూరనున్నాయి. ఇందుకు సంబంధించి శుక్రవారం జరుగనున్న బోర్డు సమావేశంలో తుది నిర్ణయం తీసుకోనున్నారు. డీఎల్‌ఎఫ్ సైబర్ సిటీ డెవలపర్స్ లిమిటెడ్‌లో (డీసీసీడీఎల్) ప్రమోటర్లకు ఉన్న పూర్తిస్థాయి వాటాను 2015 అక్టోబర్‌లో విక్రయించిన విషయం తెలిసిందే. డీఎల్‌ఎఫ్‌లో కేపీ సింగ్, కుటుంబ సభ్యులు అత్యధిక వాటాలు కలిగివున్నారు. ప్రస్తుతం సంస్థకు రూ.26 వేల కోట్ల అప్పు ఉంది. ఈ రుణాన్ని తగ్గించుకోవడంలో భాగంగా బోర్డు పలు అనుబంధ సంస్థల్లో ఉన్న వాటాలను విక్రయించాలని యోచిస్తున్నది.

గతి లాభంలో భారీ వృద్ధి

హైదరాబాద్, ఆగస్టు 23: రాష్ర్టానికి చెందిన ప్రముఖ లాజిస్టిక్ సేవల సంస్థ గతి లిమిటెడ్ ఆర్థిక ఫలితాల్లో భారీ వృద్ధి నమోదైంది. జూన్ 30తో ముగిసిన మూడు నెలలకాలంలో కంపెనీ రూ.18.3 కోట్ల కన్సాలిడేటెడ్ నికర లాభాన్ని ఆర్జించినట్లు ప్రకటించింది. అంతక్రితం ఏడాది ఇదే సమయంలో నమోదైన రూ.5.1 కోట్ల లాభంతో పోలిస్తే 258 శాతం వృద్ధి కనబరిచింది. ఏప్రిల్-జూన్ మధ్యకాలంలో కంపెనీ ఆదాయం రూ.425.5 కోట్ల నుంచి రూ.426.7 కోట్లకు చేరుకుంది. బీ2బీ వ్యాపారం ఆశించిన స్థాయి కంటే వృద్ధిని నమోదు చేసుకుందని గతి లిమిటెడ్ ఫౌండర్, సీఈవో మహేంద్ర అగర్వాల్ తెలిపారు. సమీక్షకాలంలోనే వస్తు, సేవా పన్ను(జీఎస్టీ)ని అమలు చేయడానికి అన్ని వనరులను సిద్ధం చేసుకోవడం జరిగిందన్నారు. గడిచిన త్రైమాసికంలో బీ2బీ వ్యాపారం 5.6 శాతం వృద్ధిని నమోదు చేసుకోగా, రిటైల్ రంగం 19 శాతం, జీఎస్టీపై నెలకొన్న ఆందోళనతో తయారీ, పరిశ్రమల విభాగంలో నిస్తేజం నెలకొందని ఆయన వెల్లడించారు. విదేశీ కరెన్సీ కన్వర్టబుల్ బాండ్లను జారీ చేయడం ద్వారా 2011లో సేకరించిన నిధులను గతేడాది డిసెంబర్‌లో పూర్తిగా చెల్లింపులు జరిపించినట్లు సంస్థ బీఎస్‌ఈకి సమాచారం అందించింది.

జియోఫోన్ ముందస్తు బుకింగ్ నేటి నుంచి



ముంబై, ఆగస్టు 23: ముకేశ్ అంబానీకి చెందిన జియో ప్రవేశపెట్టిన ఉచిత ఫీచర్ ఫోన్‌కు గురువారం నుంచి ముందస్తు బుకింగ్‌లు ప్రారంభించనున్నట్లు ప్రకటించింది. ఈ ఫీచర్ ఫోన్‌కోసం రూ.1,500 డిపాజిట్ చేయాల్సి ఉంటుంది. ఈ డిపాజిట్‌ను రెండేండ్ల తర్వాత తిరిగి కొనుగోలుదారుడికి చెల్లించనున్నది. ఈ ఫీచర్ ఫోన్‌పై ఉచితంగా కాల్ చేసుకునే అవకాశం కల్పించింది. అలాగే రూ.153 చెల్లిస్తే నెలంత డాటాను వినియోగించుకోవచ్చును. వీటితోపాటు మరో రెండు పథకాలను కూడా ప్రవేశపెట్టింది. వారానికి రూ.53, రెండు రోజులకు రూ.23 చొప్పున చెల్లించాల్సి ఉంటుంది. గురువారం సాయంత్రం 5 గంటల నుంచి ఆఫ్‌లైన్, ఆన్‌లైన్‌లో ఈ ఫోన్‌కోసం బుకింగ్ చేసుకోవచ్చును. బుకింగ్ చేసుకునే సమయంలో రూ.500, ఫోన్ పొందే సమయంలో మరో వెయ్యి రూపాయలు చెల్లించాల్సి ఉంటుంది.

సత్యం కేసులో సెబీకి మరింత సమయం

న్యూఢిల్లీ, ఆగస్టు 23: సత్యం కంప్యూటర్స్ కేసులో స్టాక్ మార్కెట్ నియంత్రణ మండలి సెబీకి సెక్యూరిటీస్ అప్పిలెట్ ట్రిబ్యునల్(శాట్) మరింత సమయాన్ని ఇచ్చింది. ఇన్‌సైడర్ ట్రేడింగ్‌కు పాల్పడినందుకుగాను కంపెనీ ఫౌండర్ బీ రామలింగరాజు, ఆయన సోదరుడు బీ రామరాజులపై శిక్ష విధించేదానిపై సెబీకి మరింత సమయాన్ని ఇచ్చినట్లు శాట్ ఒక ప్రకటనలో పేర్కొంది. మే 12న శాట్..సెబీకి మరో నాలుగు నెలలు గడువు ఇచ్చిన విషయం తెలిసిందే. ఈ కేసులో మరింత మందిని విచారించాల్సి ఉందని సెబీ విజ్ఞప్తి మేరకు శాట్ ఈ నిర్ణయం తీసుకున్నది. జూలై 2014లో రామలింగరాజు, రామరాజులు స్టాక్ మార్కెట్లో లావాదేవీలు జరుపకుండా 14 ఏండ్ల పాటు నిషేధం విధించింది.

నీలేకనికి పగ్గాలు అప్పజెప్పాలి..!

ఇన్ఫోసిస్ వ్యవస్థాపక సభ్యుడికి పెరుగుతున్న మద్దతు

న్యూఢిల్లీ, ఆగస్టు 23: దేశంలో రెండో అతిపెద్ద ఐటీ సేవల సంస్థ ఇన్ఫోసిస్‌లో నెలకొన్న తీవ్ర సంక్షోభానికి తెరదించాలంటే నందన్ నీలేకనికి మళ్లీ నాయకత్వ బాధ్యతలు అప్పగించాలని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఒకవైపు విశాల్ సిక్కా రాజీనామా..మరోవైపు పనయ ఒప్పందంలో భారీ అవకతవకలు జరిగి మసకబారుతున్న ప్రతిష్ఠకు మళ్లీ ప్రాణం పోయాలంటే ఇన్ఫోసిస్ వ్యవస్థాపకుల్లో ఒకరైన నీలేకనికి బాధ్యతలు అప్పగించాలని సూచించింది. మరొకరైతే ఏకంగా ఇన్ఫోసిస్‌ను అంతర్జాతీయ స్మార్ట్‌ఫోన్ల తయారీ సంస్థ ఆపిల్‌తో పోల్చగా..నీలేకనిని స్టీవ్ జాబ్స్‌తో పోల్చారు. ప్రస్తుతం నెలకొన్న పరిస్థితులు సద్దుమణుగాలంటే కంపెనీ చైర్మన్‌గా నందన్ నీలేకనిని నియమించాలని ఇన్ఫోసిస్ మాజీ సీఎఫ్‌వో వీ బాలకృష్ణన్ సూచించారు. టెక్నాలజీ రంగంపై ఆయనకు ఉన్న అనుభవం ప్రస్తుత పరిస్థితుల్లో గట్టెక్కించడానికి దోహదపడనున్నదని, క్లయింట్లను ఆకట్టుకోవడంలో ఆయన చూపించే చొరవ సంస్థపై పెట్టుకున్న నమ్మకం మరింత సడలకుండా ఉండేందుకు అవకాశం ఉంటుందని ఆయన వ్యాఖ్యానించారు. ప్రస్తుత పరిస్థితులకు కారణమైన కంపెనీ చైర్మన్ ఆర్ శేషసాయి, కో-చైర్మన్ రవి వెంకటేశన్‌లు వెంటనే తమ పదవులకు రాజీనామా చేయాలని ఆయన డిమాండ్ చేశారు, ఈ స్థానంలో నీలేకనిని నియమించాలని సూచించారు. సంస్థను ముందుండి నడిపించే సత్తా నీలేకనికి మాత్రమే ఉందని, ఆయనను చైర్మన్‌గానూ లేదా సీఈవోగానైనా నియమించుకుంటే సంస్థకు పూర్వవైభవం సంతరించుకునే అవకాశం ఉందన్నారు. ఇన్ఫోసిస్‌లో పనిచేసిన సమయంలో ఆయన కస్టమర్లతో సత్సంబంధాలు కొనసాగించేవారని, ప్రపంచ టెక్నాలజీ రంగంలో గుర్తింపైన ముఖాల్లో ఆయన ఒకడని బాల అభిప్రాయపడ్డారు. ఇప్పటికే ఆయన కేంద్ర ప్రభుత్వ అతిపెద్ద ప్రాజెక్టైన ఆధార్ రూపకల్పనలో కీలకపాత్ర పోషించారన్నారు. దేశంలో ఉన్న 12 ఫండ్ మేనేజర్లు కూడా ఇదే తరహా అభిప్రాయాన్ని వ్యక్తంచేశారు. ఐసీఐసీఐ, హెచ్‌డీఎఫ్‌సీ, రిలయన్స్ ఫండ్ సంస్థలు నందన్ నీలేకనిని మళ్లీ సీఈవోగా నియమించుకోవాలని ఇన్ఫోసిస్ చైర్మన్‌కు రాసిన లేఖలో సూచించాయి. ఈ విషయంపై ఫండ్ మేనేజర్లు ఇప్పటికే అతిపెద్ద సంస్థాగత పెట్టుబడిదారులను అభ్యర్థించాయి. దీంతో వాటాదారులు, కస్టమర్లు, షేరుహోల్డర్లు, ఉద్యోగులు కూడా మరింత ఉత్సాహంతో పనిచేసే అవకాశం ఉందని పేర్కొంది. జూన్ 30తో ముగిసిన త్రైమాసికం నాటికి ఇన్ఫోసిస్‌లో మ్యూచువల్ ఫండ్ల పెట్టుబడిదారులకు 8.95 శాతం వాటా ఉండగా, ఇన్సూరెన్స్ కంపెనీలకు 11.05 శాతం వాటా ఉంది. టెక్నాలజీ రంగంలో తనదైన ముద్ర వేసిన నీలేకని..2002 నుంచి 2007 మధ్యకాలంలో కంపెనీ సీఈవోగా విధులు నిర్వహించారు. ఇదే సమయంలో కంపెనీ అన్ని రంగాల్లో మెరుగైన పనితీరు కనబరిచింది. కంపెనీ వ్యవస్థాపకేతర సభ్యుడైన విశాల్ సిక్కా అనూహ్య పరిణామాల మధ్య గత శుక్రవారం తన పదవికి రాజీనామా చేసిన విషయం తెలిసిందే. సిక్కా రాజీనామాకు కంపెనీ ఫౌండర్ ఎన్ ఆర్ నారాయణ మూర్తి కారణమని బోర్డు విమర్శించింది. కార్పొరేట్ గవర్నెన్స్‌తోపాటు 200 మిలియన్ డాలర్ల విలువైన పనయ కొనుగోలు ఒప్పందంలో భారీ అవకతవకలు జరిగాయని వ్యవస్థాపక సభ్యులు విమర్శలు గుప్పించారు. సిక్కా రాజీనామాతో రెండు రోజుల్లో కంపెనీ మార్కెట్ విలువ రూ.34 వేల కోట్లు కోల్పోయింది.

ఇన్వెస్టర్లతో మూర్తి భేటీ వాయిదా

మరోవైపు కంపెనీ వ్యవస్థాపకుడు నారాయణ మూర్తి ఇన్వెస్టర్లతో జరుగాల్సిన సమావేశం వాయిదాపడింది. మూర్తి అనారోగ్య కారణాలతో బుధవారం సాయంత్రం 6.30 గంటలకు జరుగాల్సిన సమావేశాన్ని ఈ నెల 29కి వాయిదావేశారు. ఇన్ఫోసిస్‌లో జరుగుతున్న పరిణామాలపై ముఖ్యంగా కార్పొరేట్ గవర్నెన్స్‌పై మూర్తి బహిరంగంగా విమర్శించిన విషయం తెలిసిందే.

టాప్-10లోకి మళ్లీ ఇన్ఫీ

టాప్-10 కంపెనీల జాబితాలోకి మళ్లీ ఇన్ఫోసిస్ చేరింది. గడిచిన నాలుగు రోజులుగా కంపెనీ షేరు ధర భారీగా పడిపోవడంతో టాప్-10లో చోటు కోల్పోయిన సంస్థ తిరిగి స్థానం దక్కించుకుంది. రూ.2,05,463.70 కోట్ల నికర విలువతో సంస్థకు చివరి స్థానం లభించింది. మార్కెట్ ముగిసే సమయానికి కంపెనీ షేరు ధర 1.98 శాతం లాభపడి రూ.894.50 వద్ద స్థిరపడింది. రూ.5,14,223.14 కోట్లతో ఆర్‌ఐఎల్ తొలి స్థానంలో నిలిచింది. టీసీఎస్ ఆ తర్వాతి స్థానంలో ఉంది.



బ్యాంకింగ్ షేర్లలో జోష్

276 పాయింట్లు లాభపడ్డ సూచీ

9,800 పాయింట్ల పైకి నిఫ్టీ



ముంబై, ఆగస్టు 23: ప్రభుత్వరంగ బ్యాంకుల విలీన ప్రక్రియకోసం ప్రత్యేక మెకానిజాన్ని ఏర్పాటు చేయడానికి కేంద్ర క్యాబినెట్ పచ్చజెండా ఊపడంతో స్టాక్ మార్కెట్లు ఒక్కసారిగా పుంజుకున్నాయి. ప్రారంభం నుంచి మిశ్రమదోరణిలో కదలాడిన బాంబే స్టాక్ ఎక్స్చేంజ్ ప్రధాన సూచీ సెన్సెక్స్..చివరి గంటలో మదుపర్లు ఎగబడి కొనుగోళ్లు జరిపారు. ఎస్‌బీఐలో ఐదు అనుబంధ బ్యాంకులను విలీనం చేసినట్లుగానే మరిన్ని బ్యాంకులను ఒక్కతాటిపైకి తెచ్చి అతిపెద్ద సంస్థలుగా తీర్చిదిద్దడానికి ప్రభుత్వం కృషి చేస్తున్నదని కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ వ్యాఖ్యానించడంతో బ్యాంకింగ్ షేర్లలో కొనుగోళ్లు ఊపందుకున్నాయి. ఇన్ఫోసిస్‌కు విశాల్ సిక్కా రాజీనామా దెబ్బకు భారీగా నష్టపోయిన షేర్లకు కేంద్రం నిర్ణయం కాస్త ఊరటనిచ్చింది. దీంతో ఒక దశలో 31,593.39 పాయింట్ల గరిష్ఠ స్థాయిని తాకిన బీఎస్‌ఈ సెన్సెక్స్ 276.16 పాయింట్లు లాభపడి 31,568.01 వద్ద ముగిసింది. మంగళవారం 33 పాయింట్లు పెరిగిన విషయం తెలిసిందే. నేషనల్ స్టాక్ ఎక్స్చేంజ్ సూచీ నిఫ్టీ 9,800 పాయింట్ల పైకి చేరుకుంది. చివరకు 86.95 పాయింట్లు లాభపడి 9,852.50 వద్ద స్థిరపడింది. చివరి గంటలో కొనుగోళ్ల వర్షం కురిసిందని, ముఖ్యంగా బ్యాంకింగ్ రంగ షేర్లలో క్రయ విక్రయాలు జోరందుకున్నాయని జియోజిత్ ఫైనాన్షియల్ సర్వీసెస్ లిమిటెడ్ హెడ్ వినోద్ హెయిర్ తెలిపారు. అలాగే అంతర్జాతీయ మార్కెట్ల నుంచి వచ్చిన సానుకూల అంశాలు కూడా మార్కెట్‌కు మరింత జోష్‌నిచ్చిందన్నారు. డీఎల్‌ఎఫ్‌కు చెందిన అనుబంధ సంస్థ జీఐసీలో ప్రమోటర్లకు ఉన్నవాటాలో 40 శాతం వాటాను విక్రయించనున్నట్లు ప్రకటించడంతో కంపెనీ షేరు ధర అమాంతం పెరిగింది. 6.10 శాతం పెరిగి టాప్ గెయినర్‌గా నిలిచింది. అదానీ పోర్ట్స్ 2.82 శాతం, భారతీ ఎయిర్‌టెల్ 2.41 శాతం, టాటా స్టీల్ 2.28 శాతం, డాక్టర్ రెడ్డీస్ 2.25 శాతం లాభపడ్డాయి. అలాగే ఇన్ఫోసిస్ 1.98 శాతం, టాటా మోటార్స్ 1.81 శాతం, ఎస్‌బీఐ 1.70 శాతం, ఐసీఐసీఐ బ్యాంక్ 1.67 శాతం, ఎన్‌టీపీసీ 1.37 శాతం, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ 1.29 శాతం, రిలయన్స్ 1.15 శాతం, లుపిన్ 1.12 శాతం, కొటక్ బ్యాంక్ 1.08 శాతం, మారుతి 1.03 శాతం చొప్పున మార్కెట్ వాటాను పెంచుకున్నాయి. ఏషియన్ పెయింట్స్, యాక్సిస్ బ్యాంక్, హెచ్‌డీఎఫ్‌సీ, బజాజ్ ఆటో, ఎల్ అండ్ టీ, కోల్ ఇండియా, విప్రో, ఓఎన్‌జీసీ, హీరో మోటోకార్ప్, సిప్లాలు లాభపడ్డాయి. ప్రభుత్వరంగ ఆర్థిక సేవల సంస్థలైన పంజాబ్ నేషనల్ బ్యాంక్, బ్యాంక్ ఆఫ్ బరోడా, అలహాబాద్ బ్యాంక్, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, బ్యాంక్ ఆఫ్ ఇండియా షేర్లను కొనుగోలు చేయడానికి ఇన్వెస్టర్లు ఆసక్తి చూపారు. హెచ్‌యూఎల్ 1.10 శాతం పతనమవగా, సన్‌ఫార్మా, ఐటీసీ, మహీంద్రా అండ్ మహీంద్రా, టీసీఎస్, పవర్‌గ్రిడ్‌లు నష్టపోయాయి. రంగాల వారీగా చూస్తే రియల్టీ ఇండెక్స్ 3.48 శాతం లాభపడగా, మెటల్, బ్యాంకింగ్, ఆర్థిక సేవల విభాగాలు కూడా లాభాల బాట పట్టాయి. బీఎస్‌ఈ మిడ్-క్యాప్ ఇండెక్స్ 1.38 శాతం పెరుగగా, స్మాల్-క్యాప్ సూచీ 1.21 శాతం లాభపడింది.

మరిన్ని పీఎస్‌బీల విలీనం!

కేంద్ర క్యాబినెట్ పచ్చజెండా




న్యూఢిల్లీ, ఆగస్టు 23: మరిన్ని ప్రభుత్వ రంగ బ్యాంకుల (పీఎస్‌బీ) విలీనానికి కేంద్ర ప్రభుత్వం పచ్చజెండా ఊపింది. ప్రధాని నరేంద్ర మోదీ అధ్యక్షతన కేంద్ర క్యాబినెట్ సమావేశమై ఈ విలీన ప్రతిపాదనకు సూత్రప్రాయ అంగీకారం తెలిపింది. ఈ విషయాన్ని కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ మీడియా సమావేశంలో వెల్లడించారు. బ్యాంకులు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యల పరిష్కారంతోపాటు, ఆర్థిక వృద్ధి లక్ష్యాలతో బ్యాంకుల విలీనానికి క్యాబినెట్ ఆమోదం తెలిపినట్లు చెప్పారు. పలు చిన్న స్థాయి ప్రభుత్వరంగ బ్యాంకులను విలీనం చేసి పెద్దవిగా ఏర్పాటు చేసే ఉద్దేశంలో భాగంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు, తద్వారా ఎలాంటి ఉద్యోగాలు పోవని మంత్రి స్పష్టంచేశారు. విలీనాలు, ఇతర సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మంగళవారం బ్యాంకు ఉద్యోగ సంఘాలు చేసిన సమ్మెపై మంత్రి పై విధంగా స్పందించారు. ఏయే బ్యాంకులు ఏ సంస్థలో విలీనం చేసే విషయంపై చర్చించడానికి మంత్రి మండలిని ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. ఈ ప్యానెల్‌లో సభ్యులపై మోదీ తుది నిర్ణయం తీసుకోనున్నారు. విలీనం చేసే విషయంలో కేంద్రం బలవంతపెట్టదని, ఈ నిర్ణయం తీసుకునే అవకాశం ఉండే ఆయా సంస్థలకు వదిలిపెట్టనున్నదన్నారు. ప్రభుత్వం అధ్వర్యంలో చాలా బ్యాంకులు నడుస్తున్నాయని, వీటిని ఒక్కతాటిపైకి తెచ్చి బలమైన సంస్థను తీర్చిదిద్దాలనే ఉద్దేశంలో భాగంగా ఈ విలీన ప్రతిపాదనను తెరపైకి తీసుకొచ్చినట్లు ఆయన పేర్కొన్నారు. చట్టప్రకారం, మార్కెట్ నియంత్రణ మండలి సెబీ నిబంధనలకు అనుగుణంగా ఆయా బ్యాంకులు తగు చర్యలు తీసుకుంటాయని జైట్లీ ప్రకటించారు. ఆస్తుల నాణ్యత, మూలధన సంపద నిష్పత్తి, బ్యాంకుల లాభాలు, ఆర్థిక వనరుల ఆధారంగా ఈ విలీనం చోటు చేసుకోనున్నది. ఇప్పటికే ఈ విషయంపై రిజర్వు బ్యాంక్, కేంద్రం ఆమోద ముద్ర వేశాయి. బుధవారం కేంద్ర క్యాబినెట్ కూడా పచ్చజెండా ఊపడంతో ఇక వేగమంతమవనున్నది. పీఎస్‌బీలను మరింత బలోపేతం చేయడానికి వచ్చే రెండేండ్ల కాలంలో రూ.70 వేల కోట్ల నిధులను వెచ్చించనున్నట్లు కేంద్రం ఇటీవల ప్రకటించింది. బ్యాంక్ ఆఫ్ బరోడా, కెనరా బ్యాంకులు చిన్న స్థాయి బ్యాంకులైన దేనా, విజయా, యూకో, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, యునైటెడ్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలను విలీనం చేసుకోబోతున్నాయని తెలుస్తున్నది. జూన్ చివరి నాటికి పీఎస్‌బీల మొండి బకాయిలు రూ.7,38,776 కోట్లకు చేరుకున్నాయి. 1970-80 నుంచి బ్యాంకింగ్ రంగంలో విప్లవాత్మక మార్పులు చోటు చేసుకున్నాయని, ప్రైవేట్ రంగ బ్యాంకులు, ఎన్‌బీఎఫ్‌సీలు, ప్రాంతీయ బ్యాంకులు, పేమెంట్ బ్యాంకులు, చిన్నస్థాయి సంస్థలు రంగ ప్రవేశించడంతో వినియోగదారులకు మెరుగైన సేవలు లభించడానికి దోహదపడ్డాయి.

ఎగుమతుల్లో గోమాంసాన్ని మించిన బాస్మతి బియ్యం

దేశం నుంచి ఎక్కువగా ఎగుమతయ్యే వస్తువుల్లో మొదటిస్థానం

న్యూఢిల్లీ, ఆగస్టు 23: భారత్ నుంచి అత్యధికంగా ఎగుమతయ్యే వస్తువుల్లో ఇప్పటివరకు గోమాంసం మొదటిస్థానంలో ఉండగా తాజాగా ఆ స్థానాన్ని బాస్మతి బియ్యం ఆక్రమించింది. వ్యవసాయ, శుద్ధి చేసిన ఆహార ఉత్పత్తుల ఎగుమతి అభివృద్ధి సంస్థ వివరాల ప్రకారం.. 2017 ఏప్రిల్-జూన్ త్రైమాసికంలో రూ.8,168 కోట్ల విలువైన బాస్మతి బియ్యం ఎగుమతి అయ్యాయి. ఇదేసమయంలో రూ.5,473 కోట్ల విలువైన గోమాంసం ఎగుమతి జరిగింది. గతేడాది ఏప్రిల్-జూన్ త్రైమాసికంలో 11.8 లక్షల టన్నుల బాస్మతి బియ్యం ఎగుమతి కాగా ఈ ఏడాది అత్యధికంగా 13 లక్షల టన్నుల బియ్యం ఎగుమతయ్యాయి. గతేడాది ఇదేసమయంలో 2.8 లక్షల టన్నుల గోమాంసం ఎగుమతి కాగా ఈ ఏడాది కొద్దిగా తగ్గి 2.79 లక్షల టన్నులకు పరిమితమైంది. భారత్ నుంచి వెళ్లే గోమాంసంలో పావుశాతం మేర వినియోగించే ఇరాన్ కొత్తగా ఆర్డర్లు ఇవ్వకపోవడమే ఎగుమతుల్లో తగ్గుదలకు కారణమని నిపుణులు పేర్కొంటున్నారు. తమ వ్యవసాయ సీజన్‌లో కూడా ఇరాన్ బియ్యాన్ని భారీగా దిగుమతి చేసుకోవడంతో



బాస్మతి బియ్యం ఎగుమతులు పెరిగాయి. దీంతోపాటు కేంద్ర ప్రభుత్వం పశువధపై నిషేధం విధించడం కూడా ఎగుమతులపై ప్రభావం చూపుతున్నది.

బీఎస్‌ఈలో తెలంగాణ షేర్లు

షేర్ల ప్రస్తుత, క్రితం ముగింపు, వాణిజ్య పరిణామం వరుసగా..

A P Paper 293.05(294.75)1083
Aci Infocom 6.2(5.95)500
Aditya Ispat 5.27(5.25)1918
Aditya Spin 8.16(8.57)1150
Agro Tech Foods 542.5(529.55)1512
Aishwarya Telcom Ltd 4.6(4.4)7250
Alphageo 760.55(755.55)1393
Alufluoride 58.0(55.9)9513
Alumeco 2.2(2.2)631
Amara Raja 765.4(758.55)21233
Andhra Bank 51.4(49.85)315348
Andhra Petroch 31.75(30.3)247719
Andhra Sugars 337.6(340.3)1910
Anjani Portl 206.0(206.25)1209
Astra Micro 123.9(121.9)26618
Aurobindo Phar 698.5(695.45)97759
Avantel 237.0(239.25)1632
Avanti 1946.75(1923.35)15109
Avon Organics 5.07(4.45)16252
B N Rathi Secur 30.75(30.4)1403
B2b Software 9.16(8.73)210
Balaji Amines 310.7(310.55)1973
Bambino Agro 174.4(176.25)1013
Baron Infotech 0.32(0.33)202
Bartronics India 14.0(13.85)21278
Bgr Energy Sys137.0(128.25)84660
Bhagiradha Chem 205.6(194.95)39082
Bhagyaind 21.5(21.4)1038
Bhagyanagar W. 25.9(25.9)2
Bnr Udyog 45.95(44.35)92596
Brilliant Securities 8.0(7.62)304478
Cambridge Tech74.95(73.5)2007
Cat Tech 0.6(0.63)351
Ccl Products 276.2(274.8)568
Celestial Labs 21.45(21.25)21870
Cil Securities 28.05(28.35)5503
Color Chips 44.05(44.8)33297
Combat Drugs 11.71(11.71)61
Coromandel t 422.65(421.75)8341
Country Club 13.04(12.97)6964
Cubex Tubings 16.2(16.1)530
Danlaw Tech. 48.3(48.45)1742
Deccan Cem1121.95(1115.15)4301
Denisons Hyd 1144.4(1146.55)208
Dhan Roto Sp 21.15(22.15)2000
Diamond Power Infra20.55(21.45)7242
Divi's Lab 638.95(630.25)55759
Divyashakti Gr 98.5(96.95)310
Dolphin Med 1.1(1.15)650
Dr Reddy`s 2029.5(1984.85)54946
Empee Sugars 5.05(5.05)1852
Everest Org 98.9(95.5)5341
Facor Alloys 3.69(3.62)82980
Fenoplast 55.0(53.3)250
Firstobj 15.25(15.6)4147
Fortune Info 83.75(82.5)5727
Four Soft 96.9(96.2)865
Gati 113.9(107.85)365013
Gayatri 8.91(8.99)86170
Gayatri Projects 170.9(161.7)20510
Gayatribi 8.84(9.3)4152
Gennex 3.94(3.98)81829
Gmr Infra 17.15(17.05)1039827
Godavari Drugs 36.7(37.35)1397
Golden Carpets 6.95(6.95)2
Goldinfra 130.55(130.05)102727
Goldstone Tech 11.13(11.45)5109
Gowra Leasing & Fin 23.8(24.8)50
Granules Ind 127.9(127.2)92459
Gss America Info22.95(21.95)10071
Gulf Oil Corp 525.1(521.3)1661
Gvk Pwr 11.75(12.36)1303668
Hbl Power 44.5(43.7)20272
Heritage Food 1315.35(1299.25)1627
Hindustan Bio Sci 0.83(0.86)839
Hyderabad Ind 1110.2(1092.1)5187
I V R Cons 4.89(4.94)133954
I.c.s.a. 2.61(2.69)1307
Incap 56.9(59.85)3039
Incon Engineers 7.42(7.81)1
Infotech Ent 519.45(513.55)1224
Invinex Lab 116.35(110.85)2404
Ivrcl Infrastruc 4.89(4.94)133954
K C P 102.1(103.6)11278
Kakatiya Cement 343.6(337.4)4559
Kallam Spinning 31.9(32.6)128076
Karan Woosin 1.05(1.0)101
Kaveri Seed 543.55(531.05)80380
Kernex Mic. 36.35(35.0)3330
Knr Constr216.2(213.85)2334
Krebsbio 93.65(93.7)1208
Lanco Ind 366.15(361.5)6603
Lanco Infratech 0.89(0.86)1736279
Livewell Home Fin 67.1(68.25)905
Lokesh Mach 81.35(78.0)19513
Madhucon Proj29.35(28.85)19872
Maytas Infra 39.9(40.35)11811
Mhril 354.4(358.3)1811
Mic Electronics 7.76(7.85)44291
Moldtek 49.75(49.75)11750
Moschip Semi 47.05(46.95)34137
Msr India Ltd 36.3(38.2)9452
N C L Ind 230.3(232.5)23231
Nagarjuna Agri 33.9(34.1)10100
Nagarjuna Con 86.2(84.15)209370
Natco Pharma 726.2(733.05)29819
National Min 123.05(121.85)162998
Nbventure 122.3(120.25)8783
Neha International 5.13(4.7)55873
Neha Int5.13(4.7)55873
Neocure Thera 3.11(3.08)2664
Nettlinx 80.8(88.95)5474
Neuland Lab 1227.7(1250.7)1031
Nile 602.4(589.6)6406
Oil Country 45.0(42.95)8945
Online Media Solutions 0.4(0.41)50
P.m. Telelinnks 1.93(1.93)100
Padmalaya Tel 6.91(7.09)77746
Pankaj Polymers 11.69(11.92)24601
Panyam Cem 58.5(57.95)4504
Peeti Securities 5.65(5.65)50
Pennar Ind 59.7(55.85)192826
Pflinfotc 5.77(5.77)100
Phaarmasia 23.1(22.9)128
Pharmaids Pharma 3.01(3.0)721
Phyto Chem 45.35(46.8)7377
Pitti Lamin 58.85(58.75)10017
Pokarna 1201.85(1160.8)368
Prajay Eng 8.03(7.65)4712
Premier Expl 450.95(441.5)870
Prism Cement 110.85(107.85)17974
Ragsan Petrochem 61.0(63.0)400
Rain 144.7(137.4)380965
Raj Packaging 56.5(57.2)1165
Rajvir Industries 42.4(42.4)1
Ram Informatics 46.7(42.5)225
Regency Ceramic 5.44(5.58)1654
Restile Ceramics 5.06(5.14)2745
Sagar Cements 824.0(810.0)1157
Salguti Plast 18.0(17.95)1
Samkrg Pistons 255.5(259.7)4500
Sampre Nutritions 40.4(38.5)3140
Sanjeevni Indust 27.85(27.7)12655
Sark Sys 72.85(70.8)28228
Sathavahana Ispat 34.55(35.55)25935
Saven Tech23.0(22.8)8400
Sks Microfin888.35(850.2)228056
Sms Pharma82.6(73.0)205292
Softpro Sys 5.17(5.17)100
Southern Online Bio 2.89(2.99)45440
Sr Ray Alkalies 28.45(27.1)402011
Sree Rayalaseema 126.6(125.7)576
Srinivasa Shipp 63.3(61.95)4953
Steel Exchange 83.15(83.8)118551
Sujana 0.97(0.96)37739
Sujana Towers 4.03(4.02)6500
Sujanametal 1.55(1.54)20750
Surana Telecom 4.65(4.63)6841
Suryaamba 59.4(62.0)1007
Suryachakra Power 1.04(1.09)93349
Suryalak Cott 97.55(96.05)4966
Suryalata Spin 136.55(127.2)1027
Suvarna Cem 150.0(150.25)28
Suven 162.45(161.45)12287
Taj Gvk 155.8(153.6)14998
Tanla Solutions 32.6(32.65)27911
Tci Fin 20.9(20.65)3567
Transcorp Int19.5(19.2)11711
Transgene Biotek 2.28(2.3)10224
Transport Co 272.65(272.55)8444
Trendy Knitwear 0.19(0.19)970
Tyche 78.65(76.45)20478
Unisocks 3.45(3.39)12310
Ushakiran Finance 4.75(4.75)185
Usher 6.54(6.68)26698
V & K Softech 3.85(4.05)203
V S T Ind 2719.45(2719.75)211
Vamshi Rubber 61.45(60.15)2257
Viceroy Hotels 17.25(16.7)14948
Vijay Textiles 62.15(59.4)32788
Vimta Labs 130.25(129.8)2361
Virat Crane 37.0(38.0)1000
Virnichiq 69.35(69.7)125992
Visaka Ind 537.2(515.15)27054
Vista Pharma 33.05(34.05)22031
Vivmed Labs 103.6(100.3)103932
Vmf Softech 82.55(83.75)8813
Vsfproj 7.78(7.41)50
Waterbase 121.9(121.2)172770
Xl Energy Ltd 1.7(1.85)9095
Ybrant Digital 6.86(6.35)5580872
Zen Tech51.9(51.45)25573
Zenotech 47.55(45.3)24908



చెక్కు అందజేస్తున్న నమస్తే తెలంగాణ వైస్ ప్రసిడెంట్ రామారావు, సర్క్యులేషన్ జీఎం రాంరెడ్డి, ఖమ్మం యూనిట్ మేనేజర్ రాఘవేంద్రరావు, ఏసీఎం అజయ్

ఇన్సూరెన్సు చెక్కు అందజేత

'నమస్తే తెలంగాణ' ఏజెంట్ కుటుంబానికి రూ.5లక్షలు

బూర్గంపహాడ్: రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన 'నమస్తే తెలంగాణ' పేపర్ ఏజెంట్ కుటుంబానికి మంజూరైన రూ.5లక్షల ఇన్సూరెన్స్ చెక్కును పత్రిక వైస్ ప్రెసిడెంట్ వీఎస్ రామారావు బుధవారం ఖమ్మం యూనిట్ కార్యాలయంలో అందజేశారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంపాడు మండలం లక్ష్మీపురం గ్రామానికి చెందిన 'నమస్తే తెలంగాణ' ఏజెంట్ నాగిరెడ్డి తిరుపతి రెడ్డి 2015జులై 20న లక్ష్మీపురంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. 'నమస్తే తెలంగాణ' యాజమాన్యం పేపర్ ఏజెంట్లకు ప్రమాద బీమా పథకాన్ని వర్తింప చేయడంతో రూ.5లక్షలు ఇన్సూరెన్స్ మంజూరైంది. మంజూరైన రూ.5లక్షల ఇన్సూరెన్స్ చెక్కుని బుధవారం తిరుపతిరెడ్డి సతీమణి నాగిరెడ్డి రోజాకు అందజేశారు. కార్యక్రమంలో సర్క్యులేషన్ జీఎం డీ రాంరెడ్డి, ఖమ్మం యూనిట్ మేనేజర్ బీఎస్ రాఘవేంద్రరావు, ఏసీఎం ఈ అజయ్ తదితరులు పాల్గొన్నారు. ఆపదలో ఆదుకున్న 'నమస్తే' యాజమాన్యానికి రోజా ధన్యవాదాలు తెలిపారు.



వరంగల్ రూరల్ జిల్లా పర్వతగిరిలో చెరువును పరిశీలిస్తున్న డిప్యూటీ సీఎం

విద్యాప్రమాణాల పెంపునకు కృషి

- డిప్యూటీ సీఎం కడియం శ్రీహరి

వర్ధన్నపేట, నమస్తే తెలంగాణ: జాతీయ స్థాయిలో నిర్వహించే ఏ పోటీ పరీక్షలోనైనా తెలంగాణ విద్యార్థులు రాణించాలని, ఆ మేరకు విద్యాప్రమాణాల మెరుగుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తున్నదని డిప్యూటీ సీఎం, విద్యాశాఖ మంత్రి కడియం శ్రీహరి అన్నారు. వరంగల్ రూరల్ జిల్లాలో బుధవారం పలు అభివృద్ధి కార్యక్రమాల్లో డిప్యూటీ సీఎం పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పర్వతగిరి జెడ్పీహెచ్ఎస్‌ను మోడల్ స్కూల్‌గా మారుస్తామన్నారు. తాను చదువుకున్న పాఠశాల, పుట్టి పెరిగిన గ్రామంపై ఉన్న మమకారంతో అన్ని వసతులు కల్పించేందుకు ప్రయత్నిస్తున్నానని తెలిపారు. ప్రస్తుతం పర్వతగిరిలోని పీహెచ్‌సీని 24 గంటల దవాఖానగా తీర్చిదిద్దనున్నట్టు చెప్పారు. అనంతరం పీహెచ్‌సీని సందర్శించి బాలింతకు కేసీఆర్ కిట్టు అందజేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే ఆరూరి రమేశ్, కలెక్టర్ ప్రశాంత్ జీవన్‌పాటిల్, డీఎంహెచ్‌వో అశోక్ అనంద్, డీఈవో నారాయణరెడ్డి, ఎంపీపీ రంగు రజిత, జెడ్పీటీసీ శైలజ, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.



రాజన్న హుండీ ఆదాయం రూ.1.43 కోట్లు

వేములవాడ కల్చరల్: శ్రావణ మాసంలో వేములవాడ రాజరాజేశ్వర స్వామివారికి రికార్డు స్థాయిలో హుండీ ద్వారా ఆదాయం సమకూరింది. బుధవారం ఆలయ ఓపెన్ స్లాబ్‌లో శ్రావణ మాసం 26 రోజుల్లో వచ్చిన హుండీని లెక్కించగా రూ.1.43 కోట్ల నగదు, 219 గ్రాముల బంగారం, 10.2 కిలోల వెండి సమకూరినట్టు ఆలయ ఈవో దూస రాజేశ్వర్ వెల్లడించారు.



హైదరాబాద్ అబిడ్స్‌లోని స్టాన్లీ కాలేజీ ఆధ్వర్యంలో నిర్వహించిన హరితహారంలో మొక్కనాటి నీళ్లు పోస్తున్న హోం మంత్రి నాయిని నర్సింహారెడ్డి

కరువును తరిమేది కాళేశ్వరమే

'సాగునీరు లేక భూములు బీడువారి పోయాయి. ఉపాధి కోసం వలస వెళుతున్నాం. నీళ్లొస్తే అందరం మళ్లీ మా ఊరి బాట పడుతాం. పంటలు సాగు చేసుకొని సంతోషంగా ఉంటాం..' అంటున్నారు రైతులు. కాళేశ్వరం ప్రాజెక్టు భూసేకరణ, పర్యావరణ అనుమతులపై నల్లగొండ, సంగారెడ్డి, కామారెడ్డి, పెద్దపల్లి జిల్లాల్లో బుధవారం ప్రజాభిప్రాయ సేకరణ జరిగింది. ఈ సందర్భంగా రైతు లు ముక్తకంఠంతో ప్రాజెక్టుకు మద్దతు పలికారు



కామారెడ్డి కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న రైతులు

కామారెడ్డిలో సబ్బండవర్ణాల హర్షం

కామారెడ్డి / నమస్తేతెలంగాణ: కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంపై సబ్బండవర్ణాలు హర్షం వ్యక్తం చేశాయి. కామారెడ్డి మండలంలోని దేవునిపల్లిలో బుధవారం ప్రజాభిప్రాయసేకరణ నిర్వహించారు. రైతులు, ప్రజలు, ప్రజాప్రతినిధులు, ప్రజా సంఘాల నాయకులు, సీపీఎం, టీఆర్ఎస్, కాంగ్రెస్ నేతలు ప్రాజెక్టు నిర్మాణాన్ని స్వాగతించారు. పర్యావరణ అనుమతులు ఇవ్వాలని కోరుతూ కలెక్టర్‌కు 106 వినతిపత్రాలు అందజేశారు. వారితో పాటు 75 మంది తమ అభిప్రాయాలను వెల్లడించారు. ఈ సందర్భంగా కలెక్టర్ సత్యనారాయణ మాట్లాడుతూ.. ఆయకట్టుకు నీరు అందించేందుకు 1832 కిలోమీటర్ల మేర, 147 టీఎంసీల నీటి నిల్వతో పదమూడు జిల్లాలకు సరఫరా అవుతుందన్నారు. కామారెడ్డి జిల్లాలో 17 మండలాలు సస్యశ్యామలమవుతాయన్నారు. గోదావరి వద్ద నిర్మించిన ప్రాజెక్టు ద్వారా మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల ద్వారా ఎల్లంపల్లి రిజర్వాయర్ ద్వారా మిడ్ మానేరు వరద కాలువ ద్వారా 60 టీఎంసీల నీరు ప్యాకేజీ 22 ద్వారా అందుతుందన్నారు. ప్రాజెక్టులకు అవసరమైన 950 ఎకరాల భూసేకరణ చేపట్టామని అన్నారు.

అన్ని విధాలుగా ఉపయోగకరం

ప్రాజెక్టు జిల్లాకు అన్ని విధాలుగా ఉపయోగకరంగా ఉంటుందని ఎల్లారెడ్డి ఎమ్మెల్యే ఏనుగు రవీందర్‌రెడ్డి అన్నారు. ప్రాజెక్టు నీరు ఎల్లారెడ్డి నియోజకవర్గంలోని కొండాపూర్ తండా గుండారం, సిద్దాపూర్, గాంధారి మండలంలోని సీతాయిపల్లి మేడిపల్లి గౌరారం, వెంకటాపూర్ గ్రామాలను తప్పని సరిగా ప్రాజెక్టులో చేర్చాలన్నారు. గిద్ద గ్రామస్తులకు లాభం చేకూరే విధంగా కాలువ తవ్వకాలు జరుపాలన్నారు. జెడ్పీ చైర్మన్ దఫేదార్‌రాజు మాట్లాడుతూ ప్రాజెక్టులతో నిజాంసాగర్‌కు పూర్వ వైభవం వస్తుందన్నారు. జుక్కల్ ఎమ్మెల్యే హన్మంత్ షిండే మాట్లాడుతూ ప్రాజెక్టు ద్వారా జుక్కల్, పిట్లం, బిచ్కుంద గ్రామాలు సస్యశ్యామలం అవుతాయన్నారు. ప్రజలు గల్ఫ్‌కు వలసలు వెళ్లకుండా జీవన విధానం మెరుగుపడుతుందన్నారు. డీసీఎంఎస్ చైర్మన్ ముజీబొద్దీన్ మాట్లాడుతూ సాగునీరు లేక రైతులు కష్టాలు ఎదుర్కొంటున్నారని, ప్రాజెక్టు ద్వారా రిజర్వాయర్లకు ప్రతి రోజూ ఒక టీఎంసీ నీరందుతుందని తెలిపారు.

కాళేశ్వరం ప్రాజెక్టును స్వాగతిస్తున్నాం



ఈ ప్రాంత బీడు భూములకు సాగునీరు అందించే కాళేశ్వరం ప్రాజెక్టును కాంగ్రెస్ పార్టీ తరపున స్వాగతిస్తున్నాం. ప్రాజెక్టు పనులు త్వరగా పూర్తి చేయాలి. బీడు భూములు సస్యశ్యామలమవుతాయి. సాగునీరు అందించేందుకు ముఖ్యమంత్రి కేసీఆర్ కృషి చేయడం అభినందనీయం.

- ఎడ్ల రాజిరెడ్డి, డీసీసీబీ మాజీ చైర్మన్, కాంగ్రెస్ నేత

నిజాంసాగర్‌కు పూర్వ వైభవం



బాన్సువాడ నియోజకవర్గంలోని ఆరు మండలాలతో పాటు కామారెడ్డి, ఎల్లారెడ్డి, జుక్కల్ నియోజవర్గ రైతులకు ఎంతో మేలు జరుగుతుంది. జిల్లా రైతులకు ఈ ప్రాజెక్టు నిర్మాణంతో కల నెరవేరుతుంది. కరువు జిల్లా కామారెడ్డికి కాంతులు రానున్నాయి. ప్రతిపక్షాలు రాజకీయ లబ్ధి కోసం అడ్డుకోవడం తగదు.

- పోచారం సురేందర్‌రెడ్డి, టీఆర్ఎస్ నాయకుడు

నల్లగొండ పచ్చజెండా

కాళేశ్వరానికి మద్దతు పలికిన నీలగిరి రైతులు

చిట్యాల: కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణానికి నల్లగొండ రైతులు, అఖిలపక్ష నేతలు, ముక్తకంఠంతో జై కొట్టారు. చిట్యాలలో బుధవారం జరిగిన ప్రజాభిప్రాయ సేకరణకు పెద్ద ఎత్తున హాజరైన రైతులు, ప్రజలు కాళేశ్వరం కట్టితీరాల్సిందేనని ప్రభుత్వాన్ని కోరారు. జేసీ నారాయణరెడ్డి మాట్లాడుతూ కేవలం పర్యావరణ అనుమతి కోసం నిర్వహిస్తున్న అభిప్రాయ సేకరణే తప్ప పరిహారం చెల్లింపునకు సంబంధించినది కాదని, రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని చెప్పారు. ఎంపీ గుత్తా సుఖేందర్‌రెడ్డి, స్థానిక ఎమ్మెల్యే వేముల వీరేశం మాట్లాడుతూ కాళేశ్వరం ప్రాజెక్టు తెలంగాణకు వరప్రదాయిని అని తెలిపారు. వృథాగా పోతున్న వేలాది టీఎంసీల గోదావరి నీటిని బీళ్లకు మళ్లించడం చారిత్రక పరిణామం అని పేర్కొన్నారు.

ఫ్లోరైడ్ ప్రాంతానికి వరంలాంటిది...



ఫ్లోరైడ్ సమస్యతో సతమతమౌతున్న మా ప్రాంతానికి కాళేశ్వరం ప్రాజెక్టు వరంలాంటిది. నిర్మాణానికి మా సంపూర్ణ మద్దతు ఉంటుంది. ఇప్పటికీ కొన్ని గ్రామాల్లో తాగునీటి ఇబ్బంది నెలకొంది. భూగర్భ జలాలు అడుగంటి వందలాది ఫీట్ల లోతు బోర్లు వేసినా నీరు పడడం లేదు. ఈ ప్రాజెక్టు వస్తే సాగు, తాగు నీటి సమస్య తీరుతుంది. **- గుండెబోయిన సైదులు, రైతు, చిట్యాల**

నీరొస్తుందంటే సంతోషం...



సార్లు మీకు దణ్ణం పెడుతా... మాకు నీరొస్తుందంటే అదే సంతోషం. నాకు భర్త లేడు, పిల్లలు లేరు భూమి ఉంది కాని నీళ్లు లేవు. ఎన్నో ఏల్లుగా చూస్తున్నా... నీరొస్తే పంట పండించుకుందామని. ఇప్పుడు నీరొస్తుందని తెలిసి గేడికి వచ్చిన. నీళ్లు తెప్పిస్తే సాలు.. పంట లు పండిచ్చుకోని బతుకుతం.

- కొత్త మల్లమ్మ, రైతు, సుంకెనపల్లి, చిట్యాల

బతుకులు బాగుపడ్తయ్

సంగారెడ్డి, నమస్తేతెలంగాణ ప్రధానప్రతినిధి: సాగునీటితోనే తమ బతుకుల్లో వెలుగులు నిండుతాయని సంగారెడ్డి జిల్లా రైతులు అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై బుధవారం సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్‌లో ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టారు. ప్రాజెక్టులో భాగంగా 19వ ప్యాకేజీ కింద నారాయణఖేడ్, కల్హేర్, అందోల్, హత్నూర మండలాల్లోని 38 గ్రామాల్లో 35,772 ఎకరాలకు సాగునీరందించనున్నారు. అభివృద్ధిలో వెనుకబడిన నారాయణఖేడ్ ప్రాంతానికి కాళేశ్వరం వరప్రదాయని అని ప్రజా ప్రతినిధులు, ప్రజా సంఘాలు, రైతు సంఘాల నాయకులు అభిప్రాయపడ్డారు. ప్రాజెక్టు నిర్మాణానికి పర్యావరణ అనుమతులివ్వాలని రైతులు, రైతు సంఘాల నాయకులు కలెక్టర్ మాణిక్‌రాజ్ కణ్ణన్‌కు వినతి పత్రాలు సమర్పించారు. కార్యక్రమంలో ఎంపీ బీబీపాటిల్, ఎమ్మెల్యేలు భూపాల్‌రెడ్డి, చింతా ప్రభాకర్, ఎమ్మెల్సీ ఫరీదుద్దీన్‌తో కలెక్టర్ మాణిక్కరాజ్ కణ్ణన్, జేసీ వాసం వెంకటేశ్వర్లు, పీసీబీ ఇతర శాఖల అధికారులు అందరి అభిప్రాయాలను నమోదు చేసుకున్నారు.

శుభపరిణామం




కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణానికి పూనుకోవడమే కాకుండా ఇందులో నారాయణఖేడ్ నియోజకవర్గానికి సాగునీటి అందించే విధంగా చర్యలు తీసుకోవడం శుభపరిణామం. వర్షాధార పంటలపై ఆధారపడ్డ ఇక్కడి రైతుల కష్టాలు ఇక తీరినట్టే. ప్రతిపక్ష పార్టీలు కూడా సంపూర్ణ మద్దతు ప్రకటించాలి. సాగునీటితో రైతు జీవితం ముడిపడి ఉన్నదనే అంశాన్ని ప్రతిపక్షాలు గుర్తుంచుకోవాలి.

- నారాయణరెడ్డి, రైతు, చాప్టా(కె), నారాయణఖేడ్ మండలం

ప్రాజెక్టుల ఇన్‌ఫ్లో, ఔట్‌ఫ్లో, నీటి నిల్వ వివరాలు

కృష్ణా బేసిన్

ప్రాజెక్టు	ఇన్‌ఫ్లో (క్యూసెక్కుల్లో)	ఔట్‌ఫ్లో (క్యూసెక్కుల్లో)	పూర్తినీటిమట్టం (అడుగుల్లో)	ప్రస్తుతనీటిమట్టం (అడుగుల్లో)	పూర్తిసామర్థ్యం (టీఎంసీల్లో)	ప్రస్తుతం (టీఎంసీల్లో)
ఆల్మట్టి	513	513	1705	1703.48	128.72	121.40
నారాయణపూర్	0	230	1615	1612.50	37.646	34.21
జూరాల	2040	2214	1045	1038.88	9.66	6.172
తుంగభద్ర	10336	1101	1633	1618.62	100.86	54.57
శ్రీశైలం	1908	42	885	782.30	215.807	21.26
నాగార్జునసాగర్	608	608	590	500.20	312.045	115.626
పులిచింతల	0	0	175	119.69	45.77	3.71
ప్రకాశం బ్యారేజీ	14170	14170	56.75	56.85	3.070	3.00



(జూన్1 నుంచి ఇప్పటివరకు 463.622 టీఎంసీల గోదావరి జలాలు సముద్రంలో కలిశాయి)

గోదావరి బేసిన్

ప్రాజెక్టు	ఇన్‌ఫ్లో (క్యూసెక్కుల్లో)	ఔట్‌ఫ్లో (క్యూసెక్కుల్లో)	పూర్తినీటిమట్టం (అడుగుల్లో)	ప్రస్తుతనీటిమట్టం (అడుగుల్లో)	పూర్తిసామర్థ్యం (టీఎంసీల్లో)	ప్రస్తుతం (టీఎంసీల్లో)
జైక్వాడ్	23504	541	1522	1514.43	102.732	73.98
కడెం	1380	945	700	698.13	7.6	7.12
ఎస్సారెస్పీ	18436	587	1091	1067.90	90.313	25.223
సింగూరు	8331	345	1717.93	1709.81	29.91	18.73
నిజాంసాగర్	1215	67	1405	1383.75	17.803	2.11
ఎల్లంపల్లి	2022	660	485	474.31	20.175	11.80
లోయర్‌మానేరు	0	129	920	893.45	24.07	7.313
ధవళేశ్వరం	209174	209637	45	45	2.93	2.93

ఎస్సారెస్పీకి తగ్గిన ఇన్‌ఫ్లో

మెండోరా: నిజామాబాద్ జిల్లాలో, ఎస్సారెస్పీకి ఎగువన మహారాష్ట్రలో వర్షాలు తగ్గు ముఖం పట్టడంతో ఇన్‌ఫ్లో గణనీయంగా తగ్గింది. బుధవారం ఉదయం 27 వేల 405 క్యూసెక్కులుగా ఉన్న ఇన్‌ఫ్లో సాయంత్రానికి 18 వేల 723కు తగ్గింది. బుధవారం సాయంత్రానికి ప్రాజెక్టులో నీటి మట్టం 1068.10 అడుగులతో 25.452 టీఎంసీల నీటి నిల్వ ఉంది.

నిజాంసాగర్‌కు స్వల్ప ఇన్‌ఫ్లో

నిజాంసాగర్ ప్రాజెక్టులోకి 408 క్యూసెక్కుల స్వల్ప ఇన్‌ఫ్లో వస్తున్నది. ప్రస్తుతం 1383.82అడుగులు, 2.130 టీఎంసీల నీరుంది.



శ్రీరాంసాగర్ జలాశయం

కడెం ప్రాజెక్టుకూ..

నిర్మల్ జిల్లా కడెం ప్రాజెక్టుకు 1366 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తున్నది. 698.125 అడుగులతో 7.120 టీఎంసీల నీరు ఉన్నది. సారంగాపూర్ మండలంలోని స్వర్ణ ప్రాజెక్టు నీటిమట్టం 1183 అడుగులకు 1179 అడుగుల వద్ద ఉంది. ఇన్‌ఫ్లో ఐదు వేల క్యూసెక్కులు వస్తుండగా 40 క్యూసెక్కులు దిగువకు విడుదల చేస్తున్నారు.

సింగూర్ ప్రాజెక్టులోకి

పుల్కల్: సింగూర్ ప్రాజెక్టులోకి 8331 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తున్నది. ప్రస్తుతం 18.73 టీఎంసీల నీరు ఉన్నది. గురువారం ఈ వరదమరింత పెరిగే ఆస్కారముందని డ్యాం అధికారులు తెలిపారు.

ఎల్లంపల్లి ప్రాజెక్టులోకి చేరుతున్న నీరు

అంతర్గాం : శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టులోకి ఇన్‌ఫ్లో కొనసాగుతున్నది. ప్రాజెక్టు ఎత్తు 148 మీటర్లు కాగా, 144.58 మీటర్లతో 11.816 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్టు అధికారులు తెలిపారు.

దూసుకొచ్చిన కారు...!

- ఐదుగురికి గాయాలు - ఇద్దరి పరిస్థితి విషమం
- భద్రకాళి ఆలయ ప్రాంగణంలో ఘటన

ఎంజీఎం(వరంగల్): కొత్త కారు పూజ ఆరుగురి ప్రాణం మీదకు తెచ్చింది. వరంగల్ భద్రకాళీ ఆలయ ప్రాంగణంలో చోటు చేసుకున్న ఈ ఘటనలో ఐదుగురికి గాయాలయ్యాయి. వీరిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉన్నది. ఎంజీఎం ఔట్ పోస్టు పోలీసులు, బాధితుల కథనం ప్రకారం... భూపాలపల్లి (జయశంకర్)జిల్లాకు చెందిన ఏరనాకుల వీరన్న , గోపమ్మ దంపతులు వారి కుమారుడు ప్రశాంత్, కూతురు ప్రవళికతోపాటుగా రెండేళ్ల మనవడు నవీన్‌చందర్‌తో కలిసి బుధవారం వరంగల్‌లోని శ్రీభద్రకాళీ దేవస్థానాకి వచ్చారు. వారు కొన్న కొత్త కారుకు పూజలు చేయించుకున్నారు.అనంతరం వీరన్న కారును డ్రైవర్‌కు ఇవ్వకుండా తానే నడిపే ప్రయత్నం చేశాడు. ఈక్రమంలో కారు అతి వేగంగా ముందుకు పోనివ్వడంతో ఆందోళనకు గురయ్యాడు. పూజలు చేయించడం కోసం కూర్చున్న వీరన్న కుటుంబ సభ్యులతోపాటు యాచకురాలి పైకి దూసుకెళ్లింది. కంగుతిన్న భక్తులు తలోదిక్కు పరుగులు తీశారు. ఘటనలో వీరన్న, గోపమ్మ, కుమారుడు ప్రశాంత్, కూతురు ప్రవళిక, మనవడు నవీన్ చందర్‌తోపాటు యాచకురాలు చందర్‌వాణి గాయపడ్డారు. గోపమ్మ, నవీన్‌చందర్‌ల పరిస్థితి ఆందోళనకరంగా ఉన్నట్టు వైద్యులు తెలిపారు.



సంఘటన స్థలంలో దెబ్బతిన్న కారు

ఊటకుంటలో పడి ఇద్దరు బాలుర దుర్మరణం

బోథ్, నమస్తే తెలంగాణ: ఇద్దరు బాలురు ఊటకుంటలో మునిగి ప్రాణాలు వదిలిన ఘటన బుధవారం ఆదిలాబాద్ జిల్లా బోథ్ మండలం సాకెరలో చోటుచేసుకుంది. ఎస్సై శ్రీనివాస్ కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన జాదవ్ ధర్మేందర్ (14), జాదవ్ హరికృష్ణ (12) అప్పుడప్పుడు మేకలు మేపుతుంటారు. బుధవారం పక్కనే గల టీవీటీ గ్రామ అటవీ ప్రాంతానికి మేకలను తీసుకెళ్లి ఊటకుంటలో నీటిని తాగించారు. అనంతరం స్నానం చేసేందుకు కుంటలోకి దిగారు. ఈత రాకపోవడంతో భయంతో ఒకరినొకరు పట్టుకోవడంతో ఇద్దరు మునిగిపోయారు.



జాదవ్ ధర్మేందర్, జాదవ్ హరికృష్ణ మృతదేహాలు

అయ్యో 'పాప'లు

- పొత్తిళ్ల పిల్లలను వదిలించుకున్న తల్లులు
- భూపాలపల్లి, కుమ్రంభీం జిల్లాల్లో ఘటనలు

గోవిందరావుపేట/బెజ్జూర్: అప్పుడే పుట్టిన పండంటి బిడ్డలను వదిలించుకున్న ఘటనలు భూపాలపల్లి, ఆసిఫాబాద్ జిల్లాల్లో చోటుచేసుకున్నాయి. జయశంకర్ భూపాలపల్లి జిల్లా గోవిందరావుపేట మండలం పస్రా గ్రామంలోని పస్రా-మేడారం రహదారిలో హైస్కూల్ పక్కనే ఉన్న ఓ ఆటోలో ఉదయం పసికందును ఎవరో వదిలి వెళ్లారు. చుట్టుపక్కల వారి సమాచారం మేరకు పోలీసులు పాపను వరంగల్‌లోని ఇంటిగ్రేటెడ్ చైల్డ్ ప్రొటెక్షన్ అధికారులకు అప్పగించారు. కాగా ఆసిఫాబాద్ జిల్లా బెజ్జూర్ మండలం సులుగుపల్లికి చెందిన మడె పోచయ్య పెరటిలో మగ శిశువు లభ్యమయ్యాడు. శిశువు ఏడుపు విన్న అదే గ్రామానికి చెందిన సోయం చంద్రయ్య తన ఇంటికి తీసుకెళ్లాడు. ఐసీడీఎస్ అధికారులు అతని నుంచి బాబును ఆధీనంలోకి తీసుకొన్నారు.



పస్రాలో లభ్యమైన పసికందు



సులుగుపల్లిలో..

గొర్రెల పెంపకంతో ఆర్థిక ప్రగతి

- యాదవ, కురుమలకు సీఎం కేసీఆర్ ఆరాధ్యదైవం
- ఎప్పటికీ రుణపడి ఉంటాం: కే రాజయ్యయాదవ్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: గొర్రెల పెంపకంతో జీవనం కొనసాగిస్తున్న యాదవ, కురుమల ఆర్థిక ప్రగతికి ప్రభుత్వం కృషి చేస్తున్నదని రాష్ట్ర గొర్రెలు,మేకల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ కే రాజయ్యయాదవ్ చెప్పారు. బుధవారం తెలంగాణభవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. కురుమ, యాదవులు ఆర్థికంగా నిలదొక్కుకొనేందుకు ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు దూరదృష్టితో గొర్రెల పంపిణీ కార్యక్రమం చేపట్టారని తెలిపారు. సీఎం కేసీఆర్ చేస్తున్న ప్రయత్నాన్ని యాదవ, కురుమలు ఎన్నటికీ మరచిపోరన్నారు. గొర్రెల పంపిణీ కోసం తొలివిడుత రూ.5వేల కోట్ల బడ్జెట్‌ను ప్రభుత్వం మంజూరు చేసిందని పేర్కొన్నారు. రాష్ట్రంలో 7,925 గొర్రెల పెంపకందారుల సొసైటీలు, 7,60,000 మంది సభ్యులు ఉన్నారని, ఈ ఏడాది తొలివిడుతలో 3,62,445 మంది లబ్ధిదారులకు గొర్రెలు పంపిణీ చేశామని చెప్పారు. ఈ నెల 22నాటికి 63,576 యూనిట్లకు గాను 13,38,456 గొర్రెలను అందజేశామని తెలిపారు. అటవీప్రాంతంలో గొర్రెల మేత కోసం ప్రభుత్వం 45లక్షల ఎకరాల్లో స్టైలోగ్రాస్ పెంపకం చేపట్టిందన్నారు. గొర్రెల మంద వద్దకు వెళ్లి మొబైల్‌వ్యాన్ ద్వారా వైద్యం అందిస్తున్నామని, 1962 టోల్ ఫ్రీ నంబర్ ద్వారా ఈ సేవలు అందుతాయని చెప్పారు. ప్రమాదంలో మరణించిన గొర్రెల కాపరులకు రూ.6 లక్షల ప్రమాదబీమా అందజేయనున్నట్టు తెలిపారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్, మెదక్ జెడ్పీచైర్‌పర్సన్ రాజమణి, ఆలిండియా యాదవ మహిళా ఫ్రంట్ చైర్‌పర్సన్ బొంతు శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.



మీడియాతో మాట్లాడుతున్న కార్పొరేషన్ చైర్మన్ కే రాజయ్యయాదవ్, మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్, ఆలిండియా యాదవ మహిళా ఫ్రంట్ చైర్‌పర్సన్ బొంతు శ్రీదేవి

చక్కెర ధరలు పెంచితే కఠిన చర్యలు

- డీలర్లకు పౌరసరఫరాల శాఖ కమిషనర్ హెచ్చరిక

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: నిబంధనలకు విరుద్ధంగా చక్కెర నిల్వ చేసి కృత్రిమ కొరత సృష్టించి ధరలు పెంచేవారిపై కఠినచర్యలు తప్పవని పౌరసరఫరాలశాఖ కమిషనర్ సీవీ ఆనంద్ హెచ్చరించారు. కేంద్ర ప్రభుత్వ ఆదేశాలమేరకు చక్కెర ధరల నియంత్రణపై సీవీ ఆనంద్ హోల్‌సేల్ చక్కెర వ్యాపారుల సంఘం ప్రతినిధులతో బుధవారం పౌరసరఫరాలశాఖ భవన్‌లో సమావేశమయ్యారు. పాటించాల్సిన నిబంధనలతోపాటు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి డీలర్లకు వివరించారు. లైసెన్స్ ఉన్న వ్యక్తులు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్దేశించిన ధర కన్నా ఎక్కువ ధరకు చక్కెరను అమ్మకూడదని ఆయన స్పష్టం చేశారు. లైసెన్స్ లేకుండా విక్రయించే వ్యాపారులపై దాడులు నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. ఐదు క్వింటాళ్ల కంటే ఎక్కువగా చక్కెర నిల్వ చేసేవారిని నిబంధనల ప్రకారం డీలర్‌గా పరిగణిస్తారని, వారు సంబంధిత జిల్లా పౌరసరఫరాల అధికారి, తహశీల్దార్ల దగ్గర లైసెన్స్‌లు తీసుకోవాలని సీవీ ఆనంద్ సూచించారు. ఆ విధంగా చేయకపోతే నిత్యావసరాల చట్టం కింద చర్యలు తప్పవన్నారు. చక్కెర నిల్వలు, లావాదేవీలపై పరిమితులు విధిస్తూ కేంద్ర ప్రభుత్వం గతంలో విడుదల చేసిన ఉత్తర్వులను అక్టోబర్ 28 వరకు పొడిగించిన విషయాన్ని ఆయన గుర్తుచేశారు. చాలామంది లైసెన్స్ లేకుండా చక్కెర విక్రయిస్తున్నారని, వారిపై చర్యలు తీసుకోవాలని డీలర్లు ఫిర్యాదు చేశారు. వారి వివరాలు త్వరలో అందిస్తామని సీవీ ఆనంద్‌కు తెలిపారు. సమావేశంలో చక్కెర వ్యాపారుల సంఘం ప్రతినిధులు రాంప్రసాద్, కృష్ణమూర్తి, హరికిషన్ పాల్గొన్నారు.

చక్కెర నిల్వలు, లావాదేవీలపై ఇవీ పరిమితులు..

లైసెన్స్ రుసుం	హోల్ సేల్ రూ. 2000	రిటైల్ రూ.1000	రెండూ రూ.3000
సెక్యూరిటీ డిపాజిట్	రూ. 12,000	రూ. 6000	రూ. 18,000
స్టాక్ పరిమితులు	ప్రాంతం	హోల్ సేల్	రిటైలర్
	జీహెచ్ఎంసీ	2000 క్వింటాళ్లు	50క్వింటాళ్లు
	ఇతర ప్రాంతాలు	1000 క్వింటాళ్లు	40 క్వింటాళ్లు
	ఖండసారి (ఓపెన్ పాన్ చక్కెర)	2000 క్వింటాళ్లు	50 క్వింటాళ్లు

లోధా సిఫారసులు ఎందుకు అమలు చేయలేదు?



వ్యక్తిగతంగా కోర్టుకు హాజరు కావాలంటూ బీసీసీఐ కార్యదర్శికి సుప్రీం ఆదేశం

న్యూఢిల్లీ: లోధా సిఫారసులను అమలు చేయాలన్న తమ ఆదేశాలను పట్టించుకోని బీసీసీఐపై సుప్రీం కోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. జస్టిస్ లోధా కమిటీ ప్రతిపాదించిన సంస్కరణల్లో ఒక్కటి కూడా అమలు చేయకపోవడంలో మీ ఆంతర్యమేంటని జస్టిస్ దీపక్ మిశ్రా నేతృత్వంలోని ఏఎమ్ ఖాన్‌విల్కర్, డీవై చంద్రచూడ్‌లతో కూడిన త్రిసభ్య బెంచ్ బుధవారం క్రికెట్ బోర్డును ఘాటుగా ప్రశ్నించింది. సంస్కరణలు ఎందుకు అమలు చేయలేదో వివరణ కోరుతూ వచ్చేనెల 19న వ్యక్తిగతంగా కోర్టు ముందు హాజరుకావాలని బీసీసీఐ తాత్కాలిక కార్యదర్శి అమితాబ్ చౌదరికి షోకాజ్ నోటీసులను జారీ చేసింది. లోధా సంస్కరణలు అమలు చేయకపోవడం వెనుక బీసీసీఐ ఆఫీస్ బేరర్లయిన సీకే ఖన్నా, అమితాబ్ చౌదరి, అనిరుధ్ చౌదరిలదే పూర్తి బాధ్యతారాహిత్యంగా ప్రవర్తించారని సుప్రీం కోర్టు నియమిత క్రికెట్ పరిపాలన కమిటీ (సీవోఏ) తరఫున సీనియర్ న్యాయవాది గోపాల్ సుబ్రమణ్యం ధర్మాసనానికి వెల్లడించారు. లోధా ప్రతిపాదనల అమలుకు ఈ ముగ్గురు ఏమాత్రం కృషి చేయలేదని సుబ్రమణ్యం కోర్టుకు తెలిపారు. ఇక అనర్హులైన అధికారులను బోర్డు సమావేశాలకు అనుమతిస్తున్నారంటూ అమితాబ్ చౌదరికి వ్యతిరేకంగా బీహార్ క్రికెట్ సంఘం (సీఏబీ) దాఖలు చేసిన పిటిషన్‌పై సుప్రీం కోర్టు స్పందిస్తూ.. ఈ అంశంలో సీవోఏ నివేదికను పూర్తిగా చదివాక విచారణ చేపట్టనున్నట్లు వ్యాఖ్యానించింది.



బూమ్ బూమ్ ఇన్నింగ్స్

లండన్: ఏడాది క్రితం అంతర్జాతీయ క్రికెట్‌కు గుడ్‌బై చెప్పిన షాహిద్ అఫ్రిది ఇప్పుడు కౌంటీల్లో దుమ్మురేపుతున్నాడు. బూమ్ బూమ్ అఫ్రిది అంటూ అభిమానులచే ముద్దుగా పిలిపించుకునే ఈ పాకిస్థాన్ మాజీ కెప్టెన్.. నాట్‌వెస్ట్ టి20 బ్లాస్ట్ టోర్నమెంట్‌లో రికార్డు శతకం సాధించి అదరగొట్టాడు. డెర్బీషైర్ జట్టుతో జరిగిన క్వార్టర్‌ఫైనల్ మ్యాచ్‌లో హ్యాంప్‌షైర్ జట్టు తరఫున ఓపెనర్‌గా బరిలోకి దిగిన అఫ్రిది 43 బంతుల్లోనే 101 పరుగులతో సెంచరీ బాదాడు. తన ఇన్నింగ్స్‌లో 7 సిక్సర్లు, 10 ఫోర్లు కొట్టిన అఫ్రిదికిదే టీ20ల్లో తొలి సెంచరీ కావడం విశేషం. అఫ్రిది అద్భుత ఇన్నింగ్స్‌తో హ్యాంప్‌షైర్ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్లకు 249 పరుగుల భారీస్కోరు సాధించింది. దీంతో డెర్బీషైర్‌పై 101 పరుగులతేడాతో భారీ విజయాన్ని నమోదుచేసి హ్యాంప్‌షైర్ జట్టు సెమీఫైనల్‌కు దూసుకెళ్లింది. అఫ్రిదికే మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు దక్కింది. 1996లో అప్పటి ప్రపంచ చాంపియన్ శ్రీలంక జట్టుతో జరిగిన వన్డేలో అఫ్రిది 37 బంతుల్లోనే సెంచరీ కొట్టి రికార్డు సృష్టించిన సంగతి తెలిసిందే.

పోలీసు శిక్షణ కేంద్రానికి సచిన్ సాయం

న్యూఢిల్లీ: రాజ్యసభ ఎంపీ సచిన్ టెండూల్కర్.. మహారాష్ట్రలోని సాంగ్లీ జిల్లాకు చెందిన తుర్చి పోలీసు శిక్షణ కేంద్రానికి రూ. 15 లక్షలు సహాయం చేశాడు. నీటి సరఫరా ప్రాజెక్ట్ కోసం తన ఎంపీలాడ్స్ నిధుల నుంచి ఈ డబ్బులను సమకూర్చాడు. ఈ మేరకు తుర్చి పోలీస్ శిక్షణ కేంద్ర హెడ్ సంజయ్ బార్కుండ్ ఈ విషయాన్ని ధ్రువీకరించాడు. 'నీటి సరఫరా ప్రాజెక్ట్ కోసం నిధులు ఇవ్వాలని ఎంతో మంది సెలబ్రిటీలను అడిగాం. కానీ ఎవరూ స్పందించలేదు. ఇదే విషయాన్ని ఓసారి సచిన్ దృష్టికి తీసుకెళ్లాం. తక్షణమే స్పందించి రూ. 15లక్షలు మంజూరు చేశాడు. ఇందుకు మా శిక్షణ కేంద్రం మాస్టర్‌కు ఎంతో రుణపడి ఉంటుంది' అని సంజయ్ పేర్కొన్నాడు. ప్రాజెక్ట్‌కు సంబంధించిన పనులను జిల్లా కలెక్టర్ పర్యవేక్షణలో జరుగనున్నాయి.

సెమీస్‌లో ఢిల్లీ డాన్స్

అహ్మదాబాద్: ఇండియన్ క్యూ మాస్టర్స్ లీగ్‌లో ఢిల్లీ డాన్స్ జట్టు సెమీ ఫైనల్స్‌కు దూసుకెళ్లింది. బుధవారం జరిగిన పోరులో ఢిల్లీ జట్టు 3-2 స్కోరు తేడాతో గుజరాత్ కింగ్స్‌కు షాకిచ్చి ఫైనల్‌కు అడుగుదూరంలో నిలిచింది. చెన్నై స్ట్రయికర్స్ జట్టు ఇప్పటికే సెమీస్ చేరిన సంగతి తెలిసిందే.



ప్రీక్వార్టర్స్‌లో సైనా


ప్రపంచ చాంపియన్‌షిప్‌లో శ్రీకాంత్, సాయి ప్రణీత్ ముందంజ

ప్రపంచ చాంపియన్‌షిప్‌లో భారత షట్లర్లు దూకుడు మీదున్నారు. వరుస విజయాలతో పతకాల రేసులో దూసుకెళుతున్నారు. మహిళల సింగిల్స్‌లో మాజీ ఫైనలిస్టు సైనా నెహ్వాల్ గ్రాండ్‌గా శుభారంభం చేస్తూ ప్రీక్వార్టర్స్‌లో ప్రవేశించగా, పురుషుల సింగిల్స్‌లో హాట్ ఫేవరెట్ కిడాంబి శ్రీకాంత్, సాయి ప్రణీత్‌లు రెండో గెలుపు నమోదుచేసి క్వార్టర్‌ఫైనల్స్‌కు అడుగుదూరంలో నిలిచారు.

గ్లాస్గో: ప్రపంచ చాంపియన్‌షిప్‌కు జంబో జట్టుతో బయలుదేరిన భారత షట్లర్లు అందుకు తగ్గట్లే వరుస విజయాలతో ముందుకెళుతున్నారు. ఇప్పటికే మహిళల సింగిల్స్‌లో పీవీ సింధు ప్రీక్వార్టర్స్‌లో ప్రవేశించగా, ఇప్పుడు సైనా నెహ్వాల్ వంతు. లండన్ ఒలింపిక్స్ కాంస్య పతక విజేతైన సైనా రెండోరౌండ్‌ను అలవోకగా అధిగమించింది. తొలిరౌండ్‌లో బై అందుకున్న సైనా బుధవారం జరిగిన రెండోరౌండ్లో స్విట్జర్లాండ్ అమ్మాయి సబ్రినా జాకిట్‌ను వరుసగేముల్లో చిత్తుచేసింది. కేవలం 33 నిమిషాల్లోనే ముగిసిన ఈ పోరులో 12వ సీడ్ సైనా 21-11, 21-12తో విజయం సాధించింది. క్వార్టర్స్‌బెర్త్ కోసం సైనా కొరియాకు చెందిన రెండో సీడ్ సంగ్ జీ హ్యూన్‌తో అమీతుమీ తేల్చుకోనుంది. అయితే, సంగ్ జీ హ్యూన్‌తో ముఖాముఖి రికార్డులో సైనా 7-2తో పైచేయిగా ఉంది. అందులోనూ ఇద్దరూ చివరిసారిగా ఈ ఏడాది ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో తలపడగా, సైనానే నెగ్గింది. మరో రెండో రౌండ్ పోరులో సంగ్ జీ 21-9, 21-19తో భారత అమ్మాయి తన్వి లాడ్‌ను ఓడించింది. పురుషుల సింగిల్స్‌లో కచ్చితంగా పతకం సాధిస్తాడనుకుంటున్న ప్రపంచ 8వ ర్యాంకర్ శ్రీకాంత్ 21-9, 21-17తో ఫ్రాన్స్ షట్లర్ లుకాస్ కార్వీపై గెలుపొందాడు. ఇటీవల వరుసగా రెండు సూపర్‌సిరీస్‌లు నెగ్గి జోరుమీదున్న శ్రీకాంత్ క్వార్టర్స్‌లో చోటుకోసం 14వ సీడ్ ఆండ్రెస్ ఆంటోన్‌సెన్ (డెన్మార్క్)తో తలపడుతాడు. గంటా 12 నిమిషాల పాటు సాగిన మరో మ్యాచ్‌లో సింగపూర్ ఓపెన్ చాంపియన్ సాయి ప్రణీత్ 14-21, 21-18, 21-19తో ఆంథోనీ (ఇండోనేసియా)ని ఓడించి ప్రీక్వార్టర్స్ చేరాడు. మార్క్ జ్వీబ్లెర్, చో తిన్ చెన్ మధ్య జరిగే మ్యాచ్ విజేతతో ప్రణీత్ తర్వాతిరౌండ్ ఆడనున్నాడు. మహిళల డబుల్స్‌లో భారత్ పోరు ముగిసింది. రెండోరౌండ్లో సిక్కిరెడ్డి-అశ్విని పొన్నప్ప జంట 22-24, 21-17, 15-21తో రెండోసీడ్ కమిల్లా రైటర్-క్రిస్టినా (డెన్మార్క్) జోడీ చేతిలో పోరాడి ఓడగా.. మరో భారత ద్వయం సంజన-ఆరతి 14-21, 15-21తో చైనా జంట చేతిలో ఓడి ఇంటిబాట పట్టింది.


సాయి ప్రణీత్


శ్రీకాంత్



నేడు లంకతో భారత్ రెండో వన్డే

జోరుమీదున్న విరాట్‌సేన

తీవ్ర ఒత్తిడిలో ఆతిథ్య జట్టు

ఓవైపు ఉరకలేసే ఉత్సాహంతో భారత్.. మరోవైపు తేరుకోలేనంత బాధతో శ్రీలంక. పరాయి గడ్డపై జైత్రయాత్ర చేస్తున్న విరాట్‌సేన.. సొంతగడ్డపై విజయం కోసం కండ్లు కాయలు కాచేలా ఎదురుచూస్తున్న తరంగ బృందం.. ఇలా రెండుజట్లు కీలకమైన రెండోవన్డే కోసం సిద్ధమయ్యాయి. 2019 వరల్డ్ కప్ లక్ష్యం దృష్టితో ఈ మ్యాచ్‌లో భారత్ ప్రయోగాలకు దిగుతుందా? లేదా సిరీస్‌లో ఆధిపత్యం కొనసాగించేందుకు మార్పుల్లేకుండా ఆడుతుందా అన్నది ఆసక్తికరంగా మారింది.

ఆధిపత్యమా.. ప్రయోగమా!

పల్లెకెలె

ఎన్ని వ్యూహ్యాలు పన్నినా.. ఎంత మంది ఆటగాళ్లను మార్చినా.. సొంత గడ్డపై భారత్ చేతిలో ఎదురవుతున్న పరాజయాలకు చెక్ పెట్టాలని భావిస్తున్న శ్రీలంక.. భారత్‌తో గురువారం జరిగే రెండో డేనైట్ వన్డేలో అమీతుమీ తేల్చుకోనుంది. ఇప్పటికే టెస్టు సిరీస్ కోల్పోయి ఉక్కిరిబిక్కిరి అయిన లంకకు తొలి వన్డే ఓటమితో కోలుకోలేని దెబ్బతగిలింది. దీంతో అటు అభిమానులు, ఇటు బోర్డు.. తమ ఆటతీరుపై ఆగ్రహంతో రగిలిపోతున్న నేపథ్యంలో.. రెండో వన్డేలో విజయం రుచి చూడాలని ప్రణాళికలు రచిస్తున్నది. ఎలాగైనా ఈ మ్యాచ్‌లో గెలిచి సిరీస్‌ను 1-1తో సమం చేయాలని యోచిస్తున్నది. మరోవైపు స్పష్టమైన ఆధిక్యంతో సిరీస్‌ను గెలువాలని కోరుకుంటున్న టీమ్ ఇండియా అందుకు తగ్గట్టుగానే కసరత్తులు మొదలుపెట్టింది.

మార్పుల్లేనట్లే..!

తొలి వన్డేలో ఆడిన జట్టునే ఈ మ్యాచ్‌కు యథావిధిగా కొనసాగించాలని కోహ్లీ భావిస్తున్నాడు. ఇది కాకుండా ఈ సిరీస్‌లో ఇంకా మూడు మ్యాచ్‌లు ఉండటంతో విన్నింగ్ కాంబినేషన్‌ను మార్చొద్దన్నది విరాట్ వాదన. ఇదే జరిగితే రహానే, కుల్దీప్, శార్దూల్, మనీష్ పాండే మరోసారి రిజర్వ్ బెంచ్‌కే పరిమితం కానున్నారు. ధవన్, కోహ్లీ ఫామ్‌ను చూపెడితే ఈ మ్యాచ్‌లోనూ తిరుగుండదు. అయితే రోహిత్ వైఫల్యం ఆందోళన కలిగించే అంశం. అతను ఓ భారీ ఇన్నింగ్స్ బాకీ ఉన్నాడు. ఈ మ్యాచ్‌లోనైనా తీరుస్తాడో లేదో చూడాలి. లంక బౌలర్లు టీమ్‌ఇండియాను ఆలౌట్ చేయడం కష్టంగా మారడంతో బ్యాటింగ్ లైనప్‌లో ప్రయోగాలు చేసేందుకు కోహ్లీ సిద్ధమవుతున్నాడు. రాహుల్, జాదవ్‌కు ఎక్కువ బ్యాటింగ్ చేసే అవకాశం ఇవ్వాలని భావిస్తున్నాడు. ఇక బౌలింగ్‌లోనూ మార్పులు కనబడటం లేదు. పేసర్లు బుమ్రా, భువనేశ్వర్ స్థానాలు ఖాయం కాగా, దంబుల్లా మాదిరిగానే చాహల్-అక్షర్ స్పిన్ కాంబినేషన్‌ను కొనసాగించనున్నారు. లంక వికెట్లపై అదనంగా మూడో స్పిన్నర్‌ను ఆడించే అవకాశాలేకపోవడం, పల్లెకెలె వికెట్ చాలా పొడిగా ఉండటంతో కుల్దీప్‌కు అవకాశం లేనట్లే. తొలి వన్డేలో లక్ష్యం చిన్నదే అయినా.. ఇద్దరే ఉఫ్‌మని ఉదేయడంతో జట్టులో ఆత్మవిశ్వాసం అమాంతం పెరిగింది. రోహిత్ కూడా అనూహ్యంగా రనౌట్ అయ్యిందే తప్ప ఇందులో లంక బౌలర్ల పాత్ర ఏమీలేదు. దీంతో రెండో వన్డేలో లంకేయులు అద్భుతం చేస్తే తప్పా.. భారత్‌ను నిలువరించడం కత్తిమీద సామే.

అన్నీ సందేహాలే..

మరోవైపు లంక తుది జట్టు ఎంపికపై సర్వత్రా విమర్శలు చెలరేగుతున్నాయి. లంక తరఫున అటాకింగ్ బ్యాట్స్‌మన్‌లలో ఒకడైన టెస్టు కెప్టెన్ చండిమల్‌కు తొలి వన్డేలో స్థానం కల్పించలేదు. సాధారణంగా ఓపెనర్‌గా వచ్చే కెప్టెన్ ఉపుల్ తరంగ.. చండిమల్ స్థానమైన నాలుగో నంబర్‌లో బ్యాటింగ్‌కు వచ్చాడు. దీంతో ఈ ఇద్దరికి చెడిందని, డ్రెస్సింగ్ రూమ్ వాతావరణం బాగాలేదని వార్తలు హల్‌చల్ చేస్తున్నాయి. కోచ్, కెప్టెన్ మధ్య సమన్వయం లేదన్న కథనాలు కూడా మొదలయ్యాయి. మ్యాచ్ తర్వాత జరిగిన మీడియా సమావేశంలో కోచ్ పోతాస్ బహిరంగంగా చండిమల్ విషయంపై మాట్లాడటం దీనికి మరింత బలాన్ని చేకూర్చింది. అయితే దీనిపై చీఫ్ సెలెక్టర్ జయసూర్య, టీమ్ మేనేజర్ గురుసిన్హా స్పందించకపోవడం గమనార్హం. 2019 వరల్డ్‌కప్‌నకు నేరుగా అర్హత సాధించాలంటే కచ్చితంగా రెండు మ్యాచ్‌లు గెలువాల్సిన పరిస్థితిలో లంక జట్టు రెండో వన్డే ఎలా ఆడుతుందన్నది ఆసక్తికరంగా మారింది. ప్రస్తుతం నెలకొన్న సందేహాలకు తెరదించాలంటే రెండో వన్డేలో చండిమల్‌కు స్థానం కల్పించాలి? అలాంటప్పుడు తొలి వన్డేలో రాణించిన టాప్ ఆర్డర్‌లో ఎవర్ని తప్పిస్తారు? డిక్‌వెల్లా, గుణతిలక, మెండిస్ రాణించడంతో ఓ దశలో 150/3 స్కోరు చేసింది. భారత్ పేసర్లతో పాటు స్పిన్ ద్వయాన్ని ఈ ముగ్గురు సమర్థంగా ఎదుర్కొన్నారు. కాబట్టి మిడిలార్డర్‌ను బలోపేతం చేయాలంటే చండిమల్‌ను తీసుకుంటారా? కానీ మేనేజ్‌మెంట్ ఆ దిశగా ఆలోచనలు చేయడం లేదు. ఈ మ్యాచ్ కోసం ముగ్గురు స్పిన్నర్లతో ఆడాలని నిర్ణయించింది. అందులో భాగంగా పెరీరా, సందకన్, డిసిల్వా స్థానంలో సిరివందన, హసరంగ, ధనుంజయకు తుది జట్టులో చోటు కల్పించాలని భావిస్తున్నది. ఇదే జరిగితే చండిమల్‌కు మరోసారి మొండిచెయ్యే. ఇక బౌలింగ్‌లో మలింగ, ఫెర్నాండో పేస్ బాధ్యతలను పంచుకోనున్నారు. మొత్తానికి లంక కుర్రాళ్లపై భారం వేసింది.




పిచ్, వాతావరణం

ఫ్లడ్‌లైట్ల వెలుతురులో సీమర్లకు అనుకూలం. అలాగని స్పిన్నర్లకు సహకరించదని చెప్పలేం. వికెట్ పొడిగా ఉండటంతో పగుళ్లు కనిపిస్తున్నాయి. వర్షం ముప్పు ఉంది.

జట్లు (అంచనా)

భారత్: కోహ్లీ (కెప్టెన్), ధవన్, రోహిత్, రాహుల్, ధోనీ, జాదవ్, పాండ్యా, అక్షర్, చాహల్, భువనేశ్వర్, బుమ్రా.

శ్రీలంక: తరంగ (కెప్టెన్), డిక్‌వెల్లా, గుణతిలక, మెండిస్, మాథ్యూస్, కపుగెదెర, సిరివందన, హసరంగ, ధనుంజయ, మలింగ, ఫెర్నాండో.



కోచ్‌గా గ్రేమ్ స్మిత్

జొహన్నెస్‌బర్గ్: దక్షిణాఫ్రికా మాజీ కెప్టెన్ గ్రేమ్ స్మిత్ కొత్త బాధ్యతల్లో దర్శనమివ్వనున్నాడు. టీ20 గ్లోబల్ లీగ్‌కు చెందిన 'బెనోని జల్మీ' జట్టుకు స్మిత్ కోచ్‌గా వ్యవహరించనున్నాడు. నవంబర్‌లో జరిగే టీ20 గ్లోబల్ లీగ్‌లో పోటీపడుతున్న 8 జట్లలో బెనోని కూడా ఒకటి. ఇదే లీగ్‌లో భారత మాజీ క్రికెటర్లు రాబిన్ సింగ్, శ్రీరామ్ శ్రీధరన్ బ్లోయెమ్ సిటీ బ్లేజర్స్, జొహన్నెబర్గ్ జెయింట్స్ జట్లకు కోచ్‌లుగా వ్యవహరిస్తారు. కలిస్, ఫ్లెమింగ్, ప్యాడీ అప్టన్, డొమింగోలు ఇతర ఫ్రాంచైజీ జట్ల బాధ్యతలను స్వీకరించనున్నారు.



టీ10 లీగ్‌లో సెహ్వాగ్, గేల్

బెంగళూరు: భారత మాజీ క్రికెటర్ వీరేందర్ సెహ్వాగ్ మళ్లీ బ్యాట్‌పట్టి మైదానంలో పరుగుల వర్షం కురిపించేందుకు సిద్ధమవుతున్నాడు. టీ20 ఫార్మాట్ ఘన విజయంతో తాజాగా టీ10 పేరుతో మరో లీగ్ క్రికెట్లోకి ప్రవేశించనుంది. యూఏఈలోని షార్జా స్టేడియంలో వచ్చే డిసెంబర్ 21 నుంచి 24 వరకు టెన్ క్రికెట్ లీగ్ (టీసీఎల్) పేరుతో నాలుగురోజుల పాటు మ్యాచ్‌లు నిర్వహిస్తామని టీసీఎల్ అధ్యక్షుడు షాజి ఉల్ మాలిక్ తెలిపారు. ఈ టోర్నీలో వెస్టిండీస్ స్టార్ క్రిస్ గేల్, అఫ్రిది, సంగక్కర పాల్గొంటున్నట్లు నిర్వాహకులు వెల్లడించారు. టీమ్ పంజాబీస్, టీమ్ ఫఖ్తూన్స్, టీమ్ మరాఠ, టీమ్ బంగ్లాస్, టీమ్ లంకన్స్, టీమ్ సింధీస్, టీమ్ కేరళైటీస్ పేరుతో జట్లు బరిలోకి దిగనున్నాయి. పది ఓవర్లపాటు సాగే ఒక్కో మ్యాచ్ 90 నిమిషాలపాటు కొనసాగనుంది. దక్షిణాసియాలోనే అత్యధిక క్రికెట్ ప్రేమికులు ఉన్నారని..దీంతో ఈలీగ్ విజయవంతం కావడం ఖాయమని టీసీఏ వర్గాలు తెలిపాయి. ఈ టోర్నీలో టీమ్ ఫఖ్తూన్స్ జట్టుకు అఫ్రిది సారథ్యం వహించనున్నాడు.

వన్డే కెప్టెన్సీకి డివిలియర్స్ గుడ్‌బై



ఇక నుంచి అన్ని ఫార్మాట్లకు అందుబాటులో

కేప్‌టౌన్: దక్షిణాఫ్రికా డాషింగ్ హిట్టర్ ఏబీ డివిలియర్స్.. వన్డే కెప్టెన్సీ నుంచి వైదొలిగాడు. తనను బాధ్యతల నుంచి తప్పించాలని బుధవారం దక్షిణాఫ్రికా బోర్డు (సీఎస్ఏ)ను కోరాడు. 'ఆరేండ్లుగా జట్టుకు నాయకత్వం వహించడం గర్వంగా భావిస్తున్నా. ఏడాది కాలంగా నాకున్న అన్ని ఒప్పందాలను నెరవేర్చేందుకు ప్రయత్నించా. మానసికంగా, శారీరకంగా అలసిపోయినట్లు అనిపించింది. నా భార్య ఇద్దరు పిల్లలకు జన్మనిచ్చింది. 2004 నుంచి అన్ని ఫార్మాట్లలో ఆడుతుండడం వల్ల వాళ్లకు కాస్త దూరమైనట్లు భావించా. కానీ ఇప్పుడు నా కెరీర్‌పై సంపూర్ణ అవగాహనకు వచ్చా. సీఎస్ఏతో కలిసి నా కెరీర్‌ను మరికొంత కాలం ముందుకు తీసుకెళ్లాలని భావిస్తున్నా. అందుకే వన్డే కెప్టెన్సీ నుంచి వైదొలిగా. మరికొరికి అవకాశం ఇవ్వాలనే ఉద్దేశంతోనే ఈ నిర్ణయం తీసుకున్నా' అని ఏబీ పేర్కొన్నాడు. కెప్టెన్సీ నుంచి తప్పుకోవడంతో ఇక నుంచి మూడు ఫార్మాట్లకు అందుబాటులో ఉంటానని ఏబీ ప్రకటించాడు. కొంతకాలంగా టెస్టులకు దూరంగా ఉన్న ఏబీ ఇటీవల ఇంగ్లండ్, న్యూజిలాండ్‌తో సిరీస్‌ల్లో కూడా ఆడలేదు. దీంతో అతను టెస్టులకు గుడ్‌బై చెబుతాడని ఊహాగానాలు మొదలయ్యాయి. కానీ అందరి అంచనాలను తలకిందులు చేస్తూ మరోసారి వైట్ జెర్సీ ధరించేందుకు సిద్ధమవుతున్నానని ఏబీ ట్విట్టర్‌లో ప్రకటించాడు.

తలైవాస్ 33 - యోధాస్ 33

లక్నో: ప్రొ కబడ్డీ లీగ్‌లో భాగంగా బుధవారం తమిళ్ తలైవాస్, యూపీ యోధాస్ మధ్య ఉత్కంఠగా సాగిన పోరు చివరకు 33-33 స్కోరుతో డ్రాగా ముగిసింది. యూపీ జట్టులో స్టార్ రైడర్ రిషాంక్ దేవాదిగా 16 రైడింగ్ పాయింట్లతో అద్భుతంగా రాణించాడు. దబాంగ్ ఢిల్లీజట్టుతో హోరాహోరీగా సాగిన మ్యాచ్‌లో 27-25తేడాతో హర్యానా స్టీలర్స్ జట్టు విజయం సాధించింది. హర్యానా జట్టులో దీపక్ కుమరా 7, సుర్జీత్ సింగ్ 5, వికాస్ 4 పాయింట్లు సాధించి విజయంలో కీలపాత్ర పోషించారు. ఢిల్లీలో ఫాజల్ 8, మిరాజ్ 6, నీలేష్ 5 పాయింట్లు సాధించినా జట్టును ఓటమినుంచి తప్పించలేక పోయారు.



రూనీ రిటైర్మెంట్

లండన్: బ్రిటన్ స్టార్ ఫుట్‌బాలర్ వేన్ రూనీ అంతర్జాతీయ కెరీర్‌కు గుడ్‌బై చెబుతున్నట్లు సంచలన ప్రకటన చేశాడు. ఇప్పటివరకు ఇంగ్లండ్ జాతీయ జట్టు తరఫున 119 అంతర్జాతీయ మ్యాచ్ లాడిన రూనీ 53 గోల్స్ చేశాడు. ఇంగ్లండ్ తరఫున అత్యధిక అంతర్జాతీయ గోల్స్ సాధించిన రికార్డుకూడా అతని ఖాతాలోనే ఉంది. ఇటీవల కెప్టెన్సీ ఇవ్వకపోవడంతోపాటు ఇంగ్లండ్ జాతీయ జట్టులో చోటు కల్పించకపోవడంతోనే 31ఏండ్ల రూనీ ఈ నిర్ణయానికి వచ్చినట్లు తెలిసింది. అంతర్జాతీయ కెరీర్ నుంచి తప్పుకోవడానికి ఇదే సరైన సమయమని భావిస్తున్నానని రూనీ అన్నాడు. ఇంగ్లండ్ జట్టు మేనేజర్ గారెత్ సౌత్గటే ..రూనీకి ఫోన్ చేసి అతని నిర్ణయాన్ని మార్చుకోవాల్సిందిగా కోరారు. అతణ్ని మళ్లీ జట్టులోకి తీసుకుంటున్నట్లు ప్రకటించాడు. కానీ, రూనీ మాత్రం తన నిర్ణయానికే కట్టుబడ్డాడు.

యూరప్ టూర్‌కు రజనీ



న్యూఢిల్లీ: యువత, అనుభవజ్ఞుల కలబోతతో 18మందితో కూడిన భారత మహిళల హాకీ జట్టును యూరప్ పర్యటనకు ఎంపికచేశారు. ఈ టూర్‌లో భారత జట్టుకు సూపర్ ఫార్వర్డ్ రాణి కెప్టెన్‌గా ఎంపికవగా.. గోల్‌కీపర్ సవితను వైస్ కెప్టెన్‌గా నియమించారు. వచ్చేనెల 5న నెదర్లాండ్స్ జట్టుతో భారత యూరప్ టూర్ మొదలవుతుంది. ఈ జట్టులో తెలుగమ్మాయి రజనీ గోల్‌కీపర్‌గా చోటు దక్కించుకుంది.

ఉగ్రవాదాన్ని ప్రేరేపించే దేశంగా

పాక్‌పై ముద్రవేయాలి

- పలువురు అమెరికన్ కాంగ్రెస్ సభ్యుల డిమాండ్

వాషింగ్టన్, ఆగస్టు 23: పాకిస్థాన్‌పై ఉగ్రవాదాన్ని ప్రేరేపించే దేశంగా ముద్రవేయాలని, నాటోయేతర మిత్రదేశం హోదాను ఉపసంహరించాలని, ఆ దేశానికి అందిస్తున్న సహాయాన్ని తగ్గించాలని పలువురు అమెరికన్ చట్టసభ సభ్యులు డిమాండ్ చేశారు. ఉగ్రవాద సంస్థలకు ఆశ్రయం కల్పిస్తున్న పాక్‌ను అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీవ్రంగా హెచ్చరించడాన్ని వారు స్వాగతించారు. ట్రంప్ వ్యాఖ్యలు మాటలకే పరిమితం కాకూడదని కాంగ్రెస్ సభ్యుడు టెడ్ పో అన్నారు. అమెరికన్ల రక్తంతో పాక్ ఉగ్రవాదులకు సహాయం చేయడాన్ని ఆపకపోతే, ఆ దేశానికి అమెరికా ఇస్తున్న ఆర్థిక సహాయం మొత్తాన్ని నిలిపివేయాలని పో డిమాండ్ చేశారు. ఉగ్రవాదులకు మద్దతు నిలిపివేసే విషయమై నిర్ణయం తీసుకోవాల్సిన సమయం పాకిస్థాన్‌కు ఆసన్నమైందని మరో కాంగ్రెస్ సభ్యుడు కెవిన్ క్రేమర్ అన్నారు.

- మకావు, హాంకాంగ్‌లో జలవిలయం
- ఆరుగురు మృతి.. మరో ఇద్దరు గల్లంతు
- విమాన, రైళ్ల రాకపోకలకు అంతరాయం

హాంకాంగ్, ఆగస్టు 23: మకావు దీవులతోపాటు చైనాలోని హాంకాంగ్‌ను హీటో తుఫాను అతలాకుతలం చేస్తున్నది. విమానాలు, రైళ్ల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. జలమయమైన లోతట్టు ప్రాంతాల్లోని వేల మంది ప్రజలను అధికారులు సురక్షిత ప్రాంతాలకు తరలించారు. హాంకాంగ్‌లోని ప్రముఖ విక్టోరియా హార్బర్‌లో ఏర్పడిన హీటో తుఫాన్..పెర్ల్‌నది డెల్టాకు పశ్చిమదిశగా ఉన్న స్వతంత్ర ప్రతిపత్తి ప్రాంతమైన మకావులో బీభత్సం సృష్టించింది. భారీవర్షం, బలమైన ఈదురుగాలుల కారణంగా మకావులో ఐదుగురు మృతిచెందారని ప్రభుత్వ సమాచార సంస్థ తెలిపింది. గుయాంగ్‌డంగ్ రాష్ట్రంలోని పెర్ల్‌నది సమీప పట్టణమైన జుహైలో భారీవర్షం నమోదైంది. నదీతీర ప్రాంతాల్లోని వేల మందిని అధికారులు సురక్షిత ప్రాంతాలకు తరలించినట్టు చైనా అధికార వార్తాసంస్థ సిన్హువా వెల్లడించింది. రైలు సర్వీసులను రద్దు చేసినట్టు, 4000 పైగా మత్స్యకారులు, వారి కుటుంబాలు తీరానికి చేరుకున్నట్టు సంస్థ తెలిపింది. దక్షిణ చైనా సముద్రంలో అలలు పదిమీటర్ల ఎత్తున ఎగిసిపడుతున్నాయి. హాంకాంగ్‌లో వరదల కారణంగా ఒకరు మృతిచెందగా, పలువురు గాయపడినట్టు వార్తలు వెలువడ్డాయి. హీటో తుఫాను కారణంగా వ్యాపార వాణిజ్య, విద్యాసంస్థలు మూతబడ్డాయి. 450 విమాన సర్వీసులను అధికారులు రద్దు చేశారు. తుఫానులకు నామకరణం చేస్తున్న సంప్రదాయంలో భాగంగా ఈ తుఫాన్‌కు హీటో అని పేరుపెట్టారు. హీటో అంటే జపాన్ భాషలో పావురమని అర్థం.



హీటో తుఫాన్ కారణంగా హాంకాంగ్‌లో దెబ్బ తిన్న విక్టోరియా హార్బర్

బెయిల్‌పై పురోహిత్ విడుదల



ముంబై: మాలెగావ్ పేలుళ్ల కేసులో ఆరోపణలు ఎదుర్కొంటూ తొమ్మిదేండ్లుగా జైలులో ఉంటున్న లెఫ్టినెంట్ కర్నల్ శ్రీకాంత్‌ప్రసాద్ పురోహిత్ బుధవారం బెయిల్‌పై బయటకొచ్చారు. సోమవారమే సుప్రీంకోర్టు బెయిల్ మంజూరుచేసినా, పురోహిత్‌ను మంగళవారం ఎన్ఐఏ కోర్టులో హాజరుపరిచారు. విడుదలకు సంబంధించిన ప్రక్రియ మంగళవారం సాయంత్రం తర్వాత పూర్తికావడంతో.. బుధవారం ఉదయం 10.45కు తలోజా జైలు నుంచి విడుదలయ్యారు. మిలటరీ పోలీసు బృందాలు వెంటరాగా పురోహిత్‌ను కారులో దక్షిణ ముంబైలోని కొలాబా మిలిటరీ స్టేషన్‌కు తీసుకెళ్లారు.

31న ఇస్రో ఉపగ్రహ ప్రయోగం

న్యూఢిల్లీ: ఈనెల 31న ఐఆర్ఎన్ఎస్-1హెచ్ నావిగేషన్ ఉపగ్రహాన్ని ప్రయోగించనున్నట్టు భారత అంతరిక్ష సంస్థ (ఇస్రో) బుధవారం ప్రకటించింది. ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీహరికోట నుంచి ఉదయం ఏడుగంటలకు రాకెట్ ప్రయోగం జరుగుతుందని ఒక ప్రకటలో తెలిపింది. మొదటి నావిగేషన్ ఉపగ్రహమైన 1ఐ మీద గల మొత్తం మూడు అటామిక్ గడియారాలు ఆగిపోవడంతో దాని స్థానంలో సేవలు అందించేందుకు 1హెచ్‌ను ప్రయోగిస్తున్నారు.

కేజ్రీవాల్‌కు ఢిల్లీ హైకోర్టు నోటీసులు

- జైట్లీ తాజా పిటిషన్‌పై సమాధానమివ్వాలని ఆదేశం

న్యూఢిల్లీ: ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ తప్పుడు అఫిడవిట్ దాఖలు చేశారని కేంద్ర మంత్రి అరుణ్‌జైట్లీ తాజాగా దాఖలు చేసిన పిటిషన్‌పై సమాధానం ఇవ్వాలని కేజ్రీవాల్‌ను ఢిల్లీ హైకోర్టు బుధవారం ఆదేశించింది. అమర్యాదకరమైన పదాలు వాడాలని అప్పటి తన న్యాయవాది రాంజెఠ్మలానీకి తాను సూచించలేదని కేజ్రీవాల్ అంతకుముందు అఫిడవిట్ దాఖలు చేశారు. ఇది తప్పుడు అఫిడవిట్ అని, దీనిపై చర్యలు తీసుకోవాలని అరుణ్‌జైట్లీ తాజాగా పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై స్పందించిన హైకోర్టు.. నాలుగువారాల్లో సమాధానం ఇవ్వాలని కేజ్రీవాల్‌కు నోటీసులు జారీ చేసింది.

ఉప ఎన్నికల్లో భారీ పోలింగ్

న్యూఢిల్లీ: మూడు రాష్ట్రాల్లో బుధవారం నాలుగు అసెంబ్లీ సీట్లకు జరిగిన ఉప ఎన్నికల్లో భారీ పోలింగ్ నమోదైంది. ఒక్క ఢిల్లీలోని బావనా మినహా మిగిలిన మూడు స్థానాల్లో ఓటర్లు భారీ సంఖ్యలో తరలివచ్చారు. ఆంధ్రప్రదేశ్‌లోని నంద్యాల, గోవాలోని పనాజీ, వాల్పోయి, ఢిల్లీలోని బావనా సీట్లకు ఉప ఎన్నికలు జరిగాయి. కాగా నంద్యాలలో 82 శాతం, పనాజీలో 70 శాతం, వాల్పోయిలో 79.80 శాతం పోలింగ్ నమోదైంది. ఢిల్లీలోని బావనాలో మాత్రం 45 శాతం మాత్రమే నమోదైంది. ఓట్ల లెక్కింపు 28న జరుగనున్నది.

కార్తీ చిదంబరంను ప్రశ్నించిన సీబీఐ

న్యూఢిల్లీ: అవినీతి కేసులో కేంద్ర మాజీ ఆర్థిక మంత్రి పీ చిదంబరం కుమారుడు కార్తీని సీబీఐ బుధవారం ఎనిమిది గంటలకు పైగా ప్రశ్నించినట్లు సమాచారం. ఈ నెల 28న మరోసారి ప్రశ్నిస్తారు. పీ చిదంబరం కేంద్ర ఆర్థిక మంత్రిగా ఉన్నప్పుడు మారిషస్ నుంచి 'ఐఎన్ఎక్స్ మీడియా' అనే సంస్థ నిధుల స్వీకరణకు విదేశీ పెట్టుబడుల ప్రోత్సాహక మండలి (ఎఫ్ఐపీబీ) క్లియరెన్స్‌లో ఆయన పాత్రపై సీబీఐ అధికారులు విచారించారు.

పత్రికాప్రకటనల జీఎస్టీపై కేంద్రం వివరణ

న్యూఢిల్లీ: పత్రికల్లో వచ్చే వాణిజ్య ప్రకటనలపై విధించే వస్తు, సేవల పన్ను (జీఎస్టీ)పై కేంద్ర ఆర్థికశాఖ వివరణ ఇచ్చింది. పత్రికకు కమిషన్‌పై ప్రకటనలు సమకూర్చే వారు కమిషన్ మొత్తంపై 18 శాతం సుంకం చెల్లిచాల్సి ఉంటుంది. ఏజెన్సీలు మాత్రం వేరే రేటు ప్రకారం సుంకం చెల్సించాల్సి ఉంటుంది. ఉదాహరణకు 100 రూపాయల యాడ్‌స్పేస్‌ను 15 శాతం తగ్గింపుతో 85 రూపాయలకు కొనుగోలుచేస్తే ఆ 85 రూపాయలపై సదరు పత్రిక 5 శాతం జీఎస్టీ చెల్లించాల్సి ఉంటుంది.

భారత్‌కు తిరిగి వెళ్లిపో!

- అమెరికాలో భారత సంతతి సీఈవోకు దూషణ మెయిల్


రవిన్‌గాంధీ

న్యూయార్క్: అమెరికాలో జాతివిద్వేష దాడులు రోజురోజుకు పెచ్చరిల్లుతున్నాయి. తాజాగా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌నకు వ్యతిరేకంగా వ్యాసం రాసిన భారత సంతతికి చెందిన సీఈవోకు బెదిరింపులు ఎక్కువయ్యాయి. భారత్‌కు తిరిగి వెళ్లి పోవాలని దూషిస్తూ ఓ మహిళ వాయిస్‌మెయిల్ పంపారు. రవిన్‌గాంధీ జీఎంఎం నాన్‌స్టిక్ సంస్థ వ్యవస్థాపకుడు, సీఈవో. ఈ నెల 12న అమెరికాలోని 'చార్లెట్స్ విల్లే' ఘటనపై సీఎన్‌బీసీకి ఆయన వ్యాసం రాశారు. చార్లెట్స్‌విల్లే ఘటన తర్వాత ప్రజలు ట్రంప్‌నకు మద్దతు అంతగా ఇవ్వడం లేదని, కొందరు అమెరికన్లు ఆయనను వ్యతిరేకిస్తున్నారని రవిన్‌గాంధీ వ్యాసంలో పేర్కొన్నారు. ఆయన ఈ వ్యాసం రాసినందుకు.. 'భారత్‌కు తిరిగి వెళ్లిపో.. 'అంటూ అమెరికా మహిళ అనుచిత వ్యాఖ్యలు చేశారు. ఆయనతోపాటు భారత సంతతికి చెందిన ఐక్యరాజ్య సమితి రాయబారి నిక్కీ హేలీని కూడా అసభ్యంగా దూషించారు. త్వరలోనే భౌద్ధ విగ్రహాలను కూడా ధ్వంసచేస్తామని బెదిరించారు. 90 సెకండ్ల నిడివి ఉన్న వాయిస్ రికార్డును ఆమె గాంధీకి మెయిల్ చేశారు. దానిని ఆయన ఇతర సోషల్‌మీడియాల్లో పోస్టుచేశారు.

భారత్, పాక్ సైనిక కమాండర్ల భేటీ

- శాంతి సాధనకు సంస్థాగత వ్యవస్థ ఏర్పాటుపై ఏకాభిప్రాయం

జమ్ము: భారత్, పాకిస్థాన్ సైనిక కమాండర్ల ఫ్లాగ్ మీటింగ్ బుధవారం నియంత్రణ రేఖ వద్ద పూంచ్ సెక్టార్ పరిధిలోని చకాన్‌డాబాగ్ వద్ద జరిగింది. సరిహద్దుల్లో శాంతి, ప్రశాంత వాతావరణం నెలకొల్పేందుకు సంస్థాగతమైన వ్యవస్థ ఏర్పాటుకు ఇరు దేశాల సైనిక కమాండర్ల మధ్య ఏకాభిప్రాయం కుదిరిందని రక్షణశాఖ అధికార ప్రతినిధి చెప్పారు. 50 నిమిషాలపాటు ఈ సమావేశం సుహృద్భావ వాతావరణంలో జరిగిందని రక్షణశాఖ అధికార ప్రతినిధి అన్నారు. పాకిస్థాన్ కొన్ని నెలలుగా పలు దఫాలుగా కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘించి పౌరుల నివాసాలపై ఉద్దేశపూర్వకంగా కాల్పులు జరుపుతూ సీమాంతర ఉగ్రవాదాన్ని ప్రోత్సహిస్తూ వచ్చిన సంగతి భారత్ గుర్తు చేసిందని రక్షణ శాఖ ప్రతినిధి తెలిపారు.